జనవరి 2013 వెల: ₹ 20

తెలుగు వెలుగు

కొత్త సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలతో



GITAM UNIVERSITY

(Estd. u/s 3 of the UGC Act, 1956)

VISAKHAPATNAM * HYDERABAD * BENGALURU

Accredited by NAAC with 'A' Grade
MHRD 'A' Category University
Recognised Research University

GAT - 2013

GITAM ONLINE ADMISSION TEST FOR
B.Tech., M.Tech., B.Pharm. & M.Pharm. Programs

Download Application: **www.gitam.edu**

Applications also available throughout India at Union Bank of India and Indian Bank

Last Date for receipt of Application: **29th March 2013**

Entrance Test Dates: **17th April - 8th May 2013**

On-line admission test will be conducted at 32 centres in India

Special Features

- 100% Fee waiver to top 10 rankers of GAT-2013
- 50% Fee waiver to top 11-100 rankers of GAT-2013
- Merit cum Means Scholarships
- Teaching Assistantships to M.Tech. students
- Near 100% placements in reputed organizations
- Group Personal Accident Insurance for students
- 1000 Mbps Wifi Campus
- Separate hostel facilities for boys and girls with excellent amenities.

Lalitha®
చెన్నై • మదురై • తిరుచ్చి

తయారీ ధరలో బంగారు నగలు.

లలితా జ్యువెలరీలో మాత్రమే!

100% BIS 916
హాల్‌మార్క్ బంగారం

తరుగు 0% నుండి 7% వరకే మజూరీ లేదు.

కొన్ని ప్రత్యేక నగలకు మాత్రం తరుగు 8 & 9%. లక్షలాది రూపాయలను ఆదా చేయండి.

ఈ గణాంకాలన్నీ బంగారం ధర గ్రాముకు రూ. 2895/- ఆధారంగానే.

ప్రదర్శనలో వేలాది డిజైన్లు.

మా తరుగుతో మార్కెట్ తరుగును పోల్చి చూసుకుని ఈ ఆభరణాల ద్వారా చేసే పొదుపును తనిఖీ చేసుకోవచ్చు.

లలితా జ్యువెలరీ మార్ట్ ప్రై. లిమిటెడ్ 123, ఉస్మాన్ రోడ్, పనగల్ పార్క్, టి.నగర్, చెన్నై - 17. ఫోన్: 044-2814 1155 / 77 / 88.

180-182, సౌత్ మాసి స్ట్రీట్, మదురై-01. 0452-2330 222 / 444 / 555

www.lalithajewellery.net

బ్లాక్-5, చత్రిరం బస్ స్టాండ్, సెయింట్ జోసెఫ్స్ కాలేజ్ కాంపౌండ్, బిగ్ వాటర్ ట్యాంక్ ఎదురుగా, తిరుచ్చి-02. ఫోన్: 0431-2706555

వ్యాలెట్ కార్ పార్కింగ్ P

నూట పదహార్లు...

వీరీ వీరీ గుమ్మడి పండు... ఊరి పేరేమి? 10
- అరుణ్ పృథ్వి శాండిల్య

మాటలు ఆడిచూడు 32
- డా॥ కాకర్ల శ్రీరామమూర్తి

అమ్మకు బ్రహ్మ 54
- కొండపల్లి నీహారిణి

కథ భాషా సుధ 66
- జె.ఎస్.మూర్తి

ముంబయి తెలుగు యజ్ఞం నిర్విఘ్నం 76
- సంగెవేని రవీంద్ర

తెలుగు మహాసభల సందర్భంగా...

జైకొట్టు తెలుగోడా! 12
- ఆర్వీ రామారావ్

బ్రౌన్ తమ్ముళ్లు ఎందరో 26
- డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

మరో అష్టదిగ్గజ కవులు 72
- కట్టా నరసింహులు

నడకే కాదు.. జాడా కనిపించాలి 92
- డా॥ టి.గౌరీశంకర్

ముఖాముఖీ

చేతులు దులుపుకోను... చేతల్లో చూపిస్తా 28
- అధికార భాషా సంఘం అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ హామీ

అమ్మ సిగలో మరో కలికితురాయి 86
- మన లిపిని వరించిన కొత్త కీర్తి, లిపి విశేషాలను పంచుకుంటున్న ఆచార్య సంపత్‌కుమార్

తెలుగు ఒడిలో కథల బడి 96
- కొత్తపల్లి పత్రిక ప్రచురణకర్త సుబ్బరాజు, నారాయణల కృషి

ఈ నెల కథాపారిజాతంలో..
తెలుగు సాహిత్యంపై శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి విరజిమ్మిన 'గులాబీ అత్తరు'ను ఆఘ్రాణించండి 44

కథలు

నాగబంధం 18
- ఐతా చంద్రయ్య

శ్రీరామరక్ష 52
- ప్రియదర్శిని చాగంటి

మొగలి పువ్వంటి 62
- వాడపల్లి రాధ

దగ్ధం 68
- బల్లెడ నారాయణమూర్తి

తొక్కుడు కొమ్మ 80
- సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

ఖర్చులే 'పండగా' 90
- సి.హెచ్.వి.వి.రత్నమాల

తెలుగు వెలుగు పోటీలకు ఆహ్వానం

మీకు ప్రేమలేఖ రాయడం వచ్చా? 8

కళాశాల యువతకు ప్రత్యేక పోటీలు 114

కొత్త శీర్షికలు

తాజా చిత్రాలపై సమీక్ష
తెలుగు సిరి వెన్నెల 36
- అన్వర్

ఉద్యోగార్థులకు మార్గదర్శనం
విజయోస్తు... 38
- డా॥ పి.విజయకుమార్

నెల నెలా మంచి పుస్తకం
జాతీయోద్యమ రణన్నినాదం... 50

పదవినోదాన్ని అందించే
మాట కట్టు, అక్షర క్రీడలు 21

తెలుగు వెలుగు

సంపాదకుడు: **రామోజీరావు**

సంపుటి : 1, సంచిక : 5

జనవరి 2013

పుటలు : 116, **వెల :** రూ. 20

ముఖచిత్రం : చారి పి.ఎస్.

సహకారం : రామోజీ విజ్ఞానకేంద్రం

ప్రకటనల కోసం : +91 80081 51599, +91 90001 80608

వివరాలకు : సంపాదకుడు, తెలుగు వెలుగు, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, రంగారెడ్డి - 501 512.

ఫోను: +91 8415 246 999

మొబైల్: +91 800 800 1656

ఫ్యాక్సు: +91 8415 305 018

Telugu Velugu
Owned, Printed, published and Edited by Ramoji Rao on behalf of Ramoji Foundation, Ramoji Film City, Hayathnagar Mandal, Ranga Reddy District, Andhra Pradesh. Printed at Eenadu Press, D.No.7-134/1&2, Moosapet Village, Balanagar Mandal, Kukatpally, Rangareddy District -500 072.
RNI-APTEL 12988/01/1/2012-TC.

విన్నపం: తెలుగు భాషాభివృద్ధి, పరిరక్షణ, మేధోమథనం 'తెలుగు వెలుగు' ముఖ్య ఆశయాలు. మన భాషకు పుష్టి చేకూర్చే రచనలకు పత్రికలో అగ్రతాంబూలం లభిస్తుంది. ఈ రచనల్లో వెల్లడయ్యేవి రచయితల అభిప్రాయాలు మాత్రమేనని మనవి. ఇవన్నీ పత్రిక యాజమాన్యం, సంపాదకవర్గ అభిప్రాయాలు కానక్కర్లేదు. భిన్న భావజాలాలకు నిష్పక్షపాత వేదికగా ఈ పత్రిక నిలుస్తుంది.

ప్రతిన పూనుదాం

జాతికి జీవగర్రల్లాంటి భాష, సంస్కృతులను కాపాడి, పరిపుష్టం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలదే కాదు, ప్రభుత్వాలపైనా ఉంటుంది. ఎక్కడి నుంచో వచ్చిన రాజులు, తెల్లదొరలు మనల్ని వాళ్లభాషలో పాలించారంటే అర్థముంది. ఇక్కడ పుట్టిన నల్లదొరలకు ఇక్కడి జనం భాషలోనే పాలన సాగించాలన్న చిత్తశుద్ధి లోపించడం వల్లే తెలుగుతల్లికీ దుర్గతి. పాలకులు కుంభకర్ణ నిద్రలో కూరుకుపోతే... నిస్సహాయులైన ప్రజల బతుకుకోసం, భవిత కోసం అన్యభాషల్ని ఆశ్రయించక తప్పనిదైన్యం. తెలుగునేలపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచీ పంచాయితీ వరకూ అన్నింటా ఆంగ్లానిదే రాజ్యం! వేల సంవత్సరాల ఘనకీర్తి కలిగిన మన చరిత్రను పోగొట్టుకుంటే చరిత్రహీనులుగా మారతామన్న ఆందోళన కానీ, భావితరాలకు అందించాలన్న శ్రద్ధ కానీ పాలకులకు లేదు! అపార పదసంపద ఉన్న తెలుగును కబళిస్తోన్న అన్యభాషాపదాలకు అడ్డుకట్ట వేయాలన్న ఆలోచనే లేకపోవడం ఎంతటి దయనీయం. అసలు భాష, కళలు, సంస్కృతుల పరిరక్షణకు మన ప్రభుత్వాలు ఇప్పటి వరకూ చేసిందిదీ అని గర్వంగా చెప్పుకోగలిగే ఘనకార్యం ఒక్కటైనా ఉందా?

ఇప్పుడు నాలుగో ప్రపంచ తెలుగు సభలు తలపెట్టారు! కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు కాబట్టి ఓ వారమో, నెలో సభల తీరుతెన్నులు గురించి కొద్దిమందైనా మాట్లాడుకుంటారు. ప్రకటన వెలువడింది మొదలు పరిశీలిస్తే... భాషా సంస్కృతుల వికాసానికి నిర్దిష్ట చర్యలపై దృష్టిపెట్టకుండా, సభలు జరిపితే చాలన్న దుర్భ్రమలో ప్రభుత్వం ఉన్నట్లు కనిపిస్తోంది. దీర్ఘకాలిక ప్రణాళిక, అన్ని వర్గాల్నీ సమేకం చేయడం, ప్రజల్లో భాషాభిమానాన్ని ప్రేరేపించడం, అసంపూర్ణంగానో, అర్థంతరంగానో నిలిచిపోయిన భాషాభివృద్ధి కార్యక్రమాల్లో కొన్నైనా మొదలు పెట్టడం వంటివి చేస్తే పాలకుల లక్ష్యాల పట్ల కొంతైనా నమ్మకం కలిగేది. అప్పుడు కాస్తాకూస్తో భాషాభిమానులకు ఆశలుండేవి. కానీ ప్రభుత్వం వాటికి తావివ్వకుండా చాలా జాగ్రత్తపడింది! ఇక ప్రభుత్వం ఏం నిర్ణయాల్ని వెలువరిస్తుందో, వాటి అమలు ఎలా ఉంటుందో కొద్ది రోజుల్లోనే తేటతెల్లం అయిపోతుంది!!

మనది కాకపోయినా, ఆంగ్ల సంవత్సరాదితో చాలా విషయాలు ముడిపడి ఉన్నాయి. అదో పండుగలా చేసుకుంటున్నాం. కొత్త సంవత్సరానికి కొత్త లక్ష్యాలు నిర్దేశించుకుంటాం. అలానే ఈ సంవత్సరం ప్రతి తెలుగువాడూ భాషా ప్రతిన పూనాలి. ఆత్మగౌరవ రక్షణ ప్రతిన పూనాలి. గత ఏడాది రాష్ట్రంలో భాషా స్పృహ పెరగడం సంతోషకరం. కానీ అది చాలదు. మన భాషాభిమానం ఇంతింతై వటుడింతై అన్నట్టు ఎదగాలి. అది జాతి ప్రాథమ్యాలను, అవసరాలను నిర్దేశించే స్థాయికి చేరాలి. రష్యా, చైనా, జపాన్‌లలా అమ్మభాషలోనే అభివృద్ధిని అందుకునేలా తెలుగు జాతిని చేర్చాలి. విశ్వవేదికలపై మన జాతి ఆత్మగౌరవాన్ని ఇనుమడింపచేయాలి.

ఉగ్గుపాలతోనే విలువల్ని రంగరించి పోసే 'తెలుగు' విశిష్టతను ప్రతి వారూ తరువాతి తరానికి అందించాలి. మన దేశాన్ని, రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న జాడ్యాలకు మందు అదే. జరిగిందేదో జరిగిపోయింది. ఇకనుంచైనా మన సంస్కృతిని, విశిష్టతను కాపాడుకునేందుకు నడుంకట్టాలి. మన పరిధిలో మనం చేయాల్సినవి చిన్న చిన్న పనులే! అన్నీ ఆనందాన్నిచ్చేవి, ప్రయోజనకరమైనవే! వీలైనంతగా తెలుగులోనే మాట్లాడాలి. పిల్లలకూ అదే చెప్పాలి. విలువల్ని నేర్పే అద్భుతమైన కథలు, పద్యాలు మనకు వేలాదిగా ఉన్నాయి. పంచతంత్రం, కథాసరిత్సాగరం, రామాయణం, భారతం, భాగవతం, విక్రమార్క భేతాళ కథలు, వేమన, సుమతి, భాస్కర శతకాలు... ఇలా ఎన్నో! వాటిల్లోంచీ రోజూ ఒక్కటి పిల్లలకు చెప్పండి. అవి మీకు తెలియకపోతే తప్పేంలేదు... ఒకసారి సరదాగా పుస్తకాల కొట్టుకు వెళ్లిరండి. లేదా అంతర్జాలంలో వెదకండి.

పిల్లలు ఆంగ్లంలో చదువుతోంటే అందులోనూ ఈ కథలన్నీ వస్తున్నాయి. అయినా చదివించి తేటతెలుగులో తిరిగి చెప్పమని అడగండి! తరువాత తెలుగు పుస్తకాలూ చదివించండి. వాళ్ల సొంత మాటల్లో ఆ కథలు చెబుతోంటే ఎంత బాగుంటుందో చూడండి! దాని వల్ల తెలుగు అలవాటవ్వడం, సంస్కృతి తెలియడం మాత్రమే కాదు, వారి భావవ్యక్తీకరణ, సృజనాత్మకత, ఆలోచన, విశ్లేషణ సామర్థ్యాలు ఎంత మెరుగుపడతాయో చూస్తే ఆశ్చర్యపోతారు. కావాలంటే అనంతపురం నుంచి వస్తున్న బాలల మాసపత్రిక 'కొత్తపల్లి'లో రాస్తున్న పిల్లల్ని చూడండి! వారి కథల్ని చదవండి, చదివించండి.

సంక్రాంతి నెల ఇది. ఈ పండుగ ఎందుకు చేస్తారో, దాంట్లో ఉన్న శాస్త్రీయత, సంస్కృతి ఏమిటో పిల్లలకు చెప్పండి. అసలైన తెలుగుదనం పల్లెల్లోనే ఉంటుంది. కుటుంబసమేతంగా మీ ఊరికెళ్లిరండి. అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్య, అత్త, మావయ్య, పిన్ని, బాబాయి... బంధువులతో గడపండి. చెరుకుగడను నోటితో వలుచుకుని ఎలా తినాలో నేర్పండి. సుబ్బయ్య తాత వాళ్లింట్లోనో, వెంకయ్య మామ చావిట్లోనో అప్పుడే పుట్టిన లేగతో పిల్లల్ని ఆడించండి. హరిదాసుల కీర్తనల్ని వినిపించండి. రంగవల్లుల శోభను, భోగిమంటల వెచ్చదనాన్ని, పల్లెదనాన్ని, తెలుగు మధురిమను పిల్లలకు రుచి చూపించండి. తిరిగొచ్చాక వాళ్లు ఎంత సంతోషంగా గడిపిందీ వివరిస్తూ పిల్లలతో తెలుగులో లేఖ రాయించండి.

ఇదంతా ఇంట్లో వ్యవహారం. బయటా వీలైనంతగా 'తెలుగు'నే కోరండి. బ్యాంకులకు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లినప్పుడు దరఖాస్తులు తదితరాలు తెలుగులో దొరకవా అని కచ్చితంగా అడగండి. వాటిని, రైళ్లు, బస్సుల రిజర్వేషను ఫారాలను తెలుగులోనే పూర్తి చేయండి. ఇలా కొద్ది పట్టింపుతో ఉంటే త్వరలోనే అన్నీ తెలుగులోకి మారతాయి. మారితీరతాయి. ఎవరి పరిధిలో వారు కొంత కృషి చేస్తే అమ్మభాషను కాపాడుకోవడం అసాధ్యమేమీ కాదు. అందుకు ప్రతి తెలుగు వాడూ ప్రతిన పూనాలి. కార్యాచరణకు కొత్త సంవత్సరం నుంచే శ్రీకారం చుట్టాలి.

ఈ సంక్రాంతి తెలుగిళ్లలో కొత్త కాంతులను ప్రసరింపచేయాలి. శుభాకాంక్షలతో...

ప్రత్యేక సంచిక వేయాలి

తెలుగు భాషాభిమానులకు మేలుకొలుపుగా 'తెలుగు వెలుగు' వెలువడుతోంది. రాష్ట్రంలో భాషోద్ధరణ, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, సామాజిక వికాసాలకు పాటుపడుతున్న ప్రముఖుల చరిత్రను ప్రత్యేక సంచికగా వేయాలి.

- కె.సుబ్బరాజు, మాజీ శాసనసభ్యులు, విజయవాడ

భాషేదైనా పెరగాలి

అన్ని అక్షరాలూ ఉంటేనే పరిపూర్ణమైన భాష అవుతుంది. ఆ ఘనత తెలుగు భాషదే. అందుకే 'దేశభాషలందు తెలుగు లెస్స' అయ్యింది. ఉచ్చారణ, మన పలుకు మన అక్షరాల్లో ఉంది. ఉన్నవాటిని తీసేయకూడదు. ఏ భాషైనా పెరగాలి కానీ తరగకూడదు. భాషావేత్తలూ, పండితులూ దీన్ని గమనించాలి.

- రావి కొండలరావు, సినీనటుడు, హైదరాబాద్

మధురానుభవం

'తెలుగు వెలుగు' సంపాదకీయాన్ని చదువుతుంటే సాహిత్య సారాన్నంతా గిన్నెలోకి పోసుకుని తియ్యగా తాగిన అనుభవం కలుగుతోంది..పదసృష్టి బాగా జరిగినప్పుడే భాష బాగా రాణిస్తుంది.

- డా॥ నారాయణస్వామి, బెంగళూరు

బహుమతిగా ఇవ్వాలి

పిల్లలకు బహుమతిగా మిఠాయి, పళ్లు ఇచ్చే బదులు 'తెలుగు వెలుగు'ను ఇవ్వాలి. ఇలా చేస్తే... భాషాభివృద్ధికి కృషి చేసినట్లే.

- కందుల జవహర్, విశాఖపట్నం

తెలుగులో 'పాలించలేరా'?

రాష్ట్రంలో పాలనా భాషగా తెలుగును అమలు చేయాలి. కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే జరిగేలా ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి.

-కె.సి.హెచ్ జయరాజు, బోయపల్లి

తెలుగుదనానికి చిరునామా

'తెలుగు వెలుగు' సంచికల్లో తెలుగుదనం ఉట్టిపడుతోంది. విలువైన అంశాల సమాహారమైన ఈ పత్రికను భద్రపరచుకుంటున్నాం. మాతృభాషకు ఊపిరిపోస్తున్న రామోజీరావుకు కృతజ్ఞతలు.

- ముత్యాల రాంబాబు, కృష్ణా జిల్లా

ఇల్లే వేదిక

ఇంటింటా తెలుగు దీపం వెలిగించేందుకు రామోజీ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయం. భాషాభివృద్ధి ప్రయత్నాలను మన ఇళ్ల నుంచే ప్రారంభించాలి. పిల్లలకు చక్కటి తెలుగు నేర్పించాలి.

- కె.మల్లయ్య చౌదరి, కర్ణాటక

వంగ భూమిలో తెలుగువెలుగులు

భాషాభివృద్ధికి ప్రవాసాంధ్రులు చేస్తున్న కృషిని గుర్తించాలి. పశ్చిమబెంగాల్లో ప్రవాసాంధ్ర కవులు, కళాకారులెందరో ఉన్నారు. వారి గురించి 'తెలుగు వెలుగు'లో ఇస్తే బాగుంటుంది.

- వింజమూరి బాలమురళి (ఈమెయిల్)

చదువుతున్నాం... చదివిస్తున్నాం

ఆకలితో ఉన్నవారికి పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించినట్లుగా ఉంది 'తెలుగు వెలుగు'. ఈ పత్రికను... మా పాఠశాల్లోని విద్యార్థులందరితోనూ చదివిస్తున్నాం.

- జొన్నలగడ్డ రాంబాబు, గానుగపాడు, కృష్ణా జిల్లా

దేవుడి నోట ఆ మాటనా!

నవంబర్ నెల సంచికలోని వ్యాసాలన్నీ బాగున్నాయి. కానీ, 'దేవుని బిడ్డ' కథలో దేవుని నోట పదేపదే 'నాయాళ్లు' అనే మాటను పలికించడం సమర్థనీయం కాదు.

- వి.వి.ఎన్.వరలక్ష్మి, విశాఖపట్నం

'పదపంచాయతీ' భేష్

'తెలుగు వెలుగు'... సాహితీప్రియులకు ఆనందం కలిగిస్తోంది. పత్రిక ద్వారా మరిన్ని మంచి రచనలను వెలుగులోకి తీసుకురాగలరు. 'పదపంచాయతీ' శీర్షిక ఆలోచనాత్మకంగా ఉంది.

- వి.రామకృష్ణారావు, వీరవాసరం, తూ.గో. జిల్లా

సవరణ

డిసెంబరు సంచికలో 'అహంతు రావణో నామః' కథలో 'నా సోదరుడు కుంభకర్ణుడిపై పోరు చేసి లంకను ..' అని రావణుడు ప్రహస్తునితో చెప్పినట్టుగా వచ్చింది. 'నా సవతి సోదరుడు కుబేరునిపై పోరు చేసి...' అని ఉండాలి. పొరపాటుకు చింతిస్తున్నాం.

– సంపాదకవర్గం

పత్రికలదే ఆ బాధ్యత

తెలుగు భాషాపరంగా విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు రావాలి. వాటి కోసం.. ప్రభుత్వంపై పత్రికలు ఒత్తిడి పెంచాలి. గ్రంథాలయోద్యమ స్ఫూర్తిని అందిపుచ్చుకొని తెలుగు వారందరూ భాషా సేవ చేయాలి.

- ఎం.రామమూర్తి, విశాఖపట్నం

మధురమైన మట్టివాసన

కాలగమనంలో మసిబారుతున్న మన అక్షరాలకి వర్ణాలంకరణ చేస్తోంది 'తెలుగు వెలుగు'. మట్టివాసన గుర్తు చేస్తున్నందుకు అభినందనలు.

- అడ్డూరి వెంకటరమణ, విజయవాడ

ప్రమాణాలు ఉన్నతం

తెలుగు పత్రికా రంగానికి మార్గదర్శకత్వం వహిస్తున్న 'ఈనాడు'... తెలుగు భాషా వికాసానికి నడుం బిగించడం అభినందనీయం. ఉన్నత ప్రమాణాలు గల సాహితీ పత్రిక 'తెలుగు వెలుగు'. ప్రతి సంచికలోనూ బాలసాహిత్యానికి తప్పనిసరిగా చోటివ్వాలి.

- అమ్మిన శ్రీనివాసరాజు, చర్ల, ఖమ్మం జిల్లా

చేతిలో వజ్రాయుధం

తెలుగువారి గతవైభవాన్ని ప్రతి సంచిక వివరిస్తోంది. తెలుగు వైభవాన్ని తిరిగి నెలకొల్పవలసిన సమయమిది. ఈ పత్రిక తెలుగు జాతికి వజ్రాభరణం.

- ఆణివిళ్ల రామం, తణుకు, ప.గో. జిల్లా

వారి నుడి పసిడి!

తెలుగు లోగిళ్లలో స్వచ్ఛమైన తెలుగుదనాన్ని తట్టిలేపే ప్రయత్నం అద్భుతం. తెలుగు వెలుగులో ప్రముఖులు వెలిబుచ్చే అభిప్రాయాలు ఆలోచింపచేస్తున్నాయి. సంపాదకీయం అందర్నీ అలరించేలా ఉంది.

- డి.అప్పన్న, జయపురం, ఒడిశా

ఇదే ఆదర్శం

దారి చూపే దీపంలా, దాహం తీర్చే సెలయేరులా, కమ్మని పాటపాడే కోయిలలా, సువాసన వెదజల్లే పువ్వుల్లా, చల్లని వెన్నెలనిచ్చే చంద్రునిలా ప్రతిఫలమాశించని తెలుగు వెలుగును పంచుదాం.

-బి.నవనీత్‌రెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్

మన సంస్కృతి ఉట్టిపడాలి

తమిళాన్ని స్కైప్ వంటి సాధనాలతో ఖండాంతరాలకు తంతి (ఆన్‌లైన్) బోధనా

తరగతులు నిర్వహిస్తున్నారు. అసలు అల్లిక గూడు చిత్రణ (వెబ్‌సైట్ డిజైన్) లోనే తమిళ సంస్కృతి ఉట్టిపడుతుంది. మన తెలుగు అకాడమి. నెట్ పూర్తి విరుద్ధంగా మన ప్రభుత్వ వైఖరిలాగా ఆంగ్లంలో సకిలిస్తోంది. అధికార భాషా సంఘాన్ని 'తెలుగు ప్రజాభాషా పీఠం'గా మార్చాలి.

- శ్రీసాయి తేజస్విని, హైదరాబాద్

విద్యార్థులకు అమూల్యం

రచనలు ఉత్తమాభిరుచిని చాటుతున్నాయి. 'అక్కడ తవ్వితే అన్నీ మన జానపదాలే' చక్కని వ్యాసం. తేట తెలుగుకు నారు, నీరు పోసి వాస్తవమ్ము నార్లవారి మాట అనిపించారు. అక్షర శిల్పుల నైపుణ్యం కచ్చితంగా చూడాలనిపిస్తోంది. హాస్యబ్రహ్మ భమిడిపాటి 'మన తెలుగు' వ్యాసం తెలుగు విద్యార్థులు భద్రపరుచుకోవచ్చు.

- డా॥ శివభూషణం, కర్నూలు

మనసు పులకరించింది

'మందార మకరంద మధురభాష' చదువుతుంటే మనసు పులకరించింది. రమ్యమైన మన మాతృభాష గొప్పతనం ఈ పద్యకవితలో జాలువారుతోంది. తెలుగు సాహితీవేత్తలను పరిచయం చేయాలి.

- ఎం. సూర్యప్రకాశరావు, రామరాజులంక, తూ.గో.జిల్లా

పల్లెల్లో సంప్రదాయాన్ని రక్షించాలి

పురాణాల వైభవాన్ని, మన సంస్కృతి సంప్రదాయాలను రక్షించాలి. అక్షరాల తీరుతెన్నులను రమ్యంగా రాశారు.

- వాస్తు రామచంద్ర, నెల్లూరు

సంపాదకీయం బాగుంది

నవ్విపోదురుగాక.. సంపాదకీయం పరిస్థితులను చక్కగా ఎండగట్టింది. మన ఏలికలకు, ప్రభుత్వ బుర్రలకు, తెలుగుపై ఏ మాత్రం గౌరవం ఉన్నా పరిస్థితులు ఇలా ఉండేవి కావు.

-సి.విజయ్, హైదరాబాద్

వందనం... భాషాభివందనం

మన తెలుగుకు మరింత ప్రాచుర్యం కల్పించడానికి 'తెలుగు వెలుగు' ద్వారా నడుంకట్టిన రామోజీరావుకు శిరస్సు వంచి భాషాభివందనాలు.

- ఎం.వి.ఎస్.పవన్ (ఫేస్‌బుక్ ద్వారా)

రచయితలకు ఆహ్వానం

పద్య, గేయ, నాటక రచనలపై పోటీ నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ సేవాసమితి తెలిపింది. అంశం మాతృభాష పరిరక్షణ ధ్యేయం. పూర్తి వివరాలకు... 093425 40479, www.cpbrown.org ద్వారా తెలుసుకోవచ్చు.

కథలున్నాయి కోకొల్లలు
చదువుతున్నారా ఈ తరం పిల్లలు
అమ్మ భాషను మరిచిన తల్లులు
చెప్పండి మీ పిల్లలకు మంచి సూక్తులు

- మాధవరావు.పి, లింగసముద్రం

ఈ సంచికలో అక్షరక్రీడల రూపొందించిన వారు...
ఎం.వెంకటరామాచార్యులు,
విజయవాడ, 9295753960

తెలుగు వెలుగుకు శుభాకాంక్షలతో..

NAVATA

నవత
రోడ్ ట్రాన్స్‌పోర్ట్
రెగ్యులర్ పార్శిల్ సర్వీస్

పోస్టుబాక్సు నెం.912
బోస్‌బిల్డింగ్స్, కానూరు
విజయవాడ - 520 007
ఫోన్లు: (0866) 6638787, 2546433
ఫ్యాక్స్:(0866)2541322, email : navata@navata.com
website: www.navata.com

An ISO 9001 : 2008 Organisation

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రములలో
631 కేంద్రములకు విస్తరించిన అతిపెద్ద రెగ్యులర్ పార్శిల్ సర్వీస్

మీరెప్పుడైనా ప్రేమలేఖ రాశారా?

తెలుగు వెలుగు
ప్రేమలేఖల
పోటీ!

రామోజీ ఫౌండేషన్

ప్రేమ... ఓ అద్భుత భావన. ఈ రెండక్షరాల గుణంతో ప్రపంచాన్నే జయించవచ్చని మహాత్ములెందరో నిరూపించారు. సరే... మనబోటి మనుషుల సంగతి మాట్లాడుకుందాం. ప్రేమంటే ఒకబ్బాయి, అమ్మాయిల మధ్య ఏర్పడేది మాత్రమే కాదు? అమ్మానాన్నలు, అక్కాచెల్లెళ్లు, అన్నాదమ్ములూ, తాతయ్యలు, మామ్మలు, అత్తయ్యలు, మామయ్యలు, స్నేహితులు... ఎందరినో గాఢంగా ఇష్టపడతాం. అదంతా ప్రేమే కాదా! మరి అమ్మాయికో, అబ్బాయికో రాసేది మాత్రమే ప్రేమలేఖ అంటే ఎలా? ఎవరిపట్లనైనా మన ప్రేమను వ్యక్తీకరించే జాబు ప్రేమలేఖే అవుతుంది. భర్తకు భార్య రాయవచ్చు. విదేశాల్లో ఉన్న కూతురు తండ్రిపై తన ప్రేమను వ్యక్తం చేస్తూ రాయవచ్చు! సెల్‌ఫోన్లు వచ్చాక రాయడం ఎందుకంటారా? కొన్ని విషయాలు వినడం కన్నా చదివితే అపురూపంగా ఉంటాయి. తీపి జ్ఞాపకాలుగా భద్రపరచుకోవడానికీ వీలుంటుంది. అందుకే 'తెలుగు వెలుగు' ప్రేమలేఖల పోటీ నిర్వహిస్తోంది. కలం పట్టండి... మీరు అమితంగా ఇష్టపడే ఎవర్నికైనా సరే అద్భుతమైన లేఖ రాయండి! మీ భావాలను సున్నితంగా, హృదయానికి హత్తుకునేలా సృజించండి... అదీ అచ్చ తెలుగులో మాత్రమే!

- కవరు మీద 'ప్రేమలేఖల పోటీకి' అని స్పష్టంగా రాయాలి.
- రచన హుందాగా ఉండాలి. అసభ్యత, శృంగార వర్ణనలకు తావివ్వరాదు.
- ప్రత్యామ్నాయం లేకపోతే తప్ప ఆంగ్లపదాలు వాడకూడదు.
- పూర్తి మాండలికంలోనూ రాయవచ్చు. కాకపోతే అందరికీ అర్థం కావాలి కాబట్టి కష్టమైన పదాలకు విడిగా అర్థాలు రాయండి.
- రచన 500 పదాలకు మించకూడదు. చేతి రాత లేదా కంప్యూటర్ ప్రింట్ పంపవచ్చు. జిరాక్సులు చెల్లవు.
- రచన పూర్తిగా మీ సొంతమని, దేనికీ అనుకరణ లేదా అనుసరణ కానీ కాదని, గతంలో ఏ పత్రిక, వెబ్‌సైట్లు, బ్లాగుల్లోనూ ప్రచురితం కాలేదని, ప్రస్తుతం ఏ ప్రచురణ/ప్రసార మాధ్యమం వద్దా పరిశీలనలో లేదనీ హామీ పత్రాన్ని జత చేయాలి. మీ రంగుల పాస్‌పోర్ట్ చిత్రాన్నీ జోడించాలి.
- మీ రచన ఎంపికైతే మీ పేరు, ఫొటో, ఫోన్ నంబరు ప్రచురించవచ్చా లేదా అన్నదీ హామీ పత్రంలో పేర్కొనాలి.
- రచనతో పాటు మీ పేరు, నివాస చిరునామా, ఫోన్ నంబరు వివరంగా ఉండాలి.
- ఎంపికైన ప్రతి లేఖకూ రూ.1116 బహుమతి ఉంటుంది.
- ఎన్ని బాగుంటే అన్నీ ఎంపిక చేస్తాం. వీలువెంబడి ప్రచురిస్తాం.
- ఈ పోటీ తదుపరి ప్రకటించే వరకూ కొనసాగుతుంది. ఎప్పుడైనా నిలిపివేసే అధికారం సంపాదకవర్గానిదే.
- ఎంపిక నిర్ణయం పూర్తిగా సంపాదకవర్గానిదే.
- ప్రచురణకు వీలుగా రచనలో మార్పులు చేసే అధికారం సంపాదకవర్గానికి ఉంటుంది.
- ఎంపిక, ప్రచురణల విషయంలో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు, ఫోన్ విచారణలకు తావు లేదు.
- నిబంధనలకు లోబడని రచనలను తిరస్కరించే హక్కు సంపాదకవర్గానికి ఉంటుంది.
- రచనను teluguvelugu@eenadu.netకు మెయిల్ చేయవచ్చు. మా చిరునామా 4వ పేజీలో చూడవచ్చు.

గొబ్బి పాట

ఎండి గజ్జా పగడామవ్వ

సంక్రాంతి మాసంలో ఒక వెదురుతట్టలో గొబ్బెమ్మను పెట్టి గురుగు, తంగేడిపూలుపెట్టి, దాన్ని ఇంటింటికీ తిప్పి, దానిచుట్టూ గొబ్బిపాటలు పాడుతూ గొబ్బి తట్టడమూ ఉంది. అలాంటివాటిలో ఇదొకటి.

గొబ్బియ్యాలో గొబ్బి గొబ్బి పాడారమ్మా - నిబ్బరంపు చేడేలే గొబ్బియ్యాల్లో
గొబ్బియ్యాలో ఎండి గజ్జా పగడాముమ్వా - డేగకాలికి గట్టిరే గొబ్బియ్యాలో ॥గొబ్బి॥

గొబ్బియ్యాలో డేగబోయి ఎంకటేశుని - దేవాలాన వాలేనే గొబ్బియ్యాలో
గొబ్బియ్యాలో ఎంకటేశుని కాపులారా - డేగవచ్చే కానారో గొబ్బియ్యాలో
గొబ్బియ్యాలో కానాలేమే కన్నెలారా - చూడలేమె పడతూలూ గొబ్బియ్యాలో ॥గొబ్బి॥

గొబ్బియ్యాలో డేగబోయి గోయిందురాజులు - దేవలానా వాలేనే గొబ్బియ్యాలో
గొబ్బియ్యాలో గోయిందు రాజుల కాపులారా -డేగవచ్చే కానారే గొబ్బియ్యాలో
గొబ్బియ్యాలో కానాలేమే కన్నెలారా - చూడలేమె పడతూలూ గొబ్బియ్యాలో ॥గొబ్బి॥

గొబ్బియ్యాలో డేగబోయి కాళాస్త్రి - దేవాలానా వాలేనే గొబ్బియ్యాలో
గొబ్బియ్యాలో కాళాస్త్రి కాపులారా - డేగవచ్చే కానారే గొబ్బియ్యాలో
గొబ్బియ్యాలో కానాలేమే కన్నెలారా - చూడలేమె పడతూలూ గొబ్బియ్యాలో ॥గొబ్బి॥

గొబ్బియ్యాలో డేగబోయి తలకోన - దేవాలానా వాలేనే గొబ్బియ్యాలో
గొబ్బియ్యాలో తలకోనా కాపులారా - డేగవచ్చే కానారే గొబ్బియ్యాలో
కానాలేమే కన్నెలారా - కానలేమే పడతూలూ గొబ్బియ్యాలో ॥గొబ్బి॥

– సేకరణ డా॥ వి.ఆర్.రాసాని

వీరివీరి గుమ్మడి పండు.. ఊరి పేరేమి?

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగి బయటకు రాగానే ఆటోవాలాలు చుట్టుముట్టారు. చేతిలో సంచులను నా ప్రమేయం లేకుండానే తీసుకున్నారు. 'కహా జానా?'.. 'యాడ్కి పోవాలె?' 'ఎక్కడికి వెళ్లాలి సార్?' అంటూ రకరకాల యాసలు, భాషలను పరిచయం చేస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు.

'సాయిబాబా కాలనీ' చెప్పాను. 'ఏ సాయిబాబా కాలనీ' సందేహం వ్యక్తం చేశాడో ఆటోవాలా. 'కచ్చితంగా తెలీదయ్యా... బహుశా షిర్డీ సాయిబాబా కాలనీ అనుకుంటాను' 'సత్య సాయా.. షిర్డీ సాయా.. అని కాదు సార్, ఏ ఏరియాల కాలనియో చెప్పుండ్రి... ఈ సిటీల పదిపదిహేను సాయిబాబా కాలన్లున్నయ్'

అప్పటి దాకా ఆ విషయం తెలియని నేను, స్నేహితులకు ఫోన్ చేసి వారుండే ప్రాంతమేదో తెలుసుకుని ఆటోవాళ్లకు చెప్పి మిత్రుల గదికి చేరుకున్నాను. పదేళ్ల కిందట నేను పడ్డ అవస్థ ఇది. ఇన్నేళ్లలో ఇలా ఒకే పేరుతో ఉండే కాలనీలు మరో పదైనా పెరిగే ఉంటాయి.

కృష్ణానగర్.. లెనిన్ కాలనీ రాంనగర్, డైమండ్ ఎస్టేట్స్, గోల్డెన్ హిల్స్.. వీధులు, కాలనీలు, కొత్తగా పెరుగుతున్న పట్టణా వాసాలకు ఎక్కడ చూసినా ఇలాంటి పేర్లే. ఏ ప్రాంతంలో నైనా నాయకుల, దేవుళ్ల పేర్లే. నోరారా పలికేందుకు నిండు తెలుగు పేరున్న వీధులు, కాలనీలు కనిపించడం లేదు.

దేవుళ్లపై అభిమానమో.. నాయకులపై అవ్యాజ ప్రేమో.. కారణమేదైనా తెలుగు పేరుకి తుప్పు పట్టిస్తున్నారు.. ఈ జాడ్యం పల్లెలకూ పాకుతోంది. గ్రామాల్లోనూ కొత్తగా వెలుస్తున్న కాలనీలు, ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల సముదాయాలకు స్థానిక నాయకులవో, దేశనాయకులవో, దేశాన్ని దోచుకున్న నేతలవో ఎవరో ఒకరి నామాలే అలంకరిస్తున్నారు. అందమైన అచ్చ తెలుగు పేరు ఒక్కటీ ఉండట్లేదు. పలకడానికి హాయిగా, అర్థవంతంగా ఉండే పేర్లున్న పల్లెలు ఈ రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. ఊరికి పేరు పెట్టాలంటే మనుషులు, దేవతల నామాలే కావాలా? అక్కడి చారిత్రక ప్రాధాన్యాన్నో.. పంటల ప్రాశస్త్యాన్నో ప్రతిబింబించేలా పిలిస్తే ఎంత బాగుంటుంది..? అలాంటి పదాలు ఎన్ని లేవు? రాష్ట్రంలో అర్థవంతమైన, భావ మిళితమైన, తేట తెలుగు మాటలనే పేర్లుగా చేసుకున్న గ్రామాలెన్నో. 'వీణవంక... వీణ మీటినట్లు, వీనుల విందు చేస్తున్న ఈ ఊరు కరీంనగర్ జిల్లాలో ఉంది. ఇదే కాదు చారిత్రక ప్రాధాన్యాన్ని చెప్పేలా రామడుగు, స్థానికతను చాటేలా చిగురుమామిడి వంటి పేర్లున్న గ్రామాలు కరీంనగర్‌లో ఉన్నాయి. ఈ జిల్లాలోనే 'గంగాధర' అనే గ్రామం ఉంది. దేవుడి పేరే అయినా కమ్మని పదబంధంతో హాయి గొలిపేలా ఉంది. చందనం అన్న మాట వింటే ఆ సువాసన గుర్తుకొస్తుంది.. అనంతపురం జిల్లాలో ఇలాంటి పరిమళ భరిత నామమున్న ఊరు 'చందన'. భాషా సౌందర్యమంతా ఒలకబోసేలా మెదక్ జిల్లాలో ఓ ఊరికి 'సింగారం' అని పేరు.

పేరులోనే పండుగ కళ..

శ్రీకాకుళం జిల్లాలో ఓ ఊరు 'దీపావళి'. ఈ పేరే ఆ గ్రామానికి పండుగ కళ తెచ్చింది. ఇంకో గ్రామం 'వసుంధర' భూమినే తన పేరుగా మార్చుకుంది. ఇలాంటి సొగసైన పేర్లున్న పల్లెలు ఈ జిల్లాలో కోకొల్లలు. 'శోభ, ప్రియ, సారథి, మేఘవరం, హంసరాయి, నీలావతి, సిరిమామిడి, నేరడి, జగతి, నెలవంక, హంస, హంసరాళి, హర్షభద్ర, వనిత మండలం, మల్లి, చలివేంద్రి, రణస్థలం, వేల్పురాయి, వెన్నెలవలస'.. ఇవన్నీ ఇక్కడి ఊర్లే. వాడుకలో దీర్ఘాలు చేరి, వత్తులు హరించుకుపోయినా మధుపాం(మధుపం), సౌదాం(సౌధం), శాసనాం(శాసనం) వంటి పల్లెలు తెలుగుదనానికి పట్టుగొమ్మలే.. విజయనగరం జిల్లాలోనూ ఇలాంటి అందమైన పేర్లున్నాయి. 'జయతి, సారిక, ఉసిరి, చోర, పాంచాలి, గుమ్మ, వసంత, కలువరాయి, సుభద్ర, కెరటాం(కెరటం)' ఈ పేర్లు వింటే మనసుకెంత హాయి! కడియం (తూ.గో.), కొడవలూరు (నెల్లూరు), హేమావతి (అనంతపురం) వంటివీ తెలుగు పదాలకు పట్టం కట్టిన జనపదాలే. కర్నూలు జిల్లా 'పెద్ద హరివనం', 'చిన్న హరివనం'... తెలుగుకి పచ్చ తోరణాలు. రాజమండ్రి సమీపంలోని మధురపూడి, విశాఖపట్నంలోని మధురవాడ వంటివీ తెలుగు మాధుర్యాన్ని రుచి చూపించేవే.

ఇంత తీపిని, సౌందర్యాన్ని నింపుకొన్న తెలుగు పదాలుండగా ఏవేవో పేర్లతో పిలవడం దండగ. ఇకనుంచైనా మన ఊరికి, మన వీధికి, మన ప్రాంతానికి తెలుగు పేరు పెడితే భాష గౌరవం అందుకుంటుంది, ఊరు గర్విస్తుంది. 'వీరీవీరీ గుమ్మడి పండు ఊరి పేరేమి?' అని ఎవరైనా అడిగితే తెలుగు పేరు తొలివేకువ వెలుగులా ప్రకాశిస్తుంది.

అరుణ్ పృథ్వి శాండిల్య
ఉపసంపాదకుడు,
ఈనాడు, హైదరాబాద్
80085 50406

మనసులో మర్మం

ఏమేగంగీ భామాగంగీ
బొట్టు చెదిరిందీ?
ఉగాది యెండలు మొగానకొడితే
చెమటకు చెదిరిందీ
॥ఏ॥

నీళ్లకుపోతావు ఏతోవనొస్తావు
తోవ తొలగవేమే
॥ఏ॥

నీ మనసులో మర్మము, కడుపులో
కపటము
మాటలాడవేమే
॥ఏ॥

చూడనూచూస్తుంది నవ్వనూనవ్వుతుంది
సిగ్గూ పడుతుంది
॥ఏ॥

నేనాడిన మాటలు దానిమగనితో
చాడీలు చెపుతుంది
॥ఏ॥

కుంకుమరేకుది గుజనపురవికది
గురుతులందినాది
॥ఏ॥

ఆగురుతులంది నాసామిగంగినీ
యెదుటకేలారాదు
॥ఆ॥

కాలు కురుచదీ కంచు రవికదీ
కనుమలో యెదురాయె
॥కా॥

దానికన్నూసైగలు తిప్పుతుంటేనా
మనసు చెదరిపోయె
॥దా॥

(జానపదగేయం)

ఆదిత్య విద్యాసంస్థలు

ఆదిత్యనగర్, ఎ.డి.బి. రోడ్, సూరంపాలెం, తూర్పుగోదావరి జిల్లా. ఫోన్ : 9949876662

3 దశాబ్దాలుగా విద్యాకాంతులీనుతున్న సంస్థ

అక్షరాభ్యాసం నుండి ఉన్నత విద్య వరకు అత్యున్నత విద్యాప్రమాణాలతో, ఉత్తమ శిక్షణ, అత్యుత్తమ క్రమశిక్షణకు పేరెన్నికగన్నవి ఆదిత్య విద్యాసంస్థలు

తొలి అడుగు నుండి నేటి 2012 ఉపాధ్యాయ పోటీ పరీక్షల వరకు తిరుగులేని విధంగా ఎందరికో ఉద్యోగాలను అందించిన ఎదురులేని శిక్షణా సంస్థ ఆదిత్య.

50 విద్యాసంస్థలు, 5000 మంది నిష్ణాతులైన ఉద్యోగ సిబ్బంది, 50,000 మంది విద్యార్థినీ, విద్యార్థులతో విజ్ఞాన కాంతులీనుతున్న ఆదిత్య విద్యాసంస్థలకు చెందిన ఇంజనీరింగ్ కళాశాలకు ఎన్.బి.ఎ. గుర్తింపు, అమెరికా అయెవా యూనివర్శిటీతో ఎం.ఇ.యు, యుజి.సి. 2(ఎఫ్) & 12(బి) గుర్తింపు పొందడం ఆదిత్యకే తలమానికం.

మూడు ఇంజనీరింగ్ కళాశాలలు, రెండు ఫార్మసీ కళాశాలలు, మూడు పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్న సూరంపాలెంలో గల 180 ఎకరాలు సువిశాల సుందర ప్రాంగణంలో అత్యాధునిక ల్యాబ్స్ మరియు లైబ్రరీ సౌకర్యాలతో కూడిన భవనాలతో 12 వేల మంది విద్యార్థులకు (దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలకు చెందిన 500 మంది విద్యార్థులతో పాటూ 70 మంది విదేశీ విద్యార్థులకు) ఇంజనీరింగ్ (డిప్లొమా, బి.టెక్., ఎం.టెక్. (ఫార్మసీ (బి. ఫార్మసీ, ఎం. ఫార్మసీ, ఫార్మాడి) కోర్సుతో పాటు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు అందిస్తున్న ఏకైక సంస్థ ఆదిత్య.

బహుళజాతి సంస్థలైన అత్యున్నత సంస్థలలో ప్రాంగణ ఎంపికల ద్వారా ఇంజనీరింగ్, ఫార్మసీ మరియు డిప్లొమా విద్యార్థులు ఉద్యోగాలు పొందడం గర్వకారణం.

మరింత సమాచారం కోసం www. aditya.ac.in లాగిన్ అవ్వండి

జైకొట్టు తెలుగోడా!

'సంస్కృతి అంటే మేధను, చైతన్యాన్ని విస్తరించడమే'

– జవహర్‌లాల్ నెహ్రూ

ఒక్క బుద్ధభగవానుడి చిత్రాలు, విగ్రహాలు తప్ప మనం నిత్యం కొలిచే ఏ దేవతా చిత్రాలు, విగ్రహాలూ అన్నిచోట్లా ఒకేలా ఉండవు. బుద్ధుడి చిత్రాలు, విగ్రహాలు మాత్రమే ప్రపంచమంతా ఒకేలా ఉండటానికి కారణం ఏమిటో?

2600 సంవత్సరాల కిందట కృష్ణాతీరంలోని వర్తకులు బీహార్‌లోని రాజగృహకు వెళ్లారు. వీరిలో ఒక కుర్రవాడు చిత్రకారుడు. ఆ రోజుల్లో బుద్ధుడు తరచూ రాజగృహకు వచ్చేవాడు. అక్కడ గృధ్రకూటం శిఖరం మీద కూర్చుని ప్రకృతిని ఆస్వాదించేవాడు. అప్పుడే కృష్ణాతీరం వర్తకులకు బుద్ధుడి దర్శనం అయింది. ఆ ప్రశాంత, గంభీర బుద్ధుని మూర్తినీ, రాజగృహ ప్రకృతి సౌందర్యాన్నీ చూసి ముగ్ధుడైన యువచిత్రకారుడు 'మీ చిత్రాన్ని గీస్తాను. కాస్త కదలకుండా నిలబడతారా?' అని అడిగేశాడు. బుద్ధుడిదీ కళాహృదయమే కనక మౌనంగానే అంగీకరించాడు. యువచిత్రకారుడు బుద్ధుడిని ఎండలో నిలబెట్టి ఆయనకు అభిముఖంగా తెల్లటి గుడ్డ పట్టాడు. దాని మీద పడ్డ ఆయన నీడకు అంచురేఖలు గీశాడు. కన్ను, ముక్కు రేఖలూ దిద్దాడు. యువకుడి ఉపాయాన్నీ తన రూప చిత్రాన్నీ చూస్తున్న బుద్ధుడి కళ్లు కరుణను వర్షించాయి. పెదవులపై చిరునవ్వు విరిసింది. మనం చూస్తున్న బుద్ధుడి విగ్రహాలు, చిత్రాలు ఆ నాటి యువకుడు గీసిన చిత్రం నకళ్లే. నీడను సిల్హౌట్ అంటాం.

రెండువేల ఆరువందల సంవత్సరాల నాడే తెలుగు చిత్రకారుడు నీడకూ, మనిషికీ పోలికున్నట్టు తెలుసుకుని నీడ సాయంతో రూప చిత్రరచన చేశాడంటే ఆనాటికే, కృష్ణాతీరంలోని చేతివృత్తులు, సాంకేతికత స్థాయిల్ని అంచనా వెయ్యవచ్చు. అప్పటికే తెలుగు వారి చిత్రకళ బాగా వృద్ధి చెంది ఉండొచ్చు. ఆ యువకుడి చిత్రకళా కౌశలం, సాంకేతిక నైపుణ్యం తెలుగువారి సాంస్కృతిక వైభవానికి ప్రతీక.

విశ్వవ్యాప్తంగా మానవజాతి సాధించిన మహత్తర విజయాల్లో తెలుగువారికి కూడా గణనీయమైన పాత్ర ఉందంటే ఈ రోజుల్లో అతిశయోక్తిగా కనిపించవచ్చు. కానీ ప్రపంచమంతటా బుద్ధుడి ప్రతిరూపాలు ఒకేలా ఉండటానికి మూలం తెలుగువాడు గీసిన చిత్రమే. మానవజాతి విజయాలలో ఎన్నదగినవి ఏవి అన్నప్పుడు ఆఫ్రికా- ఈజిప్ట్ అద్భుత నిర్మాణ కౌశలం, పశ్చిమ దేశాల అన్వేషణా పిపాస, పర్షియన్‌ల పాలనా సామర్థ్యం, చైనీయుల ఉత్పాదకతా పటిమ, తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలు అని సమాధానం రావాల్సిందే.

ఏ సంస్కృతిలోనైనా రెండు పార్శ్వాలు ఉంటాయి. ఒకటి... భౌతిక సంస్కృతి. అంటే కట్టు, బొట్టు, వస్త్రోత్పత్తి, పాడిపంటలు, వ్యవసాయం, పరిశ్రమలు మొదలైనవి. రెండు... బౌద్ధిక సంస్కృతి. అంటే ఆటపాట, మాట, ఆలోచనల సమాహారం, సిద్ధాంతాలు, తాత్వికధోరణులు. ఈ రెండు రకాల సంస్కృతులను ప్రోది చేయడంలోనూ తెలుగువారు అద్వితీయమైన విజయాలు సాధించారు. భౌతిక సంస్కృతి ఏ జాతికైనా భూమిక అయితే బౌద్ధిక సంస్కృతి ఈ పునాది మీద అందమైన సౌధం అవుతుంది.

మనదేశంలోని వివిధ సంస్కృతుల కన్నా తెలుగు సాంస్కృతిక వారసత్వంలో మేలెంత తాలెంత అని బేరీజు వేసుకోవడానికి ఇదో అవకాశం. తెలుగుభాష, జాతికి ఆనవాళ్లు ఏనాటివో చూద్దాం. రుజువులే ప్రధానం అనుకుంటే క్రీ.పూ 500 ఏళ్ల ముందు నుంచే తెలుగు శాసనాలు కనిపిస్తాయి. దాన్ని బట్టి అంతకన్నా కనీసం 500 ఏళ్ల ముందు నుంచీ అంటే క్రీ.పూ 1000 నుంచి తెలుగుభాష అస్తిత్వంలో ఉందనుకోవాలి. తమిళభాషలో అనేక తెలుగు పదాలున్నాయని ప్రసిద్ధ భాషా శాస్త్రవేత్త గంటిజోగి సోమయాజి నిరూపించారు. రెండు మూడు వేల ఏళ్ల కిందటి తెలుగుభాషకు ఇప్పటి తెలుగుకూ అపారమైన తేడాలు ఉండొచ్చు. క్రమపరిణామం ఏ భాషకైనా తప్పదు. భాషతోపాటు తెలుగు వారి సంస్కృతి కూడా జీవనదిలాంటిదే. ఆ ప్రవాహంలో అనేక అంశాలను తమలో ఇముడ్చుకుని అక్కరలేని వాటిని వదిలించుకుని భాషాసంస్కృతులను సుసంపన్నం చేసుకున్నాం.

ఉత్తరాన నర్మద, మహానదుల నుంచి మొదలుపెట్టి కృష్ణా, గోదావరి, మంజీర నదుల మీదుగా సాగుతూ... దక్షిణాన కృష్ణా, తుంగభద్ర సంగమ స్థలమైన నడిగడ్డసీమ దాకా తెలుగు సంస్కృతి వికసించింది. అందుకే ఇప్పటికీ ఈ ప్రాంతాలవారికి కొన్ని పోకడలు, పద్ధతులు ఆచారాల్లో సామ్యం స్పష్టంగా కనిపిస్తుంది.

"ఒకవైపు కృష్ణవేణిక ఉబ్బి తబ్బిబ్బు
లై సాగి తెల్గింట సేనపెట్ట
ఒకక్రేవ గోదావరికి హర్షలసారికా
నాట్యంబు ప్రసన్నందనంబు కూర్చ
ఒకప్రక్క తుంగభద్రకు చాయవెన్నెల
కెరటాలు తెలుగు
నంబరముచేర్చ
ఒకదారి మంజీర చకపిక
నడలతో
తెల్గుతల్లికి
తరితీవుచేయ..."

అని దాశరథి



అన్నారంటే ఆ నదుల గమనరీతిని వర్ణించడమే కాదు. ఆ నదుల పరీవాహక ప్రాంతాల్లో విలసిల్లిన సంస్కృతీ సౌరభాలను ఆస్వాదించమని ప్రేరేపిస్తున్నారు.

ప్రతి సంస్కృతిలోనూ కొన్ని విశిష్ట లక్షణాలు ఉంటాయి. ఆ సంస్కృతికే ప్రత్యేకమైన అంశాలూ ఉంటాయి. అదే ఆ జాతికి జీవగర్ర. కానీ ఇవి ఇతర సంస్కృతులకు, జాతులకు కూడా ఆదరణీయమో, అనుసరణీయమో అయినప్పుడు ఆ సంస్కృతి మరింత విస్తరి స్తుంది. ఈ దృష్టితో చూస్తే తెలుగునేలను ఏలిన శాతవాహనులు నాణాల మీద పాలకుల చిత్రాలను ముద్రించడం, ఆ పద్ధతి ఇతర సంస్కృతులకూ అనుసరణీయం కావడం మన సంస్కృతి బలీయతకు నిదర్శనం.

చరిత్రకు అందినంత వరకు తెలుగుదేశ తొలి పాలకులు శాతవాహనులు. వీరి జాతి నామం ఆంధ్ర. ఆ పేరే మన ప్రాంతానికి పెట్టుకున్నాం. కానీ వారి భాష మాత్రం తెలుగుకాదు. వారు తెలుగుదేశాన్నే కాక మహారాష్ట్రనూ పాలించారు. అందుకే బొంబాయి విద్యుత్ సరఫరా విధానానికి 'ఆంధ్రా వ్యాలీ సిస్టం' అన్న పేరు నేటికీ మిగిలింది. శాతవాహనుల ప్రధాన రాజధాని నేటి ఔరంగాబాద్ జిల్లాలోని పైఠన్. వారి ముఖ్య శాసనాలు నాసిక్, కన్హేరి గుహల్లో ఉన్నాయి. ఆ శాసనభాష ప్రాకృతం.

రాజులు తమ భాషలోనే పాలన సాగిస్తారు. ప్రజల భాషలో కాదు. మొఘలులు ఫారసీలో, నిజాం నవాబులు ఉర్దూలో, బ్రిటిష్ వారు ఆంగ్లంలో పాలించారు. శాతవాహనులూ తమ మాతృభాష ప్రాకృతంలో దేశాన్ని ఏలారు.

ఆ తర్వాత వరసగా ఇక్ష్వాకులు, సాలంకాయనులు, విష్ణుకుండినులు, పల్లవులు కోస్తా తెలుగునాడును ఏలారు. వీరి శాసనాలన్నీ ప్రాకృత, సంస్కృతాల్లోనే ఉన్నాయి. వారి భాష కూడా తెలుగు కాదు. వారినీ తెలుగు వారనడానికి వీలులేదు.

కోస్తా ప్రాంతాన్ని వీరు ఏలుతున్న రోజుల్లో తెలంగాణ ప్రాంతాన్ని మహిషవంశ రాజులు పాలించిన దాఖలాలున్నాయి. వీరు తెలుగు వారో కాదో తెలియదు. తర్వాత పశ్చిమం నుంచి కన్నడులైన చాళుక్యులు, దక్షిణం నుంచి అరవలైన చాళుక్యులు, ఉత్తరాది నుంచి ఒడ్రులైన కళింగులు తెలుగుదేశాన్ని ముక్కలు ముక్కలుగా చేసుకుని చాలాకాలం ఏలారు.

పరాయి భాషల వారి ఏలుబడి కొనసాగుతున్న రోజుల్లో ఆరు-ఏడు శతాబ్దాల నాటికి ప్రజల్లో అలజడి, ఆందోళన మొదలయ్యాయి. ఒక రకమైన జాతీయ విప్లవం తలెత్తింది. తూర్పు చాళుక్యులకు, పశ్చిమ చాళుక్యులకు జగడాలు మొదలయ్యాయి. తెలుగునాట యువకులు జాతి ఐక్యతను, స్వపరిపాలనను నిలపడం కోసం ఆయుధాలు చేపట్టారు. అధ్యక్షపాలన నెలకొల్పారు. 750 సంవత్సరాలకు పూర్వమే రాజులేని అధ్యక్షపాలన దేశంలోని రాజులందరికీ విడ్డూరంగా కనిపించింది. భీతిగొల్పింది.

తెలుగుతనం చూపకపోతే రాజులకు మనుగడ కష్టమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. అప్పుడే కడప మండలంలోని రేనాటి చోళులు తాము తెలుగు వారమేనని చెప్పుకున్నారు. కోస్తాలోని వెలనాటి చోడులు కూడా తెలుగువాళ్లం అన్నారు. శాసనాలు వేయించారు. వీరిని చూసి కళింగులు కూడా తెలుగుపాట పాడారు. ఒక గాంగుడు తెలుగు దేవత అయిన 'నూంకవపోసె స్వామిని'కి గ్రామదానం చేశాడు. చోడ మహారాణి 'వసంత పోటి' చేసిన దానాలను తెలుగులో రాయించింది. వేంగీ చాళుక్యుల మీద తిరుగుబాటు చేసిన జటాచోట భీముని 'తెలుగు భీముడు' అని దక్షిణాది చోళులు పిలిచారు. ఈ తెలుగు భీముడు కంచి దాకా



దిగ్విజయం చేసి అక్కడ వేసిన అరవ శాసనంలో తెలుగు సీస పద్యాన్ని రాయించాడు. తెలుగుతనాన్ని నిలుపుకున్నాడు.

వెలనాటి చోడులు తెలుగుతనాన్ని సంతరించుకున్నారు. తెలుగును అధికార భాషగా చేసుకున్నారు. అలాంటివారిలో ఒకడైన నన్నెచోడుడు కుమార సంభవ కావ్యం రాశాడు. ఇది నన్నయ భారతం కన్నా పూర్వకాలం నాటిదని ఆ భాషను, అందులో ఉన్న సంప్రదాయాలను అధ్యయనం చేసిన పరిశోధకులంటున్నారు. తన కన్నా పూర్వమే చాళుక్య నృపులు మొదలైనవారు మార్గ కవితను వెలయించారని నన్నెచోడుడు కూడా అన్నాడు. దాన్ని బట్టి నన్నయకు, నన్నెచోడుడికి పూర్వమే తెలుగు మార్గ కావ్యాలు ఉండి ఉండాలి.

కన్నడిగుడైన పొన్నడు కూడా ఆది పురాణాన్ని తెలుగు, కన్నడాల్లో అంతకు ముందే రాశాడు. నన్నయకు పూర్వమే వేములవాడ వాడైన పంపకవి కన్నడంతో పాటు తెలుగులో రాసిన జనేంద్ర పురాణం, భారతం ఇప్పుడు దొరకడం లేదు. అవన్నీ కొల్లవోయిన తెలుగు సంస్కృతిలో భాగం.

తెలుగు వారికి సుదీర్ఘచరిత్ర ఉంది కానీ చారిత్రక దృష్టిలేదు. మన చరిత్ర పొడవునా సమాజాభ్యుదయానికీ, చేతనోద్దీపనకు కావలసిన అంశాలు అంతర్లీనంగా ఉంటాయి. కానీ పండితులు, పరిశోధకులు, చరిత్రకారుల హ్రస్వదృష్టి, ఆధిపత్యధోరణి వాటిని మరుగున పడేశాయి.

తెలుగుజాతి చరిత్రను రెండు, రెండున్నర వేల ఏళ్లకు పరిమితం చేయడం ఒక రకంగా అపచారమే. మహాభారతంలో 'ఆంధ్రశ్చబహవః' అన్న మాట కనిపిస్తోంది. ఆంధ్రులకు రకరకాల పట్టణాలు ఉండేవని మెగస్తనీసు చెప్పాడు. ఈ పట్టణాలు ఎక్కడ ఉండేవో నరసభూపాలీయంలో విన్నకోట పెద్దన వివరించాడు. త్రిలింగ అంటే కాళేశ్వరం, శ్రీశైలం, శ్రీకాకుళం (కృష్ణాజిల్లా)తో కూడిన ప్రాంతం అన్నాడు. ధర్మ సింధువు రాసిన మేధాతిథి కృష్ణోత్తర భాగాలను త్రిలింగదేశం అన్నాడు.

క్రీ.శ. ఒకటో శతాబ్దంలో ప్రపంచ భూగోళశాస్త్రం అందించిన టాలెమీ జంబూద్వీప తూర్పు తీరాన్ని అంతటినీ ఆంధ్రతీరం అన్నాడు. ఈస్టిండీస్‌ను ఆంధ్రదీవులు అన్నాడు. టాలెమీకి వ్యాఖ్యానం రాసిన జె.ఇ.గెరినీ కావేరి నుంచి కృష్ణ వరకు ఉన్న ప్రాంతాన్ని కళింగమనీ, మహానది నుంచి బర్మాలోని అరకాన్ నది వరకు ఉన్న ప్రాంతాన్ని ఆంధ్రతీరం అన్నాడు.

ఈశాన్య రాష్ట్రాల్లో త్రిలింగ, తెలంగో అన్న ఇంటిపేర్లు ఉన్నాయి. అందుకే మన జానపద కథలన్నీ బ్రహ్మపుత్రానది దగ్గరే తేలుతాయి. ఈ దృష్టితో చూస్తే కావేరి నుంచి కృష్ణ వరకు ఉన్న తెలంగాణ, కృష్ణ నుంచి మహానది వరకు ఉన్న కళింగం, మహానది నుంచి అరకాన్ (బర్మా) వరకు ఉన్న ఆంధ్రదేశంలో తెలుగు సంస్కృతి విలసిల్లిందనాలి.

'ఆంధ్రశ్చ బహవః' అన్న మహాభారతంలోని మాటను తరచి చూస్తే తెలుగు వారిలో 16 తెగలు ఉండేవని తెలుస్తుంది. మహిషక, మూలక, అష్టక, మొదలైనవి ఈ తెగలు. ఇవన్నీ కలిసి భారత యుద్ధం తర్వాత ఒక జాతిగా ఏర్పడ్డాయి. వివిధ తెగల సమాహారం ఒక జాతిగా ఏర్పడుతుందని చరిత్ర చెప్పే సాక్ష్యం. తెలుగు వారు జాతులుగా ఏర్పడటానికి ఆంధ్రమహావిష్ణువు నాయకత్వం వహించాడని వాసిష్ఠగణపతిముని అంటారు.

అలెగ్జాండర్ కోంద్రతోవ్ భూభౌతిక శాస్త్రరీత్యా అత్యంత ప్రాచీన నాగరికతకు అనువైన స్థలం ఏది అని తర్కించాడు. చివరికి అది కృష్ణా-తుంగభద్ర సంగమ స్థలమైన నడిగడ్డ సీమ(దోఅబ్) అన్నాడు. అదే ఆదిశిలా క్షేత్రం. అది ఇప్పటికీ మల్దకల్‌లో ఉంది. డార్విన్ సహచరుడైన ఆల్డస్ హక్స్లీ కూడా ఆది నాగరికత విలసిల్లింది తుంగభద్ర పరీవాహక ప్రాంతమేనన్నాడు.

కళింగ యుద్ధం జరిగిన తర్వాత 300 ఏళ్లకు శాతవాహనులు గుజరాత్‌లోని బరూచ్‌ను ఆక్రమించారు. కాశీపాండ్యన్ వాదన ప్రకారం తెలుగు సంస్కృతి మూలాలు 20-25 వేల ఏళ్ల నుంచీ ఉన్నట్టు లెక్క.

ఇంతటి విస్తారమైన సాంస్కృతిక చరిత్ర ఉన్న తెలుగువారి మూలాలను పరిమితం చేసే ప్రయత్నాలు జరిగాయి. చాళుక్య రాజులు అంటే వేంగీ చాళుక్యులు మాత్రమేనని నమ్మినవారు లేదా నమ్మించడానికి ప్రయత్నించినవారు వేంగీనాడును ఏలూరు పరిసర ప్రాంతాలకు పరిమితం చేశారు. అయితే వేంగి రాజుల శాసనాలు నల్లగొండ జిల్లా భువనగిరి దగ్గర్లోని బొల్లేపల్లి దేవాలయంలో కూడా ఉన్నాయన్న వాస్తవాన్ని వీరు గమనించలేకపోయారు. కొలనుపాక చాలాకాలం వేంగి రాజ్యంలో అంతర్భాగంగా ఉండేదని వారికి తెలియదు. అదీకాక వేములవాడ చాళుక్యులనే మరోశాఖ తెలంగాణ అనే తెలుగు ప్రాంతాన్ని ఏలిందని ఈ పండితులు నమ్మరు. కాకతీయుల కాలంలో మొత్తం తెలుగు ప్రాంతమంతటికీ తెలంగాణమనే పేరే ఉండేది. ఆ రోజుల్లో కోస్తా ప్రాంతం నుంచి బీదర్ వరకుగల ప్రాంతానికి పశ్చిమ తెలంగాణ అని పేరు. దాని పాలనాకేంద్రం బీదర్.

తెలుగు తాత్వికులు

తెలుగునాట జైన, బౌద్ధమతాల ఆనవాళ్లు బోలెడు. బౌద్ధ గురువు ఆచార్య నాగార్జునుడు తెలుగువాడే. బౌద్ధ తర్క పండితుడు దిజ్ఞాగుడు మెదక్ జిల్లా కొండాపురం ప్రాంతవాసి. కొండాపురంలో పురావస్తుశాఖ బారెడు లోతు తవ్వే సరికి పండితులకు, పరిశోధకులకు కళ్లు చెదిరిపోయే చారిత్రక సమాచారం వెలువడింది. అది బౌద్ధక్షేత్రమని రుజువైంది. తెలుగునాట బౌద్ధాన్ని వ్యాపింప చేసిన వారిలో భావవివేకుడు, బుద్ధపాలితుడు ఉన్నారు. బుద్ధపాలితుడు మంగళగిరి వాడు. జైనాన్ని

వ్యాపింపచేసిన కొండ కుంభాచార్యులు పేరు సాధారణంగా వినిపించదు. ఆయన అనంతపురం గుత్తికొండ వాసి. ఆయన్ను మనం నిర్లక్ష్యం చేశాం. కన్నడిగులు అక్కున చేర్చుకున్నారు.

కళాపూర్ణోదయం

సంగీతంలాంటి కళలు మానవుడు అన్న సముపార్జన కోసం శ్రమించే సమయంలోనే పుడతాయి. కానీ రూపకళలకు అన్నసముపార్జన తర్వాత తీరిక అవసరం. సంచార దశదాటి సాపేక్షిక స్థిరత్వం ఏర్పడితేనే తీరిక. కృష్ణా గోదావరి వంటి నదుల ముఖద్వారాల వద్ద తెలుగు సమాజానికి ఈ తీరిక చిక్కి ఉంటుంది. గోదావరి డెల్టా ప్రాంతంలోని గ్రామాల పేర్లు సంస్కృత ప్రభావానికి అతీతం. అంటే అక్కడ జనం స్థిరనివాసం మొహంజోదారో నాగరికతకు ముందే జరిగి ఉండాలి. సహజంగా దొరికే ఆహారపదార్థాలకు తోడు తన శ్రమను కూడా జోడించే ప్రయత్నమే వ్యవసాయం. ఈ వ్యవసాయం అదనపు ఆహారోత్పత్తికి దారితీస్తుంది. ఆ మిగులును నిలవచేసుకునే క్రమంలో మట్టి పాత్రల తయారీ సాధ్యం అయింది. ఇసుకనేలపై పేరుకున్న ఒండ్రు మీద తన అడుగు జాడ ఎండిన తర్వాత దొప్పలా తయారవడం మనిషి గమనించాడు. ఆ ఎండిన ఒండ్రు కుండపెంకులా గట్టిగా ఉండటమూ కనిపెట్టాడు. ఒండ్రును మెదిపి చేసింది ఏదైనా తర్వాత స్థిరంగా ఉండడమూ గమనించాడు. కుండలు చేయడం నేర్వడానికి ఇదే ప్రథమ పాఠం. అయితే ఎండిన కుండ నీరు తగలగానే విచ్చిపోయి రూపు కోల్పోవడమూ చూశాడు. కాల్చిన కుండకు కొంత శాశ్వతత్వం వస్తోందని గ్రహించాడు. కాల్చిన కుండల మీద కుంభకారుడి స్వహస్త ముద్రలూ గోచరించాయి. చెరిపినా చెరగని వేలిముద్రలూ, గోటిగీతలూ కనిపించాయి. ఇక కొత్త కుండచేసినప్పుడు వేలిముద్రలు వేసి వాటిని కలుపుతూ గోటి గీతలు గీశాడు. కాల్చిన తర్వాత ఆ కుండకు కొత్త అందం వచ్చింది. అదే అలంకారమైంది. వేలి ముద్రకు చిహ్నమైన శంఖవృత్తం, రకరకాల గోటి మీట్లు కుండలపైన, గోడలపైన, ముంగిళ్ల రంగవల్లికలపైన తెలుగునాట ఈ నాటికీ గోచరిస్తాయి. అవే తొలి తెలుగు చిత్రకళకు ఓనమాలు నేర్పాయి. ఆ తర్వాత పరిసరాలకు ప్రతిరూపంగా బొమ్మలు చేశాడు. తర్వాత చిత్ర కళ చరిత్ర తెలిసిందే.

స్వరోద్ధారం

సాముదాయిక, ఉత్పాదకశ్రమ లేకపోతే మనిషికి వాక్కు విడేదే కాదు. అంటే భాష ఉండేది కాదు. ఆ శ్రమను మరిచిపోవడానికి గొంతెత్తి పాడటమూ అవసరమైంది. అదే సంగీతం అయింది. ఆ సంగీతానికి ఆలంబనగా మాటలు సాహిత్యస్థాయిని అందుకున్నాయి. ఈ దశనాటికి తొలి తెలుగు సంగీతం ఎలాంటిది అని చెప్పడం కష్టమే కాని ఆ సంగీతశాస్త్రానికి వ్యాఖ్యానం చేసిన తెలుగువాడి ఆచూకీ కనిపెట్టడం కష్టం కాదు. మరాఠ్వాడాలోని దౌలతాబాద్ (దేవగిరి) రాజధానిగా పరిపాలించిన యాదవ వంశ రాజు సింహణుని ఆస్థాన విద్వాంసుడు శార్ఙ్గ దేవుడు 'సంగీత రత్నాకరం' రాశాడు. ఆంధ్రదేశపు వెలమ ప్రభువు సర్వజ్ఞసింగభూపాలుడూ, విజయనగర కర్ణాటక సామ్రాజ్య ఆస్థాన విద్వాంసుడైన చతురకల్లినాథుడు సంగీత రత్నాకరానికి 'సంగీత సుధ', 'కళానిధి' అనే వ్యాఖ్యానాలు రాశాడు. శార్ఙ్గ దేవునికి దాదాపు సమకాలికుడైన జాయపసేనాని 'నృత్త రత్నావళి', 'గీత రత్నావళి', 'వాద్యరత్నావళి' గ్రంథాలను రాసి సంగీత, నాట్యకళలతోపాటు వాద్యాలకు సంబంధించిన తబ్సీళ్లు కూడా అందించాడు. శ్రీనాథుడిని ఆస్థానకవిగా నియమించిన కొండవీటి రాజు కుమారగిరి వసంత భూపాలుడు 'వసంత రాజీయం' పేర భరతుడి నాట్యశాస్త్రానికి వ్యాఖ్య అనదగిన లక్షణ గ్రంథాన్ని, పెదకోమటి వేమారెడ్డి 'సంగీత చింతామణి'నీ అందించారు. ఇవన్నీ సంస్కృతంలోనే ఉన్నా రాసింది తెలుగువారు.

సింహాచలంలో కృష్ణమాచార్యుల 'సింహగిరి నరహరివచనాల' ద్వారా తెలుగుపాట ఆలయ మంటపాలలో మార్మోగింది. ఆళ్వారుల తర్వాత ఆళ్వారులంతటివాడైన, పదకవిత పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుడు సంకీర్తన పద్ధతికి ఆద్యుడయ్యాడు. సిద్ధేంద్ర యోగి భామాకలాపం, నారాయణతీర్థుని, కృష్ణలీలా తరంగిణి, క్షేత్రయ్య పదాలకు దోహదం చేశాయి.

కృష్ణదేవరాయల తర్వాత తంజావూరులో స్వతంత్రులైన తెలుగు నాయక రాజుల హయాం తెలుగు యక్షగానాలకు స్వర్ణయుగం. 1762లో జన్మించిన శ్యామశాస్త్రి, 1767లో పుట్టిన త్యాగరాజు, 1775లో జన్మనెత్తిన ముత్తుస్వామి దీక్షితులు కర్ణాటక సంగీత వాగ్గేయకారుల్లో త్రిమూర్తుల్లాంటి వారు. పేరుకే ఇది కర్నాటక సంగీతం కాని వస్తుతః తెలుగు సంగీతమే. గడిచిన రెండు దశాబ్దాలకు పైబడి ఈ సంగీత వాహిని నిరంతరంగా ప్రవహిస్తోంది.

విజయనగరం, బొబ్బిలి, పిఠాపురం జమిందారీలు ఆస్థాన సంగీత విద్వాంసులను పోషించాయి.

తెలుగు శోభ

'గోరింట' తెచ్చిన ముద్ద మందారపు మెరుపులీనే చేతులతో 'అష్టాచెమ్మా'నో 'వైకుంఠపాళీ'నో ఆడుకుంటూ, పండగప్పుడు అమ్మతో కలిసి ఇంటి ముంగిట 'రంగవల్లు'లను తీర్చిదిద్ది వాటిలో 'గొబ్బెమ్మ'ల్ని అలంకరిస్తూ, 'బతుకమ్మ' ఆడుతూ ఉండే తెలుగింటి అమ్మాయి చూస్తూ చూస్తూండగానే 'లంగాఓణీ'ల్లోకి వచ్చేస్తుంది. అమ్మానాన్నల కన్నుల పంటగా పెళ్లికూతురూ అవుతుంది. 'జీలకర్ర - బెల్లం' తోడుగా అత్తవారింటికి పయనమవుతుంది. 'అట్లతద్ది' నాడు అమ్మ చూడ, 'అమ్మ'ను కొలవ పుట్టింటికి తిరిగి వస్తుంది. సౌభాగ్య సంపద కలకాలం నిలవాలని కోరుకుంటూ 'బోన'మెత్తుకుంటుంది. ఇలా... ఆమె, అమ్మాయి నుంచి అమ్మమ్మ అయ్యేవరకూ తోడువచ్చే తెలుగింటి సంప్రదాయాలెన్నో! విశాల భారతంలో మన సాంస్కృతిక విలక్షణతకు ఆనవాళ్లివి. ఉరుకుల పరుగుల జీవితంలో కొన్ని మరుగునపడి ఉండవచ్చు... తీరికా, మనసు రెండూ చేసుకుని వాటిని తిరిగి తెచ్చుకోవాలి. మనకు మాత్రమే సొంతమైన ఈ వైభవాన్ని ప్రపంచానికి చాటాలి.

ద్వారం వెంకటస్వామినాయుడు, ద్వారం నరసింగరావు, ఎంఎస్ సుబ్బులక్ష్మి, బాలమురళీకృష్ణ, తమ గానామృతాన్ని పంచి పెడితే, డొక్కా శ్రీరామమూర్తి వంటివారు సంగీత గురువులుగా, అరిపిరాల, బాలాంత్రపు రజనీకాంతరావు వంటి పరిశోధక విద్వాంసులూ తెలుగు సంగీతాన్ని దశదిశలా వినిపించారు. డా॥ శ్రీపాద పినాకపాణి రెండు తరాల విద్వాంసులకు సేతువు లాంటివారు. నేదునూరి కృష్ణమూర్తిది పుష్టికరమైన పురుషగాత్రం. ఓలేటి వెంకటేశ్వర్లు దాక్షిణాత్య, ఉత్తరాది గురువుల ఉత్తమ పద్ధతులను ఆకళింపు చేసుకుని సొంత శైలిని రూపొందించుకున్నారు.

హరికథా పితామహుడైన ఆదిభట్ల నారాయణదాసు సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకున్న వారు అనేకమంది. వారు దాన్ని కొనసాగించడం మహిళా భాగవతులు తయారు కావడానికీ తోడ్పడింది.

వేయి సంవత్సరాల నాటి ఆంధ్రదేశంలో యక్షగాన ప్రదర్శన ఎలా ఉండేదో తెలియాలంటే చిందు యక్షగాన ప్రదర్శన చూడాల్సిందే. ఆరుంధతీ కులానికి చెందిన నిరుపేద కళాకారులు ఈ చిందు యక్షగానాన్ని పరిరక్షిస్తున్నారు. ప్రాచీన సంప్రదాయ పల్లె ప్రజలకు అర్థమయ్యే భాషలో భావప్రకటనతో గ్రామీణులను చైతన్యవంతులను చేస్తున్నారు.

ఆగమ నర్తనరీతిని, పూజా నర్తనరీతిని, ఆలయం వెలుపల భక్తుల కోసం ప్రదర్శించే ప్రబంధ పద్ధతిని కలిపి నటరాజ రామకృష్ణ ఆంధ్రనాట్యాన్ని రూపొందించారు. పేరిణి కాకతీయుల కాలంలో ప్రచారంలో ఉండేది. కాకతీయ గణపతి దేవుని బావమరిది, గజసేనాపతి జాయపసేనాని నర్తకుడు. 700 ఏళ్లకన్నా ముందున్న నృత్యరీతి అయిన ఆంధ్రనాట్యాన్ని పునరుద్ధరించడానికి ఎంత ప్రయత్నించినా పేరిణి తాండవం మాత్రమే జనం మదిలో నిలిచింది.

కూచిపూడి నృత్యరీతి

తెలుగు వాడి నాట్యరీతి అనగానే కూచిపూడి నృత్యమే గుర్తుకొస్తుంది. కృష్ణాజిల్లా దివి తాలూకా కూచిపూడి గ్రామం పేర ఉన్న ఈ నాట్యానికి 1950ల తరువాత ఎక్కువ ప్రచార, గౌరవాలు దక్కాయి. శాతవాహనుల రాజధాని శ్రీకాకుళానికి (కృష్ణాజిల్లా) కూచిపూడి దాదాపు తొమ్మిది మైళ్ల దూరంలో ఉంటుంది. క్షేత్రయ్య జన్మస్థలం అయిన మొవ్వకు మూడు కిలోమీటర్లే. ఒకప్పుడు ఆ ప్రాంతం అంతా నాట్యకత్తెల మంజీరనాదాలు, గాయకుల మధుర కంఠధ్వనులు, శిల్పుల లయబద్ధమైన ఉలిచప్పుళ్లు రవళించేవి. శ్రీకాకుళంలోని ఆంధ్ర విష్ణువు దేవాలయంలో దేవదాసీల నాట్యరూపాలు, నృత్య విన్యాసాలు నిలిచి పోయాయి.

కూచిపూడి నర్తకులు బాలగోపాల తరంగం ప్రదర్శనలో ఇత్తడి పళ్లెం అంచుపై నాట్యం చేస్తూ తలపైన కలశాన్ని ధరిస్తారు. ఈ పద్ధతిని ప్రవేశపెట్టింది వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి. ఆయన సంప్రదాయాన్ని ఉల్లంఘించి స్త్రీలకు కూడా నాట్యాన్ని నేర్పిన సాహసి. అందులో బాలసరస్వతి ప్రముఖురాలు. వెంపటి చినసత్యం కూచిపూడి నాట్యాన్ని దేశమంతటా, విదేశాలలో సైతం వ్యాపింపచేయడాన్ని జీవిత లక్ష్యంగా పెట్టుకుని కృషి చేశారు. తెలుగువారి సంస్కృతీ ప్రాభవం ఈ కళారీతులకే పరిమితం అయింది కాదు. మరెన్నో ఉన్నాయి.

తెలుగు వాఙ్మయం ఆనవాళ్లు కనిపెట్టడంలో అమూల్యమైన కాలాన్ని వృథా చేసి నన్నయకు అగ్రాసనాధిపత్యాన్ని కట్టబెట్టి పనైపోయిందనిపించారు. నన్నయ, తదనంతర రచనల కాలం తరువాత ప్రబంధ యుగం ఉక్తి వైచిత్రి రీత్యా ఎంతగొప్పదైనా, పద్య రచనలో ఎన్ని పోకడలు పోయినా చాలా వరకూ జనం సంస్కృతీ చైతన్యాన్ని తాకకుండానే గిరిగీసుకు కూర్చుంది. పిల్ల వసుచరిత్రల కాలంలో తెలుగు కవిత సాంద్రత మరింత తగ్గింది.

ఆ బంధాలన్నీ తెంచుకుని ఇంగ్లిషు చదువుల ప్రభావంతో ఇప్పుడు ఆధునిక సాహిత్యంగా పరిగణిస్తున్న రచనల్లో ఒక పాయ సమాజాభ్యుదయానికి చేదోడుగా ఉంటే; స్వీయ మానసిక ధోరణులే కవితకు పరమార్థం అనుకున్న భావకవిత్వ పాయ జనచేతనను పట్టించుకోకుండానే ఉండి పోయింది. ఆధునిక సాహిత్యం అని చెప్పుకుంటున్న ఈ ధోరణి 20వ శతాబ్దం తొలి దశాబ్దాంతానికి ప్రస్ఫుటమైంది. 1909లో వెలువడిన రాయప్రోలు సుబ్బారావు 'తృణకంకణం' భావకవిత్వ ధారకు దాఖలా అయితే 1910లో వెలువడిన గురజాడ 'ముత్యాలసరాలు' ఆధునిక ధోరణికి ప్రతిరూపం.

కవిత అన్న ప్రక్రియారూపానికి పరిమితమై చూస్తే 'ముత్యాలసరాలు' 1910లో వెలువడినా గురజాడ తన ఆధునిక ధోరణికి విశ్వరూపం ఇచ్చి ప్రదర్శించింది అంతకుముందు రెండు దశాబ్దాలకు పూర్వమే. గురజాడ 'కన్యాశుల్కం' ద్వారా 1892లోనే ఆధునికత అంటే ఏమిటో కళ్లకు కట్టారు. ఆయన దృష్టిలో ఆధునికత ఒక భావధారే తప్ప కాలవాచి కాదు. అందుకే 120 ఏళ్లయినా కన్యాశుల్కం నాటకానికి వన్నె తగ్గలేదు. గురజాడ ఊహించిన సమాజ స్థాయికి మనం ఇప్పటికీ చేరుకోలేకపోయాం.

కానీ గురజాడ వేసిన బాట 20వ శతాబ్దంలో సాహిత్యాన్ని పురోగమనపు బాట పట్టించి భావకవిత్వ ధారను చరిత్ర గర్భంలో నిక్షిప్తం చేసింది. కందుకూరి వీరేశలింగం సంస్కరణోద్యమం, గిడుగు భాషా సంస్కరణోద్యమం ఈ మార్గానికి అదనపు జవసత్వాలను సమకూర్చాయి. దానితో తెలుగు సాహిత్యం కొత్త పుంతలు తొక్కి శాఖోపశాఖలుగా విస్తరించింది. అంతర్జాతీయ స్థాయికి చేరుకుంది.

వాస్తవానికి 'కన్యాశుల్కం' గురజాడ సమకాలికుడైన ఇబ్సన్ నాటకాలకన్నా చాలా ఉన్నతమైంది. కన్యాశుల్కానికి ఉన్న అనువదనీయత పరిమితం అయినందు వల్ల అది ప్రపంచం దృష్టిని ఆకర్షించలేకపోయింది. ఇతర భారతీయ భాషలలోని వారికి దక్కినన్ని జ్ఞానపీఠాలు తెలుగు రచనలకు దక్కక పోవడానికీ, మన తెలుగు సాహిత్యం అనువాదాల రూపంలో రాష్ట్ర సరిహద్దులు

దాటలేకపోవడానికి ఉన్న కారణమే.

పాదార్థిక సంస్కృతిలో కూడా దేశం ఎల్లలు దాటిన తెలుగు వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రాథమిక సదుపాయాల కల్పనారంగంలోను, సాఫ్ట్‌వేర్ రంగంలోనూ ఈ కీర్తి ఎక్కువగా కనిపిస్తోంది.

రాజకీయ చిత్రపటం

తెలుగు వారి సంస్కృతి ఎంత అవిచ్ఛిన్నమైంది అయినా రాజకీయ చరిత్ర మాత్రం అనేక ఎగుడు దిగుళ్లు చవిచూసింది. కాకతీయుల కాలంలోను, ఆ తరువాత ఆదిల్‌షా, అబ్దుల్లా

అవధానం

అవధాన ప్రక్రియ తెలుగు వారికి ప్రత్యేకం. ఇది సంస్కృతంలోనూ ఉండేది. అష్టావధానం తెలుగులో బాగా ప్రసిద్ధి. ఎనిమిది మంది పృచ్ఛకులు అడిగే ప్రశ్నలకు అవధాని పద్యరూపంలో సమాధానం చెప్పాలి. అసాధారణ ధారణాశక్తి, ఏక కాలంలో అనేక పనులు చేయగలిగే సామర్థ్యం ఉన్న వారే అవధానాలు నిర్వహించగలుగుతారు.

కుతుబ్‌షాహీ కాలంలో మాత్రమే రాజకీయంగా తెలుగు వారు ఏకీకృతంగా ఉన్నారు. 1524లో కృష్ణదేవరాయలతో ఆదిల్‌షా తలపడినప్పుడు ప్రపంచ చరిత్రలోనే మొట్టమొదటి సారి ఆధునిక ఆయుధాలైన తుపాకులతో యుద్ధం జరిగింది. దీన్ని 'దోఆబ్ యుద్ధం' అంటారు. అంటే, తుపాకుల వాడకానికి దారిచూపింది తెలుగు వారే.

కాకతీయుల కాలంలో గణపతిదేవుని హయాం నాటికి తెలుగు జాతి ఏకీకరణ పూర్తై ప్రతాపరుద్రునితో అంతం అయింది. 125 ఏళ్లపాటు సాగిన కాకతీయుల పాలనకు ముందు తెలుగువారు ఒకే రాజకీయ ఛత్రం కింద ఎన్నడూ లేరు. ఆ తర్వాత పోయిన ముక్కలుపోగా మిగిలిన తెలుగు నేల 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరణతోనే ఏకీకృతం అయింది.

జాతీయోద్యమంలోనూ తెలుగువారి కృషి గణనీయమైంది. ఆనందాచార్యులు కాంగ్రెస్ అధ్యక్షులయ్యారు. హైదరాబాద్ నివాసి సరోజని నాయుడిది కాంగ్రెస్ రాజకీయాల్లో ఎప్పుడూ కీలకపాత్రే. ఆమె కాంగ్రెస్ అధ్యక్షురాలయ్యారు. ఆ తర్వాత భోగరాజు పట్టాభిసీతారామయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి, నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, పీవీ నరసింహరావు కాంగ్రెస్ అధ్యక్షులయ్యారు. నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతి పదవిని, పీవీ ప్రధాని పదవినీ చేపట్టగలిగారు.

ప్రతిపక్ష పార్టీల నాయకుల్లో కూడా జాతీయ నాయకత్వం చేపట్టిన వారిలో చాలా కాలం సీపీఐ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన చండ్ర రాజేశ్వరరావు, సిపిఎం ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన పుచ్చలపల్లి సుందరయ్య ఉన్నారు. వీరిద్దరూ ఏకకాలంలో రెండు పార్టీలకూ నాయకత్వం వహించిన సందర్భం ఉంది. ఇప్పుడు సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి తెలుగువాడే. భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన బంగారు లక్ష్మణ్, వెంకయ్యనాయుడు తెలుగువారే. దేశమంతటినీ గడగడలాడించిన వామపక్ష తీవ్రవాద పార్టీ 'పీపుల్స్‌వార్' వ్యవస్థాపకుడు కొండపల్లి సీతారామయ్య గుడివాడ వాసే. ఆర్థిక రంగంలో పేరుపొందిన తెలుగువారిలో ఆంధ్రాబ్యాంకును స్థాపించిన భోగరాజు, రిజర్వుబ్యాంక్ గవర్నర్‌గా పనిచేసిన వై.వి. రెడ్డి, ప్రస్తుత గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ప్రముఖంగా కనిపిస్తారు. తెలుగు వారిని మద్రాసీలుగా వ్యవహరించే పద్ధతిని ఈసడించి తెలుగు వారి ఆత్మగౌరవ పతాకాన్ని ఎత్తడంలో ఎన్టీ రామారావు పాత్ర అద్వితీయం. ఇంకా ఎందరో మహానుభావులు తెలుగు జాతి ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేశారు.

శాస్త్ర సౌరభాలు

శాస్త్రవేత్తలుగా అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన తెలుగువారు చాలామందే ఉన్నారు. యల్లాప్రగడ సుబ్బారావు జీవ రసాయన శాస్త్రంలో అపారమైన కృషి చేసి మానవాళిని రోగాల బారినుంచి కాపాడడానికి ఉపకరించే అనేక ఔషధాలు కనుగొన్నారు. ఉప్పుగుండువారి అశ్వత్థనారాయణ భూగర్భ శాస్త్రంలోనూ, రక్షణ మంత్రిత్వ శాఖకు సలహాదారుగా పనిచేసిన సూరి భగవంతం భౌతిక శాస్త్రంలోనూ, యలవర్తి నాయుడమ్మ రసాయన శాస్త్రంలోనూ, కొచ్చెర్లకోట రంగధామరావు భౌతిక శాస్త్రంలోనూ అసమాన ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన తెలుగు శాస్త్రవేత్తల్లో అగ్రగణ్యులు.

కొల్లవోయిన వైనం

తెలుగు ప్రాభావం ఎంత గొప్పదైనా మన అమూల్య సంపదలో ఎక్కువ భాగాన్ని కాపాడుకోలేకపోయాం. అమరావతి శిల్పులు రాళ్లలో రమణీయ వాస్తవికతను మలిచారు. కానీ 19వ శతాబ్దంలో అమరావతి ప్రభువు రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు అమరావతి శిల్పఖండాలను కాల్పించి సున్నం చేసి తన గడీ గోడలు కట్టించుకున్నాడు. ఆనాడు కన్నింగ్‌హాం అనే బ్రిటిష్ దొర అడ్డుపడకపోతే అమరావతి నామరూపాలు లేకుండా పోయేది. అయితే ఆ తెల్లదొరకు తెలుగువారి మీద అభిమానం ఎందుకుంటుంది? తనకు చిక్కిన శిల్ప కళా ఖండాలను ఇంగ్లాండుకు తరలించుకు వెళ్లాడు.

తెలుగు నేలమీద వెలసిన మహాద్భుత కట్టడం స్వయంభూదేవాలయాన్ని రక్షించు కోలేకపోయాం. పునర్నిర్మించే ప్రయత్నమూ చేయలేదు. ఆ ఆలయం రాయి రాయి విడిపోతే కళ్లప్పగించి చూస్తున్నాం. సర్వాయి పాపన్న గురించి మనకు మిగిలింది కట్టుకథలే. అతని సమకాలీన చిత్రకారుడు గీసిన పాపని రూపచిత్రం లండన్‌లోని ప్రిన్స్ అల్బర్ట్ మ్యూజియానికి చేరింది.

ఆధునిక కాలంలో మరింత శరవేగంతో తెలుగు సంస్కృతి కొల్లవోతోంది. తెలుగు భాష అస్తిత్వానికి ముప్పు వచ్చే దయనీయ స్థితి ఎదురవుతోంది. తెలుగుభాష మీద, సంస్కృతి మీద మనల్ని ఏలిన పరాయి భాషల పాలకులకు ఉన్న పాటి గౌరవాదరాలు కూడా తెలుగు పాలకుల్లో ఏ కోశానా కనిపించడంలేదు. భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటిదైనా తెలుగుకు అధికారభాషా స్థానం ఇంకా ప్రయత్న దశలోనే ఉంది. అధికారభాషా సంఘానికి ఉన్న అలంకారస్థాయిని ఆచరణలోకి తీసుకురావడానికి పాలకవర్గాలకు ఏనాడూ శ్రద్ధ లేదు. వాస్తవం ఏమిటంటే ఏనాడైనా తమ సంస్కృతిని, భాషను పొదివిపట్టుకుని, పరిరక్షించుకునేది ప్రజలే. లేకపోతే పారసీ, ఉర్దూ, ఇంగ్లిషు భాషలు మాట్లాడే పాలకుల పదఘట్టనల కింద నలిగిన తెలుగు ఏనాడో కనుమరుగయ్యేది. అది ప్రజల నోళ్లలో నిలిచినందు వల్లే ఇంకా మిగిలి ఉంది. భాషాభిమానం కొరవడకుండా చూసుకుంటే భవిష్యత్తులోనూ మిగుల్తుంది.

ఆర్వీ రామారావ్
అనుభవజ్ఞులైన పాత్రికేయులు, పాత్రికేయ అధ్యాపకులు, అనువాదకులు. హైదరాబాద్.
96762 82858

నాగ బంధం

జనమనోరంజకం విజయనగర సామ్రాజ్యం. రాజధాని విజయనగరం... నిత్య కల్యాణం పచ్చతోరణం. పాలకుల హృదయాల్లా సువిశాలమైన రాజవీధులు, ఎత్తైన రంగుల మేడలు. బాటలకిరువైపులా బారులు తీరిన చెట్లకొమ్మలు, రెమ్మలతో సయ్యాటలాడిన పిల్లగాలులు బాటసారులకు గిలిగింతలు పెడ్తున్నాయి.

పాలనురగలాంటి తెల్లని గుర్రమ్మీద ఓ నవయువకుడు రాజభవనం వైపు ఠీవిగా వెళ్తున్నాడు. వడితిరిగిన కండరాలు, వెడల్పాటి ఛాతీ, పిక్కల మీద నాట్యం చేస్తున్న అంగరఖా అంచులు, మెడలో మేలిరతనాల హారం, తలపై మణి-మాణిక్యాలు పొదిగిన తలపాగా... హుందాతనానికి వన్నెలు దిద్దుతున్నాయి. అలవాటు ప్రకారం సూర్యోదయానికి మూడు ఘడియల ముందే నిద్రలేచి, వ్యాయామశాలకెళ్లి రకరకాల కసరత్తులు చేశాడు. వీరమల్లులతో ఖుషీగా కుస్తీలు పట్టాడు. సర్దారులతో ఖడ్గయుద్ధం అభ్యాసం చేస్తూ మెరుపులు మెరిపించాడు. వస్తాదులతో ఒంటికి తైలమర్దనం చేయించుకున్నాడు.

వీధిలో ఎదురైన జనానికేదో వరాలమూట దొరికినట్టు 'అడుగో కృష్ణదేవరాయలు.. కాబోయే మహారాజు...' మురిసిపోతూ గుసగుసలాడుతూ పక్కకు తప్పుకుంటున్నారు.

శ్వేతాశ్వం లయబద్ధమైన అడుగులతో ముందుకు పరుగెడుతోంది. కృష్ణదేవరాయల ఎదపొదలో నాగాంబిక నవ్వుల పువ్వులు అల్లరిపెడుతున్నాయి. నాగాంబిక అందాలరాశి. కాని... ఆమెను పెంచి పోషిస్తున్న తిప్పసాని నలుగురి చేతుల్లో నలిగిపోయే పూలదండ. వేశ్యావృత్తిలో ఉన్నా నాగాంబను గారాబంగా 'చిన్నాదేవీ!' అని పిలుస్తూ బురదగుంటలో పద్మంలా పెంచింది. తన వృత్తి ఛాయలామె కంటించలేదు. పచ్చిపాలలో చాయపసుపు రంగరించిన దేహచ్ఛాయ, విప్పారిన నల్లకలువల్లా విశాల నేత్రాలు, నడకలో మయూరగతి, నవ్వులో నవరత్నాలొలికించే నాగాంబిక తన గుండెల మీద పూవులా వాలి "ప్రియా! నన్ను అర్ధాంగిగా స్వీకరిస్తే, నా అందచందాలన్నీ శాశ్వతంగా నీవేగదా!" వేలిమొనలతో సన్నని మీసం కట్టును తడిమింది. నవజవ్వని అధరామృతాన్ని రుచి చూడాలనే ఆరాటం సయ్యాటలాడ్తోంది.

"సుందరీ! రాచరికం కట్టుబాట్లతో పెరిగిన నా మనసును మలుపు తిప్పిన నాట్యమయూరివి. నిన్ను వదులుకుంటానా?" పెదాలతో పెదాలందుకోబోయాడు. ఒడిలోంచి జారిపోయింది. "ఈ చిలిపి చేష్టలన్నీ మన పెళ్లయింతర్వాతనే యువరాజా!" కిలకిలా నవ్వింది. ఆ నవ్వు కావేరీ ప్రవాహం సవ్వడిలాగుంది...

తియ్యని అనుభవాల కమ్మని అనుభూతులు నెమరువేస్తూంటే కోట ద్వారాలు బార్లా తెరుచుకున్నాయి. అరెరే! మనిషిగా గుర్రమ్మీదున్నా మనసు ఆ సుందరి చుట్టే తిరుగుతోంది. గదూ!... తనలో తాను నవ్వుకున్నాడు. 'చిన్నా' అని పిలిపించుకుంటున్న నాగాంబ గురించి అప్పాజీకి చెప్పాలి.

* * *

"ఏమండీ! మహామంత్రిగారూ! విజయనగర సామ్రాజ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న మహామంత్రిగారూ!" సన్నిహితులతో "అప్పాజీ!" అని ప్రేమగా పిలిపించుకుంటున్న తిమ్మరుసు భార్య పలుకరించింది. ఇంటిలో కూచున్న తిమ్మరుసు మనసు మరో లోకంలో విహరిస్తోంది. మొహమ్మీద విషాదచ్ఛాయలు. భార్య ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకుంది.

అరివీర భయంకరుడైన అప్పాజీ అలా విషణ్ణవదనులై కూచున్నారేమిటీ? తుళువ వంశీయుల సమర్ధపాలనలో కీలకపాత్రధారి అప్పాజీ అలాగయారేమిటీ? వీరనరసింహ రాయల వారి కుడిభుజమైన మహామంత్రి ఏమాలోచిస్తున్నట్టూ? దీర్ఘరోగంతో మంచమ్మీద పడున్న మహారాజుకేమీ కాలేదు గదా! పెద్దరాణి తిప్పాంబిక ఏదన్నా ఉపద్రవం సృష్టించలేదు గదా! ఆవిడ ఎనిమిదేళ్ల కొడుకుకేమీ కాలేదు గదా! శ్రీకృష్ణదేవరాయలను బాల్యం నుంచి పెంచి సకల విద్యాపారంగతుడిగా మలచిన మహనీయుడేనా ఇతను? తన కన్నకొడుకులా పెంచుకున్న కృష్ణదేవరాయలు ఇలా చూస్తే

ఏమనుకుంటాడో...

...ముందు నిశ్చేష్టురాలై నుంచున్న భార్యకంతా అగమ్యగోచరంగా ఉంది. ముత్యాల ముక్కుపుడకను తడుముకుంటూ దగ్గరికొచ్చింది. కుడిభుజాన్ని సున్నితంగా అదిలించి "మిమ్ములనిలా ఎన్నడూ చూడలేదు సుమా? ఏమైందనీ?" మొహంలోకి చూసింది.

"ఇంకేమీ కాలేదు. కాని... ఇకముందు అనుకోనిదేదో జరిగేలాగుంది దేవీ!" ఆసనమ్మీద సర్దుక్కూచున్నాడు.

"అదేమిటండీ?" పాదాల వద్ద నేలమీద కూచుంది.

"యువరాజు కృష్ణదేవరాయలు మన కన్నకొడుకులా మనింట్లోనే పెరుగుతున్నాడు కదా!" కనుబొమలు, నుదుటిగీతలు వంకర్లు తిరిగాయి. నుదుటి విభూతి రేఖలు గూడా వంకర్లు తిరిగాయి.

"అవును. కాదని ఎవరన్నారండీ?" కనుబొమలు పీటముడేసుకున్నాయి. కుంకుమ బొట్టు ఉదయార్కునిలా మెరుస్తోంది.

"మహారాజు వీరనరసింహరాయల వారి రెండో భార్య కుమారుడైనా మనపిల్లల్తో కలిసి పెరుగుతున్నాడాయె. పొద్దున్నే వ్యాయామశాల కెళ్లాడు. కాస్సేపట్లో తిరిగొస్తాడు. రాగానే ఏమవుతుందో?"

"అం...టే... చిరంజీవి కృష్ణదేవరాయల కేదన్నా కీడు...!"

"యువరాజు కృష్ణదేవరాయల ప్రాణాలు తీయించమని మహారాజు నన్నే ఆదేశించారు... దేవీ!" గొంతు వణికింది.

"అయ్యయ్యో!" కేకేసింది. నెత్తిమీద పిడుగు పడ్డట్టైంది. "ఇదేమి రాజకీయ కుతంత్రమండీ?" అంతరాళాల్లో కరిగిన ఆవేదన బిందురూపమై కళ్లల్లో మెరిసింది. "కృష్ణరాయుడు చేసిన తప్పేమిటటా?"

"రాజసింహాసనానికి వారసుడుగా జన్మించడమే. అతన్ని చంపించి రెండు కళ్లు తెచ్చి చూపించమని ఆదేశం. రాజకీయానికి బంధుత్వాలు, బాధ్యతలు ఏవీ కనబడవు."

"అదెలాగండీ?"

"మహారాజు వీరనరసింహరాయల వారి ముద్దుల పెద్ద పెళ్లాము తిప్పాంబిక ఎనిమిదేళ్ల కొడుక్కు సింహాసనం దక్కాలంటే పెద్దవాడు కృష్ణదేవరాయలు బతికుండగా కుదరదుగదా!"

"అయ్యో భగవంతుడా!" తలబాదుకుంది. గుండెల్లోంచి తోసుకొస్తున్న దుఃఖాన్ని పెదాల బిగువున అదిమి పెట్టింది. "కావాలంటే నా ప్రాణాలిస్తాను. నన్ను చంపి నా కళ్లు తీసుకెళ్లి మహారాజుకు చూపించండి. నా బిడ్డనేమీ చేయకండి." ప్రాధేయపడింది.

"నీ ప్రాణాలెవరిక్కావాలీ? మహారాజును కొనకొంగుకు ముడేసుకున్న ఆ తిప్పాంబిక కుతంత్రమిది. తన కొడుక్కే సింహాసనం దక్కాలని ఎత్తువేసింది. మరణశయ్య మీదున్న మహారాజును ఒప్పించి ఆదేశం జారీ చేయించింది."

"హమ్మో! రాజకీయ చదరంగంలో ఇంత నీచాతి నీచమైన ఎత్తులుంటాయా?"

"ఉంటాయి దేవీ!" త్రేతాయుగంలో దశరథమహారాజు చిన్నభార్య కైకేయి మాటను కాదనలేక శ్రీరామచంద్రుడిని అడవులకు పంపించలేదా? రాజకీయ రంగంలో అప్పుడప్పుడు నైతిక విలువలు ఆత్మహత్య చేసుకుంటాయి."

"వీల్లేదు. ఇదన్యాయం... అక్రమం. దీనికేదైనా ఉపాయమాలోచించి అపాయం నుంచి రక్షించండీ!" గాజులచేతులెత్తి మొక్కింది.

"అదే ఆలోచిస్తున్నాను దేవీ... కృష్ణదేవరాయలొచ్చే వేళైంది." గుమ్మం వద్ద అలికిడైంది. దృష్టి అటు మళ్లింది. గోడలమీది తైలవర్ణచిత్రాలు చిత్రంగా చూస్తున్నాయి.

కృష్ణదేవరాయలు ఠీవిగా అడుగులేస్తూ లోపలికొచ్చాడు.

"అదేమిటమ్మా.. అలాగున్నారేమిటీ? అంగరఖా దగ్గరగా ముడుచుకుని ఎదుటి ఆసనమ్మీద కూచున్నాడు. ఐదారు క్షణాలు మౌనం. "ఏమైంది అప్పాజీ?" అయోమయం.

"కుమారా కృష్ణా!" గొంతునిండా బాధ. పెంచిన తల్లిప్రేమ చేతులతో చెంపలు నిమిరింది.

"కృష్ణరాయా!" అప్పాజీ లేచి నుంచున్నాడు! మన హంపీ విజయనగరం రాజకుటుంబంలో ప్రాణాలతో చెలగాటాలాడ్తున్నారు నాయనా!"

"మా నాన్నగారి ప్రాణాలు...!?"

"మహారాజు ప్రాణాలతోనే ఉన్నారుగాని తమరి ప్రాణాలకే ప్రమాదం ముంచుకొచ్చింది కుమారా!" అంతరాళాల్లో ఆందోళన.

"నా ప్రాణాలు హరించే వారెవరు అప్పాజీ?" నవ్వేశాడు.

"నేనే కుమారా!" గొంతు గద్గదమైంది. "అది రాజాజ్ఞ."

"మీరా?" నెత్తిమీంచి కిరీటం జారిపడింది. "కన్నవారి ప్రేమకు నోచుకోని నన్ను వాత్సల్యంతో పెంచిన మీ రుణమిలా తీరుతుంది. అయినా నా ప్రాణాలెందుకటా?" తైలవర్ణ చిత్రాలు వికారంగా కనిపిస్తున్నాయి.

అప్పాజీ మొహంలో గాంభీర్యం పులుముకుంది. విషయమంతా వివరించి చెప్పాడు. చివరికి "అందుకు నా మనసంగీకరించడం లేదు కుమారా!" గొంతు నుంచి పాకిన ఆందోళన కళ్లల్లోకొచ్చింది.

"అందుకే ఆయన ఆయన మదనపడ్తున్నారు నాయనా!" భార్య నోటికి కొంగు అడ్డం పెట్టుకుంది. కళ్లు చిప్పిల్లాయి.

"దానికి బాధెందుకు అప్పాజీ!" కృష్ణదేవరాయల మందహాసం. "తమ్ముడు సింహాసనమెక్కితే నేను అడ్డురాను. అడవుల్లోకెళ్లి సన్యాసం పుచ్చుకుంటాను. మహారాజుకు చెప్పండి."

"దీన్ని మహారాజుగారు తప్పకుండా అంగీకరిస్తారండీ!" పెంచిన తల్లి ఆరాటం.

అప్పాజీ అంతరాత్మకు ఓ జీవన సత్యం గోచరించింది. మస్తిష్కంలో తర్కవితర్కాలు చెలరేగాయి. వాలకం మారింది. ఏదో నిర్ణయం జరిగిపోయిందని ముఖకవళికలు చెప్తున్నాయి.

* * *

రోగ తీవ్రతను తట్టుకోలేక మహారాజు

వీరనరసింహరాయలు పట్టుపరుపు మీద అల్లాడిపోతున్నాడు. ఊపిరితిత్తులు కొలిమి తిత్తిలా ఎగిరి పడ్తున్నాయి. లోతుకుపోయిన కనుగుడ్లు నీరు దిగిన ముత్యాల్లా మెరుస్తున్నాయి. మనసు పెద్దభార్య, ఆమె కుమారుడు ద్వితీయ నరసింహరాయల చుట్టూ గిరికీలు కొడుతుంది. సేనాధిపతులు, మంత్రులు, భార్యలు, బంధువులు ఆందోళనగా చుట్టూచేరి చూస్తున్నారు.

మహామంత్రి తిమ్మరుసు కనిపించగానే మహారాజు చేతిసైగలతో అంతా బయటికెళ్లిపోయారు. తిమ్మరుసు మహారాజుకు సవినయంగా నమస్కరించి "పని పూర్తయింది మహారాజా! ఇవిగో కళ్లు" చిన్నడబ్బాలో భద్రపరిచిన కళ్లను చూపించాడు. మహారాజు తృప్తిగా నిట్టూర్చాడు. "ఇక మీ కుమారుడికే రాజమకుటం దక్కుతుంది మహారాజా!" చెవిలో చెప్పాడు మహామంత్రి. మహారాజు శరీర పంజరంలోంచి ప్రాణం పక్షి ఎగిరిపోయింది. రాణులు గొల్లుమన్నారు.

* * *

మహామంత్రి తిమ్మరుసు ఏర్పాటు చేసిన సభలో మంత్రులు, సేనానాయకులు, ప్రముఖ పౌరులు కొలువుదీరారు. మెడల్లోని నవరత్న హారాలు పట్టు అంగరఖాలను మెరిపిస్తున్నాయి. వాతావరణం గాంభీర్యాన్ని పులుముకుంది. రంగుల కుడ్యచిత్రాలు హంపీ విజయనగర సామ్రాజ్యాధిపతిగా ఎవరిని ఎంపిక చేస్తారోనని ఆసక్తిగా చూస్తున్నాయి.

"ఆత్మీయులారా! రాజ్యశ్రేయోభిలాషులారా!" మహామంత్రి తిమ్మరుసు సభాసదుల ముఖకవళికలను పరిశీలిస్తున్నారు. "మన హంపీ విజయనగర సామ్రాజ్యానికి మీరు మూలస్తంభాలు. సాళువ వంశీయుల అధీనంలోంచి ఈ సామ్రాజ్యాన్ని తుళువ వంశీయుల పాలనలోకి తెచ్చిన మహారాజు వీరనరసింహరాయల వారసులెవరో మనం నిర్ణయించాలి. మన ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మీ అభిప్రాయాలను చెప్పండి..." మరిన్ని అంశాలు వివరించాడు.

చర్చ ప్రారంభమైంది ఎవరి అభిప్రాయాన్ని వారు నిర్మొహమాటంగా వెల్లడిస్తున్నారు.

"మహామంత్రివర్యా!" ముఖ్యసేనాధిపతి లేచినుంచున్నాడు. "ఈ సామ్రాజ్యానికి మీరు వెన్నెముక వంటివారు. మిమ్మల్ని ప్రేమగా అప్పాజీ అని పిలుచుకుంటున్నాం. అప్పాజీ అంటే నాన్నగారు అనే అర్థముంది. ఈ సామ్రాజ్యానికి మీరు తండ్రి. ఈ ఎంపిక బాధ్యతను మీకే అప్పగిస్తున్నాం." అందరి మనోసాగర తరంగాల ధ్వని వినిపించాడు. కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

"అన్నిరంగాల్లో ఆరితేరిన శ్రీకృష్ణదేవరాయల వారు బతికుంటే ఈ సమస్య తలెత్తేది కాదు. వారిని చంపించడం భావ్యం కాదేమో!" సర్వసేనాధిపతి విచారం వెలిబుచ్చాడు. "ఇహ మిగిలింది ఎనిమిదేళ్ల ద్వితీయ వీరనరసింహ రాయలేగదా!"

తిమ్మరుసు పెదాల మీదో చిరునవ్వు తళుక్కుమని నుదుటి తిలకం బొట్టును మెరిపించింది. "మీకు శుభవార్త. యువరాజు శ్రీకృష్ణదేవరాయలు సజీవంగా, క్షేమంగా ఉన్నారు."

సభలో కలకలం బయలుదేరింది. "మీరే చంపించి వారి కళ్లను తెచ్చి మహారాజుకు చూపించారు గదా!" అన్నారొకరు.

"మతిస్థిమితం లేని మహారాజు మరణశయ్య మీదుండి శ్రీకృష్ణదేవరాయలను చంపించమన్నది నిజమే. కాని ఈ సువిశాల హంపీ విజయనగర సామ్రాజ్య ప్రజాభ్యుదయాన్ని దృష్టిలో పెట్టుకుని నేనే కృష్ణదేవరాయలను రహస్యంగా చంద్రగిరి పంపించాను. మేకకళ్లు తెచ్చి మహారాజుకు చూపించాను. దాంతో ఆ మహారాజు తృప్తిగా ప్రాణాలొదిలారు". తిమ్మరుసు అనగానే సభలో సంతోష తరంగాలెగసిపడ్డాయి.

"మరైతే వారేరీ? చూపించండి అప్పాజీ!" అందరి ఆశ. మహామంత్రి భటులను పిలిపించి "యువరాజు శ్రీకృష్ణదేవరాయల వారు చంద్రగిరి నుంచి వచ్చి మా ఇంట్లో ఉన్నారు. వెళ్లి సగౌరవంగా తీసుకొద్దాం పదండి." ఆదేశించాడు.

యువకిశోరం శ్రీకృష్ణదేవరాయలు సభలో ప్రవేశించగానే సభ చప్పట్లతో మార్మోగింది. జయజయధ్వానాలు మిన్నుముట్టాయి.

* * *

తెలుగు వెలుగుల చరిత్ర పుటల్లో 26 జులై 1509. పుణ్యనదీ జలాల స్నాతమై శ్రీకృష్ణదేవరాయలు వేదమంత్రాల మధ్య హంపీ విజయనగర సామ్రాజ్యాధిపతిగా పట్టాభిషిక్తుడు అయ్యాడు. పాలనాపగ్గాలు కొన్ని నెలల తర్వాత చేపట్టాలని, అంతవరకూ తిమ్మరుసు సలహా సంప్రదింపులతో అనుభవం గడించాలని పెద్దలు నిర్ణయించారు.

ఏకాంతమందిరం... తిమ్మరుసు ముందు శ్రీకృష్ణదేవరాయలు ఆసీనుడైనాడు. గుండెలో గూడుకట్టుకున్న నాగాంబికతో తన ప్రేమ వ్యవహారం విప్పిచెప్పి ఆమెనే అర్ధాంగిగా స్వీకరిస్తానని సవినయంగా చెప్పాడు. అప్పాజీకావిషయం అంతకుముందే తెలుసు.

"మహారాజా!" అప్పాజీ మందహాసం. "ఒక వేశ్య కనుసన్నల్లో పెరిగిన పవిత్ర యువతి నాగాంబికను తమరిప్పుడే పెళ్లాడితే లోకం హర్షించదు. మహారాజు వ్యక్తిత్వం గురించి ఎవ్వరూ వేలెత్తిచూపే ఆస్కారమివ్వొద్దు. కాబట్టి మొదట మన సేనాధిపతి వీరయ్య పుత్రిక, సౌందర్యదేవత తిరుమలాంబను పెళ్లాడండి. ఆ తర్వాత నాగాంబిక చిన్నమాదేవియై మీ భార్య అవుతుంది. మొదటి భార్యనే పట్టపురాణి అవుతుంది."

ఆ మాటలకు శ్రీకృష్ణదేవరాయల ఎదలో అమృతపు జల్లు కురిసింది. యువ ముఖారవిందం సహస్రదళాలుగా విచ్చుకుంది.

ఐతా చంద్రయ్య
విశ్రాంత తపాలాధికారి,
సిద్ధిపేట, 93912 05299

మాటకట్టు 1



ఆధారాలు

అడ్డం:

1. అపూర్వమైనది (4)
3. వాలి ఎవరని పౌరాణిక భాషలో అడగండి! (4)
8. కనుమ మరునాడు (4)
10. తటాకం చివర్లో మాయమై పూర్ణమొచ్చి మధ్యలో చేరింది (2)
12. నూరు పద్యాల మాలిక (3)
14. నావ చేరే తీరం (2)
15. తల తెగిన దోమలే! (2)
16. కీర్తిచంద్రికలు మూడోవంతు మిగిలాయి (2)
17. గాడె (3)
18. కాలిబంతాటలో అటునుంచి కొట్టేది? (2)
20. చేతిలో భాగమీ హాస్యనటుడు! (2)
21. బుజ్జిపాపాయిని లాలనగా రమ్మని పిలవండి... (1)
23. ఆరంభం లేకుండా విందామయా! (3)
26. అడ్డం 21తో వ్యాజ్యం (1)
27. కళాసారస్వత రంగాల్లో ప్రతిభామూర్తులకు తమిళనాట ప్రతిష్ఠాత్మక పురస్కారం (5)
29. శ్రీరాముడి జన్మనక్షత్రం (4)
32. దండలో పూర్ణం జారిపోతే వణుకు! (2)
33. పోగాలం దాపురించినప్పుడు అంతా తిరగబడుతుంది, కొంతే మిగులుతుంది! (2)
35. ఆమూలాగ్రం తొలి సగం (2)
36. మేటి; కనుకనే వరూధిని మనసు పడింది! (4)
37. అయిదా ఆరా అడగడమెందుకు - ఎక్కువ మధ్య కొస చివర తోడ్పాటు! (3)
38. ఆవాలు చివర్లో చెరిపేసినా, దేనువా అని అడిగినా ఒకటే... (2)
39. సూచి ముందు సగం రేఖ చేరితే ప్రతిభ లేనివాడు! (3)
40. వినం ఇముడ్చుకున్న మోక్షం (4)
42. సుఖంగా (3)
44. లారామం ముందు ఇది చేరిస్తే- ఒక రచయిత్రి! (2)
47. విజయం (3)
48. ప్రస్తుత తెలుగు సంవత్సరం (3)
50. తనఖా మధ్యమం (1)
51. దధి అంటే? (3)
52. అడ్డం 21, 26, 50లతో కార్చిచ్చు! (1)

నిలువు:

1. సంభ్రమాశ్చర్యపరచేది (3)
2. ఆకృతి (2)
4. దేశభాషలందు తెలుగు...! (2)
5. ప్రథమా విభక్తి (4)
6. రామబంటు (3)
7. చేవ్రాలు (3)
9. ఆగ్నేయాసియాలో థాయ్‌లాండ్, ఇండోనేసియా, బ్రూనైలతో సరిహద్దులు పంచుకునే దేశం? (4)
11. మూకీల తరువాత? (3)
13. మన్మథుడు (3)
19. గోదావరి మన్ను - 1, 2, 5 (3)
20. అడ్డం 20ని కలిపేసుకున్న దేవత! (3)
22. తలకిందులుగా విడుదలైన (5)
24. సన్న సున్నపు పూత (5)
25. సమస్తమూ (3)
28. ముద్దు తిట్టు - దాని సోకు...! (2)
30. మొదట తడబడిన ఆనవాయితీ (5)
31. శీర్షాసనమేసిన చివర (3)
34. పదేపదే విసిగిస్తున్నవాణ్ని పొమ్మనండి! (2)
36. పుష్పం (3)
37. పూజలో వ్రతంలో..... సమర్పయామి! (4)
38. నోరూరించే వంటను ఎలా మెచ్చుకుంటారు? (2)
41. పెదవి (2)
43. వెలుగులీనే మన నుడి (3)
45. మేఘం ద్రవించగా జారులు తీరిన నీటి చుక్కలు! (2)
46. వెళ్లరంటే యుద్ధమా! (2)
49. గాఢం (2)

సమాధానాలు 114వ పేజీలో...

ఆహ్వానం

భాషాభిమానాన్ని పెంచేలా, తెలుగు మాధుర్యాన్ని పంచేలా గళ్ల నుడి కట్టును పాఠకులు కూడా రూపొందించి పంపవచ్చు. బాగున్న వాటిని ప్రచురిస్తాం. తగిన పారితోషికమూ ఇస్తాం.

తెలుగు పంట పండించిన పండుగ

సంక్రాంతి తెలుగువారి పెద్ద పండుగ, పంటల పండుగ, తెలుగు పల్లెలన్నీ కళకళలాడే పండుగ.

సూర్యుడు ఒక రాశినుంచి మరొక రాశిలోకి ప్రవేశిస్తాడనే మకర సంక్రమణం సంగతి ఎవరికీ పెద్దగా పట్టదు. సంప్రదాయాన్ననుసరించి దానాలు మాత్రం ఇంకా చాలామంది ఇస్తూనే ఉన్నారు-

సంక్రాంతి పండుగకు చాలా రోజులముందే పట్టణ, నగర ప్రజల మనస్సులు తాము పుట్టి పెరిగిన పల్లెలకు చేరుకుంటాయి. అమ్మతోటి అనుబంధాన్ని, చిన్నప్పటి ఆట పాటలను, బాల్యస్నేహాలను, చిలిపి పనులను, బడిలో చదువుకొన్న పాఠాలను, ఉపాధ్యాయులను ప్రజలు మరచిపోరు. పట్టణ, నగర జీవితం దుర్భరమైనప్పుడల్లా గతంలోకి ప్రయాణించి, తమ సొంత ఊళ్లోని స్వచ్ఛమైన గాలిని, నీటిని, చెరువులో ఈత కొట్టిన అనుభవాలను, కోతికొమ్మచ్చి ఆటలను, చింతకాయలు, మామిడి పిందెలు, నేరేడు పండ్ల రుచిని (కొన్నిసార్లు దొంగతనంగా సంపాదించి తిన్నప్పటి రుచిని) జ్ఞాపకం చేసుకుంటారు.

ఇంకా చల్లకుండలో వెన్నముద్ద రుచిని, జొన్నదంటు తీపిని, మొక్కజొన్న కండెలు కాల్చుకుని తిన్నరుచిని, సెనగపప్పు బెల్లాల రుచిని, కొబ్బరుండలు, నూజీడీలు, రేగుపండ్లు, పిప్పరమెంట్లు, నిమ్మతొనల రుచులను, గోరుముద్దల్ని, చద్దన్నంలో పెరుగు ఆవకాయ రుచిని, ఉడుకుడుకు గంజి, సంగటి రుచులను, జొన్న, సజ్జ, వరిగ, రాగి అన్నాల రుచులను, పొలం బువ్వతో దోసిట్లో మజ్జిగ అన్నం జుర్రుకుంటూ పచ్చి మిరపకాయ కొరికిన ఘాటును ఎలా మరచిపోతారు?

కోడికూతను, తెల్లవారుతూనే మజ్జిగ కవ్వాల చప్పుళ్లను, కళ్లాపి జల్లి ముగ్గులు పెట్టి, గొబ్బెమ్మలను అలంకరించిన జ్ఞాపకాలు, ఇంకా నోములు, వ్రతాలూ, పెళ్లిళ్ల జ్ఞాపకాలు, పంటపొలాల గట్లమీద ఊకబియ్యం తింటూ నడిచిన, తలపులు నెమరుకువస్తే మనసు ఆనందముగ్ధమవుతుంది.

ఆధునిక కవిత్వంలో మొదటి నుంచి పల్లె ప్రజల జీవితం చిత్రితమైంది. 20వ శతాబ్ది ప్రారంభంలో కట్టమంచి రామలింగారెడ్డిగారి 'ముసలమ్మ మరణం'లో కథ పల్లెటూరి గాథే. అనంతపురం సమీపంలో బుక్కరాయసముద్రం అనే గ్రామం ఉంది. ఆ గ్రామానికి వచ్చిన విపత్తు, బసిరెడ్డి అనే కాపు కోడలు ముసలమ్మ బలిదానంతో తొలగిపోతుంది. ఒక మూఢనమ్మకం ఆధారంగా ఈ కావ్యం రాశారు. దాన్ని పక్కనపెడితే... పల్లెప్రజల ఆత్మీయతను, బంధాలను రసవంతంగా వర్ణించి రామలింగారెడ్డి ఈ కథకు కావ్యగౌరవం కల్పించారు.

వ్యవసాయ జీవితమే ప్రధాన కథగా దువ్వూరి రామిరెడ్డి 'కృషీవలుడు' కావ్యం రాశారు. హాలిక జీవితాన్ని కావ్యవస్తువుగా స్వీకరించటాన్ని సమర్థిస్తూ కట్టమంచివారు "శోకరసము వర్ణింప వలయునన్న ననుకూల సందర్భ మెయ్యది? క్రొవ్వుకాజెడి నాయికా నాయకుల యూహామాత్రమైన కష్టములా? ప్రజలు దినదినము కన్నీరు కార్చుటకైన నవకాశము లేక కుడుచుచుండు పరిపరి విధముల గోడులా? శాంతరసమునకు పోషకమెయ్యది? తమకు కష్టముదేనట్టివైన రాజుల యొక్క యుదారచర్యలా?, అకటమాడి, మలమల మాడుచు నింటికి వచ్చి వంట సిద్ధము కాకుండినను, భార్యపై గోపింపక కన్నులు మూతపడుచుండ, విధిని ధ్యానించుచు నొకమూల గూర్చుండు పొలము కాపుల యొక్క నడవడియా? అని ప్రశ్నించారు.

పెమ్మారెడ్డిపాలెంలో సేద్యం చేసిన అనుభవాలు దువ్వూరికి కవితావేశం కలిగించాయి. రైతును కథానాయకుని చేసిన మొదటి తెలుగు కవి ఈయనే. దువ్వూరి రామిరెడ్డి, ఏటుకూరి వెంకటనరసయ్య, తుమ్మల సీతారామమూర్తిలను కర్షక కవిత్రయంగా పేర్కోవచ్చు.

"సారెకు మంచబొట్లు చెవిజంపున
ముత్తెములట్లు వ్రేల, చే
జారిన పగ్గమూని యొరచాలున గోడెనదల్చి
మేడిపై
భారము మోపి కష్టపడు భాగ్యము
చూడగవోయి, కైతసిం
గారము కింతకన్నదగు ఘట్టము లేర్చెదవా
కవీశ్వరా!"

అని కవులను పొలం దున్ని పంటలు పండించే శ్రమజీవులపై దృష్టి మరల్చమని ఏటుకూరి హెచ్చరించారు.

ఆచార్య రంగా తెలిపినట్లు "ఏటుకూరి రైతుబిడ్డ, ఇరవై సంవత్సరాల ప్రాయం వరకు రైతాంగజీవి. పొలముల బలం పంటల పొలి, నల్లరేగడి, అడవుల అందము, కొండల



ఔన్నత్యము, పశువుల సేవ, వాగుల పరుగులతో రైతాంగపుటేల పదాలు పాడుకుంటూ, మొక్కజొన్న కండెల చిద్విలాసము, సజ్జజొన్న కంకుల చిద్విలాసము, కొత్తిమీరి సుగంధము, సెనగ పులుపు, కంది ఎర్రదనము, పెసర మిసిమి, మిరప చురుకుదనము తన కవితా హృదయమును చేర్చుకుంటూ పెరిగిన కవి."

పొలం దున్ని అలసిపోయిన ఎడ్ల చిక్కొదిలించి కొంచెం జాడు (పంటకురాని పైరు) పడవేసి, నకనకలాడె ఆకలితో రైతు బువ్వ దుత్తకోసం, డొంక దెస చూడటాన్ని ఏటుకూరి 'క్షేత్రలక్ష్మి' కావ్యంలో వాస్తవికత ఉట్టిపడేలా వర్ణించారు. భర్త ఆకలి తెలిసి వడివడిగా నడిచివచ్చిన తన ఇల్లాలిని చూసి రైతు "అతకల్ లేవె? మటేమి వెట్టి పడుచా! ఆపాదమస్తకంబు పెంజితిపై జాడిన మాడ్కి భగ్గుమనె నీ చిత్తెండకున్" అని జాలిగా పరామర్శించాడు. 'అతకలు' అంటే అరిగిపోయిన చెప్పులు, 'అవ్వైనా లేవా' అని అడిగిన రైతు మనసులోని ఆర్ద్రతను తెలిపిన కవి ఏటుకూరి.

సంక్రాంతి పండుగను తలచుకోగానే ముందుగా జ్ఞాపకం వచ్చే తెలుగు కవి 'తెలుగు లెంక' తుమ్మల సీతారామమూర్తి. వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో తెలుగువారి పెద్దపండుగ సంక్రాంతి సొగసుల్ని తుమ్మల వర్ణించినంత రమణీయంగా వర్ణించిన కవి మరొకరు లేరు.

తెలుగు రైతు జీవితంతో గాఢంగా పెనవేసుకున్న సంక్రాంతి పండుగ అంటే తుమ్మలవారికి ప్రాణం. సంక్రాంతి శోభను తెలిపే ఖండకావ్యాలను ఆయన అద్భుతంగా రాశారు. అవి: సంక్రాంతి (1941), సంక్రాంతి తలపులు (1953), సంక్రాంతి వేదన (1954), జయసంక్రాంతి (1955), క్రొత్త సంక్రాంతి (1960), సంక్రాంతి ముచ్చటలు (1961), సంక్రాంతి (1983), నాలుగు దశాబ్దాల కాలంలో రైతు జీవితంలో వచ్చిన మార్పులనూ తుమ్మల ఈ ఖండకావ్యాల్లో వర్ణించారు.

ప్రాచీనాంధ్ర సాహిత్యంలో ఏ మహాకావ్యం లోనూ సంక్రాంతి పండుగ శోభ కన్పించదు. సంక్రాంతికి ప్రత్యేకమైన ముద్దబంతిపూవు ప్రాచీన కాలంలో ఏ కవికావ్యంలోనూ కన్పించకపోవడం ఆశ్చర్యకరం. తామరలూ కలువలూ కన్పిస్తాయే గాని బంతిపూల అందాలు కన్పించవు.

కోడిపుంజు మెదరిక్కించి కూయటమూ, కోడిపందేల సొగసులు మాత్రం కొన్ని కావ్యాల్లో ఉన్నాయి.

సంక్రాంతి పండుగను తెలుగువారు మూడు రోజులు జరుపుకుంటారు. భోగి, సంక్రాంతి, కనుమ వేడుకలు జరుపుకోవటంలో కొన్ని తేడాలు ఉన్నా ఈ పండుగను అన్ని ప్రాంతాలలో మూడు రోజులు జరుపుకుంటారు. ఇంగ్లిషు కేలండర్లో ఈ పండుగ జనవరి 14వ తేదీన వస్తుంది.

సున్నం కొట్టిన గోడలు, ఇళ్లముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు, గుమ్మడిపూలు గుచ్చిన గొబ్బెమ్మలు (ఆవుపేడతో చేసినవి) పసుపు పూసి, కుంకుమబొట్లు పెట్టిన గడపలు, బంతిపూల దండలతో ఆవులు, ఎడ్లు, గేదెలు, గొర్రెపొటేళ్లు బంతిపూల తోరణాలతో ప్రతి ఇల్లూ కమనీయంగా ఉంటుంది. హరిదాసుల భజనలు, గంగిరెడ్లవారి దీవెనలు, ఇంకా రకరకాల యాచకులతో తెల్లవారకముందే మంచు దుప్పటి తొలగకముందే వీధులన్నీ సందడిగా ఉంటాయి.

రైతు కలిమియే దేశపు బలిమిగా తుమ్మల తలచేవారు.

"కొసరి నూఱిన పచ్చి పసపు, బూతమొగాన
గుమ్మడి పూదుమారమ్మునద్ది
కండరేగడ నార బండి కన్పండువై
పొలుచుమిర్యపు బండు బొట్టువెట్టి
వలిపమ్మునకు నొక్కవాసి హెచ్చైనట్టి
నునుమంచు దెర చీరనూలు కొల్పి
బంతిపూవులకు జేమంతి నెయ్యము గూర్చి
కబరీభరమ్ము చక్కన కుదిర్చి
పంటకళ్లాలు మునుబరాబరులు సేయ
గూడుగట్టిన తెలిమబ్బు గొడుగునీడ
గదలివచ్చెను భాగ్యాల కడలివోలె
మకర సంక్రాంతి లక్ష్మి హేమంతవీధి"

సొగసైన సంక్రాంతి పండుగనాడు తెలుగు ప్రజలు ఆరగించే పాయసం, వంకాయ కూర,

నక్కదోసబజ్జి, గుమ్మడి పులుసు, గడ్డపెరుగులను నోరూరేలా తుమ్మల వర్ణించారు.

కొత్తగా పెళ్లయిన అల్లుళ్లకు అత్తవారిళ్లలో జరిగే మర్యాదలు, బావమరదళ్ల పరిహాసాలు, తలంట్లు అభ్యంగన స్నానాలు- (డెబ్బైయేళ్ల నాటి) తెలుగు పల్లెల అందచందాలను తుమ్మల తనివితీరా వర్ణించారు.

"ఈ కోడి పందెములేమి చెప్పెడినయా
ఆంధ్ర జాతీయ శౌర్యాభిలిప్స
ఈ రంగవల్లిక లేమి తెల్పెడినయా
తెలుగునారీ కళాధీనబుద్ధి
ఈ గంగిరెద్దు వాడేమి పల్కెడినయా
మఱుఁగువడ్డ తెనుంగు మాటతేట
ఈ గొబ్బి సంబరంబేమి చాటెడినయా
తనివి గొల్పెడు నాంధ్రి ధర్మభిక్ష
ఈ రుచిర పాయసాన్నంబులేమి చూపు
తెలుగులేజంట తొలికారు వలపుజవులు
వింత లొలికించు కలికి సంక్రాంతి నిట్లు
తెనుగు దనమింట నింటమూర్తీభవించె"

పట్టణాల్లో పుట్టి పెరిగిన కవులకు తెలియని అనేకాంశాలు తుమ్మలవారి సంక్రాంతి వర్ణనల్లో కనిపిస్తాయి.

"తట్టలు తట్టలే త్రవ్వి సుంకులు వోసె
బొలికేకలో నొడల్ పులకరింప
పొలికట్టెనందియు, మొలకనవ్వులనిండు
కళ్లమిచ్చెను జీతగాని కొఱకు
వెలసూచి చిఱుదిండి విలిచెనా, కొబ్బెర
చిప్పకే చేటలు చేటలొసగె
గాజులకని కోరగా, గంపకెత్తించి
పాలేరు సతికి సంబరముగూర్చె
కుంటికిన్ గ్రుడ్డికిని వేడుకొన్నవాని
కెల్లవానికి భాగంబులేర్పరించి
లేములెఱుగని సంక్రాంతి లేమకపు డ
నుంగుదోడయ్యెగుప్పలు నూర్చురైతు"

"కోటి విద్యలూ కోంద్రకు లోకువే"నన్న మాట తుమ్మల వారి రైతు జీవితవర్ణనలు చదివితే సార్ధకమనిపిస్తుంది.

ఇద్దరు రైతుల మధ్య సంక్రాంతి పండుగ నాడు జరిగిన సరస సంభాషణ- 'సంక్రాంతి ముచ్చటలు' తుమ్మలవారి కవితలలో మేలైనది:

"ఏమి సుబ్బయా! మీవారలెపుడు లేచి
యెపుడు చేసిరి యీపనులిపుడె కమ్మ
కమ్మగా సాగెమీ యింట గారెముక్క
లుడుకు వాసన - యీ రాత్రి నడుము వాల్చి
నట్లె తోచుట లేదు మీయాడువారు!
ఎన్ని ముగ్గులు!- తోరణాలెన్ని!- యెన్ని
యెన్ని పూలదండలు! పండుగెల్లవచ్చి
నీటుగా నేడు మీ యింట బీటవెట్టె
గోటుగానేడు మీ యింట గొలువుదీరె"

"రావయా! రామభద్రయా! రాకరాక
వచ్చితివి మంచి వేళకే! బాగు! బాగు!
బల్లమీద గూర్చుండుము! పనులు తేలి
వచ్చెనా? - పాడి కలదుగా? బావగారు
తిందురొక పట్టుగారెలు తెచ్చిపెట్టు
మోసి జానకీ! గిన్నెకుఁబోసి నేయి
కూడఁ గొనితెమ్ము- భద్రయా! క్రొత్తచోటు
గాదు- కానిమ్ము - వెనుకాడగానేమి?"

ఈ కావ్యఖండిక తెలుగు సాహిత్యానికి అపురూపమైన అలంకారం.

'వరినాటు' ఖండకావ్యం చదువుతున్నప్పుడు ఒకనాటి రైతు కూలీల సంబంధాలు- ముఖ్యంగా సర్కారు జిల్లాల్లో ఎంత ఆర్ద్రంగా ఉండేవో గదా! అన్న ఆనందం కలుగుతుంది. ఇందులో కవి కూలీల శ్రమ దోపిడీని ఎక్కడా ప్రస్తావించలేదు- "ఆ మంచిరోజులు"ను తలచుకొని గాఢంగా నిట్టూర్చారు.

కాలక్రమంలో రైతు జీవితంలో వచ్చిన మార్పులను కొన్నిటిని తుమ్మల గుర్తించారు.

"నేడు కుప్పవేయ నిచ్చెనతో బని
లేకపోయె రైతు లోకమునకు
సంతుపెరిగి పెరిగి యింత చేసినదయా
శరణమిక మఱొక్క సాధువృత్తి"

ఆసాముల కుటుంబాల్లో పంపకాలయ్యాక రైతులు సన్నకారు రైతులయ్యారు. సంపద కూడా తరిగింది.

"ఒకటరెంటగాదు సకల దురభ్యాస
ముల నపేక్ష చూపు హాలికులు"

బాగుపడరన్నారు తుమ్మల.

"భోగి మంటలందు గోగు బుల్లల గాదు
కామరోషములను గాల్చవలయు"

అని తుమ్మల రైతులకు హితవు చెప్పారు.

మెట్టమాగాణి ప్రాంతాల రైతు జీవిత విశేషాలను విశ్వనాథ సత్యనారాయణ 'ఋతుసంహారము'లో హృదయాహ్లాదకరంగా తెలిపారు. మొక్కజొన్న చేలలో వడిసెల రాయిని తప్పించుకొనే ఉపాయాన్ని తల్లిపిట్ట పిల్లపిట్టకు నేర్పినదన్నారు. చలికాలపు రాత్రి ఆవు ఈనింది. మాయవేసి ఆవు తినివేస్తుందనే భయంతో కాపలా కాస్తూ పంట కాపు అతని భార్య ఉత్తరీయం, పయ్యెద మాత్రం అడ్డుపెట్టుకొని

ఫొటో: ఫొటోపీడియా.కామ్

జాగారం చెయ్యటాన్ని విశ్వనాథ అద్భుతంగా వర్ణించారు.

రాయప్రోలు సుబ్బారావు రైతు ఆశలను-

"చెరువు నిండినదీయేడు కరువు రాదు
మిరప తోటల కిందాక పురుగులేదు
అతికినవి పైరులన్నియు నచ్చటచ్చట
సుంకుపోయుచున్నది మొక్కజొన్న యపుడె
పడ్డది విశాఖ కార్తెలో పరిగెవిత్తు
రాలితే క్రొత్తపాతళ్ల త్రవ్వవలెను
ఎదిగినది పిల్లపెళ్లికి ఎట్టులయిన
యెడ్ల కొట్టమీ యేడు నేయింపవలయు"

అనే మాటలలో చక్కగా వెల్లడించారు.

పింగళి- కాటూరి కవుల తొలకరి; బోయి భీమన్న- కేదారీశ్వరి, పాలేరు (నాటకం), వానమామలై జగన్నాథాచార్యులు- రైతురామాయణం; గంగుల సాయిరెడ్డి - కాపుబిడ్డ; గీతానందుడు- కాపుపెండ్లి; నంబూరు దూర్వాసమహర్షి- నిఋపేద; పల్నాటి సోదర కవులు- పేదకాపు; చలసాని లక్ష్మీనారాయణవర్మ - కర్షక ప్రబోధము; కొప్పరపు దుర్గా ప్రసాద వెంకటరమణ కవి- కర్షకుడు; సస్యశ్రీ- రాయలసీమ రైతు; మణిమెల నాగేశ్వరరావు - రైతురాగం; గుమ్మలూరు సత్యనారాయణ - హాలిక సూక్తులు; కొండవీటి వేంకటకవి- కర్షకా మొదలైనవి రైతు జీవితాన్ని కమనీయంగా వర్ణించిన మరికొన్ని పద్యకావ్యాలు-

రైతు భజనావళి: శిస్తు వసూళ్లేగాని రైతులకు సదుపాయాలు కల్పించని జమీందారులకు వ్యతిరేకంగా జమీన్ రైతు సంఘ స్థాపన (1929) జరిగింది. ఆచార్య రంగా సంపాదకత్వంలో 'రైతు భజనావళి' (1934) వెలువడింది.

"రాగి దమ్మిడి రత్నమాయెను/ వెలలు బొత్తిగ కూలిపోయెను" అంటూ విద్వాన్ విశ్వం ఆనాటి ఆర్థిక సంక్షోభాన్ని గురించి ఆవేదన చెందారు. ఆయన 'పెన్నేటిపాట' రాయలసీమ కన్నీటిపాట.

రంగన్నకున్నది ఒక్క ఎకరం. అది యెర్రోని చేను. దానికోసం ఊపిరూది, కాల్వతవ్వి కొండలు కరిగిస్తాయి. ఒకనాడాతని నాన్న ఊళ్లో పెద్దరైతు. కాని, క్రమంగా వాళ్ల ఆస్తి కరిగిపోయింది. ధరలు పడిపోయాయి. ఒక్కరోజునే మూడు రూపాయలు వెలచేసే మణుగు వేరుసెనగ ధర నాలుగణాలకు తగ్గిపోయింది. ఒక్కరూపాయకే మూడు సేర్ల కొర్రలు, జొన్నలు అమ్ముకోవలసి వచ్చింది. రంగన్న కూలి పనికి కుదరవలసి వచ్చింది. కటిక కారపు సంగటి, ఎండురొట్టెలు, నీళ్ల మజ్జిగలే పాలేరుకు దొరికే తిండి. పల్లెలు రాత్రుళ్ల చీకటి గుయ్యారాలే. గూట్లో దీపం నోట్లో కంబళం పెట్టుకునే పల్లెటూళ్ల ప్రజలు చుక్కల వెలుతురు లోనే కాలం గడుపుతారు.

రాయలసీమ కరవులు
మానవ కల్పితమే.
జలాధారాలు ఎండిపోతున్నా
పట్టించుకోని ప్రభుత్వ నిర్లక్ష్యమే
కరవుకు కారణం.

తెలంగాణలో రైతుల కష్టాలకు
ఆనాటి నిజాం నవాబుల
దుష్పరిపాలనే కారణం.
హైదరాబాదులో దివ్యహర్మ్యాలను
ఉద్యానవనాలను నిర్మించుకున్న
నవాబులు రైతుల్ని పీల్చిపిప్పి చేశారు. "బాంచెన్ కాల్మొక్తా దొరా!" అనే దయనీయ స్థితిలోనే ఉంచారు.

దాశరథి రైతుల పక్షాన గొంతెత్తి-

"ప్రాణములొడ్డి ఘోర గహనాటవులన్ బడగొట్టి మంచి మా
గాణములన్ సృజించి ఎముకల్ నుసిజేసి పొలాలు దున్ని భో
షాణములన్ నవాబులకు స్వర్ణము నింపిన రైతుదే తెలం
గాణము రైతుదే ముసలినక్కకు రాచరికమ్ము దక్కునే"

అని ఘంటాపథంగా తెలంగాణము రైతుదేనన్నారు. రైతు రాజ్యాన్ని కోరారు.

శెట్టిపల్లి వెంకటరత్నం, గిరిరాజు రామారావు "ఆగునా జీవాలు సాగునాలోకాలు/ రాజు నామనమెంచి రైతుజూడకపోతే/ దేశాలు తలలెత్తునా/ దాస్యపున్ పాశాలు తావీడునా?" అని రైతు ప్రాధాన్యాన్ని ఎలుగెత్తి చాటారు.

కర్షకుల త్యాగమయ జీవితాన్ని శ్రీశ్రీ "పొలాలనన్నీ హలాల దున్నీ/ ఇలాతలంలో హేమం పండగ/ జగాని కంతా సౌఖ్యం నిండగ/ విరామమెరుగక పరిశ్రమించే/ బలం ధరిత్రికి బలికావించే/ కర్షక వీరులకాయం నిండా/ కాలువ గట్టే ఘర్మజలానికి / ధర్మజలానికి/ ఖరీదు కట్టేషరాబులేడోయ్" అని కొనియాడారు.

"కోటి విద్యలు కూటికోసమే" అనే రీతిలో కాళోజీ "నర్తకుని నాట్యాలు/ గాయకుని గానాలు/ శిల్పకుని శిల్పాలు/ చిత్రకుని చిత్రాలు/ అతివల అందాలు/ కందర్పు కయ్యాలు/ కవిరాజు కావ్యాలు/ కర్షకా నీ కఱ్ఱు కదిలినన్నాళ్లే" నంటూ కర్షకుని శక్తిని మెచ్చుకున్నారు.

"దున్నేవాడిదే భూమి" అనేది చాలామంది రైతులకు నిజంకాని కల. వాళ్లు జీవితాంతం కౌలు రైతులుగానే మిగిలిపోతున్నారు. "భూమి గుండ్రంగా ఉంది భూస్వాముల చేతుల్లో" అని కుందుర్తి నిరాశ చెందారు.

అభ్యుదయ గేయ కవితా ప్రస్థానంలో సుంకర సత్యనారాయణ, కొనకళ్ల వెంకటరత్నం, పులుపుల శివయ్య, వేములపల్లి శ్రీకృష్ణ, నాజర్, తిరునగరి, యాదగిరి మొదలైన కవులు రైతు బాధలకు స్పందించి కరుణ రసం ఒలికే పాటలు రాశారు. ఇవి చాలా వరకు రైతుల్ని చేరాయి.

వర్తమాన తరంలో శేషేంద్ర, సినారె, చెరబండ రాజు, నగ్నముని, శివారెడ్డి, అమ్మంగి వేణుగోపాల్ మొదలైన వారు రైతుల కష్టాలను గురించి ఆలోచింపజేసే, ఉత్తమ రచనల్ని వెలువరించారు.

కవికోకిల జాషువా తన ఊరు విడిచివచ్చిన చాలాకాలం తర్వాత 'నా కథ' రచించారు. అందులో తన సొంతవూరు వినుకొండను తలచుకొని అక్కడ నిమ్మలబావి నీరు కడజాతివారికి అందుతోందా అనే భావంతో ఓ పద్యంలో ఆవేదన చెందారు.

కన్నతల్లి సొంతూరు మమకారం ఎల్లకాలం ఉండేవే. పండుగలు చక్రనేమి క్రమాన వస్తూనే ఉంటాయి.

సంక్రాంతి శుభవేళ తప్పక తలచుకోదగిన మరొక పద్యం తుమ్మలవారిదే.

"బిచ్చగాడు లేని ముచ్చులేని కటారి
లేని దొరతనమ్ము లేని కుట్ర
లేని యూరసమ్ము లేని దేశావధి
లేని పండువిది ఫలింపవలయు" కవివాక్కు ఫలించే మంచిరోజు కోసం ఎదురుచూద్దాం.

డా॥ కడియాల రామమోహనరాయ్
విశ్రాంత అధ్యాపకులు,
గుంటూరు. 99597 78698

బ్రౌన్ తమ్ముళ్లు ఎందరో!

చరిత్రను తవ్వితీశారు. వ్యాకరణాన్ని విరచించారు. నిఘంటువులను రూపొందించారు. వాచకాలను రచించారు. కనుమరుగైందనుకున్న సాహిత్యానికి కొత్త కాంతులద్ది కళ్ల ముందుకు తెచ్చారు. ఖండాంతరాల నుంచి తెలుగు గడ్డకు వచ్చి, తెలుగు భాషకు అద్వితీయమైన సేవ చేశారు. తెలుగు భాషాభివృద్ధికి అనన్యసామాన్యమైన కృషి సలిపిన ఆ పాశ్చాత్యులందరూ ప్రాత:స్మరణీయులే! తెలుగు తల్లి ముద్దు బిడ్డలే!



థామస్ మన్రో

విలియం కేరీ

'ఆహారానికి కాటను... వ్యాహారానికి బ్రౌను' (వ్యాహారమంటే భాష) అన్న నానుడి తెలుగులో స్థిరపడిపోయిందంటే... మన ప్రాంతానికి, మన పలుకుకు పాశ్చాత్యులు చేసిన సేవ, అప్పటి తరం తెలుగువారిపై ఎంతటి ప్రభావాన్ని చూపించి ఉండాలి! ధాతు కరవుతో అల్లాడుతున్న రాష్ట్రాన్ని దేశానికే ధాన్యాగారంగా మలచిన ఘనత కాటన్ దొరది. ఆయన కృషి వల్లే తెలుగు వారి ఆకలి తీరింది. తెలుగింటి లోగిళ్లు సుభిక్షమయ్యాయి. ఎందరో కవులు, రచయితలకు జన్మనిచ్చాయి. కరవు తాండవిస్తున్నప్పుడూ ఏ కలమైనా సృజనాత్మక కవితల్లల్లేదు కదా. ఇలా చూస్తే ఆధునిక తెలుగు సాహిత్య సృష్టి వెనుకనున్న స్రష్ట కాటన్ మహాశయుడే.

బ్రౌను దొర గురించి తెలుగు వారికి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. చరిత్ర శిథిలాల కింద నలిగిపోతున్న ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని ఉద్ధరించిన మహానుభావుడు. (బ్రౌను కృషిపై తెలుగువెలుగు నవంబరు 2012 సంచికలో సమగ్ర వ్యాసం ప్రచురితమైంది)

బ్రౌను స్థాయిలో కాకపోయినా, అజంత భాషకు అపురూప సేవ చేసిన పాశ్చాత్యులెందరో ఉన్నారు. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, తెలుగుతల్లి మెడలో సాహితీహారాన్ని అలంకరించిన తెలుగు ఆత్మబంధువులు వారు. వారిని తలచుకుని, స్ఫూర్తి తెచ్చుకుని... మన భాషాభివృద్ధికి కంకణబద్ధులం కావాలి.

పోర్చుగీసు, డచ్, ఫ్రెంచ్, జర్మన్, బ్రిటన్... ఇలా ఎన్నో ప్రాంతాల నుంచి విదేశీయులెందరో మన గడ్డపై కాలుమోపారు. వారిలో కొందరు మన భాషను నేర్చుకున్నారు. ప్రేమించారు. తెలుగు పతాకాన్ని విశ్వభాషా ప్రపంచంలో రెపరెపలాడించిన జెండా కర్రలయ్యారు మరికొందరు. అలాంటి వారిలో అగ్రగణ్యులు ఆంగ్లేయులు. తెలుగు ప్రాంతాలకు (ఉత్తర సర్కారు జిల్లాలు) సంబంధించిన మొదటి రెవెన్యూ చరిత్రను రాసింది... జేమ్సు గ్రాంటు. ఈయన నిజాం దర్బారులో బ్రిటిష్ రాయబారి. క్రీ.శ.1793లో రెవెన్యూ బోర్డులో సభ్యుడిగా ఉన్న ఛార్లెస్ వైట్... తెలుగు ప్రాంతాల్లో పని చేస్తున్న ఆంగ్లేయులు, తెలుగు భాషను నేర్చుకోవాల్సిందేనని చెప్పారు. ఇందుకు ఉపకరించే సమగ్రమైన నిఘంటువును తయారు చేయాలని సూచించారు. అప్పటికే గుంటూరులోని ఫ్రెంచి మిషన్‌వారు ఒక తెలుగు-ఫ్రెంచి నిఘంటువును తయారు చేశారు. కానీ అది అసమగ్రం.

కలకత్తా సమీపంలో సీరాంపూర్‌కు చెందిన మిషనరీ విలియం కేరీ కూడా అప్పట్లో ఒక తెలుగు వ్యాకరణాన్ని తయారు చేశారు. అదీ అంతంతమాత్రంగానే ఉండేది. భారతదేశంలో క్రైస్తవ మత ప్రచారం కోసం 1746లో సీరాంపూర్ మిషన్‌ను ప్రారంభించారు. బైబిల్‌ను దేశీయ భాషల్లోకి అనువదించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. అక్కడ మతాచార్యులుగా ఉన్న మార్ష్‌మన్, కేరీ, వార్డ్ తదితరులు... తెలుగు, కన్నడం, సంస్కృతం, తమిళ భాషల్లో అక్షరాలను పోతపోయించారు. అంతవరకు తెలుగు పుస్తకాలు విదేశాల్లో ముద్రితమయ్యేవి. బెంజమిన్ షుల్జ్ అనే జర్మన్ మతాచార్యుడు 1746, 47లలో క్రైస్తవ మత విషయాలను తెలుగులోకి అనువదించి, విదేశాల్లో ముద్రింపజేశారు. ఆ తర్వాత మనదేశంలోనే తెలుగు పుస్తకాల ప్రచురణ ప్రారంభమైంది.

ఆంగ్లేయ ఉద్యోగులు తెలుగు నేర్చుకునేలా స్ఫూర్తినిచ్చిన ఘనత సర్ థామస్ మన్రోది. 'మన్రోలప్ప'గా ఇప్పటికీ రాయలసీమ వాసుల గుండెల్లో గుడి కట్టుకుని ఉన్నారు. ఈయన పందొమ్మిదో శతాబ్దం పూర్వార్ధంలో మద్రాస్

గవర్నరుగా పని చేశారు. ఆ సమయంలోనే తన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ 'ప్రజల మధ్యనే జీవిస్తూ వారి భాషలోనే పాలన సాగించాల'ని ఉద్బోధించారు. ఈ మాటలతో స్ఫూర్తి పొందిన వారిలో సీపీ బ్రౌను ఒకరు.

'తెలుగు పామరులు మాట్లాడే భాష... తమిళ శిష్టుల భాషకన్నా శ్రావ్యంగా ఉంటుంది. భావ ప్రకటనలో గంభీరంగా, వినడానికి కమ్మగా ఉంటుంది తెలుగు'... ఈ మాటన్నది ఓ ఆంగ్లేయ కలెక్టరు. న్యాయమూర్తిగా కూడా పని చేసిన ఆయన పేరు... విలియం బ్రౌన్. 1783లో మద్రాసుకు వచ్చిన ఆయన 50 ఏళ్ల పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. తెలుగు వ్యాకరణాన్ని, అంక పద సూచికను ఆంగ్లంలో రచించారీయన. అచ్చతెలుగు అంటే అమితంగా ఇష్టపడే విలియం, తెలుగు భాషకు సంస్కృత పదాలు, పదబంధాలు అనవసరమని చెప్పే వారు. తెలుగు పద సంకలనాన్నీ తయారు చేశారు. అందులోని పదాలకు ప్రజల వాడుక భాష నుంచి ప్రయోగాలిచ్చారు.

ఎ.డి.కాంబెల్... తెలుగు భాషా చరిత్రను మొట్టమొదటి సారి ప్రామాణికంగా రాసిన వ్యక్తి. ఆరు ప్రకరణాలతో, 519 సూత్రాలతో ఆయన రాసిన ఆంధ్ర వ్యాకరణ పీఠికలో సంక్షిప్తంగా భాషా చరిత్రను వివరించారు. ఆంధ్ర శబ్ద చింతామణి, ఆంధ్ర కౌముది, ఆంధ్ర దీపిక, అహోబలపండితీయం తదితర గ్రంథాలను అధ్యయనం చేసి ఈ వ్యాకరణాన్ని రచించారు. అలాగే, 1820లో బళ్లారి కలెక్టరుగా ఉన్నప్పుడు 601 పేజీల తెలుగు నిఘంటువును నిర్మించారు.

తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం సహా ఇతర ద్రవిడ భాషలేవీ సంస్కృతం నుంచి ప్రాణం పోసుకోలేదని ససాక్ష్యంగా నిరూపించిన భాషా పరిశోధకుడు... ఎల్లిస్. 1806లో మచిలీపట్నం జిల్లా న్యాయమూర్తిగా పని చేస్తున్న కాలంలో తెలుగు నేర్చుకున్నారు. ఈయన రచించిన 'మిరాశీ హక్కులు' ఇప్పటికీ ప్రామాణిక గ్రంథమే.

తెలుగు నేర్చుకునే వారి కోసం వాచకాలు, నిఘంటువులు రాసిన జాన్ మారిస్... 1878లో గోదావరి జిల్లాల చరిత్రను గ్రంథస్థం చేశారు. మరుగునపడిపోయిన 380 ప్రాచీన తెలుగు సాహిత్య గ్రంథాలను సేకరించి, భద్రపరిచింది జాన్ లీడెన్. ఈయన బ్రౌను స్నేహితుడు. తెలుగు వారి చరిత్రకు సాక్ష్యాలైన కైఫీయత్తులను కూర్చిన మెకంజి గురించి ఎంత చెప్పినా తక్కువే. ద్రవిడ భాషల సారూప్య వ్యాకరణాన్ని రాసిన రాబర్ట్ కాల్డ్‌వెల్, తెలుగు భాషా పరిశోధనలో ముఖ్యంగా చారిత్రక తులనాత్మక పరిశోధనకు ఊతమిచ్చే రచనలు చేసిన బరోథామస్... ఇలా ఎందరో మహానుభావులు. అందరికీ వందనాలు పలకాల్సిందే.

వారి రుణం తీర్చుకోగలమా!

దేశ స్వాతంత్ర్యానంతరం రష్యా, అమెరికాతో మన దేశ సంబంధాలు పెరిగాయి. తెలుగు గ్రంథాలను రష్యన్ భాషలోకి అనువదించడం ప్రారంభమైంది. తెలుగు పండితులైన రష్యన్ భాషావేత్తలు గురోత్ మిసెన్, పెట్రనిచౌనా, స్వెట్లానా, జెనిత్ తదితరులు గురజాడ కన్యాశుల్కం, శ్రీశ్రీ గేయాలు, ఏటుకూరి బలరామమూర్తి రాసిన ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర వంటి గ్రంథాలను వారి భాషలోకి అనువదించారు. లెనిన్‌గ్రాడ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గురోత్, పెట్రోనిచోవా ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్, మాస్కోలో స్వెట్లానా, ప్రొగ్రెటట్ పబ్లిషింగ్ హౌస్‌లో జెనిత్... తెలుగు సాహిత్య పరిశోధన చేస్తున్నారు. మాస్కో రేడియోలో తెలుగు కార్యక్రమాల ప్రసార బాధ్యతలను లిడియా నిర్వర్తిస్తున్నారు. యూరిట్స్ గెన్‌కాచ్... దక్షిణ భారత సాంఘిక చరిత్రపై పరిశోధన చేస్తున్నారు. పగోల్ మద్వేదేవ్ ఉత్తర దక్షిణ భారత శాసనాలపై పరిశోధిస్తున్నారు.

భారతీయ భాషలు నేర్చుకోడానికి, భారతీయ సాహిత్యాన్ని అవగాహన చేసుకోవడానికి అమెరికాలో చాలా ప్రయత్నాలు జరిగాయి. అక్కడి చాలా విశ్వవిద్యాలయాల్లో భారతీయ భాషల బోధలు జరుగుతోంది. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, బెర్క్‌లే, కార్నెల్ విశ్వవిద్యాలయం ఇథాక, న్యూయార్క్, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, ఫిలడెల్ఫియా, టెక్సాస్ విశ్వవిద్యాలయం, ఆస్టిన్ యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్, మేడిసన్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్, ఓరియంటల్ డివిజన్లలో భారతీయ భాషల గ్రంథాలు ఉన్నాయి. కొంతకాలం వాయిస్ ఆఫ్ ఆమెరికాలో తెలుగు కార్యక్రమాలు ప్రసారమయ్యాయి. కొందరు అమెరికన్లు మన దేశానికి వచ్చి తెలుగు నేర్చుకొని, కర్ణాటక సంగీతాన్ని సాధన చేస్తున్నారు. అలాంటి వారిలో హగిన్స్ భాగవతర్ పేర్కొనదగినవాడు. హగిన్స్ త్యాగరాజుల కీర్తనలను రికార్డులుగా ఇచ్చి దాక్షిణాత్యులందరినీ ఆకట్టుకున్నారు. స్వచ్ఛమైన ఉచ్చరణతో తెలుగు కీర్తనలను పాడుతూ శ్రోతలను ముగ్ధులను చేస్తున్నారు. కర్ణాటక సంగీతంలో కృషిచేసి మంచి పాండిత్యాన్ని సంపాదించిన విలియం స్కెల్లర్ నాదస్వరంలోనూ దిట్ట. రిచర్డ్ స్కార్‌బరో వీణవాయిద్య సాధనతో పేరు ప్రఖ్యాతులు పొందారు. .

ఈ పాశ్చాత్యులను గమనించైనా... మనమంతా మనసు మర్చుకుని, అమ్మభాష వైపు అడుగులు వేయాలి. అప్పుడే తెలుగు జాతి నిలబడుతుంది. తెలుగు భాష గుబాళింపులు నలుదిక్కులకూ వ్యాపిస్తాయి.

ఒక్క సంక్రాంతి తప్ప..



హిందువులు చేసుకునే ముఖ్య పండుగలు అన్నీ చాంద్రమానం (తిథులు) ప్రకారమే జరుగుతాయి - ఒక్క సంక్రాంతి తప్ప. అందుకనే చాలా పండుగలని ఆయా తిథులతో పిలుస్తాం. ఉదా॥ వినాయక చవితి, శ్రీరామనవమి. కానీ ఒక్క సంక్రాంతిని మటుకు మకరసంక్రాంతి అని పిలుస్తాం. ఎందుకంటే ఈ రోజున సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. అప్పటివరకూ భూమధ్య రేఖకు దక్షిణ దిక్కులో ఉన్న సూర్యుడు ఉత్తరానికి మారతాడు. అందుకే దీన్ని ఉత్తరాయణం అంటారు. అప్పటివరకూ రాత్రిళ్లు సుదీర్ఘంగా ఉంటే, సంక్రాంతి నుంచి పగటి సమయాలు పెరుగుతాయి. వేడి ప్రభావం వల్ల మెదడు మరింత చురుగ్గా పనిచేస్తుంది. చీకటి మీద వెలుగుది పైచేయి అవుతుంది. బహుశా అందుకే ఉత్తరాయణాన్ని పుణ్యకాలంగా భావిస్తారు. భీష్ముడంతటి వాడు సైతం ఉత్తరాయణంలో మరణించాలని, అంపశయ్యపై ఎదురుచూశాడు. సౌరమానం ప్రకారం జరుపుకునే పండుగ కాబట్టి పండుగ వచ్చే తేదీలో కూడా పెద్దగా మార్పు రాదు.



డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి
వ్యవస్థాపక కార్యదర్శి
సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్టు,
కడప. 08562 243923

చేతులు దులుపుకోను... చేతల్లో చూపిస్తా

– అధికార భాషా సంఘం అధ్యక్షుడు
మండలి బుద్ధప్రసాద్

తెలుగు భాషోద్యమకారునిగా, మాజీ మంత్రిగా, రాజకీయవేత్తగా బుద్ధప్రసాద్ ప్రస్థానం తెలుగు వారికి సుపరిచితం. ఇటీవలే ఆయన అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. తెలుగును కాపాడుకోవడానికి సంఘం చేస్తున్న కృషి, ఇతర అంశాలపై 'తెలుగువెలుగు'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

తె.వె: అధికార భాషా సంఘం అధ్యక్షునిగా మీ ప్రణాళిక ఏమిటి?

మండలి: పదవీ కాలం రెండేళ్లు అనుకున్నా.. అయిదారు నెలల్లో ఎన్నికల వాతావరణం వచ్చేస్తుంది. అప్పుడు అధికారులు, మంత్రులు ఎవరూ మన మాట వినరు. ఏం చేసినా ఈ కొద్ది సమయంలోనే చేయాలి. నాలాంటి వాడు ఈ స్థానంలో కూర్చున్నాక కొన్ని పనులు తప్పనిసరిగా చేయించాల్సిందే. చేయిస్తాను కూడా. భాషాభిమానులు కూడా నాపై చాలా అంచనాలు పెట్టుకున్నారని తెలుసు. మొన్నెవరో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. నేను అధికార భాషా సంఘం అధ్యక్షుణ్ని అయ్యాక ప్రభుత్వానికి రాసిన లేఖల వివరాలను అడిగారు. లేఖలు రాసి చేతులు దులుపుకునే మనస్తత్వం కాదు నాది. తెలుగు అభివృద్ధి కోసం నూటికి నూరుపాళ్లు కష్టపడతా.

తె.వె.: తెలుగు భాషా ఉద్యమకారునిగా మీ ప్రస్థానానికి అంకురార్పణ జరిగిందెప్పుడు?

మండలి: మా అబ్బాయి మూడో తరగతిలో ఉన్నప్పుడనుకుంటా...ఒకరోజు టీవీ చూస్తున్నాడు. అప్పట్లో ఈటీవీ తప్ప మరే ఛానలూ లేదు. లోగోలోని 'ఈనాడు' తెరపై స్పష్టంగా కనిపించేది. మావాడు ఆ అక్షరాలను చదవలేకపోయాడు. అదేంట్రా అంటే... మా బళ్లో తెలుగు నేర్పించరని చెప్పాడు. చాలా బాధేసింది. అప్పుడే తెలుగుపై పని చేయాలని నిర్ణయించుకున్నా. ఆ సమయంలోనే మొదటిసారిగా శాసనసభ్యుడిగా ఎన్నికయ్యా. అప్పటికే తెలుగు అభివృద్ధికి కృషి చేస్తున్న ఉద్యమకారులతో మాట్లాడి, శాసనసభలో 'అనధికార తీర్మానం' ప్రవేశపెట్టా. దాంతోనే, ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ తెలుగును తప్పనిసరిగా చదవాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే, అవి కాగితాల్లోనే మిగిలిపోయాయి.

తె.వె.: అధికార భాషా సంఘానికి ఏవైనా ప్రత్యేక సౌకర్యాలు కావాలని ప్రభుత్వాన్ని అడిగారా?

మండలి: అధికార భాషా సంఘానికి ప్రత్యేక కార్యదర్శి ఉండాలి. ఆయనకు కార్యాలయ బాధ్యతలు ఉండాలి. నిధుల కేటాయింపులు జరిపే అధికారమివ్వాలి. అలాగైతేనే... ఎప్పుడైనా సంఘం అధ్యక్షుణ్ని నియమించడంలో ఆలస్యం జరిగినా పనులు మాత్రం ఆగవు. ఈమేరకు ఇప్పటికే ప్రభుత్వానికి సూచనలు చేశా. అలాగే, సంఘానికి బడ్జెట్ కేటాయింపులు కూడా పెరగాలి.

తె.వె.: అధికార భాషా సంఘం భవిష్యత్తు కార్యక్రమాలేంటి?

మండలి: జనవరి నుంచి అధికార భాషా సంఘం ప్రజల్లోకి వెళ్తుంది. సంఘ సభ్యులందరూ జిల్లాల్లో పర్యటిస్తారు. తెలుగుభాష

అమలు తీరుతెన్నులను పరిశీలిస్తాం. తెలుగును వినియోగించడంపై అధికారులకు శిక్షణనిస్తారు. తెలుగును కాపాడుకోవాలన్న స్ఫూర్తిని ప్రజల్లో రగుల్చుతారు. ప్రభుత్వ వెబ్‌సైట్లన్నింటినీ తెలుగులో అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. అన్ని మొబైల్ ఫోన్లలో తెలుగును పెట్టాలని పరిశ్రమ వర్గాలతో మాట్లాడుతున్నాం. త్వరలో సానుకూల ఫలితం రావచ్చు. తెలుగు పాఠ్యపుస్తకాల్లో తప్పుల్ని నివారించడానికి... పుస్తకాలను ప్రచురణకు పంపే ముందు అధికార భాషాసంఘం అనుమతి తీసుకోవాలని అధికారులను సంబంధిత శాఖ మంత్రి ఆదేశించారు. ఇంకా చాలా ఆలోచనలు ఉన్నాయి.

తె.వె.: పాలనా భాషగా తెలుగు ఎందుకు అమలు కావట్లేదు?

మండలి: అధికార భాషా చట్టం ప్రకారం ప్రభుత్వంలోని అన్ని స్థాయిల్లో ఉత్తర ప్రత్యుత్తరాలను తెలుగులోనే జరపాలి. భారత ప్రభుత్వంతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలకు మాత్రమే ఆంగ్లాన్ని వాడాలి. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక సచివాలయ స్థాయిలో తెలుగును అమలు చేయాలని సంకల్పించారు. ఆమేరకు ఆదేశాలు ఇచ్చారు. కానీ, ఫలితం లేకపోయింది. ఒకానొక దశలోనైతే 'ప్రజల మధ్యకు నేను ఏ ముఖం పెట్టుకు వెళ్లాలి? చట్టం చెబుతున్నా, ముఖ్యమంత్రిగా నేను ఆదేశాలు జారీ చేసినా... నా దగ్గరకు తెలుగులో ఒక్క దస్త్రమూ రావట్లేద'ని బాధపడ్డారు. పాలనా భాషగా తెలుగును అమలు చేయించడం... దీక్షతో, దక్షతతో తెలుగును వెలిగించాలనుకున్న రామారావుగారి వల్లే సాధ్యం కాలేదు. 1992 తర్వాత ప్రపంచీకరణ ఊపందుకోవడంతో తెలుగును పట్టించుకున్న వారు లేరు. అప్పటి వరకూ బోధనా భాషగానైనా తెలుగు ఉండేది. ఆ తర్వాత ఆ స్థానాన్ని పోగొట్టుకుంది. పరాయి రాష్ట్రానికి చెందిన అధికారులు తెలుగు నేర్చుకుంటున్నారు. వారితో సమస్యేం లేదు. ఎటొచ్చీ మన వాళ్లతోనే ఉంది. వారే మన అమ్మభాషకు తగిన గౌరవం ఇవ్వట్లేదు.

తె.వె.: పరిస్థితిని మార్చడానికి మీ కృషి...

మండలి: ఇప్పుడంతా కంప్యూటర్ యుగం. ప్రభుత్వ కార్యాలయాలన్నీ కంప్యూటర్లపైనే పని చేస్తున్నాయి. కాబట్టి, ఆధునిక సాంకేతిక వ్యవస్థను సమర్థంగా ఉపయోగించుకుని అధికార భాషగా తెలుగును అమలు చేయాలి. గతేడాది నుంచి రాష్ట్ర సమాచార శాఖ తెలుగుపై కృషి చేస్తోంది. ఫలితంగా 18 తెలుగు ఖతులు (ఫాంట్లు) అందుబాటులోకి వచ్చాయి. పదపరిష్కరణి (స్పెల్ చెకర్)ని కూడా రూపొందించారు. అలాగే, తెలుగు కీబోర్డు రూపకల్పన కూడా జరుగుతోంది. ఈ అవిష్కరణలన్నింటినీ ప్రతి ప్రభుత్వ కార్యాలయానికీ చేర్చుతాం. వాటి వినియోగంపై ఉద్యోగులందరికీ శిక్షణనిస్తాం. జనవరి నుంచే ఈ పనిని ప్రారంభించబోతున్నాం. ఒక్కసారి ఈ సాంకేతిక ఆవిష్కరణలన్నీ క్షేత్రస్థాయికి వెళ్తే... ఇకపై పాలనా భాషగా తెలుగును వినియోగించకపోవడానికి సాకులు చెప్పే అవకాశం ప్రభుత్వ యంత్రాంగానికి ఉండదు.

తె.వె.: పాఠశాలల్లో తెలుగును తప్పనిసరి బోధనాంశంగా చేయాలన్న నిర్ణయానికి కారణాలేంటి?

మండలి: విద్యావ్యవస్థ మొత్తం ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఆ సంస్థలు నిర్వహించే పాఠశాలల్లో తెలుగుకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వట్లేదు. పైపెచ్చు విద్యార్థులు తెలుగులో మాట్లాడితే కొడుతున్నారు. అవమానిస్తున్నారు. ఫలితంగా పిల్లలు తెలుగు అక్షరాలను కూడా నేర్చుకోవట్లేదు. మన అక్షరాలు కూడా రాని తరంతో భాష బతుకుతుందా? జాతి నిలుస్తుందా? ఆంగ్లంపై నాకు వ్యతిరేకత ఏమీ లేదు. ప్రపంచ అనుసంధాన భాష అయిన దానిని తప్పనిసరిగా నేర్చుకోవాల్సిందే. అందుకని, తెలుగును వదిలేస్తామంటే ఎలా? చదువులో ఒక అంశంగానైనా తెలుగు ఉండాలి కదా. దీనిపైనే కొద్ది రోజుల కిందట విద్యాశాఖ మంత్రితో మాట్లాడా. తప్పనిసరిగా చదివే అంశంగా తెలుగు ఉండాలని ఈ సందర్భంలోనే నిర్ణయించాం. అధికారులూ దీనికి ఒప్పుకున్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి వృత్తి విద్యా కోర్సులు కూడా తెలుగులో ఉండాలి. ఎందుకంటే, తెలుగు మాత్రమే తెలిసిన రోగికి... తెలుగు రాని వైద్యుడు పూర్తిస్థాయిలో చికిత్స చేయలేడు కదా!

తె.వె.: తెలుగులో మాట్లాడే విద్యార్థులపై కొన్ని ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు కఠినంగా వ్యవహరిస్తున్నాయి కదా...

మండలి: అలాంటి పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి. ఈ మాటను ఇప్పటికే సంబంధిత అధికారులకు చెప్పాం. భవిష్యత్తులో ఎప్పుడైనా ఏ పాఠశాల అయినా ఇలా వ్యవహరిస్తే... అధికార భాషా సంఘం అధ్యక్షుడి హోదాలో ఆ పాఠశాల ముందే కూర్చుంటా. ఆ బడి గుర్తింపు రద్దు చేసే వరకూ అక్కడ నుంచి కదలను.

తె.వె.: తెలుగు మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులకు ప్రభుత్వ కొలువుల్లో కోటా ఇచ్చే ఆలోచన ఉందా?

మండలి: గతంలో తెలుగులో చదువుకున్న వాళ్లకి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రోత్సాహం లభించింది. న్యాయస్థానం దానిని కొట్టివేయడంతో ప్రస్తుతం ఆ విధానం లేకుండా పోయింది. దానిని ఎలా పునరుద్ధరించాలన్న దానిపై న్యాయశాఖతో మాట్లాడుతున్నాం. తెలుగులో చదవడమనేది ఆత్మగౌరవ సమస్య. ప్రలోభాలు పెట్టి చదివించడం కంటే మక్కువతో చదవడం ముఖ్యం. దీనిపై విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. వాటిని తీసుకున్నాక ప్రకటిస్తాం.

తె.వె.: విశ్వవిద్యాలయాల్లో భాషా పరిశోధనలు ఎలా జరుగుతున్నాయి?

మండలి: దురదృష్టవశాత్తూ మన విశ్వవిద్యాలయాల్లో భాషాపరంగా చెప్పుకోదగిన పరిశోధనలు జరగట్లేదు. పరిశోధన రంగంలో మల్లంపల్లి సోమశేఖరశర్మ గారి లాంటి పెద్దల కృషిని కొనసాగించే వారు లేరు. పరిశోధనలు కుంటుపడటం మూలంగానే... ప్రాచీన భాష గుర్తింపునకు ప్రయత్నిస్తున్నప్పుడు తగిన ఆధారాలు సమర్పించలేకపోయాం. పూర్వ పరిశోధకులు తయారు చేసింది తప్ప తెలుగు జాతి సమగ్ర చరిత్రను ఇప్పటికీ రూపొందించుకోలేకపోయాం.

తె.వె.: హఠాత్తుగా ప్రపంచ తెలుగు సభలను ఏర్పాటు చేయడానికి కారణం?

మండలి: మొదటి ప్రపంచ తెలుగు మహాసభల దాకా తెలుగు జాతి అని ఒకటుందన్న విషయం ప్రపంచానికి తెలియదు. మహాసభల తర్వాత మన జాతి ఔన్నత్యం, భాష గొప్పదనం లోకానికి వెల్లడైంది. ఆ తర్వాత మహాసభలను మారిషస్, మలేషియాల్లో నిర్వహించుకున్నాం. ఈ దేశాల్లో ఎందుకు నిర్వహించారంటే... 150 ఏళ్ల కిందట బ్రిటిష్ వారు.. మన ప్రాంతం నుంచి ముఖ్యంగా ఉత్తరాంధ్ర నుంచి ఎక్కువ మంది ప్రజలను శ్రమజీవులుగా ఆ దేశాలకు తీసుకెళ్లారు. అక్కడ మన వాళ్లను కోరంగీలని, మన భాషను కోరంగీ అని (కోరంగి రేవు నుంచి వచ్చారు కాబట్టి) పిలిచే వారు. అలా వెళ్లిన వారు తెలుగును కాపాడుకోవడానికి పడ్డ కష్టాల

గురించి వింటే కళ్లల్లో నీళ్లు తిరుగుతాయి. పగలంతా పని చేసుకుని వచ్చి... రాత్రిపూట ఇసుకలో పిల్లలకు తెలుగు అక్షరాలు నేర్పేవారు. అలా వారు చేసిన కృషి మూలంగానే నేడు మారిషస్ ప్రభుత్వం తెలుగుకు ప్రత్యేక గౌరవం ఇస్తోంది. కిందటేడాది ప్రపంచ తెలుగు మహాసభలను కూడా నిర్వహించింది. మన రాష్ట్రంలో లేదు గానీ, ఒకటో తరగతి నుంచి పీజీ వరకూ తెలుగులోనే చదువుకునే అవకాశం అక్కడ ఉంది. అక్కడి వారికి మన అమ్మభాష ఎంతో అపురూపం. తెలుగు సంస్కృతి గురించి తమ పిల్లలకు తెలియజెప్పడానికే తెలుగును నేర్పిస్తారు వారు. 37 ఏళ్ల తర్వాత మన గడ్డపై తెలుగు మహాసభలు జరుగుతున్నాయంటే... విదేశాల్లోని తెలుగు వారి ఒత్తిడి మూలంగానే. తెలుగు వారిలో తెలుగుపై కొంత ఆలోచన రేకెత్తించడానికి ఈ సభలు ఉపయోగపడుతున్నాయి. తెలుగు మహాసభలు ఎందుకు? అన్న అంశంపై పుస్తకం రాయాలని ఉంది. సమయం చిక్కట్లేదు.

తె.వె.: మన భాషను కాపాడుకోవాలంటే?

మండలి: ప్రపంచీకరణను తిట్టుకోకుండా, దాన్నే ఉపయోగించుకుని మన అమ్మభాషను అభివృద్ధి చేసుకోవాలి. సాంకేతికతను, అంతర్జాలాన్ని సమర్థంగా వినియోగించుకుని తెలుగును విశ్వభాషగా మలుచుకోవాలి. ఇదంతా మేధావులు చేయాల్సిన పని. దీనికంటే ముందు... ప్రజల్లో భాషపై అనురక్తి కలగాలి. అధికారభాషాచట్టాన్ని ఎందుకు అమలు చేయట్లేదని ఎవరూ అడగట్లేదు. దానిపై ఎవరైనా ఒక్క ప్రజాహిత వ్యాజ్యమైనా వేశారా? బోధనా భాషగా తెలుగును ఎందుకు కొనసాగించట్లేదని ప్రశ్నించారా? భాష నశిస్తే జాతి అస్తిత్వమే నశిస్తుంది. ఆ స్పృహ ప్రజల్లో కలిగించాలి. అపురూపమైన మన జానపద కళారూపాలన్నీ అంతరిస్తున్నాయి. వీటిపై కూడా తెలుగు వారిని ఆలోచింపజేయాలన్నదే మా ప్రయత్నం. సంగీతం, కళలను చదువులో భాగం చేయాలి. అప్పుడే కూచిపూడి, ఆంధ్ర నాట్యాలు, పేరిణీ శివతాండవం, లలిత, శాస్త్రీయ సంగీతాల గురించి మన పిల్లలకు తెలుస్తుంది. ఒబామా... అమెరికా అధ్యక్షుడైన వెంటనే కళలను విద్యలో భాగం చేశారు. మన దగ్గరా ఆ పని జరగాలి.

తె.వె.: భాషాభివృద్ధిలో ప్రసారమాధ్యమాల పాత్ర ఎలా ఉండాలని ఆశిస్తున్నారు?

మండలి: స్వచ్ఛమైన భాషను ప్రచారం చేయడంలో ఆకాశవాణి ముందు ఉండేది. పూర్వపత్రికలేవీ ఆంగ్ల పదాలను వాడేవి కావు. వాటికి సమానమైన తెలుగు మాటలను సృష్టించేవి. వ్యాప్తిలోకి తెచ్చేవి. తద్వారా మనభాషను పరిపుష్టం చేశాయి. ఇప్పుడంతా తెంగ్లీషే కదా! అందుకే స్వచ్ఛమైన తెలుగునే వాడమని కోరేందుకు ప్రసార మాధ్యమాల యాజమాన్యాలతో మాట్లాడాలని అనుకుంటున్నాం. 'ఈనాడు' మాత్రం మొదటినుంచీ మిగిలిన పత్రికలన్నింటి కన్నా భిన్నమైంది. సాధ్యమైనంత వరకూ తెలుగుకే ప్రాధాన్యమిస్తుంది. ఎప్పటికప్పుడు కొత్త పదాలను సృష్టిస్తూ అమ్మభాషకు అనుపమానమైన సేవ చేస్తోంది. 'ఈనాడు' వ్యాప్తిలోకి తెచ్చిన గుత్తేదారు, గోడపత్రిక లాంటి ఎన్నో పదాలను ఇప్పుడు చాలామంది మాట్లాడుతున్నారు. రామోజీరావు గారికి తెలుగంటే మక్కువ. తెలుగు అభివృద్ధికి ఏదో ఒకటి చేయాలన్న తపన ఉంది ఆయనలో. ఆ తపనతోనే కదా 'తెలుగు వెలుగు' పత్రికను ప్రారంభించారు. ఈ పత్రిక... మాలాంటి భాషాభిమానులందరికీ మానస పుత్రిక.

తె.వె.: ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషా బోధకుల పరిస్థితి దయనీయంగా ఉంది?

మండలి: తెలుగు పండితుల సమస్యలపై నాకు సంపూర్ణ అవగాహన లేదు. తెలుగువెలుగు పత్రిక మొదటి సంచికలో భాషాబోధకుల వెతలపై వ్యాసం ఇచ్చారు కదా. దాన్ని మాధ్యమిక విద్యాశాఖ మంత్రికి పంపా. నేను అప్పుడు అధికార భాషా సంఘం అధ్యక్షుణిగా లేను. ఇప్పుడు దీనిపై ఆయనతో అధికారికంగా మాట్లాడతా.

తె.వె.: రాష్ట్రం వెలుపల ఉన్న తెలుగు వారి సమస్యలపై ఏం చేయనున్నారు?

మండలి: ఇప్పటి వరకూ హిందీ తర్వాత దేశంలో ఎక్కువ మంది మాట్లాడే భాష తెలుగేనని గర్వంగా చెప్పుకుంటున్నాం. కానీ, తాజా జనాభా లెక్కల ప్రకారం ఆ స్థానం బెంగాలీ చేజిక్కించుకుంది. మనం మూడోస్థానంలోకి వెళ్లిపోయాం. ఎందుకు? తెలుగు వారి జనాభా తగ్గిందా? లేదే! తమిళనాడు వంటి రాష్ట్రాల్లో తెలుగులో చదువుకోవడానికి ఎలాంటి అవకాశమూ లేదు. దాంతో తెలుగు కుటుంబాల్లో పిల్లలందరూ తమిళంలోనే చదువుకుంటున్నారు. ఫలితంగా దాన్నే తమ మాతృభాషగా చెప్పుకుంటున్నారు. దాంతో తెలుగు మాతృభాషీయుల సంఖ్య దస్త్రాల్లో తగ్గిపోతోంది. నేను తెలుగు వాణ్ని అని గర్వంగా చెప్పుకునేంత ధైర్యాన్ని రాష్ట్రేతర ఆంధ్రుల్లో కలిగించాలి. ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్రలతో పెద్ద ప్రమాదమేమీ లేదు. అక్కడి ప్రభుత్వాలతో మాట్లాడుతున్నాం. వారు మన అభ్యర్థనలను ఆలకిస్తున్నారు. అయితే... సమస్యంతా తమిళనాడుతోనే. ఆ రాష్ట్రంలోని తెలుగు వారి సమస్యలను ముఖ్యమంత్రి జయలలిత దృష్టికి తీసుకెళ్లాం.

తె.వె.: తెలుగు కవుల స్మృతిచిహ్నాల రక్షణ బాధ్యతలను అ.భా.సం. చేపడుతుందా?

మండలి: స్మృతి చిహ్నాలను రక్షణ బాధ్యతలను సంఘం తరఫున చేపట్టడానికి అవకాశం లేదు. స్మృతిచిహ్నాలను రక్షించుకోవాలన్న జాగృతి మన వారిలో లేదు. నేను విజయనగరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్నప్పటి సంగతి... మొదటిసారి ఆ జిల్లాకు వెళ్లినప్పుడు గురజాడ ఇంటిని సందర్శించా. అక్కడ పరిస్థితిని చూసి

పంటల పండుగ

ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంటలు సంక్రాంతినాటికి రైతుల ఇళ్లకి చేరుకుంటాయి. మెట్ట, మాగాణి పంటలు మాత్రమే కాదు. గుమ్మడికాయలవంటి కాయగూరలు, బంతి, చామంతి వంటి పూదోటలూ ఈ కాలానికల్లా విరగబూస్తాయి. భారతదేశమంతటా దీన్ని అనేక పేర్లతో పిలుస్తారు. ఉత్తరభారతంలో లోరీ, తమిళనాడులో పొంగల్, మన రాష్ట్రంలో సంక్రాంతి. పేరు ఏదైనా ఇది పంటలు చేతికొచ్చే భాగ్య సమయం. ఆ ఆనందాన్ని పంచుకునేందుకు నూతన వస్త్రాలను ధరిస్తారు, పూర్వీకులని స్మరించుకుంటూ నల్లనువ్వులతో తర్పణాలను వదులుతారు. గుమ్మడి కాయలను దానం చేస్తారు.

మనస్సు చలించిపోయింది. మహాకవి కళ్లజోడు, పుస్తకాలు... ఏ రక్షణా లేకుండా పడి ఉన్నాయి. వెంటనే వాటిని సంరక్షించడానికి నిధులు మంజూరు చేశా. ఇంగ్లాండ్‌లో ప్రతి కవికీ ఒక స్మృతిచిహ్నం ఉంది. వాటిని అక్కడి వారు ఎంతో అపురూపంగా చూసుకుంటారు. ప్రభుత్వమూ, ప్రైవేట్ ట్రస్టులు సంయుక్తంగా వాటి బాగోగులు చూసుకుంటాయి. మన దగ్గర కూడా ఆ పద్ధతి రావాలి. స్మృతిచిహ్నాల సంరక్షణకు స్థానికులూ ముందుకు రావాలి.

తె.వె.: న్యాయస్థానాల్లో ఆంగ్లానికే ప్రాధాన్యం లభిస్తోంది కదా..

మండలి: అదే పెద్ద సమస్య. వాదనలేం జరుగుతున్నాయో కక్షిదారుకు అర్థంగాక పోతే ఎలా? దీనిపైన ఏం చెయ్యాలో ఆలోచిస్తున్నాం. ఒకరిద్దరు న్యాయమూర్తులు తెలుగులో తీర్పులిస్తే ఆశ్చర్యపోతున్నాం. కానీ, బ్రిటిష్ హయాంలోనే మొదటిసారిగా మచిలీపట్నంలో సీపీ బ్రౌన్ న్యాయమూర్తిగా ఉన్నప్పుడు తెలుగులో తీర్పు రాశారు. ఆ ప్రతిని ఇప్పటికీ మచిలీపట్నంలో చూడవచ్చు.

తె.వె.: మన సినిమాలకు ఆంగ్లపేర్లు పెడుతున్నారు?

మండలి: ప్రస్తుతం ఈ అంశం చర్చనీయాంశమైంది. కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రి సమక్షంలో సినీ ప్రముఖులతో సమావేశం జరిగింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఉంటే సినిమాలకు తెలుగు పేర్లు వస్తాయని పరిశ్రమ పెద్దలు చెప్పారు. దాంతో నేను విభేదించా. తెలుగు వారు తీసిన సినిమాకు తెలుగు పేరు పెట్టడానికి ఎదురు డబ్బులు ఇవ్వాలా! తమిళనాడులో సినిమాకు తమిళ పేరు ఉంటేనే సెన్సారు ధ్రువపత్రం వస్తుందని మొన్నా మధ్య నాకు ఎవరో చెప్పారు. మన దగ్గర కూడా అలాంటి నిబంధనలు రావాలి. వాటిని అధ్యయనం చేస్తున్నాం.

తె.వె.: తెలుగు భాషాభివృద్ధి గురించి పార్టీలేవీ ఎన్నికల ప్రణాళికల్లో ప్రకటించవెందుకని?

మండలి: మనదగ్గర భాషకు రాజకీయ ప్రాధాన్యత లేదు. తమిళనాడులోనైతే రాజకీయాలను భాషే శాసిస్తుంది. యూపీఏకు మద్దతు ఇవ్వమని కరుణానిధిని అడిగితే తమిళానికి ప్రాచీన హోదా కావాలని పట్టు బట్టారు. సాధించుకున్నారు. అక్కడి ప్రతి పార్టీ కూడా తమ ఎన్నికల మేనిఫెస్టోలలో భాషకు తాము చేయబోయే సేవను వివరిస్తుంది. అధికారంలోకి వచ్చాక అలాగే చేస్తుంది. ఇప్పుడు మనలోనూ స్పృహ పెరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు ప్రణాళికల్లో తెలుగు గురించి ప్రస్తావిస్తాయని అనుకుంటున్నా.

తె.వె.: విదేశాల్లో ఉన్న ప్రాచీన తెలుగు గ్రంథాల నకళ్లను తెచ్చే ఆలోచన చేస్తున్నారా?

మండలి: లండన్ ప్రదర్శనశాలల్లో ప్రాచీన తెలుగు సాహిత్యం ఎంతో ఉంది. దాని నకలు తీసుకురావాలని ఆలోచిస్తున్నాం. అయితే, మన దగ్గర లేనివేంటో చూసుకుని వాటినే అక్కడ నుంచి తెచ్చుకోవాలి. దానిపై అధ్యయనం చేస్తున్నాం. అదృష్టవశాత్తూ ఆ ప్రాచీన గ్రంథాలన్నీ అక్కడున్నాయి కాబట్టే పదిలంగా ఉన్నాయనిపిస్తోంది. వాటి రక్షణకు అక్కడి వారు తీసుకుంటున్న జాగ్రత్తలు అనన్య సామాన్యం.

తె.వె.: తెలుగులో సంతకం పెట్టే మంత్రులెవరైనా ఉన్నారా?

మండలి: మంత్రులు, ప్రభుత్వోద్యోగులు తెలుగులో కనీసం సంతకమైనా పెట్టాలని ఎప్పటి నుంచో చెబుతున్నాం. ఒకరిద్దరు మంత్రులు ఎప్పుడూ తెలుగులోనే సంతకాలు చేస్తారు. జానారెడ్డి చూసే శాఖకు సంబంధించి దస్త్రం ఆంగ్లంలో ఉన్నా... ఆయన సంతకం మాత్రం తెలుగులోనే ఉంటుంది. నేను మంత్రిగా ఉన్నప్పుడు కూడా దస్త్రాలకు సంబంధించి అభిప్రాయాలన్నింటినీ తెలుగులోనే రాసేవాణ్ని. మరో మారు ఈ అంశంపై దృష్టిపెడతాం. చేయాల్సింది చాలా ఉంది. ఈ విషయంలో భాషాభిమానులందర్నీ అడుగుతున్నాం. సలహాలు, సూచనలు చెప్పమని. అందరి సహకారంతో భాషాభివృద్ధి కోసం వీలైనంత కృషి చేస్తా.

- తెలుగు వెలుగు బృందం

చిత్రాలు: వై.వి.సత్యనారాయణ

పదపదవె వయ్యారి గాలిపటమా



గాలిలో తేలిపోవాలనే మనిషి ఊహ ఈనాటిది కాదు. ప్రజ్ఞ ఏర్పడిననాటి నుంచి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. దానికి తొలి రూపమే గాలిపటం. మకర సంక్రాంతినాడు గాలిపటాలను ఎగరవేసే సంబరాన్ని భారతదేశంలోని అనేక ప్రాంతాలలో జరుపుకుంటారు. అప్పటి వరకూ నిద్రించిన దేవతలు ఆరోజున మొదలయ్యే ఉత్తరాయణంతో మేల్కొంటారని నమ్మకం. వారికి ఆహ్వానం పలుకుతూ స్వర్గానికి చేతులూపే సాంప్రదాయమే గాలిపటాలు ఎగరేయడం. సంక్రాంతి రోజుల్లో ఆకాశం తేటగా ఉంటుంది. సముద్రం మీద నుంచి వచ్చే గాలులు మరీ ఉధృతంగా ఉండవు, అలా అని స్తబ్దతా ఉండదు. సూర్యరశ్మి కూడా తక్కువగా ఉంటుంది. డాబాల పైకి చేరి, కేరింతలని గాలిపటాలుగా మార్చి ఎగరేయడానికి ఇంతకంటే మంచి సమయం ఏముంటుంది!

మాటలు 'ఆడి' చూడు

మన భాష సుమధురం. మన మాట సుస్వరం. మన రాత సుమనోహరం.

సులక్షణమైన, సుసంపన్నమైన మన తెలుగు.. భారతీయ భాషలకే తలమానికం.

అద్వితీయ సంస్కృతి, అఖండ సాహితీ సంపదలకు వారసులం మనం.

స్వభాషకు దూరమైన జాతి ఏదీ అట్టేకాలం మనుగడ సాగించలేదు. సొంత సంస్కృతికి దూరమై పరాయి సమూహాల్లో చోటు వెతుక్కుంటుంది. తెలుగు వారు ఆ దుస్థితిలోకి జారిపోకూడదన్న సదుద్దేశంతో ఈ మధ్యకాలంలో ఎందరో భాషావేత్తలు, పరిశోధకులు, ప్రేమికులు ఎన్నో రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మన అక్షరం - మనకు రక్ష అనే నమ్మికతో భాషను బతికించుకునేందుకు చక్కని ప్రయత్నాలు చేస్తున్నారు. భాషాభిమానులందరూ చేతులు కలిపి ఇలాంటి ప్రయత్నాలను ముమ్మరం చేయాలి. ఆసక్తులకు అనుగుణంగా కళా రూపాల్లోనో, క్రీడాకాలక్షేప రూపాల్లోనో భాషాసేవ చేయాలి. ఆటపాటల రూపేణా కొత్త తరానికి తెలుగు అలవోకగా అలవడుతుందన్నది అక్షరసత్యం. ఈ ఉద్దేశంతోనే తెలుగునాట వెలిసిన ఆటలు.. 'జోడించు', 'త్వరగా జోడించు'.

ప్రపంచంలో- ముఖ్యంగా రోమన్ వర్ణమాల గల చోట్ల - పలు భాషల్లో రకరకాల పదక్రీడలున్నాయి. తద్వారా, భాషాలబ్ధి, భావపుష్టి అని తెలిసినదే. (ఉదా: Scrabble, Jumble, Crossword Puzzles, Word- Mine, Boggle వంటివి ఇంగ్లిషులో.) సాధారణంగా మన భారతీయ భాషలలో విభిన్న రూపాల పదక్రీడలు ఈనాటికి ఇంచుమించు మృగ్యం అనే చెప్పవచ్చు. అడపాదడపా కనిపించినా, వాటి సాంకేతికతా సౌలభ్యాలు ఇబ్బందికరమే. ఇందుకు కారణం. భారతీయ భాషల ద్విత్వ సంయుక్త గుణింత వర్ణక్రమ విన్యాసాల సొంపులు అసమానమయినప్పటికీ పదచిత్ర బంధాలలో- అడ్డము - నిలువుగా అమరికలు కుదిరేటట్లు - ఇమడ్చడం కష్టతరమే.

నాకు తెలిసినంత వరకూ, తెలుగులో గర్భకవిత్వాలు, గుప్తాక్షర చమత్కారాలు, పొడుపు కథలు, నిగూఢ సందేశాలు, పలురకాల నుడికడలి/పదబంధ ప్రహేళికలు వంటివి కొన్ని ఉన్నాయి. అయితే అవి సాధారణంగా పండిత ప్రకాండులకు సుసాధ్యం. అంచేత వాటి ప్రాచుర్యం అంతంత మాత్రం. పైగా, తరచూ వీటిలో ప్రముఖ పాత్ర ఒక్కరికే. ఆటల్లో కనిపించే పోటీదృష్టి, అందువల్ల కలిగే సరదా అరుదు. ఇద్దరు కాని ఇంకా ఎక్కువ మంది కాని పాల్గొనే ఆటల్లో మజా అనిపిస్తుంది. వినోదం, విజ్ఞానం పడుగు-పేకల్లా కలిసిన వినూత్నమైన అల్లిక ఈ మధ్యకాలంలో మనకు తెలుగులో "జోడించు" ఆటలు కనిపిస్తున్నాయి. ఇవి అక్షరాలను జతపేర్చి పదాలను జోడిస్తూ నేర్చుకో అనే సందేశమిస్తున్నాయి.

ఈ పదక్రీడ రూపకల్పనలో ఐఐటీ పట్టభద్రులు, సాంకేతిక నిపుణులు, భాషావేత్తలు సుమారు నాలుగు సంవత్సరాలు చేసిన పరిశోధనల పునాదులు ఉన్నాయి. మౌలికమైన గణాంకశాస్త్రం ఆధారంగా పాయింట్లు నిర్దేశించడం (విభిన్న అక్షరం/ గుణింతం గుర్తులు/ ఒత్తుల సంఖ్యలు నిర్దేశించడం, వాటిని

రూపొందించే బిళ్లల ఆకారాలు నిర్ణయించడం కూడా) ఇందులో ప్రత్యేకత. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రముఖ భాషా శాస్త్రవేత్త డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు మాటల్లో 'భాషా సంపద, వర్ణక్రమం, వ్యాకరణాంశాలకు మంచి పునాది ఏర్పడ్డానికి ఈ 'జోడించు' పదక్రీడలు ఉపయోగకరం. సృజనాత్మకత, తార్కికత, పిల్లలకు ముఖ్యంగా కావలసిన అంకగణితం, నిర్ణయాత్మకత కూడి ఉండడం వల్ల మేధాశక్తి విస్తృతమవుతుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పెద్దలు, పిన్నలు అందరికి లాభం'.

నమ్మండి-నమ్మకపోండి, మన పాఠశాలల్లో భాషా బోధన, అందులో తెలుగు భాషా బోధన (అభిరుచి ఉన్నవాళ్లకు అందుకు కారణాలు అన్వేషించడం ఒకానొక ప్రత్యేక పరిశోధనాంశం) బొత్తిగా దయనీయం. మాతృభాషలో ఆలోచించడం, విజ్ఞానం నేర్వడం అనేవి మేధ వికసనకు తప్పనిసరి. పరాయి మాధ్యమంలో చదువు పోతపాల పెంపకం లాంటిది. తమ మాతృభాషలో చదువుకొని పైకెదిగిన విజ్ఞానవేత్తలు పెక్కురు. అవసరమైతే సులభంగా, ఈనాటి తరం- ముఖ్యంగా నగరాల్లో విద్యార్థులు- నమ్మలేనంత సులభాతిసులభంగా ఆంగ్లంలో విజ్ఞానాంశాలను నేర్చుకోవడం సాధ్యమని నిరుటితరం - మాలాంటివారి ఎందరికో- అనుభవైక వేద్యం. మాతృభాషా మాధ్యమంలో చదువుకొనడంలో విజ్ఞానశాస్త్ర పునాదులు పట్టుబడ్డంత సుగమంగా పరభాషా మాధ్యమంలో సాధ్యం కాదు. రష్యన్, జపనీస్; పోలిష్ మాతృభాషల వైజ్ఞానికులతో పరిచయం, చర్చాగోష్ఠుల స్వానుభవ పూర్వక వాక్యాలే ఇవి. పొల్లు మాటలు మాత్రం కానేకావు. ఇప్పటికీ 'అలోపతీ' వైద్యవిధానపు సాంకేతిక పదజాలం 'లాటిన్' ఆధారంగా నడుస్తున్నా, ఆంగ్లేయులలో, తెలుగువారిలో అదో గడ్డు సమస్య అన్నవారున్నారా?

భాష నేర్చుకోవడం తరగతి గోడలను, ఇంటికప్పును దాటి బయటకు వస్తే జనపదంలో, ఆటల్లో, పాటల్లో సుసంపన్నత వ్యక్తం అవుతుంది. క్రీడలంటే- అవి ఆరుబయట ఆడుకునేవైనాసరే, హితైషులతో కూడి నీడపట్టున నేర్చుకునేవైనాసరే- కాస్త చిన్నచూపు చూస్తూ బతుకుతెరువుకు (పాండిత్య ప్రకర్షకో!) 'తుక్కు-తునుకల' వైజ్ఞానికాంశాల్ని ముక్కునబెట్టి చీదేసే తెలుగు విద్యార్థులు బొత్తిగా అస్తవ్యస్త విద్యావిధానాలకు బలైపోతున్నారు. విభిన్న అభ్యసన పద్ధతుల్లో కేవలం వాఙ్మాధ్యమం మాత్రమే మన పట్టున పిల్లలకు దిక్కు. అడపాదడపా దృశ్య, శ్రవణ మాధ్యమాలలో అభ్యాసం ముఖ్యం అని గుర్తించినా, వినియోగం మాత్రం తక్కువే. తాతయ్య- అమ్మమ్మలతో కలిసుండే కుటుంబాల్లో ఆంతరంగిక (Social/ interpersonal) విద్యావకాశం ఉంటుంది. కాని నగర జీవనంలో ఈనాడు బొత్తిగా కరవే. కాగా, క్రియ/స్పర్శ (kinaesthetic/ tactile), తార్కిక, సామూహిక రీతులు ఉపయోగించుకోవడానికి విద్యార్థులకు వీలు చిక్కనంత సమయాభావం. వృత్తి విద్యలకే అర్రులుసాచే వారికైతే మరింత ఇబ్బంది. ఆటల ద్వారా పిల్లలకు తెలియచెప్పడం, ఏదైనా సరే చేతల ద్వారా తెలియజేయడం (చేతులకు, వేళ్లకు ఉండే జ్ఞాపకశక్తి మరచిపోకూడదు సుమా!) ఎంతో హాయి. ఇదిగో, ఇల్లిక్కడే 'జోడించు' మాటల ఆటలకు పదిలమైన స్థానం!

పదబంధ ప్రహేళిక రీతిని పదాలను అడ్డంగాను నిలువుగాను పేర్చడం కూర్చిన వానికి పొడిగింపులు, ఏర్చిన అక్షరానికి కొన్ని పాయింట్లయితే ద్విత్వ సంయుక్తాలకు మరిన్ని; అలాగే కూర్చిన పదం పొడుగునుబట్టి పాయింట్లు, మధ్యలో బోనస్సులు ఇలా చక్కగా సాగుతాయి 'జోడించు ఆటలు. ఇద్దరుకాని, ముగ్గురు నలుగురైనా సరే పోటీపడి ఆడవచ్చు. అరగంట, లేదా గంటసేపు ఆడుకున్నాక స్కోరు ఎక్కువ వచ్చినవారు గెలిచినట్లు. పోనీ, ముందు నిర్ణయించుకొని అయిదు గాని పది రౌండ్లుగాని పూర్తయిన తరువాత గెలుపోటములు అనుకోవచ్చు. స్కోరు, ఉదాహరణకు నూరు పాయింట్లు ఎవరికి ముందు వస్తే వారిని విజేతలుగా ప్రకటించుకోవచ్చు.

తెలుగుభాషలో సంపూర్ణ వర్ణమాలతో- ద్విత్వాలు, సంయుక్తాలు సహా- ఎడమ నుంచి కుడికి, పైనుంచి కిందికి పదాల కూర్పు ఈ ఆటల పన్నికలో సుగమం. రోమన్ లిపి రేఖీయాకృతిలో (uni-dimensional) సాగిపోతుంది. తెలుగు లిపి ద్విపరిమాణాకృతి (2-dimensional) కలిగింది. (ఉదాహరణకు 'స్త్రీ' అనే సంయుక్తాక్షరంలో రమణీమణుల

ఒంపుసొంపులు స్ఫురించవూ? lady అనే పదంలోనూ ఆ మాత్రం అగుపిస్తాయి అనుకునేవారి ఊహాశక్తికి నా జోహారు. కాబట్టి, సాంకేతిక పుష్టితోబాటు కంటికి ఇంపు కూడా ఉండి తీరాలి.

ప్రస్తుతం హైదరాబాద్, మెదక్, వరంగల్, కడప, ఖమ్మం జిల్లాల్లో, అమెరికాలో అనేక పాఠశాలల్లో, వందలాది కుటుంబాలలో ఈ ఆటలు పాకాన పడుతున్నాయి. పిన్నలకు, సమయాభావం అయితే పెద్దలకు 'త్వరగా జోడించు' సులభకర రూపాంతరం. మాటవరసకు, తీసుకున్న ఆరు అక్షరాలతో నిర్ణీత సమయంలో ఒక పదాన్నైనా కూర్చాలి. సమయ నిర్ణయానికి ఆట సామగ్రిలో భాగంగా ముచ్చటైన కాలమానిక (hourglass) కూడా ఉంది. అక్షరాల విలువలను బట్టి, పదాల పొడుగునుబట్టి, స్కోరులు, విజేతలు మామూలే.

ఈ 'జోడించు' ఆట ఒక విధంగా గళ్ళ నుడికట్టు పద్ధతిలో సాగుతుంది. తెలుగు అక్షరాలు, తలకట్టులు, గుణింతాలు, వత్తులతో తయారైన బిళ్లలు ఉంటాయి. వాటిని గళ్లల్లో.. అన్ని దిశల్లో క్రమబద్ధంగా పేర్చుకుంటూ పదాలను తయారు చేసే ఆటే.. జోడించు. దీన్ని ఆడటానికి కొన్ని నియమ నిబంధనలుంటాయి. ఆటల రూపకర్తల వెబ్‌సైట్ www.jodinchu.in నుంచి వాటిని పొందవచ్చు.

ఈ'జోడించు' ఆటకి, యు.కె పేటెంట్ లభించటంతో పాటు సిలికానాంధ్ర, హైసియా వంటి సంస్థల నుంచీ ప్రశంసలు లభించాయి.

అచ్చరాల పూలనందంగ జోడించు!
ముచ్చటైన మాట మూటగట్టు!!
తెలుగు తల్లి దీవెనలు కోరనర్హించు!!!
కలుగునమృత ఫలము ఘనచరిత్ర

అని ఆటవెలదిలో ఈ ఆటల గురించి డా॥ చల్లా అనిల్‌కుమార్ (జన్యుశాస్త్రవేత్త, మిల్వాకీ, యూఎస్ఏ) చక్కగా ముచ్చటించారు.

తుదిపలుకు: శంకరంబాడి సుందరాచారి తెలుగుజాతికి ఇచ్చిన కానుకను గుర్తు చేసుకుని,

"మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్న తల్లికి మంగళారతులు..
....
....
నీ ఆటలే ఆడుతాం/ నీ పాటలే పాడుతాం/
జై తెలుగుతల్లీ! / జై తెలుగుతల్లీ!!"

అంటూ మనందరం ఆడి, పాడి తరిద్దాం.

డా॥ కాకర్ల శ్రీరామమూర్తి
విశ్రాంత ఆచార్యులు,
ఉస్మానియా విశ్వవిద్యాలయం,
హైదరాబాద్. 94911 24587

కప్పు కాఫీ ఖర్చుతో పసందైన విశ్వకథావిందు

జనవరి **విపుల** తాయిలాల్లో మచ్చుకు రెండు..

తలుపు తట్టి వచ్చిన ఓ అపరిచిత మహిళ ఆ ఇద్దరికీ భోజనం తెచ్చింది. తినడానికి వారు నిరాకరించేసరికి బ్లౌజ్‌లోంచి పిస్తోలు తీసింది.. ఇంతకీ ఎవరామె? మఖ్కన్‌లాల్ పండిట్ కాశ్మీరీ కథ **నైవేద్యం** చదివి తెలుసుకోండి.

కీకారణ్యంలో జంతువుల సమావేశం జరుగుతోంది. 'మనుషుల దురాశకి అంతేలేకుండా పోతోంది.. వాళ్లకసలు సిగ్గు-లజ్జ లేనే లేవు.. మనప్రాంతాన్ని కూడా ఆక్రమించుకోవాలని చూస్తున్నారు' మృగరాజు ఆందోళనగా అనేసరికి జంతువులన్నీ భయంతో బిక్కచచ్చిపోయాయి. తర్వాత అన్నీ కలిసి సమస్యకు విరుగుడుగా ఓ పథకం వేశాయి. ఏమిటది? సుప్రసిద్ధ కథారచయిత గుల్జార్ ఉర్దూ కథ **జీవారణ్యం** చదవండి.

ఇలాంటి పదిహేడు కథలతోపాటు కథకుల ఫైల్‌లో
కె.సభా ఎండమావుల్లో తిమింగలాల వేట ప్రత్యేకం!
ఇంకా జ్ఞానధార, ముషాయిరా, నేనెవరిని?, కార్టూకథలు..
వంటి శీర్షికలు మరెన్నో!



విపుల

సాలు చందా రూ.120/- మాత్రమే

చందా ఆన్‌లైన్ బుకింగ్‌కు డబ్బు పంపినవారు
నేరుగా చందా చెల్లించాలనుకున్నవారు దిగువ చిరునామాలో సంప్రదించండి.
మేనేజర్, వసుంధర పబ్లికేషన్స్, ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ హైదరాబాద్-82 ఫోన్ : 040 23318181 Ext: 6441
email: vipula.chatura@eenadu.net, vipula.chatura@gmail.com

పాతికేళ్లుగా చెక్కుపై తెలుగులోనే సంతకం

తనికెళ్ల భరణి

> అవధాన ప్రక్రియల్లాంటివి చూస్తే ఆశ్చర్యపడతాం. ఎంత మేధావితనం కావాలి! కంప్యూటర్‌లతోనే అది అసాధ్యం!

ఆంధ్రత్వమాంధ్ర భాషా చ
నాల్పస్య తపసః ఫలమ్

-అప్పయ్య దీక్షితుల మాట ఎన్నిసార్లు స్మరించుకున్నా ఒళ్లు పులకిస్తుంది. ఆయన స్వతహాగా తమిళుడైనా తెలుగు భాష గురించి, దాని ఔన్నత్యం గురించి చెప్పారని తెలిస్తే మనస్సు ఉప్పొంగుతుంది. నామటుకు నాకు తెలుగువాడిగా పుట్టడం ఓ దివ్యానుభూతి. ప్రపంచంలో ఇంకెవ్వరికీ లేని ఐశ్వర్యం పద్యం. మనకెన్ని పద్య కావ్యాలున్నాయి! విజయవిలాసం అనగానే ప్రతిపద్య చమత్కృతి, భాగవతాన్ని తలచుకోగానే పద్య లాలిత్యం మదిని ఆహ్లాదపరుస్తాయి. త్యాగరాజస్వామి కీర్తన ఒక్కొక్కటి ఒక్కో కలకండ. అన్నమాచార్య సంకీర్తనలు ఆణిముత్యాలు! ఇలా.. భాషతోటి భావంతోటి పరిపుష్టమైన జాతి మనది. తెలుగు సాహిత్యాన్ని మధించడానికి, ఆస్వాదించడానికి ఒక్క జీవితం చాలదు. వెయ్యి జీవితాలు కావాలి. ఆ వెయ్యిసార్లు తెలుగువాడిగానే పుట్టాలన్నది నా ఆకాంక్ష. ఎటుచూసినా అటు యువకవులు, ఇటు నవకవులు, యుగకవి శ్రీశ్రీని తలచుకున్నా, కృష్ణశాస్త్రిని చదివినా, చలాన్ని నెమరేసినా.. భాషతోటి, భావంతోటి తెలుగు భాషని హిమాలయమంత ఎత్తుకు పెంచారు. అయితే ఆ జీవధార పట్టుకోగలగాలి. చిన్నప్పటి నుంచే నేర్పాలి. జీవితాన్ని కాచి వడబోసి మనకు అందించిన సుమతి శతకాలు, వేమన శతకాలు నేర్పాలి. ఇంత భాషా సంపద, కావ్య సంపద ఉన్న మనం తెలుగు మాట్లాడటం మానేసి.. నామోషీ పడటం మన దౌర్భాగ్యం. 'నన్ను ప్రేమించండ్రా' అని అమ్మ అడుక్కుంటున్నట్టు.. తెలుగు భాష మాట్లాడండి అని మనల్ని అడగాల్సి వస్తోంది. ప్రతి పక్షులకి, పశువులకి ప్రత్యేక ధ్వని ఉంటుంది. దాని ద్వారానే గుర్తింపు పొందుతాయి. కోడికో కూత ఉంటుంది. నెమలికో అరుపూ ఉంటుంది. కోడి నెమలి లాగా... నెమలి కోడిలాగా అరవ్వ. అలాగే మన తల్లి భాషతో మనకు వచ్చే గుర్తింపు. మన తల్లి ఎంతగొప్పదో తల్లిభాష అంత గొప్పది. ఆంగ్లభాషను నేర్చుకోవడం నేరం కాదు. బతకడానికి.. ఒక భాష అవసరమైనప్పుడు మనస్సు మూలాలు ఆనందించడానికి మన భాష అవసరం. ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్..నేర్పండి! దాంతోబాటు ఓ వేమన పద్యం కూడా నేర్పండి. ముందు ఇంట్లో తెలుగు మాట్లాడదాం. అమ్మ, నాన్న తెలుగే మాట్లాడితే పిల్లలూ మాట్లాడతారు. అప్పుడే భావి తరాలకి ఆ పరిమళాలు అందుతాయి. ఒక్కసారి తెలుగుని వదులుకుంటే ఇక మన జీవితం నుంచి వెళ్లిపోతుంది.. తిరిగిరాదు. అమెరికా సిలికాన్ వ్యాలీలో 10 ఏళ్ల అమ్మాయిలు కూడా చక్కగా తెలుగులో పద్యాలు రాస్తున్నారు! త్యాగరాజ కృతులు పాడుతున్నారు. ఇక్కడ? పెరటి చెట్టు వైద్యానికి పనికి రాదన్నట్టుంది! మనకోసం బ్రౌన్‌లాంటి విదేశీయులు ఎంతో కృషి చేశారు. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అన్నారు. సుబ్రహ్మణ్యభారతి లాంటి తమిళకవులు 'సుందర తెలుగని' అన్నారు. తెలుగు మన శ్వాస కావాలి. ఇష్టం పెంచుకుని.. విధి అన్నట్టు కాకుండా.. తెలుగుతో స్వచ్ఛంగా మమేకం కావాలి.

ఎవరు చేయాలిది? ప్రభుత్వం చేయాలా? మీడియా చేయాలా? కవులు చేయాలా? కళాకారులు చేయాలా? అంటే... అమ్మని పోషించాల్సిన బాధ్యత కొడుకుది! వాడు ఏ రూపంలో చేసినా సరి. అందరి సమష్టి కృషితో తప్ప ఇది సాధ్యం కాదు. భవిష్యత్తులో ఇంగ్లిషులో ఆలోచించి తెలుగులో మాట్లాడే దుస్థితికి వెళ్లిపోతాం. అవధాన ప్రక్రియల్లాంటివి చూస్తే ఆశ్చర్యపడతాం. ఎంత మేధావితనం కావాలి! కంప్యూటర్‌లతోనే అది అసాధ్యం! తెలుగుభాషకి పట్టాభిషేకం చేసి.. ఏనుగులెక్కించిన జాతి మనది! కవులకు గండపెండేరాలు తొడిగి.. అగ్రహారాలు రాసిచ్చిన సాంస్కృతిక వైభవం మనది! 'దీనార టంకాల తీర్థమాడించితి..' అన్నాడు శ్రీనాథుడు. తమిళనాడు నుంచి కేంద్ర మంత్రి కూడా ఢిల్లీలో లుంగీ కట్టుకునే వెళతాడు! అది వాళ్ల జాతి ముద్ర! కొత్తిమీర అవసరం. కరివేపాకు అవసరం. పులుసులో వేసుకోవడానికి. మల్లెపూలు కూడా అవసరం. మధుర ఊహలకి. కొత్తిమీర, కరివేపాకు గంటలో చచ్చిపోతుంది. అనుభూతి కూడా పోతుంది. మల్లెపూల వాసన తరతరాలుగా నిలిచిపోతుంది. తెలుగు వెలుగు.. తెలుగున్నంత కాలం వెలగాలి. వెలుగున్నంత కాలం తెలుగులోనే మాట్లాడదాం. తెలుగుజాతి ప్రతినబూని భాషకి పూర్వ వైభవం తీసుకురావాలి. నేను నామటుకు గత పాతికేళ్లుగా తెలుగులోనే సంతకం చేస్తున్నా.. చెక్కులపైన కూడా! మీరూ తెలుగులోనే సంతకం చేయండి. జై.. తెలుగు!

తాంబూలమేసి.. కవిత రాసి...

కర్పూర తాంబూలం తెచ్చే దూతిక, ఆత్మకింపైన భోజనం, ఊయల మంచం.... అల్లసాని పెద్దన కలం కదలాలంటే ఈ సౌకర్యాలన్నీ ఉండాల్సిందేనట! ఈ మాటను ఆయనే ఓ పద్యంలో చెప్పారిలా...

నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చు క
ప్పురవిడెమాత్మ కింపయిన భోజన మూయలమంచ మొప్పు త
ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరకినగాక యూరక కృతుల్ రచియింపు మటన్న శక్యమే?

తెలుగు సిరి వెన్నెల

తెలుగు సాహితీ ప్రపంచంలో, సినిమా స్థానం నానాటికీ తీసికట్టు అవుతున్న సమయంలో, ఓ సినిమాలోని భాషా సౌందర్యాన్ని ప్రస్తావించుకునే అవకాశం లభించడం అరుదైన సంగతే. చిక్కుడుకాయలన్నీ ఒకేలా కనిపించినంత మాత్రాన అన్నింటిలో, చక్కగా గింజలు అమరి ఉండవు. తెలుగు సినిమాలూ అంతే. మంచి సాహిత్యం వెల్లువెత్తే మాటలు, పాటలు ఉండటం అప్పుడప్పుడు జరిగే సంగతి. ఈ సంధికాలంలో 'జరుగుతున్నది జగన్నాటకం' అంటూ ఓ మంచి పాట ఒకటి పుట్టింది... సిరివెన్నెల ఆలోచనల నుంచి... క్రిష్ 'కృష్ణం వందే జగద్గురుమ్' కోసం! కాదు... కాదు... ఆ పాట నుంచే ఆ సినిమా ఊపిరిపోసుకుంది.

'ఆకలేస్తే... మట్టిని అడుగు, బువ్వ పెడుతుంది. మరి మట్టే లేకపోతే...' ఎంత లోతైన, భయపెట్టే ఆలోచన. ఇదే కృష్ణం వందే జగద్గురుమ్ సినిమాకు ఆలంబన. మట్టిని నమ్ముకోమని చెప్పారు పెద్దలు... అమ్ముకోమని చెప్పలేదు కదా. కానీ, ఇప్పుడు అదే జరుగుతోంది. పొలాలన్నింటినీ హలాల దున్నడం మానేసి ఇంటి స్థలాలుగా మార్చేస్తున్నారు. కొండలు, గుట్టల్ని సైతం యంత్రాలతో పిండి చేసి, దాన్ని మరింత పిండి, అందులోని ఖనిజాలను దోచేయడం పరిపాటి అయింది. మన కళ్ల ముందే జరుగుతున్న ఈ అక్రమాలే 'కృష్ణం..' సినిమాకు మూలం.

బళ్లారి కేంద్రంగా రెడ్డప్ప అనే పెద్దమనిషి... కనపడ్డ కొండలను, ఆఖరికి జనం కాళ్ల కింద ఉన్న మట్టిని కూడా వారికి తెలియకుండానే తవ్వేసి, అమ్మేస్తుంటాడు. తెలుగు సాంస్కృతిక వైభవానికి చిహ్నాలుగా మిగిలిన వాటిలో ఒకటైన సురభి నాటక సమాజంలోని కళాకారులు... నాటకాలకు తగ్గిపోతున్న ఆదరణను చూసి తలోదారి చూసుకుందామని అనుకుంటున్న తరుణం. ఈ పరిస్థితిని చూసి 'సురభి' పెద్ద కనుమూస్తే, ఆయన ఆఖరి కోరిక తీర్చడానికి బళ్లారి వస్తారు కళాకారులు. వారిలో ముఖ్యుడు బీటెక్ బాబు. అదే సమయంలో రెడ్డప్ప అక్రమాలను జనం ముందుకు తేవాలని ప్రాణాలు పణంగా పెట్టి పరిశోధన చేస్తుంటుంది విలేఖరి దేవకి.

'నాన్న పక్కలో అమ్మ పది నిమిషాలు సుఖపడితే తాను భూమి మీదకు వచ్చాననుకునేవాడు పశువు' అనే బలమైన మాటలతో, ఎవరెలా పోతే నాకెందుకనుకునే సగటు మనిషి మనస్తత్వం ఉన్న బీటెక్ బాబును మార్చేసి, కర్తవ్యం దిశగా నడిపిస్తుందామె.

దర్శకుడి మదిలో మెదిలే కథకు, సన్నివేశాలను కల్పిస్తే చాలదు. దానికి బలమైన మాటలు కావాలి. అవి ఈ చిత్రంలో నూటికి నూరుపాళ్లు అమిరాయి. బుర్రా సాయిమాధవ్ సంధించిన మాటలు తూటాల్లా పేలాయి. ఎందుకంటే అవి కాగితాల నుంచి కాదు... సమాజం నుంచి పుట్టుకొచ్చాయి. 'అది కల నిద్రలో కనేది... ఇది కళ నిద్రలేపేది' అంటూ సురభి సమాజ పెద్ద కళ ప్రయోజనాన్ని వివరించే సన్నివేశం, ప్రేక్షకుల మనస్సులపై

అమ్మ తప్పిపోయింది

ఆమెవరో కానీ....
గత కొద్ది రోజులుగా
మురికివాడలో... పూరిగుడిసెలో...
దిక్కుతోచక బిక్కుబిక్కుమంటూ బతుకుతుంది
చిమ్మ చీకట్లు చుట్టుముడుతున్నా
ఆమె కళ్ళల్లో ఆత్మాభిమానం
వెన్నెల దివ్వై వెలుగుతుంది
అదే పనిగా ఆరాతీస్తే
'ద్రావిడ' కుటుంబానికి చెందిన
నలుగురు అక్క చెల్లెళ్లలో తానొక్కతని
ఒకప్పుడు బాగా బతికినదని అర్థమవుతుంది
పిల్లలు పట్టించుకోవట్లేదా? అని
ఎవరైనా జాలి చూపులు చూస్తే
వాళ్ళేమి చేస్తారు
పరిస్థితులు చేజారిన చిల్లర కాసులై పోతుంటే
నాలుగు పైసలిచ్చే వారి మాట వింటారన్నట్లు
చిరిగిన చీరకొంగుతో
చెమర్చిన కళ్ళను ఒత్తుకుంటుంది
తన అరచేతి నుడికారాన్ని తిన్నప్పుడు
నిద్దట్లో సైతం తననే పలవరించేవారని
మార్కెట్ మాటల రుచి మరిగినాక
తనను మరచిపోవడం మొదలు పెట్టారన్నట్లు

బలమైన ముద్రను వేస్తుంది.

'దేవుడు అంటే రాత కాదు
సాయం

రాధతో రాసలీలలు చాలు
కన్నయ్యా... దేశం ద్రౌపది
అయింది'

ఇలా ఎన్ని మాటలని! ఇతర భాషా వాసనలు సోకనివి. గుండెల్లోకి సూటిగా నాటుకుపోయేవి. ఇలా మాటల మూటలు విప్పిన సినిమాలో కీలకమైన అంశం... 'దేవుడు అంటే సాయం'. సాయం చేసిన వాడు దేవుడు అని చాలాసార్లు విన్నాం. దాన్ని తిరగేసి అర్థవంతంగా చెప్పడం ఇదే ప్రథమం. దాన్ని నిజమని నిరూపించే బాధ్యతలను సిరివెన్నెల సీతారామశాస్త్రి కలం తీసుకుంది.

జరుగుతున్నది జగన్నాటకం అంటూ దశావతారాల పరమార్థాన్ని, అంతరార్థాన్ని ఆయన చిన్న రూపకంలోకి మార్చేశారు. దశావతారాల్లో ఒక్కో అవతార పరమార్థంపై వందలాది పుస్తకాలు రాసుకోవచ్చు. ఎవరి అనుభవం, దర్శనం వారివి. అలాంటిది వాటన్నిటి సారాన్ని పుక్కిట పట్టినట్లు కొద్దిపాటి వాక్యాల్లోకి మార్చడం ఆషామాషీ కాదు.

'బహుశా ఈ పాట రాయడానికేనేమో 28 ఏళ్లుగా సినిమా రంగంలో ఉన్నాను'... అని రచయిత అన్నారంటే, ఆ పాట ఆయన్ని ఎంతగా స్పందింపజేసి ఉండాలి?

నరుడి లోపలి పరునిపై దృష్టి సలుపగా
తలవంచి కైమోడ్పి, శిష్యుడివి నీవైతే
నీ ఆర్తి కడతేర్చు, ఆచార్యుడివి నీవే...

ఇవీ 'జరుగుతున్నది...'లో నాలుగు పంక్తులు. ఆత్మసాక్షాత్కారం అంటే ఇదేనేమో. నీ స్వధర్మమే మేలు అని భగవంతుడు చెప్పడం అంటే నీకు నీవే గురువనేగా. ఈ పంక్తుల్లో ఇమిడిన సారమూ అదే.

పురాణ కథను పాటగా మార్చే ప్రక్రియ పాతదే. చాలామంది పెద్దలు చేసిందే. వేటూరి 'కిరాతార్జునీయం' జనానికి కంఠస్థమే. అయితే, కథను పాటగా చెప్పడమే కాదు సిరివెన్నెల చేసింది. పండితులు వేదాంత ప్రసంగాల్లో విడమర్చే భాగవత అంతరార్థాలను... వర్తమాన సమాజానికి, భావజాలానికి అనుసంధానించి, పాటలోకి అనువదించారు.

'చేయదలచిన మహత్కార్యము... మోయజాలని భారమైతే, పొందగోరినది అందలేదని నిరాశలో అణగారిపోతే, బుసలు కొట్టే అసహనపు నిట్టూర్పు సెగలకు నీరసించక, ఓటమిని ఓడించగలగిన ఓరిమే కూర్మమన్నది'

ఎన్ని బాధల బరువునైనా మోయగలిగిన ఓరిమి.. కూర్మమని రచయిత చమత్కరించారు. 'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమీ... ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమీ' అని గతంలో తానే ఒక పాట రాసిన సిరివెన్నెల... ఆ పాట భావాన్నంతా పై రెండు వాక్యాల్లోనే ప్రభావవంతంగా చెప్పారు.'ఉనికి నిలిపే ఇలను, కడలిలో కలుపగనురికే ఉన్మాదమ్మును, కరాళ దంష్ట్రల కుళ్లగించి, ఈ ధరాతలమ్మును ఉద్ధరించగల ధీరోద్ధతి రణ హుంకారం.. అది వరాహపు ఆకారం...'. నిజమే జనం హుంకరిస్తే, ఆ అరుపు చాలదూ... దుర్మార్గుల గుండెల్లో దడ పుట్టడానికి.

'..నీలో నరుని, హరిని కలుపు, నీవే నరహరి అని తెలుపు..' అని కవి రాశారంటే, మానవుడే మహనీయుడని, మాధవుడని చెప్పటమే కదా. ఇలా ఒక్కో అవతారాన్ని వర్ణించుకుంటూ వెళ్లిన కవి కలం, రామావతారానికి వచ్చేసరికి... '.ఏ మహిమలూ లేక, ఏ మాయలూ లేకపోయినా మనిషిగానే బతికినా, మహిత చరితగా మహిని మిగలగలిగాడని' కీర్తిస్తుంది. సాదాసీదా మనిషి కూడా గొప్ప చరిత్రను సంతరించుకునే అవకాశం ఉందని పరోక్షంగా స్ఫూర్తినందిస్తుంది.

ఎన్నాళ్లయింది! ఇంతటి చక్కటి పదాలతో కూడిన పాట మన సినిమాల్లో వినిపించి.

ఈ చిత్ర గీతాల్లో దశావతార రూపకం ఒక్కటే అర్థవంతంగా ఉంటుంది. మిగతా స్వరాలూ, సాహిత్యం.. వాణిజ్యాంశాల తాళింపులతో దట్టించినవే. ఓ మంచి కథ చెప్పవలసి వచ్చినప్పుడు కూడా దర్శకుడు వాణిజ్య సూత్రాల గురించి పట్టించుకోవడం నేటి సినిమా వ్యాపార సరళికి అద్దం పడుతోంది.

పౌరాణిక నాటకానికి ఆదరణ తగ్గిపోతోందన్న వాదనను పక్కనపెట్టి... అభిమన్యు, హరిశ్చంద్ర వంటి నాటక ఘట్టాలను తెరపైకి తెచ్చారు దర్శకుడు. తాను చెప్పదలుచుకున్న విషయంపై అభిమానం, అనురక్తి, ఆసక్తి ఉంటే తప్ప ఇలా అడ్డుగోడలు దాటి సాహసించడం సాధ్యం కాదు. దాన్ని సుసాధ్యం చేసుకున్న వారు క్రిష్. సిరివెన్నెల చెప్పినట్లు, ఎవరో ఒకరు ఎప్పుడో అప్పుడు అడుగు ముందుకేస్తే తప్ప, ఏ పనీ జరగదు. దర్శకుడు క్రిష్ ఇప్పుడు చేసింది అదే. అందుకే సినిమాలో మిగిలిన వాణిజ్య వ్యవహారాలను, వ్యాపార సూత్రాల సంగతులను పక్కన పెట్టేసి, ఈ ప్రయత్నాన్ని అభినందించాలి.

అన్వర్
ఉప సంపాదకుడు, సితార
సినీ పత్రిక, హైదరాబాద్
80087 09985

మూగగా రోదిస్తూ... దీర్ఘంగా నిట్టూరుస్తుంది
ఎప్పుడైనా... ఎవరైనా
అచ్చ తెలుగులో 'అమ్మా' అని పిలిచినప్పుడు
ఇక్కడి కన్న పేగు కలుక్కుమంటుంటే
అక్కడెక్కడో ఈవిడగారి పుత్రరత్నాలు
పదిమంది ముందు తనతల్లి తప్పిపోయిందని
ఇంగ్లీషులో ఏడుస్తున్నారు!?

- మొయిద శ్రీనివాసరావు,
విజయనగరం,
99082 56267

ముగ్గులతో పండుగ 'వాతావరణం'

సంక్రాంతినాడు ముగ్గులని వేయడం వల్ల పండుగ శోభ ఇనుమడించి నట్లవుతుంది. ముగ్గులను వేయడం కూడా ఒక కళ. ఆ కళాప్రదర్శనకి ఇంటి ప్రాంగణమే వేదిక. రంగుల ద్వారా మనోల్లాసం పొందడాన్ని కలర్ థెరపీ అంటున్నాము. అంటే రంగురంగుల ముగ్గులతో మనసుకి కూడా నిండుదనం వస్తుందన్నమాట. అంతేకాదు, బియ్యప్పిండి ముగ్గుతో ఉడతలు, పిచ్చుకలు వంటి చిన్న జీవులకి ఆహారంగా ఉపయోగపడుతుంది. రాతిపిండితో ముగ్గు వేసినా ప్రయోజనమే! ఎందుకంటే సున్నపురాయికి కార్బన్ డయాక్సైడ్ వంటి మలినాలని పీల్చుకునే గుణం ఉంది. అందుచేత గాలి కూడా శుభ్రపడుతుంది.

విజయోస్తు

తెలుగుయోగంతో ఉద్యోగం

అమ్మభాషే ఆలంబనగా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే ఏం చేయాలి... ఏయే పాఠ్యాంశాలను ఎంత మేరకు చదవాలి... పాఠ్యాంశాల్లో పట్టు సాధించాలంటే ఏయే గ్రంథాలను అధ్యయనం చేయాలి... చదివిన అంశాలు గుర్తుండాలంటే సాధన ఏ దిశగా సాగాలి... ఉద్యోగార్థుల మదిలో మెదిలే ఈ ప్రశ్నలన్నింటికీ స్థూలంగా సమాధానం ఇచ్చే ప్రయత్నమే ఈ వ్యాసం.

పరిశీలన... అధ్యయనం... సాధన... పోటీపరీక్షలకు సన్నద్ధమవడంలో ఈ మూడు అంశాలపై ఎవరెక్కువ కృషి చేస్తే వారినే విజయలక్ష్మి వరిస్తుంది. ఆ కృషి ప్రణాళికాబద్ధంగా సాగాలి. అప్పుడే ఫలితం దక్కుతుంది. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో జూనియర్ అధ్యాపకులు, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల నియామకాలను చేపట్టబోతోంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 'సెట్' నోటిఫికేషన్ విడుదల కాబోతోంది. వీటితో పాటు నెట్/ జేఆర్ఎఫ్ నోటిఫికేషన్లను సంవత్సరానికి రెండుసార్లు ఇస్తోంది యూజీసీ. ఈ నాలుగు పరీక్షలకూ 'తెలుగు' కీలకమే. వీటన్నింటి సిలబస్ కూడా దాదాపుగా సమానమే. గత పరీక్షల ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే ప్రశ్నల కాఠిన్యతా స్థాయి ఎక్కువగా కనిపిస్తుంది. ప్రశ్నలన్నీ... అభ్యర్థిని ఎక్కువసేపు ఆలోచింపజేసే విధంగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో... పాఠ్యాంశంపై సమగ్రమైన అవగాహన ఉంటే తప్ప నెగ్గుకురాలేం.

తెలుగు భాషా చరిత్ర

భాషకు సంబంధించిన నిర్వచనాలు, భాషోత్పత్తి వాదాలు, భాషాలక్షణాలు, ప్రయోజనాలు, భాషోత్పత్తి ధ్వనులు, ధ్వని విజ్ఞానం, వర్ణ విజ్ఞానం, ధ్వని-వర్ణం-సవర్ణం భేదాలు, పదవిజ్ఞానం, పదం-పదాంశం-సపదాంశ భేదాలు, వాక్యనిర్మాణం, అర్థ విపరిణామం, ధ్వని విపరిణామ భేదాలు, ఆదాన ప్రదానాలు; అంతర్జాతీయ ధ్వనిమాల విశేషాలు, ప్రపంచ భాషా కుటుంబాలు; శాసనభాషా పరిణామం, కావ్యభాషా పరిణామం, తులనాత్మక పద్ధతి, మూలభాషా పునర్నిర్మాణం, అవకాశాలు - అవరోధాలు - అంతరంగ పునర్నిర్మాణం, మాండలిక భేదాలు, మాండలిక పటాలు, మాండలికాలు ఏర్పడటానికి హేతువులు, అన్యదేశ్యాలు, ఆంధ్రము - తెనుగు - తెలుగు పదాల జాతి, దేశ, భాషా వాచక ప్రయోగ విశేషాలు, ఆధునిక భాషలో స్వర వ్యంజన సంధి విశేషాలు, ఆధునిక భాషా పదనిర్మాణ భేదాలు, భాషా భాగ విశేషాలను కూలంకషంగా చదవాలి.

ఉపకరించే గ్రంథాలు

తెలుగు భాషా చరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి
ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు - ఆచార్య పి.ఎస్.సుబ్రహ్మణ్యం.
ద్రావిడ భాషలు - ఆచార్య పి.ఎస్.సుబ్రహ్మణ్యం
తెలుగు వాక్యం - చేకూరి రామారావు
ఆంధ్ర భాషావికాసం - గంటిజోగి సోమయాజి
తెలుగు భాషా చరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న

ఈ విభాగంలో వచ్చే ప్రశ్నలకు ఒక ఉదాహరణ

ప్రశ్న: నాదవర్ణాలను గుర్తించండి.

1 క, ప	2. జ, ద
3. గ, బ	4. త, ట
(అ) 1, 2	(ఆ) 2, 3
(ఇ) 1, 4	(ఈ) 2, 4

జవాబు: (ఆ)

వివరణ ప్రశ్నల్లో కాఠిన్యత ఇలా ఉంటుంది.. ఒక ప్రశ్న, నాలుగు ప్రశ్నలకు సమానంగా ఆలోచింపచేస్తుంది. పరీక్ష రాసేటప్పుడు సమయ హరణం జరగకుండా ఉండాలంటే తీవ్రంగా సాధన చేయాల్సిందే.

ఆధునిక సాహిత్య చరిత్ర

ఆధునిక కవిత్వం నుంచి అత్యాధునికత లేదా ఆధునికోత్తరవాదం వరకు, మినీకవిత్వం నుంచి నానీలు, హైకూలు, రెక్కలు వరకు, నవలా పరిణామ వికాసం, కథానికా వికాసం, నాటకం ఆవిర్భావ వికాసాలు, తెలుగు నాటక రచనపై ఆంగ్ల సాహిత్య - నాటక ప్రభావం, నాటక సమాజాలు, ప్రహసనం, వ్యాసం, జీవితచరిత్ర, యాత్రా చరిత్ర, లేఖ, డైరీ, మ్యూజింగ్స్, వచన కవిత, నాటిక, ఏకాంకిక ప్రక్రియా వికాసం, ప్రసిద్ధ కవితోద్యమాలతో పాటు కవుల రచనా క్రమాలపై సంపూర్ణంగా దృష్టి పెట్టాలి.

ఉపకరించే గ్రంథాలు

ఆధునికాంధ్ర కవిత్వం-
సంప్రదాయాలు - ప్రయోగాలు - ఆచార్య సి.నారాయణరెడ్డి

ఆధునికాంధ్ర కవితా సమీక్ష - కె.వి.ఆర్.నరసింహం
తెలుగు కవితోద్యమాలు - (తెలుగు అకాడమీ)
తెలుగు కవితా వికాసం - కడియాల రామమోహనరాయ్
తెలుగులో కవితా విప్లవాల స్వరూపం - ఆచార్య వెల్చేరు నారాయణరావు

ఈ విభాగంలో వచ్చే ప్రశ్నలకు ఒక ఉదాహరణ

ప్రశ్న: ఆధునిక కావ్యాల రచనా క్రమం?

అ) భూమిక తృణకంకణం తెలంగాణా కృష్ణపక్షం
ఆ) తృణకంకణం కృష్ణపక్షం తెలంగాణా భూమిక
ఇ) కృష్ణపక్షం తెలంగాణ భూమిక తృణకంకణం
ఈ) తెలంగాణా భూమిక తృణకంకణం కృష్ణపక్షం

జవాబు: (ఆ)

వివరణ ఏ రచనలు ఎవరు రాశారో తెలియాలి. వారి కాలం తెలియాలి, అప్పుడు మాత్రమే రచనా కాలక్రమం నిర్దేశించవచ్చు. ఇటువంటి ప్రశ్నలే ఇటీవలి కాలంలో తారసపడుతున్నాయి.

ప్రాచీన తెలుగు సాహిత్యం

నన్నయకు పూర్వయుగంనాటి భాషా స్వరూపం, నన్నయ యుగం నుంచి దక్షిణాంధ్ర యుగం వరకు గల కవులు, రచనల విశేషాలు, ఇతిహాసం, పురాణం, ప్రబంధం, శతకం, ద్విపద, యక్షగానం, కథాకావ్యం, చారిత్రక కావ్యం, ద్వ్యర్థి కావ్యాలు, అచ్చ తెలుగు కావ్యాలు, నిఘంటువులు, కవుల బిరుదులు, ప్రసిద్ధ పద్యాలు, చాటువులు, సంకలనాలు, అంకిత విశేషాలు, కవితా లక్షణాలు, సమకాలీన కవుల విశేషాలు, కాల విశేషాలు, సంకీర్తన వాఙ్మయం, జానపద విజ్ఞానం, కళలు, ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి, రామాయణ, భారత, భాగవతాలపై ప్రత్యేక అధ్యయనం చేయాలి.

ఉపకరించే గ్రంథాలు

తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి.నాగయ్య
ఆంధ్ర సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీకాంతం
ఆంధ్ర వాఙ్మయ చరిత్ర - దివాకర్ల వెంకటావధాని
సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర - ఆరుద్ర
తెలుగు సాహిత్య చరిత్ర - ముదిగంటి సుజాతారెడ్డి
తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానాశాస్త్రి
తెలుగు సాహిత్య చరిత్ర - తెలుగు అకాడమీ
తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న

ఈ విభాగంలో వచ్చే ప్రశ్నలకు ఒక ఉదాహరణ

ప్రశ్న: గుర్తించండి.

1. ఆదిపర్వం (క) శిశుపాల వధ
2. సభాపర్వం (ఖ) సౌపర్ణోపాఖ్యానం
3. ఉద్యోగపర్వం (గ) ఉత్తర గోగ్రహణం
4. విరాటపర్వం (ఘ) శ్రీకృష్ణుని రాయబారం

	క	ఖ	గ	ఘ
అ)	2	1	4	3
ఆ)	1	2	3	4
ఇ)	3	2	1	4
ఈ)	1	3	4	2

జవాబు: (అ)

వివరణ కేవలం భారతం, భారతంలోని పర్వాలు తెలిస్తే చాలదు. పై ప్రశ్న పరిశీలిస్తే... ఎన్ని అంశాలపై పరిజ్ఞానం ఉండాలో స్పష్టమవుతుంది. అవగాహన లేకపోతే ఎక్కువ సమయం ఒక్క ప్రశ్నకే కేటాయించాల్సిన పరిస్థితి తలెత్తుతుంది.

అలంకారశాస్త్రం - విమర్శ

కావ్య సౌందర్యాన్ని పెంపొందించేవి అలంకారాలు. గుణ, దోష, విచారణ చేస్తే విమర్శ, ఈ విభాగంలో ప్రాచ్య, పాశ్చాత్య, కావ్యనిర్వచనాలు, కావ్యాత్మ, కావ్య ప్రయోజనాలు, కావ్య భేదాలు, కావ్య శరీరం, కావ్య జీవితం, రీతి, ధ్వని, వక్రోక్తి, రససిద్ధాంతం, రసనిర్వచనం, రససూత్ర వ్యాఖ్యానం, రసనిష్ఠ, రససంఖ్య, ఏకో రసవాదాలు, రససాంకర్యం, రసాభాస, సహృదయ లక్షణం, ఔచిత్యం, భారతీయ అలంకారశాస్త్ర క్రమవికాసం, విమర్శ భేదాలు, విమర్శా గ్రంథాలు, ఆయా విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనలను అధ్యయనం చేయాలి.

ఉపకరించే గ్రంథాలు

సాహిత్య దర్శనం ఆచార్య కాకర్ల వెంకటరామనరసింహం
సాహిత్య శిల్ప సమీక్ష ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
సాహిత్య సోపానాలు దివాకర్ల వేంకటావధాని
తెలుగులో సాహిత్య విమర్శ ఆచార్య ఎస్.వి.రామారావు

ఈ విభాగంలో వచ్చే ప్రశ్నలకు ఒక ఉదాహరణ

ప్రశ్న: గుర్తించండి.

1. పి.ఎస్.ఆర్ అప్పారావు (క) తెలుగు నవలా వికాసం
2. పి.వెంకటరామిశాస్త్రి (ఖ) విమర్శనాశిల్పం
3. మొదలి నాగభూషణశర్మ (గ) తెలుగు నాటక వికాసం
4. వల్లంపాటి వెంకటసుబ్బయ్య (ఘ) తెలుగు చారిత్రక నాటకాలు

	క	ఖ	గ	ఘ
అ)	3	4	1	2
ఆ)	1	2	3	4
ఇ)	4	1	2	3
ఈ)	2	3	4	1

జవాబు: (అ)

వివరణ హేతువు, నిర్దేశాలు గురించిన ప్రశ్నలు కూడా ఈ విభాగం నుంచి తరచుగా వస్తున్నాయి.

ఈ విభాగంలో వచ్చే ప్రశ్నలకు ఒక ఉదాహరణ

ప్రశ్న:
నిర్దేశం: భారతం పంచమవేదంగా ప్రసిద్ధి చెందింది;
హేతువు: వ్యాసుడు రచించాడు కాబట్టి

(అ) ని: సరైనది హే: సరికాదు
(ఆ) ని: సరికాదు హే: సరైనది
(ఇ) ని: సరైనది హే: సరైనది
(ఈ) ని: సరికాదు హే: సరికాదు

జవాబు: (అ)

ఉపకరించే గ్రంథాలు

బాలవ్యాకరణం చిన్నయసూరి
ప్రౌఢవ్యాకరణం బహుజనపల్లి సీతారామాచార్యులు
శబ్దమంజరి సంస్కృత సాహిత్యచరిత్ర తె.వి.వి.ప్రచురణ

ఛందోదర్పణం   అనంతమాత్యుడు

సంస్కృత, తెలుగు వ్యాకరణం, ఛందస్సు

భాషకు విశిష్టమైన ఆకృతినిస్తూ, దాని స్వరూప స్వభావాలను తెలియజేసేది వ్యాకరణం. సాధు, అసాధు ప్రయోగాలను తెలియజేసేదీ అదే. బాల వ్యాకరణం, ప్రౌఢ వ్యాకరణంతో పాటు పాణినీయ కౌముదిలో భాగంగా సంధులు, సమాసాలు, శబ్దాలు, ధాతువులతోపాటు కాళిదాసు, వ్యాసుడు, భారవి, నారాయణ పండితుడు, విష్ణుశర్మ, భాసుడు లాంటి కవుల విశేషాలు అధ్యయనం చేయాలి. ఛందస్సులోని పద్యభేదాలతో పాటు యతి, ప్రాస భేదాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

పై అంశాలకు సంబంధించిన గ్రంథాలపై పట్టు సాధిస్తే ఏ పోటీ పరీక్షలో అయినా మంచి మార్కులు సంపాదించుకోవచ్చు. వీటిలో ఎక్కువ శాతం తెలుగు ప్రత్యేకాంశంగా చదివిన వారు గతంలో అధ్యయనం చేసే ఉంటారు. కాకపోతే ఇప్పుడు మరోసారి పునశ్చరణ చేసుకోవాలి. గతంలో చదవనివి ఇప్పుడు క్షుణ్ణంగా చదవాలి.

సివిల్స్‌లో ఐచ్ఛికాంశంగా తెలుగు

సివిల్స్ సర్వీసెస్ పరీక్షలకు సంబంధించి మాతృభాషపై పట్టులేకపోతే అర్హత పరీక్షను గట్టెక్కడం చాలా కష్టం సివిల్స్ ఐచ్ఛికాంశంగా తెలుగు పేపర్‌ను ఎంచుకోవచ్చు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటి దాంట్లో ప్రధానంగా భాషాశాస్త్ర సంబంధిత అంశాలుంటాయి.

1. ఆంధ్రము - తెనుగు - తెలుగు పదాల పుట్టుపుర్వోత్తరాలు.
2. ద్రావిడ భాషల్లో తెలుగు స్థానం.
3. మాండలిక విజ్ఞానం.
4. అనువాద విజ్ఞానం.
5. వాక్య విజ్ఞానం.
6. మూలద్రావిడ భాషా విజ్ఞానం.
7. భాష ఆధునికీకరణ.

రెండో పేపర్లో తెలుగు సాహిత్య చరిత్రలో భాగంగా ప్రాఙ్నన్నయ యుగం, నన్నయ్య నుంచి నేటి వరకు గల సాహితీ విశేషాలు, ప్రక్రియా విజ్ఞానంపై పరిజ్ఞానం ఉండాలి. అలంకారికంగా, విమర్శాకోణంలో సాహిత్యాం శాలను సామాజికాంశాలతో సమన్వయించి అధ్యయనం చేయాలి. ఆనాటి సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతానికి అన్వయిస్తూ ప్రశ్నలు ఇస్తున్న నేపథ్యంలో భాషపై పట్టు ఉండి విమర్శనాత్మకంగా వ్యాసరూపంలో సమాధానం ఇస్తే విజయం వరిస్తుంది.

ప్రాచీన సాహిత్యంలో నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, పింగళి సూరన, మొల్ల, కాసుల పురుషోత్తమ కవుల గురించి, ఆధునిక సాహిత్యంలో గురజాడ, విశ్వనాథ, దేవులపల్లి, శ్రీశ్రీ, జాషువా, సినారె, కనుపర్తి వరలక్ష్మమ్మ, ఆత్రేయ, రావిశాస్త్రి రచనలను విమర్శనాత్మక ధోరణిలో వివేచిస్తూ అధ్యయనం చేయాలి.

ఎస్.ఐ.పరీక్షల్లో తెలుగు

పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్షల్లో పేపర్ 2లో 100 మార్కులకు తెలుగుపై పరీక్ష ఉంటుంది. జాతీయాలు, సామెతలు, తెలుగు పదబంధాలపై పట్టు సాధించాలి. లేఖారచన, అనువాదం, పేరాగ్రాఫ్ రచన, వ్యాస రచనలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఎస్.ఐ.కి ఇటీవలే గెజిటెడ్ హోదా ఇచ్చారు కాబట్టి పోటీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో తెలుగు

కేంద్ర ప్రభుత్వానికి చెందిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా సుమారు 15 శాఖల్లోని గ్రూపు 'బి' నాన్‌గెజిటెడ్, గ్రూపు 'సి' నాన్ టెక్నికల్ ఉద్యోగాల భర్తీ జరుగుతోంది. ఇటీవల కంబైన్డ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో ప్రయోగాత్మకంగా ఆయా రాష్ట్రాల అధికార భాషల్లో పరీక్ష నిర్వహించారు. అది విజయవంతమవడంతో స్థానిక భాషల్లో ఉద్యోగ పరీక్షలకు అనూహ్య స్పందన వచ్చింది. తెలుగు మాధ్యమంలోనే ఎస్.ఎస్.సి. పరీక్షలు మన రాష్ట్రంలోనే నిర్వహించబోతున్నందున అభ్యర్థులు మాతృభాషపై స్పష్టమైన అవగాహన ఉండాలి. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఎస్.ఎస్.సి. ద్వారా లక్ష ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. మాతృభాష మాధ్యమంలో పరీక్షలు రాసే అభ్యర్థులకు ఇది మంచి అవకాశం.

డీఎస్సీలో తెలుగు

త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల అవుతుందని వార్తలు వెలువడుతున్నాయి. గ్రేడ్ 2 తెలుగు పండిట్ ఉద్యోగానికి పదవ తరగతి స్థాయిలో, స్కూల్ అసిస్టెంట్‌కు ఇంటర్మీడియట్ స్థాయిలో... పాఠ్యపుస్తకాల్లోని భాష, సాహిత్యాలను అధ్యయనం చేయాలి. తెలుగు అకాడెమీ వారి బి.ఎడ్., తెలుగు బోధన పద్ధతులనూ అధ్యయనం చేయాలి. ఎస్జీటీ ఉద్యోగాల్లో కూడా పదో తరగతి వరకూ... పాఠ్యాంశాలకు 9 మార్కులు, తెలుగు బోధనా పద్ధతులకు 3 మార్కులు కేటాయించారు.

పోటీ ప్రవేశ పరీక్ష పేరు	ప్రకటన ఎప్పుడు?	పరీక్ష ఎప్పుడు?
1. సివిల్స్ ప్రధాన పరీక్ష (అర్హత)	ఫిబ్రవరి 2నప్రాథమిక పరీక్ష ప్రకటన	నవంబరు
2. సివిల్స్ ప్రధాన పరీక్ష (ఐచ్ఛికం)	"	నవంబరు
3. గ్రూప్-1 ప్రధాన పరీక్ష రెండో పేపర్	వెలువడాలి	జూన్- అక్టోబరు
4. గ్రూప్-2 రెండో పేపర్	"	జులై
5. ఎల్.పి.సెట్ తెలుగు పండిట్	"	జూన్
6. డీఎస్సీ/టెస్ట్ సెకండరీ గ్రేడ్ టీచర్	"	జులై-ఆగస్టు
7. డీఎస్సీ/టెస్ట్ స్కూల్ అసిస్టెంట్	"	జులై-ఆగస్టు
8. ఎస్.ఐ.ఆఫ్ పోలీస్ రెండోపేపర్	"	డిసెంబరు
9. నెట్ (ఏడాదికి రెండుసార్లు)	"	జూన్ - డిసెంబర్
10. సెట్	"	జులై

ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ తెలుగు పాఠ్యాంశాలు, తెలుగు అకాడమీ డీఎడ్ తెలుగు బోధనా పద్ధతులను క్షుణ్ణంగా చదవాలి. టెట్, డీఎస్సీలను కలిపి త్వరలో 'టెస్ట్' పేరుతో ప్రకటన విడుదలవుతుందన్న వార్తలూ వస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు... తెలుగు పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులపై ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా అధ్యయనం ప్రారంభిస్తే విజయం సాధించడం సులభమవుతుంది.

డా॥ పి.విజయకుమార్
సహాయ ఆచార్యులు,
సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాల
కర్నూలు. 98493 02546.



అన్నిటికీ అలవాటు పడిపోతున్నాం
అన్నిటినీ లోపలికి తొక్కిపెడుతున్నాం
దేన్నీ తెరకెక్కనివ్వం
ఏ దృశ్యాన్నీ కనురెప్పలకు వేలాడనివ్వం
భయం
నిన్నటిలోకి చూడాలంటే భయం
కట్టెలపొయ్యిని కలగనాలంటే అయిష్టం
లాంతరు వెలుగుని ఊహించాలంటే అనాసక్తి
చేదబావిని గుండెల్లోకి చేదుకోవాలంటే అసహనం

మనం జారవిడుచుకున్న
కొన్ని మహిమాన్విత మాణిక్యాలు మట్టిలో ఉంటాయి
పేడకళ్లాపు చల్లిన మైదానం
మేతమోపులు సిగలో తురుముకున్న పశువులకొట్టం
పోలిగా పాటల మంత్రాలు జపించే పంటపొలం
సుఖదుఃఖాలను తొంభై ఆమడలు మోసుకెళ్లే తోకలేని పిట్టలు
ఆరుబయట వెన్నెల్లో ఈతకొడుతూ
ఆకాశం పలకమీద లెక్కలుదిద్దే అభ్యాసం
రివర్స్ ఆస్మాసిస్ టెక్నాలజీ గురించి
బొత్తిగా తెలియని మంచినీటి చెరువు
దేన్నీ ఊహించాలన్నా అయిష్టం..
అనాసక్తి... అసహనం....

మనం ఎంత వద్దనుకున్నా
కొన్ని మూలాలు అప్రమేయంగా తన్నుకొస్తాయి
కళ్లగంతల్ని ఛేదించుకుని
కాలయవనికపై కొన్ని గీతలు గీస్తాయి
చూస్తుండగానే అవి ప్రాణం తొడుక్కొని పక్షులవుతాయి
పక్షులన్నీ బారులు తీరి
అల్లార్చిన తమ రెక్కలపై ఆకాశాన్ని మోసుకెళ్తుంటాయి!

మన అయిష్టాన్ని అధిగమించి
అనాసక్తిని అశక్తం చేసి
అసహనాన్ని బద్దలుకొట్టి
కొన్ని పురాస్మృతులు నిలువెల్లా వెల్లువెత్తేలోపే
మనం అదాటుగా ఆకాశాన్ని తిరగేస్తాం
అడుగున దాక్కున్న క్రూరమృగాలు
గాండ్రిస్తూ నిద్రలేస్తాయి
పక్షుల గుంపు చెదిరిపోతుంది
రెక్కలు తెగిన విహంగాలు నేలకూలుతాయి
ఇప్పుడు ఆకాశం మన కాళ్లకింద!
ఆధునిక మోహావేశాలు మన నెత్తిమీద!

అన్నిటికీ అలవాటు పడిపోతున్నాం
అన్నిటినీ లోపలికి తొక్కిపెడుతున్నాం

- ఎం.వి.రామిరెడ్డి, హైదరాబాద్
9866777870

పది రూపాయలకే నవనవలా వేదిక మీ సొంతం!

నెలనెలా నవ్యనవలా కేతనం చతుర

'మా ఫ్రెండ్ ఇంటికి వెళ్దాం పద' అందామె.
పరిచయం అంతగాలేని ఆమె అలా ఆహ్వానించేసరికి అతను మొహమాటపడుతూ 'మీ ఫ్రెండ్ ఇంటికి నేనెందుకు?' అంటూ నసిగాడు.
'ఆc.. ఏంలేదు.. తను బయటకు వెళ్తూ ఇంటి తాళాలు నాకిచ్చింది.. ఇద్దరం కాసేపు వాళ్ల బెడ్‌రూంలో ఎంజాయ్ చేయవచ్చని' అందామె.
పక్కనే బాంబు పేలినట్టు ఉలిక్కిపడ్డాడతను. అతని పరిస్థితిచూసి-
'లేకపోతే ఏంటి? నా ఫ్రెండ్ దగ్గర పనుందయ్యా బాబూ! అంటే అన్నీ పిచ్చి ప్రశ్నలు వేస్తావు పద పద..' అంటూ ఆక్టివా స్టార్ట్ చేసింది.
చేసేదేంలేక బండెక్కి ఆమె వెనుక కూర్చున్నాడతను. ఆ తర్వాత ఏం జరిగింది?
అక్షరాక్షరంలో ఉత్కంఠనూ, ఉద్వేగాన్నీ రంగరించిన వాలి హిరణ్మయీదేవి తొలినవల
నేను పుట్టింది నీ కోసమే చతుర కొత్త సంవత్సర కానుక!
✦ అవధాన సరస్వతి డాక్టర్ మేడసాని మోహన్ చతుర ప్రజ ప్రత్యేకాకర్షణ
ఇంకా జ్ఞానపీఠాలు, కథవెనుక కథ,
చతురకతలు మరెన్నో!

చతుర

సాలు చందా రూ.120 /- మాత్రమే

చందా ఆన్‌లైన్ బుకింగ్‌కు డబ్బు పంపినవారు నేరుగా చందా చెల్లించాలనుకున్నవారు దిగువ చిరునామాలో సంప్రదించండి
మేనేజర్, వసుంధర పబ్లికేషన్స్, ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ హైదరాబాద్-82 ఫోన్ : 040 23318181 Ext: 6441
email: vipula.chatura@eenadu.net, vipula.chatura@gmail.com

భాషకు శాస్త్రచికిత్స

మాతృస్థానంలో ఉన్న భాష అన్ని లౌకిక వ్యవహారాల్లో ఉపయోగపడకపోతే, ఆ తల్లి అందరికీ దూరమైనట్లే అవుతుంది. భాష సులువుగా అర్థమయ్యే రీతిలో ఉంటే, ప్రజల ఆదరణకు ఆచరణకు పాత్రమౌతుంది. వాక్యం పదాల సంపుటి అయినా, క్రమం అర్థాన్ని చక్కగా అందజేస్తుంది. ఒకే పదానికి అనేక అర్థాలు ఉండవచ్చు, ఉంటాయి కూడా. సమయం, సందర్భం పదానికి ప్రాణం పోస్తాయి. మందు అనే పదం వైద్యశాస్త్రంలో చికిత్సా విధానం. అదే మరో సందర్భంలో వ్యతిరేకార్థం స్ఫురించవచ్చు. అందుచేత పదాల ఎంపిక అతి సూక్ష్మనైపుణ్యం.

అన్ని ఆచార వ్యవహారాల్లో మాతృభాష వాడుక భాషగా అందుబాటులో ఉంటే, ఏ కృషీ అక్కరలేకుండానే ప్రజల్లోకి వెళ్తుంది. కలకండ నేలమీద పడితే చీమలకి ఏ ఆహ్వానం అక్కర్లేదు. మాధుర్యమే ఎక్కడున్నా పిలుస్తుంది. ఆ మాధుర్యాన్ని ఏ వన్నె చిన్నెలూ అక్కరలేకుండా అందిస్తే, అందరి హృదయ ద్వారాలు వాటికవే తెరుచుకుంటాయి. మనం నేర్చుకునే భాషలో పాఠాలు ఆదినుంచీ కళలనీ, శాస్త్రాలనీ రెండుగా విడిపోయాయి. భాషా పరంగా చాలా హాని కలిగింది. కారణం... కళలు ఎప్పుడూ భౌగోళికంగా దేశ కాలమాన పరిస్థితులకు, సంస్కృతికి దగ్గరగా ఉంటాయి. హృదయ స్పందన మాతృభాషలోనే ఉంటుంది. కానీ శాస్త్ర అధ్యయనం అలా కాదు. సంస్కృతం తోపాటు కాలక్రమంలో గ్రీకు, లాటిన్ పదాలూ విరివిగా ఆంగ్లంలోకి చొచ్చుకుపోయాయి. ఆంగ్లం బోధనాభాష కావడంతో, పదో శతాబ్ది నుంచే శాస్త్రం దాని సొత్తయింది. అదిగో అప్పటినుంచి సామాన్యుణ్ని వదిలి శాస్త్రం మాన్యుల ఇంట తిష్టవేసింది. సామాన్య జనానికి 'ఇదంతా మనకు తెలియదు- ఇది వారి సొత్తు' అనే భావన కలిగించింది. ఈ అపోహతో ఆంగ్ల విద్య, పరిజ్ఞానం ఓ ప్రత్యేక వర్గాన్ని సృష్టించింది. అంతా కాలవైపరీత్యం! ప్రభువుల పైత్యం!! దీని పరిణామమే ఆంగ్లబోధనాశాలలు, ఉన్నత విద్యా నిలయాలు, విశ్వవిద్యాలయాలు. రాష్ట్రంలో కొన్ని విశ్వవిద్యాలయాలు కూడా తెలుగు భాషకు ఓ శాఖను అప్పగించి సంతోషిస్తున్నాయి తప్ప అంతకు మించిన భాషామతల్లి సేవలేమీ లేవు. ఆయా శాఖలకు కూడా శాస్త్ర విజ్ఞానం తమ మాటల సొత్తు చేసుకోవాలని లేదు. ఎంతసేపూ సాహిత్యభాషా చర్చలు తప్ప శాస్త్ర చర్చలు మృగ్యం. దీనికి మరో కారణం ఉంది. ఇందులో వారు మాతృభాషాకోవిదులు. సాహిత్యవేత్తలే కాని శాస్త్రజ్ఞానం లేనివారు కావడం, దాని మీద ధ్యాస, అనురక్తి లేకపోవడం. అంతేకాదు... తమకు అలవికాని ఆయా శాస్త్రాల పట్ల కించిత్ కినుక కూడా ఉండి ఉండవచ్చు. ఇక్కడ శాస్త్రం అనే పదం వేద, జ్యోతిష శాస్త్రాల దృష్టితో కాదు... భౌతిక, రసాయన, వైద్య, సాంకేతిక శాస్త్రాల కోణంలోంచి మాత్రమే.

మరోమాట నిర్మొహమాటంగా చెప్పుకోవాలి. విపరీత పరభాషాభిమానం, ఆ తరహా పరదేశాభిమానం అవమానకరం. మనం ప్రపంచపటంలో ప్రముఖస్థానంలో ఉండాలంటే ఇతర భాష అత్యవసరమని వాదించేవారు పలు

వురు. ఇంద్రప్రస్థం నుంచి భాగ్యనగరం వరకు వినిపించే 'నినాదం' ఇదే! మనం భౌతికంగా తెల్లవారి కబంధహస్తాల నుంచి విడివడ్డామేమో కానీ, ఇంకా వారి మానసిక బందీలుగానే ఉన్నాం. మనలో అనేకుల బుద్ధి ఇంకా భాషా బంధనాలలోనే చిక్కుకుని ఉంది. ఇప్పటికీ ఎవరైనా విదేశీ వ్యక్తి వస్తే ఆయన మాటలు ఊటలవుతాయి. రోజూ ఎన్నోచోట్ల చూస్తున్నాం. ఇది పోవాలంటే- మన మానసిక వ్యక్తిత్వం పెరగాలి. భాషావేత్తలు మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించవచ్చు. దానితోపాటు ఆంగ్లం కూడా చదివి అర్థం చేసుకుని మన భాషను వృద్ధిచేసే తత్వం పెంచుకోవాలి. ఏ శాస్త్రసాంకేతిక విద్యాజ్ఞానం సంపాదించినా, ఏ పరిశోధనలు చేసినా... ఆ విజ్ఞానాన్ని మన తెలుగు వారందరికీ అందజేయాలనే స్ఫూర్తితో మాతృభాషలో అది అందించాలి. దీనికి మనవాళ్లంతా విదేశాలలో ఏం జరుగుతోందో గమనించాల్సి ఉంది. జపాను, చైనా, జర్మనీ, రష్యా దేశాల్లో పట్టుదలతో మాతృభాషా శక్తిని పెంపొందించుకుని అన్ని విషయాలను వారి భాషలోనే సుసంపన్నం చేసుకున్నారు. వీరికీ ఆంగ్లం వచ్చు. అయితే ఎంతమేరకు అవసరమో అంతవరకే ఉపయోగిస్తారు. దీనివల్ల ఆ దేశాలు నష్టపోయిందేమీ లేదు. మనకన్నా శాస్త్ర సాంకేతిక రంగాల్లో అన్ని విధాలా ముందంజలో ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా పేరున్న భారతదేశంలో భాషాదారిద్ర్యం ఉన్నంతవరకు భావ దారిద్ర్యం ఉంటుంది. అది పోకపోతే భవిష్యత్తే ఉండదు. మనకు రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందేమో గాని ఆత్మ స్వాతంత్ర్యం రాలేదు.

అసలు సమస్య మరొకటుంది. కొందరు భాషాకోవిదులకు శాస్త్రం పట్టదు. కొంతమంది శాస్త్రజ్ఞులకు భాషమీద పట్టుండదు. వీరు కనీసం కూర్చొని శక్తిని పంచుకోరు. ముందుతరాలకు మార్గదర్శకం అవ్వాలనే కోరిక వీరిలో లేకపోవడం దురదృష్టం.

ఆంగ్లం భాషగా విశ్వంలో సుసంపన్నం అయిందంటే... గ్రీకు, లాటిన్, సంస్కృతం తనలో ఇముడ్చుకోవడమే కారణం. ఆంగ్లపద కోశాలు తరచు పునర్ముద్రణకు రావడానికి కూడా ఇదే కారణం. ప్రతిసారి క్రమం తప్పకుండా పై మూడు భాషల్లోని పదాలను తనలో చేర్చుకుంటూనే ఉంది. మన తెలుగుభాష కూడా చాలా సుసంపన్నమైంది. ఎందుకంటే-పుట్టిల్లు సంస్కృతం. ఏ రకమైన భావాలనైనా తెలుగులో అవలీలగా వ్యక్తీకరించవచ్చు. తెలుగులో శాస్త్రసాంకేతిక పదాల కోసం తెలుగు అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం వంటి సంస్థలు విశేష కృషి చేశాయి. రాష్ట్రంలోని అనేక విశ్వవిద్యాలయాలలో ఉన్న శాస్త్ర బోధనలు చేసేవారిలో భాషా పటిమ ఉన్నవారూ ఉన్నారు. కాకపోతే ఓ సమగ్ర ప్రణాళిక లేదు. వీరిని నడిపించే శక్తి కావాలి. తెలుగులో శాస్త్రభాషకు పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం కృషి చేస్తోంది. అయితే ఇది తెలుగు వారి విస్తృత వినియోగానికి పనికి రావాలి మరి.

తెలుగువారికి ఈ రోజుల్లో విద్యా, వైద్య, సాంకేతిక శాస్త్రాలు విధిగా తెలియాలి. అందరి కన్నా ధన్వంతరి అతి ప్రాచీనుడైనా, మన వైద్య శాస్త్రాలు ఎన్నో దేశాలకు మూలమైనా ప్రస్తుతం వైద్యంలో ప్రతి పదమూ ఆంగ్లమే! వీటిని గ్రామీణులు చక్కగా చర్చించుకునేలా చేయాలంటే తప్పనిసరిగా అవన్నీ తెలుగులో ఉండాలి. ఇందుకు క్లిష్టమైన అనువాదం కన్నా అందరికీ ఇష్టమైన అనువాద రచన కావాలి. బ్లడ్, మోషన్స్, డయాబెటిస్, ఇలా అన్నీ తెలుగు కావాలి. తెలిసినా తెలియకపోయినా ఇవి వారి పెదాలమీద తిరుగుతున్నాయి. అందుకు అందరికీ తెలిసిన ఆంగ్లపదంతో జోడించి కొంతకాలం తెలుగు శాస్త్రీయపదాలు అలవాటు చేయాలి. ఉదా: టైఫాయిడ్‌కి సన్నిపాత జ్వరం అని రాయాలి. న్యూమోనియో వ్యాధికి తెలుగులో -'క్రిమిజనిత ఘనీభవ వ్యాధి' అని రాస్తే అందరూ భాషకి దూరమైపోతారు. అందుకే దీనికి తగుమాత్రంగా అర్థమయ్యే పదం కావాలి. వీలుకాకపోతే యథాతథంగా స్వీకరించాలి. అనువాదం ఎక్కడ, ఎంతవరకు జరగాలి? ఎక్కడెక్కడ నియంత్రించాలి? అనే వాటి మీద భాషాపండితులు-శాస్త్రకోవిదుల నడుమ నిర్మాణాత్మక చర్చలు సాగి సమస్యకు సముచిత పరిష్కారాలు సాధించాలి. శాస్త్ర సాంకేతిక పదసృష్టికి... తెలుగుకు శాస్త్ర చికిత్స అవసరమే.

సమష్టిగా ఇలా చేస్తే బాగుంటుంది

- ఆంగ్లానికి తెలుగులో శాస్త్రీయపదాలు తేవాలి.
- ఆయుర్వేద నిఘంటు పదాలతో ఆంగ్లవైద్య సమకాలీన పదాలు తయారు చేసుకోవాలి.
- ఆయుర్వేద పదాలు ప్రజల్లో పాతుకుపోయాయి. వాటిని చాలా సులువుగా ప్రయోగంలోకి తేవచ్చు. (ఇంజక్షన్-సూదిమందు)
- అలవాటైన పదాలు వాడితే చాలు అని కొందరంటారు. కానీ వందశాతం తెలుగు పదాలు వాడాలంటే తెలుగు పదాలను ఆంగ్లంతో కలిపి కొంతకాలం ఇవ్వాలి.
- ఇంటింటికి విధిగా తెలుగు పత్రిక ఉండాలి. ప్రతి విద్యాలయం వారి స్థాయిలో వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించాలి. కళాశాలల్లో విధిగా తెలుగు మీద ఓ ప్రత్యేక అభ్యాసం కొనసాగాలి.
- విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, తెలుగు భాషా పండితులు కలిసిమెలిసి తరచు చర్చావేదికలు నిర్వహించుకోవాలి.
- ఆయుర్వేద కళాశాలలు... వైద్యశాస్త్రాధ్యయనానికి, ఆంగ్లపారిభాషికాలకు తెలుగు పదాలు ఇవ్వడానికి ఎంతగానో ఉపయోగపడతాయి.



డా॥ కె.ఎస్.రత్నాకర్,
ప్రముఖ వైద్యులు,
హైదరాబాద్.
98494 40626

నీకో గింజ - నాకో గింజ

సంక్రాంతి సకల జీవ రాశులకూ పండుగ కావాలన్నది పెద్దల ఆశయం. రైతులు ధాన్యపు వరిని కోసినప్పుడు, కొన్ని కంకులను నూర్పకుండా దాచిపెడతారు. అలా దాచిన వరి కంకులను సంక్రాంతి రోజులలో పక్షులకి ఆహారంగా ఉంచుతారు. వరి కంకులకు ఉన్న గడ్డిని కిందకి లాగి ముడివేస్తారు. అప్పుడు బయటపడ్డ వరి గింజలు పక్షులకు అందుబాటులో ఉండేట్లుగా ఇంటి చూరుకి వేలాడతీస్తారు, లేదా ఒక కర్రకి కడతారు. ధాన్యం చేతికి వచ్చే వరకూ పక్షులని పంటకి శత్రువుగా భావిస్తాడు రైతు. కానీ తనకంటూ సమృద్ధిగా ధాన్యం లభించాక, అందులో కొంత మిగిలిన ప్రకృతికి కూడా చెందాలనుకుంటాడు. 'బతుకు - బతకనివ్వు'కి ఇంతకంటే మంచి ఉదాహరణ ఏముంటుంది!

గులాబీ అత్తరు

— శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

ఒక్క అడుగు వేస్తే దివాన్జీ కనపడతాడు. అతగాడొక్కమాటు తమకేసి చూస్తే చాలునని ఆత్రపడుతూనూ, అతని కటాక్షం ఆశించీ, అతని అనుగ్రహం ఎదురుచూస్తూనూ, అతని ఆలంబనం నమ్ముకునీ, అతనిచేత 'సరే' అనిపించుకోవడానికి తగ్గ యెత్తులాలోచించు కుంటూనూ, అయినా, అతని లోభగుణం మాత్రం లోపల్లోపల గర్హించుకుంటూనూ, ఆ గదిలో పరివేష్టించి ఉండిన ఆశ్రితులూ, పౌరప్రముఖులూ, రాజబంధువులూ, రాజ పురుషులూ కొందరక్కడికే కనపడుతున్నారు.

వారిలో కొందరు తనకేసిన్నీ చూశారు.

అలాంటిచోట నుంచుని, మొదట వొక్కమాటు గదిలోకి తొంగిచూసి, తరవాత నిటారుగా నుంచుని, నుంచున్న వెంటనే తాపీగా రెండు చేతులూ చాపి, గబీమని బిరడా తీసి సీసా గాలి వాటానపెట్టాడు షుకురల్లీఖాను, తల వెనక్కి విరుచుకుంటూ.

బిరడా తీశాడు, అంతే, వెంటనే బిగించేశాడు. కాని ఆ క్షణ మాత్రానికే అతని చుట్టూ ఉండిన జవానులు తుళ్లిపడి మత్తెక్కు తున్నట్టయిపోయారు. లోపల ఉండిన పెద్దమనుష్యులు ఉలిక్కిపడి యోగ ఊపిరి తీసుకుంటూ ఇటు చూశారు.

దివానుకి పక్కగానూ కొంచెం వెనుక వాటుగానూ నుంచుని ఉండి, అతని రాతలు ఒరకంట చూస్తున్న ఠాణేదారున్నూ చకితుడై 'వచ్చాడా?' అన్నట్టొకమాటు గుమ్మం కేసి చూసి, మళ్లీ మొగం వంచుకున్నాడు, సాలోచనగా.

అప్పటికప్పుడే చర్రున మొగం పైకెత్తి "ఏయ్! ఏమిటీ కంపు?" అంటూ గద్దించాడు దివాన్జీ, దగ్గుకుంటూనూ తీక్షణంగా చూస్తూనూ. దీంతో పండు వెన్నెట్లో కటిక చీకటిరేఖ విరిసినట్టయింది. కొంచెం ఘాటుగానే ఉండినా, హృదయంగమమైన వట్టివేళ్ల అత్తరు కమ్మదనం దివాన్జీకి కంపుగా తట్టడం చూసి లోపలి వారందరూ మొగమొగాలు చూసుకున్నారు, ఉబికిన నవ్వు కళ్లల్లో కుక్కుకుంటూ.

"అరే, అరే" అనుకుంటూ మొగం పక్కకి తిప్పుకుని, ఠాణేదారు పెదవి విరుచుకున్నాడు. తన రసికత గుర్తించమన్నట్టొక రాజబంధువు కేసి బెల్లించి చూస్తూ. జవానులున్నూ అందుకు వింతపడి, అపవారించి పెదవులు కరుచుకున్నారు. ఖాను కొయ్యే అయిపోయాడు. కంపు అన్నమాట అపశ్రుతిగా కనప డిందతనికి.

మాంచి పరువమైన యాభైయేళ్ల వయస్సున్న, అత్తరు సౌరభం కంపుగా వెలవరించుకునే మనిషి కనపడటం అతనికిదే మొదటిసారి. మొన్న మొన్ననే- రెండు మాసాలపాటు నానాపాట్లూ పడి గాని గోలకొండ కోటలో అడుగు పెట్టలేకపోయాడతను. అసలు, వజీరు దర్శనమే కాలేదు నెలా పదిహేను దినాలు పడిగాపులు పడి ఉంటేనేగాని.

ఆ ప్రయత్నంలో, నిజంగా, తల ప్రాణం తోకకు వచ్చిందతనికి; కాని దర్శనం ఇచ్చాక మాత్రం యీ వట్టివేళ్ల అత్తరుకే ఆ వజీరెంత ముగ్ధుడయి పోయాడు! అప్పుడక్కడ ఉన్నవారూన్నూ ఎంత సంబరపడ్డారూ! తరవాత, నవాబున్నూ ఎంత మెచ్చుకోలేదూ! మరి యిక్కడ, పెద్దాపురంలో, అడుగు పెట్టిననాడే కావలసిన భోగట్టా అంతా దొరికిపోయింది. మర్నాడు ఠాణేదారు ప్రసన్నుడయిపోయాడు. మూడో నాడే కోటలో

ప్రవేశం దొరికింది. అయితే, అంత సౌలభ్యానికీ చివరికిదా పరిణతి?

హిందువులలో విభ్రమ విలాసాలకు తగినంత విలువ లేకపోవడం అతనెరుగును. పోనీ, అంటే నిర్లిప్తత కూడా అంతంతగానే ఉండడమూన్నూ అతనెరుగును. అయితే మాత్రం యింత తల్లకిందులా! ఇంతకీ అత్తరు సువాసన చెడుకంపుగా బాధపడే మనిషి, రాజు తరువాత రాజంతవాడయి ఉండటమా? రాచ రీవికి ప్రశంసావహమా?

దీనివల్ల, మహారాజు ప్రాభవం విషయమూ, వైభవం విషయమూ దివాన్జీకి లక్ష్యం లేదనుకోవాలా? లేక, మహారాజు ప్రవృత్తి కూడ యిలాంటిదే అనుకోవాలా? ఇది మిక్కిలి అసంభావ్యంగా కనబడిందతనికి.

'చివరికేది యెలా సంభవిస్తుందో?' అని అనుమానమున్నూ పట్టుకుంది. ఇంతమాత్రాన నిరాశ చేసుకోలేదుగాని చేసుకోకతప్పదేమో అన్నట్టు జవాన్లకేసి అభావదృష్టులు పరిపాడతను. ఈ స్థితిలో "ఏయ్ జవాన్?" అని పిలిచాడు ఠాణేదారు, ద్వారంకేసి చూస్తూ. చిత్తం బాబయ్యా అంటూ వెంటనే లోపలికి వెళ్లి జవాను "ఢిల్లీ నుంచి అత్తరు వర్తకుడొకడు వచ్చి దర్శనం కోరుకుంటున్నాడండి" అని విన్నవించాడు.

దీని మీద "అతనే, నేను మనవి చేసుకున్న సాయిబేనండి" అన్నాడు ఠాణేదారు, మెల్లిగా. కాని దివాన్జీ, మొగం పైకెత్తలేదు.

పైపెచ్చు "దివాణంలోనే అంగడి తెరుస్తాడటనా సాయిబు?" అని ముదలకించాడు, కొంచె కటువుగా. ఇది విని ఖాను తెల్లబోయాడు. జవానే కాదు, ఠాణేదారు కూడా జంకిపోయాడు, అందుకు ప్రత్యుత్తరం చెప్పడానికి.

కాని "చిత్తగించారా?" అంటూ వొక బోసినోటి శాస్త్రులు మాత్రం అందుకున్నాడు. తన ప్రతిభ చూపించడానికి మంచి అవకాశం దొరికిందన్న ఉత్సాహంతో, నలుగురికేసీ చూస్తూ.

అయితే, అప్పుడు కూడా దివాన్జీ

పైకెత్తిచూడకపోగా, అతణ్ణి మాత్రం ఉద్దేశించి, ఒక్కొక్కమాట ఒక్కొక్క పెద్ద మనిషికేసి చూస్తూ "దివాణంలోనే అంగడి తెరుస్తాడటనా? అంటే చెప్పలేను గాని, అతను చేసిందాంట్లో మంచి భావుకత మాత్రం కనపడుతోంది. ఏమంటే, రాణేదారుగారి పరిచయ వాక్యాలవల్ల అతను ఫలానా అని మాత్రమే తెలుస్తుంది. అతని సామర్థ్యం అజ్ఞాతంగానే ఉండిపోతుంది. ఆ విషయం తనకి తానై చెప్పుకోవడం యెవరికీ రసికతాముద్ర కాదు. అందుచేత, తన అత్తరు సువాసనతోనే తన విషయం యావత్తూ విశదపరుచుకున్నాడతను. ఇది చాలా గొప్పగా ఉంది. ఢిల్లీలో మసులుకుంటున్న మనిషికిదొక లెక్కామరి? అక్కడ యెంతెంతలేసి ఉమ్రావులున్నారు! వారి దగ్గిర మసులుకునే మనిషి సామాన్యుడయి ఉంటాడా? చాలా బాగుంది. తప్పకుండా చూడతగ్గవాడతను" అన్నాడు శాస్త్రులు, చివరిమాట రాణేదారు కందచేస్తూ. అయినా, దివాన్జీ మాట్లాడలేదు. చూడనే లేదు. రాస్తూ రాస్తూ ఉండిన కలం మాత్రం కింద పెట్టేసి పొడుంకాయ అందుకున్నాడతను, అంతే.

"ప్రవేశపెట్టు" అన్నాడు రాణేదారు, సరే అనేమాట దివాన్జీ ప్రకటపరచే పద్ధతి అది అని తెలుసు కనక. ఆ మాట మీద దివాన్జీ కనుబొమ్మలు ముడిపడ్డాయి. ఏదోవొక గంబీరాలోచన అతని బుర్రలో ప్రవేశిస్తూ అది కళ్లల్లో తళుక్కుమంది. తన రసజ్ఞత అంతా వ్యర్థం అయిపోయినందుకు కించపడుతున్న శాస్త్రులు అది చూసి ఉలిక్కిపడ్డాడు.

అప్పటికప్పుడే వొక్క అంగలో లోపలికి వెళ్ళి "దివాన్జీ వారికి కోటి సలాములు. నేను ఢిల్లీ నుంచి వచ్చానండి, ఏలిన వారి పాదాలు వెతుక్కుంటూ" అన్నాడు ఖాను, చేతులూపు కుంటూనూ, మూడుమాట్లు వంగిలేస్తూనూ.

"ఏమి పని?" అనడిగాడు దివాన్జీ దర్పంగా, అతని సలాములు కళ్లతో అందుకుని.

"నేనత్తర్లు తయారు చేస్తాను మహాప్రభూ! దక్షిణ దేశంలో, గోల్కొండ తరవాత పెద్దాపురం ఒక్కటే చూడతగ్గది అని విన్నాను, రెక్కలు కట్టుకువచ్చి వాలాను, తమరు కటాక్షించాలి" అని వేడుకున్నాడు ఖాను.

"రెక్కలుండటమే వస్తే ఎక్కడో ఒకచోట వెళ్లివాలక, ముడుచుక్కూచుంటాడా ఎవడైనా?" అని ముదలకించాడు దివాన్జీ.

అందులో ఉన్న దెబ్బ ఖాను గుర్తించలేకపోలేదు; కాని "తమరు సరిగా సెలవిప్పించారు మహాప్రభూ! ఏమంటే, రెక్కలున్నందుకు వినియోగం, ఎక్కడ సరసులుంటే అక్కడ వెళ్లివాలడమే. కనుకనే నాలుగు తరాలనాడు, మా కుటుంబం పారశీక దేశం విడిచి ఢిల్లీ వచ్చి వాలింది. వచ్చాక కూడా సైన్యంలో చేరడానికెన్ని అవకాశాలు తటస్థపడినా, పేరు తెచ్చిన కళాజీవిక విడిచిపెట్టలేక అత్తరులే తయారుచేసి ఢిల్లీ పాదుషాల ఆదర గౌరవాలు పొందుతోంది" అన్నాడు, ధోరణి మార్చించదలిచి.

దీంతో "కావచ్చు" అన్నాడు దివాన్జీ, కొంచెం వడిమళ్లి; కాని చూపుల్లో మాత్రం సారళ్యం అంకితం కాలేదు.

"మా నాయనగారి సెలవుపొంది, నేను, దక్షిణదేశ ప్రభువులను సేవించుకోడానికి వచ్చాను. గోల్కొండ నవాబుగారూ, అక్కడి వజీరూ మా పరిశ్రమ గుర్తించి మిక్కిలి ఆదరించారు."

"ఇంకేం?"

"ఇంకేమంటే మనవి చేసుకున్నాను గదా,

గోల్కొండ తరవాత పెద్దాపురమే చూడతగ్గదని విన్నాను? ముందు తమరిది చిత్తగించ కోరుతున్నాను."

ఇలా అని, ఖాను, మూతతెరచి ఒక చిన్నపెట్టె దివాన్జీ సందుకా పెట్టిమీద ఉంచాడు. అందులో ఒక చిన్నసీసా. చక్కని నగిషీ పనితో ఎంతో ముచ్చటగా ఉందది. సీసాలో సగానికిపైగా అత్తరు ఉంది. అది చూసి అక్కడి వారందరూ గుటకలు మింగారు.

"అది మల్లె అత్తరు మహాప్రభూ! అందులో ఉన్నది రెండే తులాలు; కాని రెండు వసంతాలకు తయారయిందది"

"వోస్."

"మా వస్తువు మర్యాద మాకు మేమయినా చెప్పుకోడం ధర్మం కాదు, చిత్తగిస్తే తెలియందీ కాదు. అయితే మొగం కొంచెం యెడంగా ఉంచి మరీ మూత తీయించండి మహాప్రభూ"

దీని మీద, అక్కడి వారందరూ ఘ్రాణేంద్రియానికి ఏకాగ్రత అలవరుచుకున్నారు; కాని "మాట్టాడేటప్పటికి ముందు మూత తియ్యడమే పనా మాకు?" అనడిగాడు దివాన్జీ, దురుసుగా. ఖాను మళ్లీ కుతకుతలాడి పోయాడు. అయితే, అధికార దర్పం ఒక్కొక్క మనిషిలో ఎలాంటి పశు ప్రవృత్తి రేకెత్తిస్తుందో అతనికి తెలుసు. లక్షలకొద్దీ అధికారులతో నిండి ఉండిన ఢిల్లీ నగరంలో, అతను, మొదట ఆర్జించింది ఈ పరిజ్ఞానమే. ఇలాంటి వాటికి నషాళం అంటేటట్టు బదులు చెప్పడమూ అతనికి చేతనవును. మరొక పనిమీద వచ్చి ఉంటే అతనందుకు సందేహించకపోవును. కాని ఇప్పుడలా చేస్తే కార్యం భంగపడుతుంది. పారితోషికం కంటే, తన అత్తర్లకు దేవదుందుభులు మోగడం అతనికి మిక్కిలి అగత్యం. అది, రాజు యెదట పడగలిగితేనే సిద్ధిస్తుంది. రాజసభలు కంటకభూయిష్టాలూ, హింస్రక మృగాకీర్ణాలున్నూ. పాలకోసం రాయి మొయ్యాలి. అంచేత, అతనోపిక పట్టాడు. ఇంతేకాదు. అలాంటి దురుసు మనిషిని, అందుకు తగ్గట్టు మాట్టాడి అంతకంటే ఎక్కువగా నొప్పించడం కంటే తగ్గి మాట్టాడి, దారికి తెచ్చుకుని, పిడికిట పట్టుకుని ఆడించడం కూడా వ్యవహర్తల లక్షణమే.

ఈ నిశ్చయంతో అతను "ఏలినవారి-" అంటూ ప్రారంభించాడు: కాని, మాట సగంలోనే కలగజేసుకుని, రాణేదారు "దివాన్జీవారు అది సావకాశంగా చిత్తగిస్తారు. ముందు నువ్వు వచ్చిన పనేమిటో మనవి చేసుకో" అని అందించాడు.

"చిత్తం, చిత్తం" అంటూ మరో పెట్టె తెరచి దివాన్జీ యెదుట ఉంచాడు ఖాను, రాణేదారు సమయస్ఫూర్తికి కళ్లతో మెప్పు చూపిస్తూ. లోభాగాన ఆకుపచ్చ మఖమల్ గుడ్డ అతికించిన చక్కని పెట్టె అది. ఎర్రని అత్తరుతో, అపురూపమైన నగిషీ పని చేసిన చిన్నసీసా ఒకటి, కోటి కిరణాల జాతిరత్నంలాగా మెరిసిపోతోంది, అందులో. అక్కడివారు దాని చక్కదనానికి ముగ్ధులయి పోయారు; కాని దివాన్జీ అటు చూడనే లేదు. అందుకున్నూ నరాలు తోడేసినట్టయి పోయాడు; కాని యేమీ యెరగనట్టు "ప్రభువులకు తెలియంది కాదు" అంటూ ప్రారంభించాడు, ఖాను.

"పెద్దాపురం ప్రభువులకు నజరు పెట్టుకుందామని తయారు చేశానది. గోల్కొండ నవాబుగారికి వట్టివేళ్ల అత్తరు మిక్కిలీ ప్రియం అని తెలిసి అదెంత శ్రద్ధగా తయారు చేశానో, పెద్దాపురం మహారాజులుంగారికి గులాబీ అత్తరు మిక్కిలీ ప్రీతిపాత్రం అని తెలిసి యిది అంత శ్రద్ధగానూ తయారు చేశాను. ఆ సీసాలో ఉన్నది ఒక్కటే తులం- దాని నిమిత్తం కాశ్మీరం జాతి పువ్వులు వాడాను. ఢిల్లీ పరిసరాల్లో పారశీక జాతులే ఎక్కువ. కాశ్మీరజాతి చాలా అరుదుగా దొరుకుతుంది. అంచేత, ఆ కాస్త అత్తరూ తయారు కావడానికి ఖరాగా రెండేళ్లు పట్టింది మహాప్రభూ" అని వివరించి చెప్పాడతను.

ఇది విని అక్కడివారు దాని విశిష్టతా, విలువా ఊహించుకుని చాలా ఆనందించారు; కాని "ఆశ్చర్యమా;" అనడిగాడు ముందు దివాన్జీ మెల్లిగా.

"గొప్ప వస్తువులు తయారు చెయ్యాలంటే గడియల్లో సాగుతుందా మరి?" అంటూ ఖాను పరిశ్రమ మెచ్చుకున్నాడు తరవాత.

కాని "యెంతకి కిట్టింది పాపం?" అనడిగాడు చివరికి, జాలి పడుతున్నట్టు బెల్లించి చూస్తూ. ఖాను నిర్విణ్ణుడయిపోయాడు. అది గుర్తించి, కళ్లంతా గర్వం చేసుకుని, తల పంకించుకున్నాడు, దివాన్జీ. అతగాడి నిర్విణ్ణతా, ఇతగాడి గర్వరేఖా చూసి అక్కడి పెద్దమనుష్యులందరూ చకితులయిపోయారు. అనేక రాజసభలూ, ఎన్నో నవాబు దర్బారులూ చూసి సమస్త మర్యాదలూ అనుభవించిన షుకురల్లీఖాను, అనేక శోధనలకు తట్టుకోగలిగిన ఆ కళాశీలి, ఈ కొత్తదెబ్బకు ఊగిపోయిన్నీ, మహారాజు మిక్కిలీ సరసుడని విని ఉన్నాడు కనక, రాజదర్శనంతో యీ మనోవైకల్యం అంతా పోతుందని ఆశించుకుని, అత్తరు సౌరభం కంపుగా భావించిన అధికారి దగ్గర ఇంతకంటే రసికత ఉంటుందనుకోవడం తనదే తప్పనీ తనకితానే మందలించుకుని, అప్పటికి చేసేదిలేక, యి నిర్విణ్ణతా, దీంతో పుట్టిన కోపమూ, ఆ వెంటనే వచ్చిన యేవగింపూ అణచుకుని, వినయమున్నూ తెచ్చుకుని, "అది నజరు వస్తువు మహాప్రభూ! దక్షిణ దేశానికంతటికీ జాతిరత్నం శ్రీవత్సవాయి ప్రభువు నిమిత్తం ఉద్దిష్టమైనదన్నీ, ఈ కారణాల వల్ల దానికిట్టింపు ధర అడగడం మాకు మన్నన కాదండి" అన్నాడు, కళ్లలో బాధ కనపరుస్తూనే.

దీని మీద "మరి మా ప్రభువులను మీరెంతగా గౌరవిస్తున్నారో మాకు తెలియడం యెలాగా?" అనడిగాడు దివాన్జీ అమాయికత్వం నటిస్తూ.

"పెద్దాపురం రాజసభలో ఇలాంటి వస్తువుల విలువలు కట్టగలవారు లేరని నేననుకోగలనా మహాప్రభూ?"

మా ప్రభువు కోసం ఉద్దిష్టమైన వస్తువు వారి సెలవు పొందకుండా విప్పిచూడటం మాకు ధర్మమే అనుకోనా నేను మరి?

"మరి ప్రభువుల సన్నిధికి..."

"అది సరేనయ్యా! మేము వారి భృత్యులం

శ్రీమద్రమారమణ గోవిందో హరి...



సంక్రాంతి సందడికి శృతి కలిపే తంబుర నాదాలు హరిదాసులవి. పట్టువస్త్రాలని మొలకి చుట్టుకుని, అక్షయపాత్రని తల మీద పెట్టుకుని వస్తారు హరిదాసులు. వారి చిడతల చప్పుడునీ, తంబుర నాదాలనీ విని ఇంట్లోని వారంతా అప్రమత్తమవుతారు. భాగవత గీతాలని పాడుకుంటూ తిరిగే హరిదాసులది గొప్ప జానపద కళారూపం. భిక్షని స్వీకరించే వీరి అక్షయపాత్ర సాక్షాత్తూ శ్రీకృష్ణుడే ప్రసాదించాడని ఓ నమ్మకం. తమ ఇళ్లకు చేరుకునే వరకు, ఆ పాత్రని కిందకి దించరు. భిక్ష సమయంలో సంకీర్తనలు తప్ప వేరే మాట మాట్లాడటం కూడా నిషేధం. ధాన్యం చేతికి వచ్చిన సంక్రాంతి రోజుల్లో, ఉన్నదాంట్లో కొంతని పంచుకునే సదాచారమే హరిదాసుల సంచారం. దానికి భగవన్నామ స్మరణ తోడైతే అది ఆస్తికులకు ఆచారం.

కదా, మేమూ కొన్ని విధులు నిర్వర్తించు కోవాలేమో?"

ఎగిసిపడి 'ఇదా విధి నిర్వహణం?' అన్నట్టు చురుగ్గా చూశాడు, బోసినోటి శాస్త్రులు, క్రీగంట.

అదలా జరుగుతూ ఉండగానే "నేను మనవి చేసుకునేది అదే మహాప్రభూ" అన్నాడు ఖాను.

"ఒకరితో మనవి చేసుకోడానికీ, సొంతానికి సత్యం గుర్తించడానికీ చాలా అంతరం ఉంది. మీ ఢిల్లీలో వజీర్లు ఎవరే వస్తువు తెచ్చినా దాని మంచిచెడ్డలు తెలియకుండా అది పాదుషా సన్నిధిని ఉంచనిస్తారా?"

తల తాటించుకుంటూ దివాన్జీ యిలా అడిగాడప్పటికి. ఖాను, నిలువునా నీరయి పోయాడు. వట్టివేళ్ల అత్తరు సౌరభంతో అతని యెడల మిక్కిలీ అనురక్తులయి ఉండిన పెద్దమనుష్యులు ఈ మడత పేచీ గుర్తించి నిర్విణ్ణులయినారు. రాజు బంధువులలో ఒకాయన, అపవారించి, దివాన్జీ యెడల నిరసనభావం కనపరచగా, బోసినోటి శాస్త్రులు నుదుట 'రాత' అన్నట్టు వేలితో పాముకొని మొగం వంచుకున్నాడు. రాణేదారు ఇదంతా గుర్తించాడు. వెంటనే ఖానుణ్ని సంబోధించి "దివాన్జీవారిప్పుడు చాలా తొందర పనిలో ఉన్నారు. ఇప్పటికి వెళ్లిపో, మరోమాటు దర్శనం చేసుకుందువుగాని" అన్నాడతను.

"ఇది బాగుంది" అన్నట్టందరూ తలలు ఊపుకున్నారు. అంతమంది పెద్ద మనుష్యులకు తన యెడల సానుభూతి ఉండినందుకు తృప్తిపడి, మళ్లీ సలాములు చెప్పి, బుర్ర వంచుకుని వెనక్కి అడుగులేస్తూ బయలుదేరాడు ఖాను. గుమ్మం దాటేటప్పటికే రెండు పెట్టెలూ తెచ్చి ఒక జవాను అతని చేతిలో ఉంచాడు.

* * *

ఆ రాత్రి తెల్లవార్లూ కంటికి నిద్రలేదు, ఖానుకి. నోటికి ముద్ద కూడా పోలేదు. బుద్ధిన్నీ మందగించి పోయింది. కళ్లు మూసుకున్నా తెరుచుకున్నా దివాన్జీ చికిలింపు చూపులే కనపడసాగాయి. కిట్టింపుధర చెప్పమనడం ఒక్కటే జ్ఞాపకం రాసాగింది. దీంతో, క్షణక్షణమూ యూటెపోట్లు తింటున్నట్టే బాధ పడిపోయాడతను. ఐతే, లోక ప్రవృత్తి ఏకముఖంగా ఉండదు, సత్యమే. ముక్కుకు సూటిగా వెడదామంటే ఎవరికీ సాధ్యమూ కాదు, నిజమే. దీనికి సాయం, ప్రతిఘటనలు తటస్థించితేనే జీవితానికి విజయమున్నూ. కాని, ఒక్కొక్క జీవితానికి హృదయమే పునాది అయితే, మరొక్క జీవితానికి మేధస్సు ప్రధానం అయి ఉంటుంది. ఎక్కడ మేధస్సు ప్రధానమో అక్కడ అనుభూతి తక్కువయిపోతుంది. అక్కడ సానుభూతిన్నీ పూజ్యమే. ఏ జీవితానికి పునాది హృదయమో అది కళాబంధురం. అక్కడే కళలకు పరిణతి. అక్కడే కళలకు వినియోగం. అక్కడే తన్మూలంగా ఆనందానుభవమున్నూ. అలాంటి ఆనందం తాననుభవించాలన్నా, ఇతర్లకు కలిగించాలన్నా ఆ కళాశీలి మహామేధావి అయి ఉండాలి. మహాతపశ్శాలిన్నీ అయి ఉండాలి. కళావేత్తృతలోనే- కళాసాధనలోనే తన జీవితం పరిపక్వం చేసుకుంటూ ఉండాలి.

ఏమంటే? ఎవరి సంకల్పం విశుద్ధమో, ఎవరి హృదయం కళామయమో, ఎవరి దీక్ష అలోకసామాన్యమో, ఎవరి ప్రాప్యం లోక కల్యాణమో ఆ కళాశీలుల నిర్మాణాలే ద్వంద్వ భూయిష్ఠమైన భౌతిక జగత్తులో ధ్రువతారలయి మెరుస్తూ ఉంటాయి. నిజంగా అత్తరులలాంటి ధ్రువతారలు. అయినా "అక్కర్లేదు", అని చెప్పేస్తే, వెంటనే అతనర్థమూ చేసుకోగలడు, సులభంగా నిరాశా చేసుకోగలడు, నిర్విచారంగా వెళ్లి పోనూగలడు; కాని యిదేమిటి యీ వాలకం? తన అత్తర్లకు విలువ కేవలమూ డబ్బే అయితే అందుకోసం అతనింత దూరం రానక్కర్లేదు. ఉన్నఊరే కదలనక్కర్లేదు.

అసలు, ఢిల్లీ నగరమే ఒక మహాదేశం అంత. అక్కడే ఎందరో ప్రభువులూ, సంపన్నులూను. వారిలో, ఎందరో రసికులు. అతని అత్తర్లు కళ్లకద్దుకునేవారు, వారిలో మళ్లీ వందలూ వేలూనూ. అయితే, పెద్దాపురం ప్రభువు, శ్రీశ్రీశ్రీ శ్రీవత్సవాయి చతుర్భుజ తిమ్మ జగపతి మహారాజు రసికత ఢిల్లీలో గుబాళించింది. ఢిల్లీ పాదుషా రసికతకు వంకలు దిద్దింది. ఖాను ఆగలేకపోయాడు. దీక్ష పట్టాడు.

తపస్సులో కూచున్నాడు. అపూర్వసాధన చేశాడు. తహతహలాడిపోయాడు. రెక్కలు కట్టుకువచ్చివాలాడు. కాని, షష్ఠి ఘడియలూ పువ్వులతోనే కాలంగడిపే అతనికి, ఇక్కడ, ప్రభుదర్శనం గగనపుష్పం అయిపోయింది. అపూర్వమైన జాతిరత్నం గులకరాళ్లలో కూరుకుపోయి ఉండినట్టనిపించిందనికి. వచ్చి వచ్చి ముళ్లకంచెల్లోనూ, మురుగు గుంటల్లోనూ పడిపోయినట్లు బాధపడ్డాడతను. 'అంత ఢిల్లీలో కూడా - అంతంతలేసి వజీర్లయినా చెయ్యలేని కుట్ర యిది' అని పరితపించాడతను. బయట ఉండగా పెద్దాపురం ఎంత ఆశకొలిపిందో, వచ్చి ప్రవేశించాక అంత దిగగుంజేసినట్లు అనిపించిందతనికి. దక్షిణ దేశానికి దక్షిణదేశమే దుష్టమృగ సంకీర్ణం అయిన కీకారణ్యంలా తోచిందతనికి. దీంతో 'ముక్కూ మొగమూ యెరగని చోటికి రావడం మనదే బుద్ధితక్కువ' అని విసుక్కున్నాడతను. కాని, తన భృత్యుల చేతిలో ఒక కళాశీలి ఎంత క్షోభపడుతున్నాడో మహారాజుకెలా తెలుస్తుంది? లోకంలో, ఎక్కడా కూడా ఇలాంటి అంతరువులు తప్పవంటే సమ్మతమే. అయితే, ఎంతెంతలేసి ధర్మరాజ్యాలలోనూ, మహోదారులైన యెలాంటి ధర్మప్రభువుల పరిపాలనలోనూ అసంతృప్తి కలిగిందంటే- ఏవగింపు పొటమరించిందంటే- విరోధభావం పుట్టుకువచ్చిందంటే - కల్లోలాలు చెలరేగాయంటే అక్కడి కార్యనిర్వాహకుల ఇలాంటి అతిలౌక్యాల వల్లనే.

కాని, ఏది ఏమయినా ఎంత చూసినా ఖానుకిక్కడ ఒక్కటే ఫలితం. అంచేత 'సన్మానం మాట దేవుడెఱుగును, మర్యాదగా అయినా ఇక్కణ్నుంచి వెళ్లగలమా?' అని బెంగ పెట్టుకుందతనికి. ఇలా ఉండగానే కోళ్లు కూశాయి. పనిలోపని కాకులు కూడా కూసేశాయి.

* * *

తెల్లవారడం తడవుగా వెళ్లి రాణేదారు పాదాలమీద వాలాడు ఖాను. ఇంతవరకూ అంత గొప్ప అత్తర్లు పెద్దాపురం కోటకు రాలేదు. రాణేదారుకి తెలుసు. ఖానుకి మంచి సన్మానం జరగడం దివాన్జీకి సుతరామూ ఇష్టం లేదు, ఇదీ తెలుసు అతనికి. బుర్ర ఎగిరిపోడానికయినా ఒప్పుకుంటాడు; గాని, ఖాను, కిట్టింపు ధర చెప్పడు, ఇదిన్నీ తెలుసు అతనికి. చూశాడంటే, మహారాజు, ఖాను అత్తర్లు విడిచిపెట్టడు. అది, ఆ సమయంలో, దివాన్జీ దగ్గర ఉండినవారందరూ గుర్తించేశారు. రాణేదారు ఆలోచించాడు. ఉండుండి "సాహసించగలవా?" అనడిగాడతను.

"మానం నిలిచేటట్టు లేదు. ఇక ప్రాణాలెందుకూ? ఆజ్ఞాపించండి" అంటూ ప్రాధేయపడ్డాడు ఖాను.

"ఇక నువ్వు కోటలో ప్రవేశించడం అసాధ్యం. ప్రవేశించినా ముందుకు వెళ్లగలగడం అబద్ధం. వెళ్లినా నిలిచిఉండటం దుర్ఘటం. ఇన్నీ జరిగితే మాత్రం నీ కోరిక సఫలం అవుతుంది, తప్పదు"

"సెలవిప్పించండి"

"కోట ప్రాకారం దాటకుండా నువ్వు వారికళ్లబడాలి. కనీసం నీ వట్టివేళ్ల అత్తరయినా వారినాకర్షించాలి"

"సెలవిప్పించండి"

"దివాన్జీ వారిదివరకే యిది ఊహించి ఉంటారు. ఇందుకు ప్రతిక్రియ ఆలోచించి ఉంటారు. ఆజ్ఞలు మాత్రం ఇంతవరకూ పుట్టలేదు.

"సెలవిప్పించండి."

"నీకు అదృష్టం ఉంటేనే ఆయనకిది మరుపు వస్తుంది. మహారాజు పెట్టిపుట్టినా మరుపు వస్తుంది. లేదూ, నువ్వు కోటలో ప్రవేశించలేవు"

"సెలవిప్పించండి"

"నావల్ల కాతగ్గదింతే. ఇక యేటికడ్డపడు"

ఖానుకి ఊపిరి తిరిగింది.

"నిన్న నేను దాఖలు చేసుకున్నది చందినీ అత్తరు. ఇదిగో యిదిన్నీ స్వీకరించండి. దివాన్జీవారికి నా మీద అనుగ్రహమూ లేకపోయింది. యిది వాడుకునే యోగ్యతా లేకపోయింది. ఎవరేమి చెయ్యగలరూ? తమరు చివరి ఉపాయం చెప్పారు. బతికి ఉంటే నేను తమ మేలు మరవను."

అలా చెప్పి, మూడుమాట్లు వంగి సలాములున్నూ చేసి ఖాను వెళ్లిపోయాడు.

* * *

ఖాను కోటలో ప్రవేశించాడు. వంకదార దాటి అనుమానిస్తూనే పదడుగులున్నూ వేశాడు; కాని ఇంతలో "అరే, అరే" అని నాలుకలు కరిసిపోయాయి. వాటిని ఒరుసుకుంటూ కాలం కూడా గడిచిపోయింది. "ప్రాకారంలో నిలవగలిగితే చాలు" అని ఖానుకి సలహా. లోపల్లోపల అతను ధన్యవాదాలు చెప్పుకుంటూనే ఉన్నాడు. ముందుకడుగు పడనివ్వవద్దని సిపాయిలకు దివాన్జీ ఆజ్ఞ. అందుకు వారూన్నూ మురిసిపోతూనే ఉన్నారు. అంతలో, ఆ చుట్టుపట్ల పనిచేస్తున్న వారందరూ వచ్చి మూగారు. వచ్చి పోయే వారున్నూ నిలిచిపోయారు. చూస్తూ ఉండగానే, మహారాజు చదరంగ సహచరులూ, దశావతారీ స్నేహితులూ వచ్చారు. వారున్నూ నిలిచిపోయారు. పాటకజనమే కాక, పెద్ద మనుష్యులున్నూ పోగయినందుకు ఖాను సంతోషించాడు.

"ఏమిటేమిటి?" అన్నారు కొందరు.

ఖాను తన అవస్థ అంతా చెప్పుకువచ్చాడు.

చక్కటి తెలుగు పలుకుబడులు తెలుసుకోవటానికి శ్రీపాద కథలు చదవాలని పెద్దలు చెబుతారు. సహజత్వం నిండిన చక్కటి పొట్టిపొట్టి సంభాషణలతో పాఠకులను కథలోకి తీసుకుపోయే లక్షణం శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథలకుంది. దాదాపు వంద కథలు, కొన్ని నవలలు, 'అనుభవాలూ, జ్ఞాపకాలూనూ' పేరుతో రాసిన ఆత్మకథ శ్రీపాద సాహితీవనంలో పూసిన పూలు. 'వడ్లగింజలు' కథ తెలుగు సాహిత్యం ఔన్నత్యాన్ని చాటిన కథ. 'మార్గదర్శి' 'అరికాళ్ల కింద మంటలు', 'కలుపు మొక్కలు' వంటి గొప్ప కథలు రాశారు. శ్రీపాద కథాకథన శక్తికి మచ్చుతునక ఈ 'గులాబీ అత్తరు' కథ.

కరచుకుంటూనూ, "ఎక్కడికెక్కడి"కంటూనూ వచ్చి నలుగురు సిపాయిలు అతణ్ని అటకాయించారు. ఖానుకి, వెంటనే రక్తం వుడుకెత్తిపోయింది. చూపులు చెదిరిపోయాయి.

కాని, సప్రయత్నంగా నిలవరించుకుని "నేను దివాన్జీ వారి దర్శనానికి వెడుతున్నాను, నన్నెందుకడ్డుకుంటారూ?" అనడిగాడతను.

"ఇప్పుడు వీలులేదు పోపో"మ్మన్నారు సిపాయిలు.

"నేను పాతవాణ్నేనయ్యా! నిన్నసాయంత్రం ఒక పనిమీద మాట్లాడే ఉన్నాను. ఆ వ్యవహారం పూర్తి చేసుకోడానికే వెడుతున్నాను"

"అయితే, వెళ్లు వారి లోగిటి దగ్గరే కనిపెట్టుకుని ఉండు, లోటేం?"

"పోనీ, ఠాణేదారుగారి కచేరీకి తీసుకువెళ్లండి"

"వారిప్పుడు దివాన్జీగారి సన్నిధిని ఉన్నారు. నీకు కనపడరు"

"వారు వచ్చేదాకా కనిపెట్టుకుని ఉంటాను."

"ఆ పని వారి ఇంటి దగ్గర, కోటలో వల్లకాదు."

ఇలా యుక్తుల మీద యుక్తులు దానిమీద, సిపాయిలు, తమ అసహాయస్థితి చెప్పారు. ఇలా ఒక్క గడియ గడిచింది.

"ఇంకో అరగడియ" అని ఎవరో అన్నట్టయింది ఖానుకి.

కాని, అంతవరకూ అతణ్ని అక్కడ నిలపగలిగినందుకు ఆనందిస్తున్న సిపాయిలూ, మరొక్కడు పరుగుపరుగున వచ్చి ఏదో చెప్పగా "ఇక దయచెయ్యి" అనడం ప్రారంభించారు.

"రాజు బయలుదేరుతున్నాడు. అందుచేతనే వీళ్లు పొమ్మంటున్నారు. ఇక గెంటుతారు" అని గుర్తించాడు ఖాను. చిరవాంఛా, దీర్ఘశ్రమా ఇలాగ వ్యర్థం అయిపోతున్నందుకు చాలాచాలా కుమిలిపోతున్నాడతను. చివరికతను, ఉండిన వారిలో పెద్ద మనుష్యులుగా కనపడుతున్న వారినుద్దేశించి "పెద్దాపురం రాజ్యంలో కళాకారులకిదా సన్మానం?" అని నిక్కచ్చిగా అడిగాడు. అంతే. దాంతో అతని శరీరం వొణికిపోయింది. కళ్లెర్రబడ్డాయి. చూపులు నిశితబాణాలయిపోయాయి. ఈ స్థితిలో చక్రున గులాబీ అత్తరు పైకి తీశాడతను. అందరూ చూపులప్పగించేశారు.

"ఇది పెద్దాపురం ప్రభువు కోసం తయారు చేశాను," అంటూ ముందు సీసా చేతబుచ్చుకొని పెట్టె కిందికి విడిచిపెట్టేశాడతను.

తరవాత "నిద్రాహారాలు మాని తయారు చేశా"నంటూ మళ్లీ అందుకుని "ఢిల్లీ పాదుషావారు అటూ, పెద్దాపురం ప్రభువు వారు ఇటూ అన్న గౌరవభావంతో నాశక్తి అంతా వినియోగించి బొట్టుబొట్టుగా కూడబెట్టానిది. ఒక్కరాకతో దక్షిణ దేశంలో నాపేరు నిలిచిపోతుందన్న పేరాశతో నా రక్తం అనుకుంటూ కూడబెట్టానిది. అయితే, 'పెద్దాపురం ప్రభువు ఎంత సరసులో వారి పరివారం అంత విరసమైనది' అని నేను ఇక్కడికి వస్తేగాని తెలుసుకోలేకపోయాను. గులాబీపువ్వు సౌరభం ఎంత దూరమో వ్యాపిస్తుంది; కాని దాని ముళ్ల ప్రభావం ఉన్నచోటనేగాని వెల్లడికాదుగా; ఇది నాకు కాదు అమర్యాద. ఇది నా గులాబీ అత్తరుకున్నూ కాదు అగౌరవం. ఇది పెద్దాపురం మహారాజుకందించడానికి నాకిక మార్గాలు లేవు. అయితే ఇది వెనక్కి తీసుకువెళ్లడం నాకే కాదు, మా కుటుంబానికే శిరచ్ఛేదం. ఇక నాకున్న తృప్తి ఒక్కటే. దివాన్జీగారి అతిలౌక్యంతో కనుమూసే మహారాజులుంగారి స్వచ్ఛకీర్తి, ఢిల్లీ నివాసి షుకురల్లీఖాను గులాబీ అత్తరు సౌరభంలో కలకాలమూ గుబాళిస్తూ ఉంటుంది. చాలు నాకిది" అంటూ ఊర్ధ్వశ్వాసతో కోటగోడకి విసిరికొట్టాడతను సీసా.

సీసా భళ్లుమంది. సీసా పెంకులు ఘళ్లున చెదిరిపడ్డాయి. రాజసఖుల హృదయాలు ఠవ్వుమన్నాయి. ఆ ప్రదేశం అంతా అత్తరు సౌరభంతో గుమ్ముమంది. అందరూ ఆ పరిమళానికి మత్తెక్కుతున్నట్టయ్యారు. ఒక్క క్షణానికి తెలివివచ్చి అందరూ కళ్లెత్తి చూసేటప్పటికి, హఠాత్తుగానూ అప్రయత్నం గానూ వెనక్కి తిరిగిచూసి ఖాను కొయ్యయి పోయాడు. అదేమిటో అని అందరూ వెనక్కి తిరిగి చూడగా, పంచకల్యాణి మీద, శ్రీశ్రీశ్రీ శ్రీవత్సవాయి చతుర్భుజ తిమ్మజగపతిమహారాజు అరకంట చూస్తూ సాక్షి ఉన్నాడు. మోర పైకెత్తుకుని ఉండి, పంచకల్యాణి ఉడుండి సప్రయత్నంగా ఊపిరి తీసుకుంటోంది.

* * *

ఇప్పటికీ, ఆ ప్రదేశంలో, గులాబీ అత్తరు సౌరభం గుబాళిస్తూనే ఉంటుందంటారు చూసివచ్చినవారు.

'తెలుగు' శపథం చేద్దాం!

శోభారాజు

> "తెలుగును ప్రయత్నపూర్వకంగా ఎందుకు దూరం చేసుకుంటున్నాం? స్వాతంత్ర్యం వచ్చి 65 ఏళ్లు వచ్చినా ఇంకా మనలో పీఠం వేసుకున్న బానిసత్వ భావనే కారణం"

ప్రపంచ దేశాలతో మాట్లాడటానికి మనం ఆంగ్లం నేర్చుకోవాలి, తప్పదు. కానీ మన భాషను మరచిపోవడం మన ఉనికిని పోగొట్టుకోవడమే కదా? తెలుగు పరిరక్షణ పెద్ద కష్టం కాదు. నా విద్యాభ్యాసం నేపాల్‌లో ఆరంభమైంది. అక్కడ కే.జీ.ని "శిశు" అనేవారు. మనం కూడా తరగతులకు అలాంటి పేర్లు పెట్టుకోవచ్చుకదా? ప్రాథమిక పాఠశాలలో తెలుగును తప్పనిసరి చేయాలి. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని తెలుగుననడం కాదు, "తెలుగు ఆఫ్ ది వెస్ట్" అని ఇటాలియన్‌నే సంభావించవచ్చు. అంతటి లాలిత్య, గాంభీర్యముల సుమధుర మేళవింపు మన తెలుగు. ఇంతటి గొప్ప భాషకు వారసులమైనా తెలుగును ప్రయత్నపూర్వకంగా ఎందుకు దూరం చేసుకుంటున్నాం? స్వాతంత్ర్యం వచ్చి 65 ఏళ్లు వచ్చినా ఇంకా మనలో పీఠం వేసుకున్న బానిసత్వ భావనే కారణం. ఆంగ్లంలో 'నర్సరీ రైమ్స్' నేర్చుకున్నా, భాషా పరిరక్షణకు 'చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ', 'ఉప్పు కప్పురంబు నొక్క పోలికనుండు' లాంటి పద్యాలు నేర్పిస్తే బాగుంటుంది. ఒక టీవీ ఛానల్‌లో 'క్లాసు పీకారట' అని ఒకమ్మాయి వార్తలు చదివింది. ఇది వరకు వార్తలు ఒక భాషా ప్రామాణికతతో చదివేవారు. ఇప్పుడు అది కొరవడింది. 'నలుగురికి నచ్చే విధంగా' అన్నదే ప్రమాణంగా తీసుకుంటూ ప్రచార మాధ్యమాలు ప్రవర్తిస్తే భాష వికలాంగమైపోతుంది. సినిమాల్లో ఉచ్చారణ దోషాలతో ఇతర భాషా గాయకులతో పాడించి శ్రోతలను 'ఆ పాటకున్నది ఏ భాష' అనే ఆలోచనకు గురిచేస్తున్నారు. ఇది ఒక రకమైన హింసోద్భవానందం (శాడిజం). డబ్బు వస్తుందంటే ఏమైనా చెయ్యటానికి సిద్ధంగా ఉన్న వారి సంగతిని సెన్సార్ వారు పట్టించుకోవాలి. సెన్సార్ బోర్డులో ఒక తెలుగు పండితుణ్ని కూడా నియమించడం ముఖ్యం. భాషా దోషాలున్న పాటలను ఆమోదించకూడదు. అందంగా ఉన్న 'న్యూస్ రీడర్స్' కావాలనుకుంటున్నారే తప్ప స్వచ్ఛమైన ఉచ్చారణ ఉన్న వార్తా వ్యాఖ్యాతలు ఎవరికి కావాలి? పోనీ ఇది చలనచిత్ర రంగానికి బుల్లితెరకి సంక్రమించిన జాడ్యమే అనుకుంటే దేవస్థానాలు కూడా పొరుగింటి పుల్లకూర రుచి వ్యవహారమే చేస్తున్నాయి. తెలుగు అందరికీ ఒంటబట్టే వరకు చక్కటి తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలి. 'పద్యం' తెలుగువారి సొంతం. పద్యపఠనంలో పిల్లలకు పోటీలు పెట్టాలి. టీవీ ఛానల్స్ భాషాపరమైన కార్యక్రమాలకు కనీస సమయం కేటాయించాలనే నిబంధన రావాలి. గుడ్ మార్నింగ్ మాని 'శుభోదయం' అని ఒకరినొకరు పలుకరించుకుంటామని, మమ్మీ డాడీ అని కాక అమ్మా నాన్న అని పిలుచుకుంటామని మనకు మనమే శపథం పూనుదాం. తెలుగు బాగా రావాలంటే అన్నమయ్య పాటలు చదవండి అన్న వేటూరి ప్రభాకరశాస్త్రిగారి మాట విందాం. భాష భావానికి ఆహార్యం, భావశుద్ధి చేసుకుని అందమైన తెలుగులో మాట్లాడుదాం. భాండ శుద్ధి లేని పాకమేల? భావ శుద్ధి లేని భాష ఏల? జై తెలుగు తల్లీ.

అక్షరక్రీడ I

1					X
2					
3					
4					X
5					
6				X	X
7				X	X
8					X
9				X	X
10				X	X
11			X	X	X

1. దేవాలయానికి వికృతి.
2. అజ్ఞాతంలో పాండవులు ఆయుధాలు దాచిన చోటు.
3. వినాయకచవితి వచ్చే తెలుగునెల.
4. తుమ్మెదకు సంస్కృతంలో ఆరుకాళ్లు.
5. వినాయకుడు.
6. కోట.
7. సాహసము.
8. ఎదురు తిరిగిన ప్రథమావిభక్తి ప్రత్యయాలు.
9. కూష్మాండము, ఒక ప్రముఖ సినీనటుడు
10. రాజు... సభకు వెనక్కివెళ్లాడు.
11 చెప్పిందే వేదం. విశేషమేమంటే 'వి' జారిపోయింది.

అక్షరక్రీడ పూర్తిచేసి మొదటి అక్షరాలను నిలువుగా చదివితే మనభాష గొప్పతనం తెలుస్తుంది.

సమాధానాలు 114వ పేజీలో

బలవంతంబుగ పంపి, బళ్ల గదులన్ బంధించి, 'ఇంగ్లీషు' ము
క్కలు చిన్నారుల కంటరుద్దుటొకటే కైవల్య మన్నట్టుగా
తలిదండ్రుల్ తలపోయుచుండ, నిక నే 'దైవంబు' కాపాడు, మా
టలె రానట్టి అభాగ్య బాలలను? కట్టా! దీని కంతెన్నడో?

- హెచ్.ఆర్.చంద్రం,
గుడివాడ, కృష్ణా జిల్లా. 94932 48053

జాతీయోద్యమ రణన్నినాదం

తెలుగు సాహితీరంగంలో వెలుగులు విరజిమ్మే రవ్వలు, రత్నాల వంటి నవలలెన్నో... వాటిలో ఎన్నదగినది 'మాలపల్లి' నవల. దీనిని రచించిన ఉన్నవ లక్ష్మీనారాయణ స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్త, కార్యశూరుడు. గుంటూరు జిల్లా పుల్లరి సత్యాగ్రహోద్యమాన్ని నడిపినవాడు. అందుకుగాను బ్రిటిష్ ప్రభుత్వం ఆయన్ని 1921 సంవత్సరంలో నిర్బంధించి మూడు రోజుల్లో విచారణ ముగించి సంవత్సరంపాటు కారాగార శిక్ష విధించింది. రాయవెల్లూరు జైలులో ఆ సంవత్సరకాలంలో ఎనిమిది ఎక్సర్‌సైజు పుస్తకాలలో ఈ నవలను రాశారు. నవల ప్రచురణ కాకముందే దాన్ని నిషేధించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఇది తెలుగులో తొలినవల కాకపోయినా తొలినాళ్ల నవల. సాహిత్యంలో వాడుక భాషకు ఆదరణ లేని రోజుల్లో వాడుక భాషలో అందునా గుంటూరు ప్రాంత మాండలిక పదాలు పలుకుబడులు, విరివిగా వాడుతూ రాసిన నవల. మాండలిక పదాలతో వెలువడిన తొలి తెలుగు నవల 'మాలపల్లి'.

గాంధీ తత్వాన్ని జీర్ణించుకుని గాంధీ అడుగు జాడల్లో స్వాతంత్ర్య సమరంలోకి దిగిన వ్యక్తి ఉన్నవ. అదే రోజుల్లో రష్యాలో విప్లవం విజయవంతమై కమ్యూనిజం తలెత్తుకు నిలబడుతున్న తొలిరోజులు. కమ్యూనిజం పట్ల తెలియని ఆరాధనా భావమూ ఉంది రచయితలో. అందుకే అటు గాంధీ తత్వాన్ని, ఇటు కమ్యూనిజాన్ని సమన్వయపరిచి ఇక్కడి సామాజిక స్థితికి అద్దం పడుతూ నవల రాయటానికి ఉపక్రమించాడు ఉన్నవ రాయివెల్లూరు జైలులో.

నవలకు కేంద్ర బిందువు గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలూకా మంగళాపురం గ్రామం. అందులోనూ మాలపల్లి. రామదాసు మాలదాసరి. పూర్వీకులు వైష్ణవ బోధకులు. రామదాసు అదే మార్గంలో నడుస్తూ, జ్ఞానమార్గంలో ప్రవేశించి బోధ చేస్తుంటాడు. కాబట్టే ఊళ్లో అతనంటే మర్యాద, మన్నన. అతనికి నలుగురు పిల్లలు; పెద్దకొడుకు వెంకటదాసు వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటాడు. రెండోవాడు సంగదాసు ఊరి షావుకారు నల్లమోతు చౌదరయ్య దగ్గర పెద్ద జీతగాడు. చదువుకున్నవాడు. తెలివిగలవాడు. మూడోవాడు పసివాడు. మొదటి ఇద్దరి తర్వాత పుట్టిన ఆడపిల్ల జ్యోతి అంటే అందరికీ గారాబమే.

నల్లమోతు వంశానికి గుంటూరు జిల్లాలో పేరు ప్రఖ్యాతులున్నాయి. ఆ వంశీకుడిగా చౌదరయ్యంటే భయభక్తులున్నాయి. చౌదరయ్య పెత్తనానికి వచ్చాక, చౌకధరకి కొనటం వల్లకానీ, బాకీల కింద జమ కట్టుకోవడం వల్లకానీ 500 ఎకరాలు పల్లం, 300 ఎకరాలు మెట్ట సంపాదించాడు. అయినా కాపీనం తగ్గలేదు. ఇంకా సంపాదించాలనే కోరిక. కష్టజీవుల పాలిట యముడే. ఆయన కడుపున తప్పబుట్టిన రామానాయుడు ఏకైక పుత్రుడు. నిగర్వి. పేదసాదలంటే అభిమానం మెండు. తమ దగ్గర జీతగాడుగా పనిచేస్తున్న సంగదాసుకి ప్రాణమిత్రుడు. ఇద్దరూ కాంగ్రెసు రాజకీయాలు, స్వాతంత్ర్యోద్యమ కార్యక్రమాలను నిత్యం చర్చించుకుంటూ ఉంటారు. ఊళ్లో కోతల సీజను మొదలయింది. కూలిరేట్లు పెంచాలని సంగదాసు ఆలోచనలో ఉంటే, ఉన్న కూలీకే ధాన్యానికి బదులు డబ్బు రూపేణా ఇచ్చి మోసం చెయ్యాలని చౌదరయ్య నాయకత్వంలో మునసబు, మరికొంత మంది పెద్దల పన్నాగం.

రామానాయుడు, సంగదాసులిద్దరూ కలిసి బెజవాడ ఆది ఆంధ్రుల సభకు ప్రయాణమయ్యారు. ఇది తెలిసిన మునసబు, మోతుబరుల దగ్గర ఉన్నవీ లేనివీ కల్పించి ప్రచారం చేశాడు. చౌదరయ్య ఉగ్రుడయ్యాడు. కోపంతో ఊగిపోతున్న చౌదరయ్య రాగోల బిగబట్టి సంగదాసు తలమీద

కొట్టాడు. తల రెండు ముక్కలైంది. సంగదాసు మరణించాడు. ఊళ్లో అగ్గిరాజుకుంది. సంగదాసు అంత్యక్రియలు ఘనంగా జరిగాయి. రామానాయుడు బాధకు అంతేలేదు. కేసు మాఫీకి ప్రయత్నాలు చేస్తూనే చౌదరయ్య రామదాసు కుటుంబంపై పగపట్టాడు. రామదాసు సాగు చేసుకుంటున్న పదెకరాల రేగడి చేనుకు కుతంత్రాలతో కోర్టు డిక్రీ సంపాదించి రామదాసుకు కాకుండా చేశాడు. రామదాసు బికారైపోయాడు. పెద్దకొడుకు వెంకటదాసు ఇల్లు విడిచిపోయాడు.

ప్రభుత్వం మాలమాదిగల్ని కూడా నేరస్థ జాతికింద చేర్చి తమకు గిట్టని మనుషుల్ని సెటిల్మెంట్లలో కుక్కింది. దొంగకేసు బనాయించి రామదాసును తాడేపల్లి సెటిల్మెంటులో పెట్టారు. వైష్ణవ భక్తులైన రామదాసు దంపతుల్ని జైలుకు పంపించాడు బ్రౌన్సన్ అనే మత ప్రచారకుడు.

గుంటూరు జిల్లాలో ఓ ఉపద్రవం వచ్చిపడింది. అది తక్కెళ్ల జగ్గడి పేరుతో వచ్చింది. ప్రభుత్వం దృష్టిలో ముఖ్యంగా బీదసాదల దృష్టిలో అతడు కొత్తదేవుడు. జగ్గడు దోచిందంతా బీదసాదలకు పంచుతాడని జనంలో ప్రచారం. అతడిని బంధించటం పోలీసుల వల్ల కావటం లేదు. ప్రభుత్వం జగ్గడిని బంధించడానికి సీఐడీ అధికారి రాంసింగ్‌ను పిలిపించి పదివేల సైన్యాన్ని తోడిచ్చింది. ఎత్తులకు పైఎత్తులు వేసి జగ్గడిని, అతడి మనుషులను ఉచ్చులో బిగించి పట్టుకున్నారు. తీవ్రగాయాలతో నెత్తురోడుతున్న జగ్గడిని బంధించి కర్నూలు జైలులో పడేశారు పోలీసులు.

కర్నూలు జిల్లా కలెక్టరు హెండర్సన్ జగ్గడిని 'ధర్మబద్ధుడైన చోరుడ'న్నాడు. జగ్గడికి వైద్యచికిత్స ఏర్పాటు చేశారు. కేసు విచారణకు గుంటూరు తరలించారు.

ఇంతకీ జగ్గడు ఎవరోకాదు రామదాసు పెద్దకొడుకు వెంకటదాసే! ఈ విషయం క్షణాల మీద జిల్లా అంతా పాకిపోయింది.

నాటి వ్యవస్థపై వెంకటదాసు కోర్టులో సుదీర్ఘమైన ఉపన్యాసం చేశాడు. రష్యన్ రచయిత గోర్కీ 'అమ్మ' నవలలో పావెల్‌చేసిన ఉత్తేజపూరిత ఉపన్యాసం అది. సీజర్ చనిపోయినపుడు మార్క్ ఏంటోనీ చేసిన తెలివైన ఉపన్యాసం అది. ప్రముఖ నటుడు చార్లీచాప్లిన్ 'గ్రేట్ డిక్టేటర్' సినిమాలో చేసిన మానవీయమైన ఉపన్యాసం అది.

సరళభావంతో కేసును పరిశీలించి కేవలం అయిదు సంవత్సరాల కారాగారశిక్ష వేశాడు హెండర్సన్. వెంకటదాసు నిడదవోలు జైలులో తల్లిదండ్రులను చూశాడు. మర్రోజే తల్లి మరణించింది. గాయాల బాధతో వెంకటదాసూ మరణించాడు. స్వరాజ్య చట్ట తీర్పుతో రామదాసు జైలు నుంచి విడుదలయ్యాడు. మంగళాపురంలో జగ్గడు దోచుకున్న కొంత సొమ్ము, రామానాయుడి ఆస్తితో కలిపి నిర్మించిన విజయ గురుకుల కళాశాలకు ప్రజల బలవంతంమీద కులపతి అయ్యాడు. ఆ తర్వాత ఏమయ్యాడో ఎవరికీ తెలియదు. సిద్ధుడై కొండ గుహల్లో ధ్యానం చేసుకుంటూ పరబ్రహ్మంతో ఐక్యమయ్యాడని పెద్దలు చెప్పుకుంటారు. కాలం చెక్కిలిపై కన్నీటి చారిక అన్నారు మాలపల్లి నవలను.

ఒక తరం ముగిసింది- ఒక మహోద్యమం ఆగింది. ఒక ఉజ్వల శకానికి ముగింపు వచ్చింది. నూతన శకారంభం అయింది.

ఈ నవల ప్రధాన ఇతివృత్తం రామదాసు. చౌదరయ్య, వెంకటదాసు వంటి ప్రధాన పాత్రల చుట్టూ తిరిగినా ఇవి కాక అనేక దాస కథలు అందుకనుగుణమైన అనేక పాత్రలు మన కళ్లకు కట్టినట్లు చిత్రించారు రచయిత. కొందరు విమర్శకులన్నట్లు టాల్‌స్టాయ్ 'అన కరేనినా' నవల్లో ఉన్నన్ని పాత్రలతో వాటి మధ్య ప్రధాన కథకు ఇబ్బంది కలిగించకుండా కథ నడిపించటం కత్తిమీద సాము వంటిది. జ్యోతి, అప్పాదాసు ప్రేమకథ, ముతరాచు ముసలమ్మ పాత్ర రామానాయుడు సంసారంలో సున్నిత శృంగారం. మాలపల్లిలో మాలదాసరుల జీవన విధానాన్ని వర్ణించిన తీరు హృద్యంగా సాగుతుంది నవల.

వీటితో పాటు గుంటూరు జిల్లా పలుకుబడులు పదవిన్యాసాలు పాఠకులను ఆ ప్రదేశాల్లో నిలబెడతాయి. కుంటగట్టు, పయిటన్నం, సందెడు, పచ్చిచొప్ప వంటి పదాలు మనం మరిచిన మన తెలుగును గుర్తుకు తెస్తుంది. నవల ప్రారంభంలోనే చేనుని వర్ణించిన తీరు, చేనుతో ముడిపడిన ఆహ్లాదకర వాతావరణం పాఠకులను ఆకట్టుకుంటుంది. గేదె యానినపుడు ఆ ఘట్టాన్ని వర్ణించిన తీరూ ముచ్చటగొల్పుతుంది. 'ముక్కలు పిండి గిట్టెలు గిల్లచోగా బలె బుస్సుమన్నది' వంటి వాక్యాలు- మనల్ని వెంటాడుతూనే ఉంటాయి.

మాలపల్లి నవల ముగిసినా అందులోని పాత్రలు మనల్ని వెన్నాడుతూనే ఉంటాయి. ముఖ్యంగా రామదాసు వెంకటదాసు ఉరఫ్ జగ్గడు. రెండు విరుద్ధ భావాల కలయికతో రాసిన ఈ నవల తెలుగు సాహిత్యంలో ఆచంద్రతారార్కం నిలుస్తుందని విజ్ఞుల భావన.

- తెలుగు వెలుగు బృందం



1921-22 మధ్యకాలంలో ఉన్నవ లక్ష్మీనారాయణ జైలులో రాసిన ఈ నవల ప్రచురణకు ముందే నిషేధించటానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. అసలుప్రతి జైలు అధికారులు, ప్రభుత్వాధికారుల మధ్య చక్కర్లు కొడుతూనే ఉంది. ఈ లోపు ఆశ్చర్యంగా 1922 నవంబరు నెలలో మొదటి సంపుటం విడుదలై ఇటు సాహితీలోకంలో ప్రకంపనలు సృష్టిస్తే, ప్రభుత్వాధికారులకు ముచ్చెమటలు పట్టించింది. జైలులో ఉండగానే ఉన్నవ సహచరుడు మాడభూషి నరసింహాచారి ఈ నవలకు మరో నకలు ప్రతిని తయారుచేసి జైలు నుంచి రహస్యంగా బయటికి పంపారు.

1923 జులై నాటికి మూడు భాగాలుగా మాలపల్లి పూర్తినవల విడుదలైంది. ప్రతి సంపుటాన్నీ విడుదలైన నెలకే నిషేధిస్తూ వచ్చింది ప్రభుత్వం. 1928లో నిషేధం ఎత్తివేశారు. 600 పేజీల బృహత్ నవలని 1935లో రెండో ముద్రణని కాశీనాధుని నాగేశ్వరరావు తన సొంత 'ఆంధ్రగ్రంథమాల' తరపున ప్రచురించారు. దీన్ని ప్రభుత్వం వెంటనే నిషేధించింది. అయితే రాజాజీ చొరవతో 1936లో ఆ నిషేధం తొలగిపోయింది.

శ్రీరామరక్ష

వేపచెట్టు కింద వేమనలా కూర్చున్నాడు బైరాగి. వానాకాలం అయిదు గంటలకే చీకటి పడ్డట్టుంది. ఉరుములు, మెరుపులతో పాటు సన్నజల్లు మొదలైంది. కూర్చున్న గోనె ఎత్తి చిల్లర డబ్బులు, నోట్లు లెక్కపెట్టుకున్నాడు. మొత్తం నాలుగు వందల ఇరవై ఒక్క రూపాయల, డెబ్బై ఐదు పైసలున్నాయి. తులసి మాల పట్టుకుని జపిస్తున్నా, మనసు మాత్రం ఆలోచనల్లో పడింది. ఇంతలో ఓ కారు ఆగింది. ఒక స్త్రీ కొంగు నిండా కప్పుకుని దిగింది. వెంటనే బైరాగి అలవాటుగా సన్నద్ధుడయిపోయాడు. తన ముందున్న సీతా రాముల విగ్రహాన్ని తదేకంగా చూస్తూ ధ్యానంలో ఉన్నట్లు కూర్చున్నాడు. ఇంతలో ఆ స్త్రీ బైరాగి ముందు నిలుచుని చేతులు జోడించింది.

"స్వామీ! నమస్కారం! ఆశీర్వదించండి" అంటూ వంద రూపాయల నోటు బైరాగి చేతిలో, పళ్ళ బుట్ట ఆయన పక్కన పెట్టింది. సంతృప్తిగా ఆ నోటును చూశాడు బైరాగి. కాని ఆ సంతోషం బయటపడకుండా జాగ్రత్తపడి, నిర్లిప్తంగా చూస్తూ, ఆవిడను ఆశీర్వదించాడు. 'నా ఆశీర్వాదానికి అంత మహిమ ఉందా?' అనుకుని మనసులోనే నవ్వుకున్నాడు.

భక్తురాలు వెళ్లాక కూర్చున్న గోనె విప్పి పరుచుకున్నాడు. గడ్డాన్ని, కాషాయ వస్త్రాలని ప్రేమగా తడుముకున్నాడు. తృప్తిగా నడుం వాల్చాడు. ఎంత ప్రయత్నించినా నిద్ర రాలేదు. గతం కళ్ల ముందర తిరగసాగింది.

ఆ రోజు తన తల్లి పనికి వెళ్ళలేదు. నాలుగు రోజుల నుంచి చలిజ్వరంతో లేవ లేదు. కూలీ లేకపోతే రోజు గడవని జీవితాలు వాళ్ళవి. లక్ష్మమ్మ పడక వేయడంతో బైరాగికి డబ్బుల ఇబ్బంది మొదలయింది. బైరాగి నిత్య అవసరాలకి కనీసం పది, పదిహేను రూపాయలు కావాలి. తాగుడుకి అలవాటు పడి, ఏ పనీ చెయ్యని బైరాగి లక్ష్మమ్మకి పెద్ద సమస్య అయ్యాడు. మందు పడకపోతే మనిషి కాడు. మందు లేక కాళ్ళూ చేతులూ లాగేస్తున్నాయి అతనికి.

'ముసలిదానిలా నేనూ మంచం యెక్కేలాగా వున్నాను. మందు పడితే తప్ప లాభం లేదు' అనుకున్నాడు బైరాగి. గుడిసెలో ఎంత వెదికినా ఒక్క పైసా దొరకలేదు. ఇంట్లో వస్తువులు ఎప్పుడో అమ్మేనంటే బైరాగి. ఇంతలో సీతారాముల కంచు విగ్రహం కనిపించింది.

ఒక్క అంగలో అక్కడికి వెళ్ళి దీపం ఆర్పేశాడు. గుడిసె అంతా చీకటి కమ్ముకుంది. లక్ష్మమ్మ చూడకుండా విగ్రహాన్ని చేబుచ్చుకుని, బయటకు వెళ్ళటానికి సిద్ధం అయ్యాడు. 'అక్కరకు రాని దేముడు ఉన్నా, లేకపోయినా ఒకటే. దీన్ని అమ్మేనంటే నాలుగు రోజులు మందుకు ఢోకా వుండదు' అని మురిసిపోయాడు.

అలికిడికి లక్ష్మమ్మ కళ్ళు తెరిచింది. కొడుకు విగ్రహం తీయడం చూసింది "అంత అపచారం చెయ్యకు. ఆ దేముడి దయ వల్లే మనం ఈ పాటిగా ఉన్నాం. ఆయనే మనకి రక్ష" అని వారించింది నీరసంగా.

"ఊరుకోవే ముసలిదానా! నీతులు చెప్పకు. రక్షకుడైతే నన్నూ రక్షిస్తాడులే!" అని విసురుగా బైటకు వెళ్ళిపోయాడు బైరాగి. లక్ష్మమ్మ ఏడుస్తూ, నిస్సహాయంగా, నీరసంగా పక్క మీద ఒరిగిపోయింది.

గుడిసె బైటకి వెళ్ళి, వెలుతురులో సీతారాముల విగ్రహాన్ని పరిశీలనగా చూశాడు బైరాగి. రాముల వారి నడుముకి చిన్న మూట ఉంది. 'ముసల్ది ఏదో కట్టినట్టుంది' అనుకున్నాడు

గుడిసె పక్కనున్న మురికి కాలవ గట్టున కూర్చుని మూట విప్పాడు. మూటలో అక్షింతలు, పదకొండు రూపాయలూ వున్నాయి. ఆ బట్టని, అక్షింతలని కుళ్ళు కాలవలోకి విసిరేశాడు. పదకొండు రూపాయలని గుప్పెటలో పట్టుకోగానే, ఏనుగంత బలం వచ్చినట్లనిపించింది. కళ్ళు మిలమిలలాడాయి. నరాలు వేగం



పుంజుకున్నాయి. అంతదాక అడుగేయలేని కాళ్ళు గబగబా నాటుసారా అమ్మే పాక వైపు బయలుదేరాయి. చీకటి పడింది. ఉరుములూ, మెరుపులూ పెరిగాయి.

ఆంజనేయస్వామి గుడి దగ్గర పూజారి కనిపించాడు. 'నీ పాపిష్టి మొహం చూశానంటే, గంగలో మునిగి రావలసిందే' అనుకుంటూ పక్కకి వెళ్ళిపోయాడు. నది గట్టున నడుస్తున్న బైరాగికి నీళ్ళ బిందెలతో వస్తూన్న అమ్మలక్కలు కనిపించారు. 'పనీ పాటా లేకుండా బేవార్సుగా బతికేస్తున్నాడు' అనుకుంటూ వెళ్ళిపోయారు. కారు చీకటి కమ్ముకుంది. వాన మొదలయింది. క్రమంగా కుండపోతగా మారింది. గబగబా నడవటం మొదలుపెట్టాడు బైరాగి.

'విగ్రహాన్ని రేపు అమ్ముతాను. ఇవ్వాళ్టికి ఇది ఉంది కదా!' అనుకుంటూ గుప్పెటలోని

పదకొండు రూపాయల్ని ఆప్యాయంగా చూశాడు బైరాగి. సారా పాకకి చేరాడు. ఓ రూపాయి పకోడీలు, పది రూపాయల సారా విలాసంగా పట్టించాడు. బైరాగి మనసు కుదుటపడింది. ఏదో తెలియని హాయి! సీతారాముల విగ్రహాన్ని చేత పట్టుకుని అడుగులు తడబడుతూ ఉంటే గుడిసె వైపు బయలుదేరాడు. వర్షంలో నడవటం కష్టంగా ఉంది. మురికికాలవ పక్కనున్న వేపచెట్టు దగ్గర కూర్చున్నాడు. కాళ్ళు బరువెక్కాయి. కళ్ళు మూతలు పడుతున్నాయి. తెలియకుండానే మత్తులోకి జారుకున్నాడు బైరాగి.

జడివానకి గుడిసె కూలిపోయింది. లోపల భాగంలోని గుంజ లక్ష్మమ్మ తల మీద పడింది. నెత్తురు మడుగులో తుదిశ్వాస విడిచింది లక్ష్మమ్మ. ఊరంతా చిమ్మచీకటి అలుముకుంది. జడివాన చప్పుడు తప్ప ఇంకే శబ్దమూ లేదు. ఒళ్ళుతెలియని మత్తులో ఉన్న బైరాగి శరీరం మురికికాలవలోకి సగం ఒరిగిపోయింది. తెల్లవారింది. వాన వెలిసింది. పొలానికి వెళ్ళే రైతులు కూలిపోయిన లక్ష్మమ్మ గుడిసెని చూశారు. నలుగురూ కలిసి లక్ష్మమ్మ మృతదేహాన్ని బయటకు తెచ్చారు. ఇవేవీ తెలుసుకునే పరిస్థితిలో లేడు బైరాగి.

రైతులు బైరాగిని కాలవ నుంచి తీసి కూర్చోపెట్టారు. తలకి తగిలిన చిన్న గాయానికి కట్టుకట్టారు. బైరాగి మాటలాడే స్థితిలో లేడు. విపరీతమైన తలనొప్పితో కళ్ళు తెరవలేకపోయాడు.

ఊరివాళ్ళు సీతారాముల విగ్రహాన్ని లాక్కుంటారేమోనని భయపడ్డాడు. చేతిలోని విగ్రహాన్ని గట్టిగా పట్టుకున్నాడు. వెంటనే విగ్రహాన్ని అమ్మేసి డబ్బు చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. అయినా లేచి వెళ్ళే పరిస్థితిలో లేడు. కాళ్ళు వణుకుతున్నాయి. ఈ పరిస్థితిలో దీన్ని ఎలా అమ్మాలా అని ఆలోచిస్తూ, విగ్రహాన్ని చూస్తూ కూర్చుండిపోయాడు.

ఊరివాళ్ళు గుమిగూడారు. "పాపం లక్ష్మమ్మ పోయింది" అంటూ కంటతడి పెట్టింది శాంతమ్మ. "ఎంత తాగుబోతైనా ఈ వానలో దేముడి విగ్రహాన్ని మాత్రం రక్షించాడు" అన్నాడు గోవింద.

"ఈ పుణ్యకార్యం వల్ల బైరాగి పాపాలు ప్రక్షాళనం అయిపోయాయి" అన్నాడు గుడి పూజారి. "దేముడు బైరాగి చేత రక్షించబడ్డాడంటే, బైరాగి యెంత పుణ్యసంపన్నుడో ఊహించండి" అన్నాడు బడి పంతులు. "ఈ వానలో గుడిసె కూలినా, తల్లి మరణించినా బైరాగికి యేమీ కాలేదంటే, అతను సామాన్యుడు కాడు" అన్నాడు కరణం. "ఇలాంటి మహానుభావుడు ఊరిలో ఉండటం మన అదృష్టం" అన్నారు అమ్మలక్కలు.

"బైరాగీ! మీ అమ్మ చనిపోయిందని బాధపడకు. ఇక నుంచీ మేం నిన్ను చూసుకుంటాం" అన్నాడు సర్పంచి.

"అవును! నువ్వు ఇప్పటిలాగే సీతారాముల సేవలో లీనం అయి ఉండు. తక్కిన సంగతులు మేం చూస్తాం" అన్నారు ఊరి పెద్దలు.

బైరాగి మాటలాడలేదు. నోరు విప్పితే సారా వాసన గుప్పుమంటుందేమోనని భయపడ్డాడు. ఊరివాళ్ళు విగ్రహాన్ని తీసుకోకుండా మరింత గట్టిగా గుండెకు హత్తుకున్నాడు.

"మహాభక్తుడు, దైవానికి దూరంగా ఉండలేక ఎలా విగ్రహాన్ని గుండెలకి హత్తుకున్నాడో చూడండి" చెమర్చిన కళ్ళతో అన్నాడు పూజారి.

అంతే! బైరాగి జీవితం మారిపోయింది. వేపచెట్టు కింద రేకుల షెడ్డు వేశారు ఊరి వాళ్ళు. ఓ నవారు మంచం వేసి, దాని మీద ఉతికిన దుప్పటి పరిచారు. మంచినీళ్ళ కుండ పెట్టారు. వీధిలైటు నుంచి వైరు లాగి బల్బు వెలిగించారు. దర్జీ రంగయ్య రెండు జతల కాషాయం కుట్టిచ్చాడు. ఊరి వాళ్ళు వంతుల ప్రకారం భోజనం పంపిస్తున్నారు. బైరాగి భక్తి, పవిత్ర ఆత్మల గురించి జనం ఊహాశక్తి కొద్దీ కథలల్లారు. 'బైరాగిగారు పరమ భక్తులు. నిన్న రాత్రి స్వయంగా రాములవారే తమని రక్షించమని బైరాగిగారిని కోరారుట' అన్నారు ఒకరు. 'సాక్షాత్తు దేవుడిని దర్శించాక బైరాగి గారు మూగపోయారు. మరో ధ్యాస లేకుండా జీవితాన్ని సీతారాముల సేవకి అంకితం చేశారు' అన్నారు మరి ఒకరు. ఈ కథల ప్రభావంతో వచ్చేపోయే వారు రేకుల షెడ్డు ముందర ఆగి బైరాగికి నమస్కరించి, దక్షిణ, తాంబూలాదులు సమర్పించుకొని ఆశీర్వాదం పొందుతున్నారు!

కొత్తలో బైరాగికి సారా గుర్తు వచ్చినప్పుడల్లా ఒళ్ళు జివ్వుమనేది. అందులోనూ దక్షిణలు దండిగా రావటం వల్ల డబ్బుకి లోటుండేది కాదు. సారా కొనుక్కోవటం సులువయిన పనే బైరాగికి. అయినా ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ జారవిడుచుకోకూడదని దృఢ నిశ్చయం చేసుకున్నాడు బైరాగి. సారా గురించి ఆలోచన మానేశాడు. పొద్దున్నే లేచి స్నానం చేసి ఉతికిన కాషాయ వస్త్రాలు ధరిస్తున్నాడు. దేవుడి విగ్రహాన్ని బాగా తోమి, మెరిపించి, ఓ గన్నేరు పువ్వు పెడుతున్నాడు. కూర్చున్న చోటు నుంచి కదలకుండా మహారాజులా బతుకుతున్నాడు.

'మనుషుల మూఢనమ్మకమా లేక శ్రీరామరక్ష అంటే ఇదేనా?' నవ్వుకున్నాడు బైరాగి.

ప్రియదర్శిని చాగంటి

పుణె. 093724 13078

'అమ్మ'కు బ్రహ్మ

అమ్మకు రూపాన్నిచ్చే అవకాశం బిడ్డకు వస్తుందా... సకల చరాచరసృష్టిలో అసంభవం కదా ఇది. కానీ... 'మాట'నే మాతృమూర్తిగా కొలుచుకుంటున్న తెలుగు వారికి ఆ అదృష్టం దక్కింది. అజరామరమైన అజంత భాషను అమ్మగా భావించి... తెలుగింటి సంస్కృతినే ఆమె నుదుటి తిలకంగా ఊహించి... అచ్చ తెలుగు సాంప్రదాయంలో ఆమెకు కట్టు కట్టి, ప్రసన్న రూపాన్నిచ్చి, బాషా ప్రపంచంలోనే మా తల్లి 'మతల్లిక' అని గర్వంగా చెప్పుకుంటున్నాం. మనందరి హృదయాగ్రపీఠాలపై ప్రతిష్ఠితమైన 'తెలుగుతల్లి'కి తొలిసారి రూపునిచ్చింది... విఖ్యాత చిత్రకారులు కొండపల్లి శేషగిరిరావు.

మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలకు తెలుగు వారు సన్నద్ధులవుతున్న సమయమది. 1975వ సంవత్సరం. అప్పుడే... తెలుగుతల్లికి ఓ రూపాన్నివ్వాలన్న ఆలోచన తెలుగు సాహితీ పెద్దలకు వచ్చింది. ప్రభుత్వమూ దానికి అంగీకరించింది. అమ్మకు ప్రాణం పోసే బాధ్యతను ప్రఖ్యాత చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావుకు అప్పగించారు. దేవులపల్లి రామానుజరావు, గోపాలస్వామి, దాశరథి, సి. నారాయణరెడ్డి వంటి సాహితీవేత్తలతో చర్చించి... తెలుగుతల్లి చిత్రాన్ని చిత్రించారు శేషగిరిరావు. తెలుగు కట్టుబొట్టు ప్రతిఫలించేలా, తెలుగు గడ్డ విశిష్టత గోచరించేలా 'అమ్మ' ప్రసన్న రూపాన్ని తీర్చిదిద్దారు. ఆ తర్వాత జరిగిన కొన్ని పరిణామాల కారణంగా ఆ చిత్రాన్ని 'తెలుగుతల్లి'కి రూపంగా ప్రభుత్వం స్వీకరించలేదు. కానీ, తెలుగుతల్లి అన్న భావనకు ఆకృతినిచ్చి మొదటిసారి తెలుగు వారి కళ్ల ముందుకు తెచ్చిన ఘనత మాత్రం కొండపల్లి వారిదే. అదే కాదు మరెన్నో అద్భుత చిత్రాలతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన చిత్రకారుడాయన. ప్రకృతి ఒడిలోని రసవాహినులను తన అంతరంగ ఊహల్లో మిళితం చేసి, అవి చిత్రాలుగా జాలువార్చిన కుంచె శేషగిరిరావుది. ప్రకృతిని జగన్మాతగా భావించి, అద్భుత వర్ణాలలో ప్రతిబింబించి మనకందించారాయన. 'మానస సరోవరం నుంచి ఎగిరివచ్చిన రాజహంస నలదమయంతులకు ప్రేమ సందేశాన్ని అందించి, ఓరుగల్లు కోటలోని కాకతీయ ద్వారబంధంపై వాలి, శిలారూపం ధరించింది. తెలంగాణ మొదలుకొని కోస్తా, రాయలసీమలోని గృహకుడ్యాలు, ద్వారబంధాలపై, వివిధ లోహ పాత్రలపై ప్రతిబింబించి తెలుగువారంతా ఒకటేనన్న ఐక్యతా సందేశాన్ని ఇంటింటికి అందజేసింది' అనే ఏకత్వభావాన్ని వ్యక్తపరచగలిగిన స్వచ్ఛమైన చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు. దాదాపు భారతదేశమంతా తిరిగి చూసి ఆయా సంస్కృతులనీ, ఆయా శిల్పసంపదలనీ తన చిత్రాల్లో బంధించారు. భారతీయ చిత్రశైలిలోని ప్రత్యేకతను వందల సంఖ్యలో రేఖాచిత్రాలుగా, వర్ణచిత్రాలుగా చిత్రించారు. ఆయన గీసిన ప్రతి బొమ్మా అందమైనదే. ఆలోచింపజేసేదే. తాదాత్మ్యం కలిగించగలిగేదే.

అజరామరమైన శేషగిరిరావు చిత్రాలను చూసి-

"పరుగెత్తే నదినైనా బంధించును చిత్రం
అంతటి ఆకాశమైనా ఇంతవును విచిత్రం!"

అని ప్రశంసించారు డా॥ దాశరథి కృష్ణమాచారి. నదీనదాలు, కొండకోనలు, పశుపక్ష్యాదులు అన్నీ అత్యంత సహజంగా ఆ చిత్రాల్లో ఒదిగిపోయాయి. రాళ్లూ, మోళ్లూ కూడా! కాలం పరుగెత్తినా కళలు నిలిచి ఉంటాయి. అందులోనూ ఉత్తమ కళ సమాజానికి పథ ప్రదర్శకురాలవుతుంది. భారతీయ పౌరాణిక గాథలకు, కవిపుంగవులకు, చారిత్రకులకు, జగన్మాత నుంచి రాముడు గుహుడు వంటి చిత్రాలన్నింటికి రూపాన్నిచ్చిన శేషగిరిరావు చిత్రాలను చూసి ప్రఖ్యాత చిత్రకారిణి ఎఫ్. అకినో ఒకసారి -

"శేషగిరిరావు ప్రతిభ నాకెంతో నచ్చింది. వారు ఎంతో ఉత్సాహంతో, సామర్థ్యంతో స్కెచ్‌లు డిజైన్లు వేశారు. ఎన్నో నూతన పద్ధతులను కనుగొన్నారు. క్రియాశీలకమైన పద్ధతులను తన చిత్రాల్లో ప్రయోగించారు. అవి వారి సృజనాత్మకశక్తిని చాటుతున్నాయి. ఆయన చేసిన స్టడీరికార్డ్ అద్భుతమైంది. పురాతన రచనలు, మండలాలు, ఆరూబనలపై ఆయన చేసిన అద్భుత స్టడీరికార్డ్ చూసి నేనెంతో పరవశురాలినయ్యాను" అని అన్నారు.

1924 జనవరి 27వ తేదీన జన్మించారు శేషగిరిరావు. వీరి స్వస్థలం వరంగల్ జిల్లా మహబూబాబాద్ సమీపంలోని పెనుగొండ. కొండపల్లి వారు ఆ కాలంలో తెలంగాణాలో దేశ్‌ముఖ్, దేశ్‌పాండ్యగిరి కలిగినవారు. బాల్యంలో రాజఠీవిని అనుభవించిన కొండపల్లి శేషగిరిరావు విధివశాత్తు యౌవనమంతా అష్టకష్టాలపాలయ్యారు. అనివార్య కారణాల వల్ల ఆస్తిపాస్తులన్నీ పోయాయి. అయినా మొక్కవోని ధైర్యంతో తనలోని కళను తనతోపాటు బతికించుకుంటూ అచంచలమైన పట్టుదలతో శ్రమించారు. వరంగల్‌లోని వేయి స్థంభాల గుడి శిల్పాలు, రామప్ప దేవాలయ శిల్పాల అందాలు



ఆయనలోని చిత్రకారునికి ప్రేరణైతే, దీన్‌దయాళ్‌నాయుడు ప్రత్యక్ష గురువయ్యారు. ఆయన శిక్షణలో చిత్రకళలోని మెలకువలన్నీ గ్రహించిన శేషగిరిరావు బంధుమిత్రుల సహాయంతో హైదరాబాద్ చేరుకున్నారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదువుకోవడానికి మెహదీనవాజ్ జంగ్ సహకారం పొందారు. రవీంద్రుడు స్థాపించిన విశ్వభారతి శాంతినికేతన్‌లో శేషగిరిరావుకు తగిన శిక్షణ లభిస్తుందని నవాబ్ కలకత్తాకు పంపించారు. శాంతినికేతన్‌లో నందలాల్ బోస్ శిష్యరికంలో శేషగిరిరావు చిత్రాల పరిణతి అద్వితీయమైంది.

తనదైన ప్రత్యేకశైలిలో చిత్రించిన 'రెస్ట్', 'క్షామ', 'స్టేట్‌హుడ్', 'సంతాపం', 'డెడ్‌కౌ (మృతగోవు)', డిసైర్ అండ్ డెత్, సింఫోని, హార్వెస్ట్ వంటి మోడ్రన్ ఆర్ట్‌లో వేసిన చిత్రాలన్నీ బహుమతులను సాధించుకున్నాయి. భువనేశ్వర్‌లోని శిల్పాలను చిత్రించిన శేషగిరిరావు రామప్ప దేవాలయంలోని శిల్పకళా నైపుణ్యాన్ని తమ రేఖాచిత్రాలతో జాతికి తెలియజేసి రామప్ప అందాలనూ వెలికితీశారు, వెలుగులోకి తెచ్చారు. తెలుగు సాహిత్యంపైనా, తెలుగుభాషపైనా ఎనలేని మక్కువ ఉన్న ఆయన... నిరంతరం తెలుగు సాహిత్యాన్ని చదివే వారు. వానమామలై వరదాచారి, దాశరథి, సినారె, పల్లా దుర్గయ్య, బి.రామరాజు, అడవి బాపిరాజు, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి కవులెందరితోనో సన్నిహిత సంబంధాలుండేవి కొండపల్లికి. పురాణాలను చదవడం, సాహితీ గోష్ఠుల్లో పాల్గొనడం వీరికెంతో ప్రియం. రామాయణ, భారత, భాగవతాలు చదివి ఆకళింపు చేసుకొని కథానుగుణంగా, వర్ణనానుగుణంగా చిత్రాలు వేశారు.

1961, 1969ల్లో ఢిల్లీలో గణతంత్ర దినోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ తరపున శేషగిరిరావు ప్రాతినిధ్యం వహించారు. ఆయన ఆధ్వర్యంలో నిర్మించిన టాబ్లోను చూసి అప్పటి ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీలు ముగ్ధులయ్యారట! 1969లో వేసిన 'కృష్ణవేణి' టాబ్లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందట! కృష్ణానదీ ప్రవాహాన్ని అందమైన స్త్రీ ముఖబింబంగా శిరోజాలను ప్రవాహంగా, ఆ నదీ తీరంలోని ప్రసిద్ధ గ్రామాలను ఆ చిత్రంలో వేశారు. గాంధీ శతజయంతి ఉత్సవాల్లో వీరు చిత్రించిన 'ఎవేకనింగ్ ఆఫ్ ది పీపుల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ - విత్ బ్లెసింగ్ ఆఫ్ బాపు' అనే చిత్రం సుప్రసిద్ధం.

సామాజిక స్పృహతో వేసిన వీరి చిత్రాల్లో తెలుగు వెలుగులు, తెలంగాణా విముక్తి, రాళ్ళు, వ్రేళ్లు, ఓ బిచ్చగాడు, బెస్తవాడు, డెడ్‌కౌ అన్నీ గొప్పవే. దేవత, పౌరాణిక, కుడ్య, దేశభక్తి చిత్రాలతో సహా ఏ వర్గంలోని వర్ణచిత్రాలనైనా అద్భుతంగా చిత్రించే కుంచె కొండపల్లిది.

'వేద సంస్కృతిలో అంతర్భాగమైన ఆనాటి సత్సంప్రదాయాలు, సంస్కారాలు మరుగున పడిపోతున్న దుస్థితి పట్టింది. పాశ్చాత్య విద్యా ప్రభావంచేత భావదాస్యాలు కలిగి సనాతన భావాల మీద వ్యతిరేకత ఏర్పడిన ఈ ప్రస్తుత కాలంలో మన సంస్కృతీ సంప్రదాయాలను ఆచరించడం మన ధర్మం' అంటారు శేషగిరిరావు. ఆ దృష్టితోనే వేసిన లక్ష్మీగణపతి, జగన్మాత, రాముడు, గుహుడు, విష్ణుదుర్గ, పార్వతీకల్యాణం, గజేంద్రమోక్షం, వ్యాసుడు - గణపతి, నన్నయ్య, వేమన, అన్నమయ్య, పోతన, మాదన్న, భాగమతి, పతంజలి మహర్షి, అభినవ గుప్తుడు వంటి చిత్రాలు శేషగిరిరావు పరిశీలనా శక్తిని తెలియజేస్తాయి.

'పోతన చరిత్ర' కావ్యానికి తగినట్లు అనేక చిత్రాలు వేశారు శేషగిరిరావు. అంతేకాదు 'చిత్రమయీ కావ్యం' అనే చక్కని వ్యాసాన్ని రాసి కొత్తకోణంలో ఆ కావ్యాన్ని ఆవిష్కరించారు. 1964లోనే ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం కోరికపై "కుడ్య చిత్రకళ, అలంకరణ కళ"పై విశ్లేషణాత్మక వ్యాసాలు రాసిచ్చారు శేషగిరిరావు. ఈ వ్యాసాలు సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశంలో ముద్రించారు. ఆదిమ కళ నుంచి ఆంధ్రదేశ చిత్రకళ వరకు, శిలల నుంచి తెలుగువారి శిల్పకళా వైభవం వరకు ఎన్నో వ్యాసాలు రాశారు. తెలంగాణలో మరుగునపడిన 'కాకిపడిగెలు' అనే పురాతన పట చిత్రాలను వెలుగులోకి తెచ్చారు. వట్టికోట ఆళ్వారుస్వామి, కల్లూరు సుబ్బారావు, అడవి బాపిరాజు, అంట్యాకుల పైడిరాజు, కాపు రాజయ్య వంటి ప్రముఖులపై వారి అభిప్రాయాల్ని వ్యాసరూపంలో చక్కగా వివరించారు. లేపాక్షి, హంపి శిల్పాలను రేఖాచిత్రాలుగా వేసి పుస్తకంగా వేయించిన శేషగిరిరావు ఎన్నో పల్లెటూళ్లు తిరిగి ముగ్గులను సేకరించారు. ఆ ముగ్గుల్లోని మలుపులు, ముడులు, చుక్కలు,



రేఖలు అన్నింటికీ వివరణ ఇచ్చారు.

ప్రముఖుల నిలువెత్తు చిత్రాలు వేయడంలో శేషగిరిరావు సిద్ధహస్తులు. అమెరికాలోని భారతీయ రాయబార కార్యాలయంలోని టంగుటూరి, హైదరాబాద్ శంకరమఠ్‌లోని శంకరాచార్యులు, రామచంద్ర మిషన్‌లోని రామచంద్రాజీ మహరాజ్ నిలువెత్తు చిత్రాలన్నీ కొండపల్లి కుంచె నైపుణ్యాన్ని పట్టిచ్చేవే! 'నిలువెత్తు చిత్రాల చిత్రీకరణంలో హృదయ స్పందన చాలా అవసరం' అంటూనే 'నేను వేసిన ఈ చిత్రాల్లో వారి వారి సంతానం కూడా చెప్పలేని సందర్భాలను నాకుంచె చెప్పగలిగింది అంటే మాటలందించని భావాలను కుంచె అందించగలదన్న మాట' అన్నారు శేషగిరిరావు.

1960 దశకంలో శేషగిరిరావు వేసిన నిలువెత్తు గోదాదేవి చిత్రం ఓ కలికితురాయి. సుందరమైన విశాల నయనాలు, సంపెంగపువ్వంటి చక్కనిముక్కుతో, సుందర దరహాసంతో లేతకాషాయ వర్ణ లేపనాలతో ఉన్న గోదాదేవి చిత్రాన్ని చూడగానే దేవులపల్లి కృష్ణశాస్త్రి కళ్లు చెమర్చాయట. 'ఆ చిత్రం, మరణించిన తన కూతురును గుర్తుకు తెప్పించింద'న్నారట ఆ కవి. వెంటనే శేషగిరిరావు తన గోదాదేవి చిత్రాన్ని కృష్ణశాస్త్రికి ఇచ్చేశారట! అది! అదీ జీవత్వం ఉట్టిపడే వీరి బొమ్మలతీరు! కవి పండితులంటే, సాహిత్యమంటే ఉండే అభిమానం తీరు.

మహాకవి కాళిదాసు రాసిన 'అభిజ్ఞాన శాకుంతలం' పుస్తకాన్ని చదివి, ఆ కథానుగుణంగా దాదాపు 25, 30 చిత్రాలను వేశారు. విశ్వామిత్ర మేనకల కథ నుంచి, శకుంతల దుష్యంతుల ప్రణయం వరకు, శకుంతలను అత్తవారింటికి పంపించే దృశ్యం నుంచి అంగుళీయకం నదిలో పడిపోవడం వంటివన్నీ చిత్రించారు. ఆ వర్ణచిత్రాలన్నీ ప్రేక్షకుల కళ్లను తిప్పనీయవు. మనసులను సుందర లోకాల్లో విహరింపజేస్తాయి. ఒక్కటా రెండా, పదా ఇరవయ్యా! వందల చిత్రాలు! అవన్నీ విభిన్న ప్రక్రియల్లో వేసిన శేషగిరిరావు చిత్రాలను గురించిగానీ, వారు రాసిన, సేకరించిన విషయాలుగానీ వారు చిత్ర కళారంగానికి అందించిన విశిష్ట సేవలను గురించిగానీ, ఎందరో నేటి ఆధునిక చిత్రకారులకు ప్రఖ్యాత చిత్రకారులకు ప్రొఫెసర్‌గా విద్యాదానం చేసిన విషయాలుకానీ, వారికి లభించిన అవార్డులు, రివార్డులు, బహుమతులు ఎన్నని చెప్పగలం.

1987లో ఢిల్లీలో చిత్రకళా ప్రదర్శనలో ఎన్టీ రామారావు కొండపల్లివారి 'హరిహరరాయలు, విద్యారణ్యస్వామి' చిత్రాన్ని చూసి ఆశ్చర్యపడి ఎంతో ప్రశంసించారు. 1996లో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 'గౌరవ డాక్టరేట్'ను బహూకరించింది. 1997లో ఎన్టీఆర్ పురస్కారాన్ని ప్రకటించారు. 2003లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'హంస' అవార్డును ప్రదానం చేసింది. కేంద్రప్రభుత్వం నుంచి 'ఆర్టిస్ట్ ఎమరిటస్'గా గుర్తింపు పొందిన శేషగిరిరావును మరెన్నో అవార్డులు, సన్మానాలు పొందారు.

స్థితప్రజ్ఞులైన ఒక ప్రసిద్ధ చిత్రకారుని సమగ్ర జీవితాన్ని ఎంత వ్యాఖ్యానించినా అది అసమగ్రమే! 'ఇంత కడివెడు పాలపై మీగడలాగా రాజులు రాజ్యాలు కాలగర్భంలో కలిసిపోయినా శతాబ్దాల చరిత్ర సంస్కృతికి సజీవ సాక్ష్యాలుగా కళాఖండాలు మిగిలాయ'ని శేషగిరిరావు చిత్రాలను చూస్తూ డా॥ సి. నారాయణరెడ్డి ఆశువుగా ఇలా అన్నారు..

'ఎన్నిసార్లు చెక్కితే ఒక శిల్పం
ఎన్నిసార్లు తీర్చితే ఒక చిత్రం
కబుర్లేవో చెప్పకే ఓ కాలమా
ఎన్నిమార్లు చస్తే ఒక జీవితం'

చెరగని చిరునవ్వు సుందరరూపంతో ఆప్యాయంగా పలకరించే శేషగిరిరావు... రాష్ట్ర ప్రజల మనస్సుల్లో చిరంజీవి.



కొండపల్లి నీహారిణి
(శేషగిరిరావు గారి కోడలు)
విశ్రాంత ఉపాధ్యాయిని,
హైదరాబాద్, 98663 60082

అక్షరక్రీడ 2

1				X
2				
3				
4			X	X
5				
6				X
7				
8			X	X
9				

1. దురద. 2. మహిషం.
3. నది. 4. నక్షత్రం.
5. దృష్టి.
6. జమదగ్ని భార్య.
7. దుష్యంతుడి భార్య.
8. శివుని శిలారూపం.
9. గానమే వృత్తిగా గల దేవజాతి.

గడులను పూర్తిచేసి నిలువుగా చదివితే మన తెలుగు కవి, సంస్కర్త పేరు వస్తుంది.

సమాధానాలు: 114వ పేజీలో...

అవసరానికే అన్యభాష!

ఆచార్య చేకూరి రామారావు

"ఇంగ్లీషును నిషేధించాలని కాదు. పరాయి భాషల్ని కేవలం అవసరమైనప్పుడు మాత్రమే వాడితే చాలు"

శతాబ్దాల చరిత్ర, సాహిత్య సంప్రదాయం ఉన్న మన తెలుగులో ఇతర భాషల మిశ్రమం ఎక్కువ కనిపిస్తోంది. తెలుగు.. సంకర భాషగా మారే దిశలో ఉన్నట్టు అనుమానం వేస్తోంది. ఇంగ్లీషు అటువంటి ప్రమాదం తెచ్చి పెడుతుందేమో అనే ఆందోళన అందర్నీ వేధిస్తోంది. అంతమాత్రాన ఇంగ్లీష్‌ను నిషేధించాలని కాదు. పరాయి భాషల్ని కేవలం అవసరమైనప్పుడు మాత్రమే వాడితే చాలు.

సంకరభాష అయితే నష్టమేంటి... అంటారా? నేను మారిషస్ వెళ్లినప్పుడు ఓ విషయం గమనించాను. వాళ్లందరూ 'ఫ్రెంచి కియోన' మాట్లాడతారు. ఆ భాషలోనే వార్తలు కూడా ప్రసారమవుతాయి. అంతా బావుంటుంది కానీ.. ఆ భాషలో కవిత్వం కానీ, ఇతర సృజన ప్రక్రియలు కానీ, శాస్త్రపరమైన విషయాలు కానీ ఏమీ లేవు. ఎందుకు లేవంటే.. అది సంకరభాష! సంకరభాషలో ఎటువంటి ఉన్నత కవితా వచ్చే అవకాశం ఉండదు మరి! మన తెలుగు సజీవభాష! అంతటి విశిష్టత ఉన్న సొంత భాషలో చదువుకుంటేనే మంచి పాండిత్యం, ఊహాబలం, కాల్పనికత సహజంగా అబ్బుతాయి. గొప్ప కావ్యాలుగా నిలిచినవన్నీ అలా చదువుకున్న రచయితలవే. హాస్యం కోసం టీవీ యాంకర్లు, సినిమాల ద్వారా సంకరభాష ఒకటి తయారవుతోంది. ప్రజలూ వాటినే గుడ్డిగా అనుసరిస్తున్నారు. తక్షణం ఆ దుర్దశని అరికట్టాలి. నిజానికి మీడియా రంగాన్ని తప్పు పట్టాల్సిన అవసరం కూడా లేదు. ఆకర్షణీయమైన భాష, సులువైన పదాలు వారికి అందుబాటులో లేవు. కాబట్టి.. తెలుగులోని సృజనశక్తిని ఉపయోగించి, కొత్త పదనిధి ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకు భాష, సాహిత్యవేత్తలు శ్రద్ధ చూపాలి. సామాన్యజనమైనా సరే.. వీలున్నంత వరకు తెలుగులోనే రాయడం, మాట్లాడటం జీవితానికి తప్పనిసరి చేసుకోవాలి. విద్యార్థులు తెలుగు చదివేలా చూడాలి. వాళ్లు చదివే పరిస్థితులు కల్పించాలి. మంచి సిలబస్‌తో పుస్తకాలు రూపొందించాలి.

ఇప్పుడు పెద్దలు పెద్దల కోసం రాసిన రచనలు తీసుకువచ్చి పిల్లలకు పెట్టారు. పాత వ్యాకరణాలూ పెట్టారు. ఆ వ్యాకరణ పరిభాష ఇప్పటి ఉపాధ్యాయులకూ తెలియదు! ఎం.ఎ. చదువుకున్న వాళ్లకీ అర్థం కాదు. ఇవ్వాళ తెలుగు పాఠ్యగ్రంథాల్లో భాష, వ్యాకరణాలు పిల్లల్ని బెదరకొట్టేస్తున్నాయి. అందుకే వాళ్లు హిందీ అయినా తీసుకోవడానికి ఇష్టపడుతున్నారు.. తెలుగంటే పారిపోతున్నారు. అలా తెలుగును తప్పించుకునే పరిస్థితి మనమే కల్పిస్తున్నాం. ఇది సవరించాలి.

1889లో 'మహారాణి' వేసిన ముగ్గు!



ముగ్గులు ముప్ఫైరెండు రకాలు. ఇది దక్షిణ భారతదేశంలో ఓ నానుడి. ఎంచక్కా వేసే ఇన్ని రకాల ముగ్గుల్లో చుక్కముగ్గు, వంకెముగ్గు, వృత్తాకారం, కోణం, చదరం, రేఖ, సన్నాయి, గొట్టం, ఘటం, బంధం, అచ్చు మొదలైనవి కొన్ని.

గీతముగ్గు, చుక్కముగ్గు, అచ్చుముగ్గు అనే మూడు రకాలవీ ఒకే ముగ్గులో ఉన్న ముచ్చట ఈ సూర్యకిరణం ముగ్గులో ఇక్కడ చూస్తున్నాం. ముగ్గులు అలంకరణకే కాదు, ఆరోగ్యానికీ అవసరమే. ఆరోగ్యానికి బాటచూపే సూర్యుని పేరుగల ఈ ముగ్గు ఇంటిముందు పెడతారు; పెండ్లి అరుగు చావడిలో అయితే మధ్యన పెడతారు. ఇది శుభంకరం, మంగళప్రదం. ఈ ముగ్గులో సూర్యుని బింబాకారం రావడానికి ముందుగా మధ్యలో కమలం వేయాలి. దానికి బయట కొంత దూరంలో చుట్టూ సమదూరంలో చుక్కలు పెట్టాలి. తర్వాత గుండ్రని రేఖలతో వాటిని చేర్చాలి. అప్పుడు ముచ్చటైన ఆకారం ఏర్పడుతుంది. దానికి మూడు పక్కలా రేఖాకారాలు, పద్మాకారాలు గోడపక్కల స్తంభాల మధ్యలో వెయ్యాలి. ఈ సూర్య కిరణం ముగ్గు మద్రాసు నుంచి ఒకనాడు వచ్చిన 'మహారాణి' అనే బాలికల సచిత్ర మాసపత్రిక 1889 జూన్ సంచికలో వచ్చింది. ఇది 123 ఏళ్లక్రితం 'మహారాణి' ఇచ్చిన ముగ్గు.

వెన్నంటి వచ్చే వెన్నెల

ఉన్నట్లుండి ఒకనాడు మా ఇంటికి పెద్ద మామయ్య వచ్చేవాడు, పౌర్ణమినాటి పెద్ద చందమామ వచ్చినట్లుగా. ఇంక సంబరమే సంబరం! కొబ్బరి చెట్టులో సగమంత ఎత్తుకి ఎగరవేసి పట్టుకునేవాడు. అప్పుడు, అంటే ఎగరవేయటానికి వీలైన వయసులో నేనున్నప్పుడు.

మా ఇంట్లో ఫ్యాన్లు లేవు. కరెంటు దీపాలు కూడా లేవు. ఎక్కడో కలకత్తా చెన్నపట్టణం లాంటి ఊళ్లల్లో ఉండేవో ఏమో తెలియదు. మా ఊరులాంటి ఊళ్లల్లో మాత్రం లేవు. మామయ్య చావడిలో గాలికెదురుగా పడక్కుర్చీలో కూర్చునేవాడు. తాటాకు విసనకర్రతో విసురుకుంటూ.

మామయ్య అమ్మా మాట్లాడుకునే మాటలు, మామయ్య, నాన్నగారు ముచ్చటించుకునే విషయాలు, ఇంటికి పెద్ద దిక్కు అయిన మామ్మగారు మామయ్యతో ప్రస్తావించే కుశలాదికాలూ - అన్నీ బాగానే ఉండేవి, వేరేవేరే రుచులతో!

మామ్మగారి మాట "ఇదిగో, శ్రీరామ్మూర్తీ! ఈ సారి మాత్రం అమ్మాయినే కనాలి. మా బాబ్జీకి తగినట్లుగా ఉండాలి సుమా!" అప్పటికి మా బాబ్జీకి ఏణ్ణర్ధం వయసు! అన్నం గిన్నె, పప్పు గిన్నె వాడి ఎదురుగా తెచ్చి పెడితేనే అన్నం తినేది. "గిన్నె గిన్నె, డబ్బా డబ్బా" అనేది వాడి నినాదం! డబ్బాలోంచి బిస్కెట్లు, చాకలేట్లు ఇస్తే పనికి రాదు. ఆ డబ్బా పళంగా చేతికిచ్చేయ్యాలి. డబ్బా డబ్బా అంటే అదీ అర్ధం. ఆ బాబ్జీకి కావాల్సిన పెళ్లాం కోసం ఆ బేరాలు!

మామయ్య రావటం మమ్మల్ని తీసుకెళ్లేందుకే. ఆ రోజుల్లో... ఆహా ఏమి వైభోగం! తాతగారో మామయ్యో వచ్చి తీసుకువెళ్లే వారు, మళ్లీ నాన్నగారు వచ్చి తీసుకువచ్చేవారు. బండెక్కు అంటే ఎక్కటం, రైలెక్కు అంటే ఎక్కటం, దిగు అంటే దిగటం. బట్టలు సర్దుకుని పిల్లల్ని సవరించుకోవటంతోనే ఆడవాళ్లు అలసిపోవటం. ఏడు మల్లెపువ్వులెత్తు వంటి సౌకుమార్యం! రమ్మంటే వచ్చివాలే సిగ్గు దొంతరలు, పిలుస్తారేమోనని ఉరకటానికి సిద్ధంగా ఉండే కాటుక కళ్లలోని నీలాంబుదాలు, పుట్టిల్లు అత్తిల్లు మధ్య వస్తూ, పోతూ పెద్దవారి - కాళ్లు కళ్లకద్దుకోవటం, కన్నీళ్లు పెట్టుకోవటం,

పసుపురాయించుకుని బొట్టు పెట్టించుకుని కడుపు చలవకి పెట్టే ఒడిగంటు చలివిడిని సవరించుకుంటూ ఆ జీవితమూ అందమైనదే!

మా తాతగారిది జమిందారీ కుటుంబం. వాళ్లది పొన్నపల్లి అగ్రహారం. వారు పొన్నపల్లి వారు. ఆ అగ్రహారం వారికి 'ఈనాం'గా వచ్చింది. అందులో పద్దెనిమిది పాలేలు ఉన్నాయట. నాకు తెలిసింది మాత్రం ఒకే ఒక వీధి. వీధి అంటే అలాంటి ఇలాంటి వీధి కాదు. జాతీయ రహదారి, ఒక వైపు చెన్నపట్టణమూ! మరొక వైపు కలకత్తా!

మా తాతగారి ఊరికి ముందున్న ఊరు చెరుకుపల్లి. తరువాత వచ్చే ఊరు గుళ్లపల్లి. మా ఊరు నర్సాపురం. చారిత్రాత్మకమైన ఊరు. రైల్వే స్టేషనూ, బస్టాండూ, లాంచీల రేవూ అన్ని ప్రయాణ సాధనాలూ ఉండేవి. నా చిన్నతనంలో కూడా, ఇంకా టేలరు దొరగారి పేరిట ఉన్న టేలరు హైస్కూలు వందేళ్ల చరిత్ర గలది. చుట్టుపట్ల ఉన్న ఎన్నో ఊళ్లకి అదొక్కటే ఉన్నత పాఠశాల. బారిష్టరు పార్వతీశం - ఆయన్ను సృష్టించిన మొక్కపాటి వారు చదువుకొన్నది అక్కడే. మా నాన్నగారు, బాబయ్య చదువుకున్నది కూడా అక్కడే. వాళ్లకి చదువుచెప్పిన మాస్టర్లలో కొందరు మాక్కూడా చెప్పారు!

మా తాతగారింటికి వెళ్లాలంటే పెద్ద హోల్డాలొకటి తప్పనిసరిగా పట్టుకునేవారం. 90 మైళ్ల దూరం వెళ్లడానికి యాభై గంటలు కనీసం పట్టేది. అప్పుడు రిజర్వేషన్లు లేవు. రైళ్లల్లో అసలా పద్ధతే ఉండేది కాదు. మూడు నాలుగు చోట్ల రైళ్లు మారవలసి వచ్చేది. మారిన చోటల్లా ఎక్కాల్సిన రైలు కోసం ఆరేసి, ఏడేసి గంటలు వేచి ఉండాలి. ఒక్కొక్కప్పుడు అది రాత్రివేళ అయ్యేది. అటువంటి సమయాల్లో ఆ హోల్డాలు విప్పుకుని, అందులోంచి బొంతలూ, దుప్పట్లూ ప్లాటుఫారం మీద పరుచుకుని పడుకునేవాళ్లం. నిద్రగన్నేరు చెట్టూ, ప్రయాణీకుల రద్దీ, సరియైన భోజనం లేకపోయినా కడుపునిండా తాతగారింటికి వెళుతున్నామన్న సంబరమూ - ఆ పడక, అట్లాంటిది అదే!

వాహనాలు మారుతూ మారుతూ చివరగా పొన్నూరులో దిగి రేపల్లె వెళ్లే బస్సు ఎక్కింతరువాత అప్పుడనుకోవాలి, అమ్మయ్య! అని. ఆ పొన్నూరు బస్సు ఎక్కటం గొప్ప ఫీటు. రబ్బరు ఇలాస్టిక్‌లా సాగుతుందనుకుంటామా, పొన్నూరు బస్సులు కూడా ఇలాస్టిక్‌గా ఉండేవి ఆ రోజుల్లో. చూస్తుండగా యాభైమంది పట్టే బస్సు నూట యాభై మందిని ఎక్కించుకుని నిండు చూలాలిలా కదిలిపోయేది. బస్సులు తక్కువగా ఉండటం వల్ల అలాంటి ప్రత్యేక పదార్థంతో తయారయ్యేవనుకుంటాను!!

బస్సు ఆగేది మా తాతగారి ఇంటి ముందరే, వస్తోందా, ఇల్లు వస్తోందా అనుకుంటూ, కిటికీలంటూ ఏమన్నా కనిపిస్తోంటే అందులోంచి చూసే ప్రయత్నంలో మెడ రకరకాలుగా నిక్కించుకుని చూస్తూ... ఆ! చెరుకుపల్లి వచ్చేసింది, అనుకుంటూ ఉంటే దాంతో పాటు "నేను కూడా" అని ఆకలికూడా ముందుకి వచ్చేది. తరవాత నాగారమ్మ దిబ్బ.. రెండు నిమిషాల తరవాత మా తాతగారింటి ఆవలిదొడ్డి కంచె కనబడేది. ఇంకో అరపర్లాంగు తరవాత కండక్టరు గావుకేక వినబడేది. "రామయ్య గారింటి స్టాంపు"

అప్పటికి అరుగుల మీద అమ్మమ్మ, తాతగారు, చిన్నమామయ్య, పెద్దత్తయ్య, సరోజా వదిన, కామేశ్వరి వదిన, జయప్రద, అచ్యుతం, ఇరుగింటి సీతమ్మ, పొరుగింటి భ్రమరాంబ, అక్కాయమామ, పాపక్క, స్వర్ణం - అందర్నీ చూసి, కండక్టరు గావుకేక, పొలికేక పెట్టక ఏం చేస్తాడు?

అసలా బస్సులో మేమున్నట్లు వాళ్లకెలా తెలిసిందనీ, అలా కేకలేస్తూ చేతులూపుతున్నారు! అప్పుడర్థమవలేదు, ప్రతి బస్సుకూ అలాంటి స్వాగతమే ఎదురయ్యేదని.

పెట్టెలూ, బుట్టలూ, హోల్డాలూ రోడ్డు పక్కన దింపేసి బస్సు పరుగెత్తుకు పోయేది. అమ్మని మాతో సహా దగ్గరికి తీసుకుని అమ్మమ్మ లోపలికి తీసుకువెళ్లేది, రవ్వంత ఆవుపేడ దిష్టితీసి, వీధిగుమ్మం పక్కన గోలెంలోని నీటితో కళ్లూ కాళ్లూ తుడిచివేస్తే అన్ని రోజుల ప్రయాణ బడలికా హుష్ కాకి!

ప్రయాణమంతా తాతగారింటికి, చేరిన తర్వాత అది అమ్మమ్మ ఇల్లు. మా అమ్మమ్మ ఇంకో సెట్టు పిల్లలకి నాయనమ్మ కదా! మేం వచ్చే వరకూ మీ కోసం ఎదురుచూసిన వదినలూ, బావలూ వచ్చిన తరవాత మా మీద గూఢచారులైపోయేవారు. వాళ్ల నాయనమ్మలో మా అమ్మమ్మ పాలు ఎక్కడెక్కువైపోతుందోనని! రోజూ ఎదురుగా ఉండరు కదా, వీళ్లనికాస్త ఎక్కువ ముద్దు చేద్దామనుకున్నా ఆవిడకి కుదిరేది కాదు. పిల్లలకి కావల్సింది ముద్దు కాదు, తోటి వాళ్లకంటే ఎక్కువ ముద్దు! అంతంత ముద్దుల ఊటలు నిండి ఉండటానికి ఆవిడ ఏం తినేదో ఏం తాగేదో అడిగి ఉండాల్సింది, అడగనే లేదు. నేనూ ఒక నాటికమ్మమ్మనవుతానన్న ఆలోచన చొరపడని ప్రపంచం అది! అలాగే ఆవిడ కొప్పులాంటి చక్కటి తీరుపైన కొప్పు ఎలా ముడుచుకోవాలో అదీ నేర్చుకోలేదు!

ప్రతిపూటా ఏదో ఒక ప్రత్యేక వంటకంతో భోజనం! ఇది వీళ్లకిష్టం. అది వాళ్లకిష్టం. అంటూ ప్రతి రోజూ విందు భోజనాలే. మా తాతగారికి పెద్ద పిలక ఉండేది. ఆయన భోజనానంతరం పడక కుర్చీలో కూర్చుని విశ్రాంతి తీసుకున్నంత సేపూ ఆ పిలక మా చేతుల్లోనే ఉండేది.

దాన్నొదిలేసి నా కాళ్లు పట్టితే మంచి కథ చెబుతాను అనేవారు. ఒకళ్లో ఇద్దరో పడితే అందరూ కథ వినొచ్చు కదా అనుకుంటూ, ఆ ఒకళ్లో ఇద్దరో ఎవడో తేలక పోట్లాటకి దిగేవాళ్లం.

ఈ సందడిలో చిన్మయంగా బాదం ఆకులతో విస్తళ్లకుడుతూ మా తాతమ్మ! తాతమ్మ ఎప్పుడూ కర్రపట్టుకుని తిరిగినా, చాలా చురుకైనది. ఆ కర్రతో కొమ్మలు కిందికి వంచి బాదం ఆకులు కోసేది. అన్నీ దొంతులుగా పేర్చి పక్కన పెట్టుకుని ఒక్కొక్కటే చేర్చుకుంటూ ఎక్కడా లొచ్చు లొసుగూ లేని వలయాలుగా పెద్ద పెద్ద విస్తళ్లు కుట్టేది. ఈనెల్ని సన్నగా చీల్చి మహా నేర్పుగా ఆకుల్ని కలుపుతూ చిన్న చిన్న కుట్లు వేస్తూ బ్రహ్మాండమైన కళాఖండాలవంటి విస్తళ్లని తయారు చేసేది. పచ్చివాసన పోని ఆ విస్తళ్లలో ఏం తిన్నా మహా రుచిగా ఉండేవి.

లేత తాటి ముంజెలూ, పేలపిండీ, కొత్త అటుకులూ వేసవి ప్రత్యేకతలు, ఇంటి ముంగిట ఉన్న బాదం చెట్టు చుట్టూ పరుగులు పెడుతూ కాయలు ఏరుకుని, వాటిని బద్దలు కొట్టి పప్పులు తినటం, వీధి గుమ్మంలోని పొన్న చెట్టు "రాల్చు" అంటే రాల్చే పొన్న పువ్వులు ఏరుకుంటున్నాం అనుకుని ఆ చెట్టుకి చేసే ప్రదక్షిణలూ, పొద్దున్న సాయంత్రం గిలక బావి చుట్టూ చేరి జీతగాళ్ల కడవలతో తోడిపోస్తుంటే గంతులేస్తూ చేసే స్నానపర్వాలూ - మాతామహుల ఇంటి అనుభూతులు అజరామరాలు. వెనక్కి తిరిగితే వెన్నంటి వస్తూ కనబడతాయి.

ఎండల్లో తిరగొద్దు అనే మాట చెవుల్లో పడేది ఆ విధంగా అయినా దాని అర్థం ఏమని అనుకునే వాళ్లమో ఎంత ఆలోచించినా జ్ఞాపకం రావటం లేదు. ఎండ ఉన్నంతసేపూ ఇంట్లో మాత్రం ఉండేవాళ్లం కాము. చింతచెట్లు కిందనో ఎడ్లని విప్పదీసిన బళ్లకిందనో, రావిచెట్టు కింద రావి ఆకులు చుట్టి చేసిన బూరలు ఊదుతోనో మధ్యాహ్నాలు నిమిషంలో గడిచిపోయేవి.

రోజంతా ఆడుకున్న చింతచెట్లూ గడ్డివాములూ, తాటితోపులూ చీకటి పడుతూ ఉంటే రాక్షసులుగా తయారయ్యేవి. జుత్తు విరబోసుకుని కథల్లో విన్న దయ్యాల్లా చేతులూపుతూ భయపెట్టేవి. అప్పుడు మాకు పిన్ని రక్షకురాలయ్యేది. బ్రహ్మాండమైన కథలు కళ్లకి కట్టినట్లుగా, సినిమా చూస్తున్నట్లుగానే చెప్పేది. దుష్టమాంత్రికుల బారినుండి రాజకుమార్తెల్ని, ఎక్కడినుంచో మహావీరులైన రాజపురుషులు గుర్రాలమీద వచ్చి కాపాడటం, ఎవరో గొప్ప తపస్వి దయ్యాల్ని శాపవిముక్తుల్ని చెయ్యటం - మహా ఉత్కంఠతో వినేవాళ్లం.

పిన్నికి చుట్టూవారా కూర్చున్నా దగ్గరగా కూర్చోవాలన్న తాపత్రయం ఎవరిమటుకి వాళ్లకే! కథ వినాలనో లేక భయం మూలంగానో! పూర్తిగా నిద్రతో కళ్లు మూతలు పడేంత వరకూ ఆ కథాకాలక్షేపం సాగుతూనే ఉండేది. అసలు సంగతి చెప్పనే లేదు. మా పిన్ని కథల్లో బోలెడు పాటలుండేవి. పాటలు పాడుతూ మా చేత పాడిస్తూ ఆమె చెప్పిన కథలు జ్ఞాపకం లేవు కాని ఆ తీపి జ్ఞాపకాలు మాత్రం గడిచిన కాలాన్ని చెరిపేస్తూ అలాగు ఉన్నాయి అంత తీపిగానూ! మా పిన్ని పేరు చిన్నమ్మ.

ఎలా గడిచాయో తెలీకుండా రోజులు గడిచిపోయి, మళ్లీ మా ఊరు వెళ్లే రోజు వచ్చేసేది. ఆ రోజు చాలా విషయాలు గుణించి, గణించి వారాలూ వర్జ్యాలూ అన్నీ చూసి నిర్ణయించిన తరవాత, పొద్దున్నే మా అమ్మమ్మ మా అందరికీ తలంట్లు పోసేది. సున్నిపిండితో కాలిమడమలు చుట్టూ తోమి సంతృప్తిగా లేక కుంకుడుకాయ పిప్పితో మళ్లీ తోమి - పిల్లల పిల్లలంటే ఎంత మమత! - అదొక పెద్ద అదృష్టం, మళ్లీ ఎన్నాళ్లకో ఆ భాగ్యం అన్నట్లు. ఆ నాటి ఉదయం నుంచే అడపా దడపా వర్షిస్తూనే ఉండేవి మా అమ్మమ్మ పెద్దపెద్ద కళ్లు. పాయసాన్నంతో భోజనం తరవాత చలిమిడి చేసేది. మంచి సమయంలో బయల్దేరేందుకు తాతగారు తొందర పెట్టే ప్రయత్నం చేద్దామనీ! అయితే ఆ ప్రయత్నంలో వేడి ఉండేది కాదు.

"బయట నుంచుని, పొన్నూరు బస్సు ఆపరా!" అని రత్తయ్యతో చెప్పిన తరవాత అప్పుడు అమ్మమ్మ పళ్లెంలో పసుపు కలిపి తన కాళ్లకి రాసుకుని అమ్మ కాళ్లకి రాసేది. తరవాత అత్తకిచ్చేది అందరికీ రాయమని, కొత్త చీరా, రవికా పైకి తీసి పసుపు పెట్టి అమ్మకిచ్చి కట్టుకుని వచ్చింతర్వాత ఆ కొంగులో ఇంత చలివిడీ పసుపుకొమ్మూ పెట్టి మడిపించి మళ్లీ వేరే సంచిలో పెట్టి ఇచ్చేది.

కాస్త దూరం నుంచి చూసే రత్తయ్య ఈ ఘట్టంలో బయటికి కదిలేవాడు, బస్సు ఆపటానికి, ఇంకో జీతగాడు సారయ్య పెట్టెలూ సంచీలూ, హోల్డాలూ అరుగుమీద పెట్టిన తరవాత ఇంక బయల్దేరిపోయినట్లే లెక్క. పెద్ద వాళ్లందరికీ పాద నమస్కారాలూ, పిల్లకాయలందర్నీ దగ్గరికి తీసుకుని వీడ్కోలు పాటలూ అన్నీఅయి 'మళ్లీ ఆర్నెల్ల తరవాత వస్తాంగా' అని సమాధానపడుతూ బస్సెక్కితే - పాపం దానికీ కష్టంగానే ఉండేది. మా మనసుల బరువుని మోసుకుని ముందుకు నడిచేది... పరుగెత్తుదామని ఉన్నప్పటికీ!

పారనంది శోభాదేవి
మంగళూరు, కర్ణాటక.
090086 65210

రథబంధం

మన పూర్వకవులు తెలుగులో చిత్రవిచిత్ర రీతుల్లో కవితామాలికలు అల్లి ధన్యులయ్యారు. ఇవి భాషాక్రీడ విశేషాలు. సహృదయుల్ని, కవితాభిమానుల్ని అబ్బురపరుస్తాయి. అభ్యాసకులకు ఖేలారూపమైన అభ్యసన కృత్యాలు. ఒక వరుసలో ఒక్కొక్క గడిలోని అక్షరాన్ని చదువుకుంటూ పోతే ఈ 'రథబంధ' చిత్ర కవితలో ఓ 'సీస పద్యం' దర్శనమిస్తుంది. ఇచ్చిన పద్య సహాయంతో రథంలో ప్రవేశించండి. తెలుగు మాధుర్యాన్ని రుచి చూడండి. ఇందులో ఓ చమత్కారమూ ఉంది గమనించండి.

(పూర్తి పద్యం కోసం పేజీని తిరగేసి చూడండి)



తన్వల్లికల్ విరిదండలై జవరాంద్రు
విరిసిరి తిరుమల వేంకటేశ
హాయి ఊంజల సేవ హవణించు సమయాన
పరవశింతురు నీదు భజన చేసి
శ్రీహరి యేకాంత సేవలో ఒకవైపు
నిలిచి వరుసలందు నిను గొలుతురు

నిను జూచిన సకల జనులును సుఖశాంతి
యుత చిత్తులగుదురు యోగమంది
సిరియనదే నాదని హరిచరణ సేవ
కరుణ వెలయించు తరిగొండ సిరుల ఝురులు
సేవలు గ్రహించి విరజిమ్ము చిరునగవులు
నవయువత కియ్యవలదె చదువుల కొలువు

టి.చక్రపాణి,
బ్యాంకు విశ్రాంత మేనేజర్,
తిరుపతి, 98851 96086

మొగలి పువ్వంటి

జనవరి ప్రవేశించింది. చలి బాగా పెరిగింది. మంచుతెరలు నింగినీ, నేలనూ ఆక్రమించేస్తున్నాయి. సాయంత్రం అయిదింటినించే చలిపులి గాండ్రిస్తూ, అందరినీ దుప్పట్లోకో, ఉన్నిచొక్కాలోకో దూర్చేస్తోంది.

అంత చలిగా ఉన్నప్పటికీ కాలు కాలిన పిల్లిలాగా ఇంట్లోకీ, బయటికీ తిరిగేస్తోంది ఇందిర. ఆరున్నర దాటుతున్నా ఇంటికి రాని కూతురు శ్రావ్య కోసం ఎదురు చూస్తోంది. ప్రత్యేక తరగతి అంటూ పాఠశాల వాళ్లే విద్యార్థులకి అదనపు తరగతులు నిర్వహించడం వల్ల శ్రావ్య రోజూ ఆరు గంటల వరకూ బడిలోనే ఉంటుంది. బడి బాగా దగ్గరే అవటం వల్ల మరో పది నిమిషాల్లో ఇంటికొచ్చేస్తుంది.

"ఈ రోజెందుకో శ్రావ్య ఇంకా రాలేదు." అనుకుంటూ ఉండగానే వచ్చేసింది శ్రావ్య.

"అమ్మా! అమ్మా!" పుస్తకాల సంచి సోఫాలోకి విసిరేస్తూ పిలిచింది.

"ముందు ముఖం కడుక్కురా! తర్వాత మాట్లాడదాం" అంది ఇందిర.

"సరేలే! కానీ... 'సందెగొబ్బిళ్లు' అంటే ఏమిటో ఈ రోజు నువ్వు చెప్పాలి. సరేనా!" అంటూ షరతు పెడుతూ లోపలికి వెళ్లింది. నవ్వుకుంది ఇందిర. "ఇది ఈ మధ్య ఇలా బడి నుంచి రాగానే ఏదో ఒక ప్రశ్న వేస్తోంది." అనుకుంది.

శ్రావ్య తినడానికి చిరుతిళ్లు సిద్ధంగా పెట్టి, హార్లిక్స్ కలిపి కప్పులో పోసి రెంటినీ భోజనం బల్ల మీద పెట్టింది.

శ్రావ్య వచ్చీ రాగానే ఆ రెండూ ఖాళీచేసి హాల్లోని సోఫాలో తల్లి పక్కనే కూర్చుంది.

"అమ్మా! ఇప్పుడు చెప్పు. 'సందె గొబ్బిళ్లు' అంటే ఏమిటి?" అడిగింది.

"ఏమిటే! రోజుకో ప్రశ్న అడుగుతున్నావు? మొన్న 'నెల పట్టడం' అంటే ఏమిటన్నావు? నిన్న 'రంగవల్లి' అంటే ఏమిటన్నావు? ఈ రోజు ఈ ప్రశ్న? ఏమిటి, విషయం? ఇవన్నీ మీ బళ్లో అడుగుతున్నారా? ఇలా అయితే వాళ్లని మెచ్చుకోవాలి సుమా, మన సంస్కృతి, సంప్రదాయాల్ని మీకు పరిచయం చేస్తున్నందుకు!" అడిగింది ఇందిర.

" పోమ్మా! బళ్లో ఇలాంటివన్నీ ఎందుకు అడుగుతారు? ఆ ప్రశ్న చదివావా? ఈ లెక్క చేశావా? ఈ పరీక్షల్లో తక్కువ మార్కులెందుకొచ్చాయ్ ఇవేగా వాళ్లడిగేది?" అంది శ్రావ్య.

"మరైతే ఈ పండుగల గురించిన సందేహాలు నీకెందుకొస్తున్నాయి?" కుతూహలంగా అంది ఇందిర.

"మా స్నేహితురాలు హరిత లేదూ... అదే... కొత్తగా చేరిందని చెప్పానే... ఆ అమ్మాయి వాళ్లింట్లో ఇవన్నీ చెప్తారట. 'రేపు సందె గొబ్బిళ్ల పేరంటం' చేస్తారట. తను ఇవన్నీ చెప్తుంటే నాకు కొత్తగా అనిపిస్తూ ఉంటుంది, అందుకే నిన్ను అడిగి వివరంగా తెలుసుకుంటున్నాను." అంది శ్రావ్య.

"అలాగా! ఈ మహానగరంలో కూడా ఇంకా ఇలా మన సంప్రదాయాలని పాటిస్తూ, పిల్లలకి నేర్పించే వాళ్లున్నారంటే ఆశ్చర్యంగా ఉంది."

"తర్వాత ఆశ్చర్యపోదువు గానిలే! ముందు 'సందె గొబ్బిళ్లు' అంటే ఏమిటో చెప్పు" గారాలు పోయింది.

"సరే విను. మా చిన్నతనంలో అమ్మమ్మగారి ఊరెళ్లినప్పుడు ఈ పేరంటం నేనూ చేశాను. తర్వాత మా అమ్మ, మీ బామ్మ ప్రతియేటా చేయించారు." చెప్తూనే గతంలోకి జారిపోయింది ఇందిర. పక్కనే ఉన్న కూతుర్ని మర్చిపోయి, ఏదో పారవశ్యంలో ఉన్నదానిలాగా 'ఆనాడు తామెలా చేశారో' అదంతా కలవరిస్తున్నట్లు చెప్పసాగింది.

* * *

"ఇందూ! ఇందిరా! లేమ్మా! లే, తెల్లారే లోపలే ముగ్గేయడం అయిపోవాలి. చూడు, నీ కోసం ఎంత పెద్ద ముగ్గు వేశానో! నీ స్నేహితురాలు రజనివాళ్ల ఇంటి ముందు కన్నా పెద్దముగ్గు వేయాలి, లేకపోతే మీ స్నేహితురాలి ముందు ఓడిపోతానని రాత్రంతా గొడవ చేశావ్‌గా! మరి లేచి చూడు." ఇందిర తల్లి ఇందిర కప్పుకున్న దుప్పటి లాగేస్తూ లేపుతోంది.

"ఉండమ్మా! చలేస్తుంది! కాస్సేపు పడుకుంటా!" మారాం చేసింది ఇందిర.

"అలాగా! అయితే పడుకో! రేపట్నించీ నీ కోసం ముందే లేచి పెద్దపెద్ద ముగ్గులేయను. రజనీయే గెలుస్తుంది. నువ్వోడిపోతావ్!" అలిగినట్లు అంది ఇందిర తల్లి.

"అమ్మో! అలా వీల్లేదు. నేనే గెలవాలి!"

ఒక్క ఉదుటున లేచి కూర్చుంది. వేడివేడి నీళ్లతో స్నానాదులు కానిచ్చి బయటకొచ్చేసరికి ఎంతో హాయిగా అన్పించింది ఇందిరకి.

తూర్పు తెల్లతెల్లగా మారుతోంది. పక్షుల కిలకిలా రావాలు వీనుల విందు చేస్తున్నాయి. ఇందిరా వాళ్ల వీధి పొడవునా రంగవల్లులు తీరుస్తూ సందడి చేస్తున్నారు ఆడవాళ్లు.

ఇందిర తమ ఇంటి ముందున్న ముగ్గువైపు చూసింది. చూస్తుండగానే ఆనందంతో, ఆశ్చర్యంతో కళ్లు విప్పారాయి. గులాబీలు, చేమంతులు ఆకుల మధ్య అందంగా విరిసినట్లు తీర్చిదిద్దిన ముగ్గు తల్లిలోని కళాత్మకతకు అద్దం పట్టింది.

"హబ్బ! ఎంత బాగా వేశావమ్మా! చాలా... చాలాచాలా బాగుంది. రజని ఈసారి తప్పకుండా ఓడిపోతుంది." తల్లి చెంగుపట్టి లాగి బుగ్గమీద ముద్దుపెడుతూ అంది ఇందిర.

"పిచ్చిపిల్లా!" నవ్వింది ఇందిర తల్లి.

"సరేగానీ, ఇప్పుడు నేనేం చేయాలి?" అడిగింది ఇందిర.

"అదుగో, ఆ పూలమధ్యలో పద్మంలాగా ముగ్గు దిద్దాను కదా! ఈ గొబ్బిళ్లని ఆ పద్మం మీద అందంగా అమర్చు" అంది తల్లి.



తల్లి చేతిలో ఉన్న పీటని అప్పుడే చూసింది ఇందిర. ఆ పీట మీద గొబ్బిళ్లున్నాయి. ఆవు పేడతో గుండ్రని ముద్దలు చేసి, పసుపు, కుంకుమ, బియ్యప్పిండితో గీతలు గీసి, బొట్లుపెట్టి, బంతిపూలతో, చేమంతి పూలతో అలంకరించి,

పీటపై ఉంచారు. వాటినే గొబ్బెమ్మలు లేదా గొబ్బిళ్లు అంటారు. సాక్షాత్తు గౌరీ స్వరూపాలుగా వాటిని పూజిస్తారు.

తల్లి దగ్గర్నించీ ఆ పీట తీసుకుని ముగ్గు మధ్యలో ఉన్న పద్మం మీద అందంగా అమర్చింది. తల్లి అందించిన పండ్లు నివేదించి, దీపధూపాలతో అర్చించింది.

"ఇలా ఎన్నాళ్లు చెయ్యాలి?" అడిగింది ఇందిర. "సంక్రాంతి పండుగ వరకూ ఇలా చెయ్యాలి. రేపు నీకు సెలవేకదా! 'సందె గొబ్బిళ్లు' పెడదాం, నీ స్నేహితులందరినీ రమ్మని చెప్పు. ఇక లోపలికి రా! చాలా పనుంది" అంటూ ఇందిర తల్లి లోపలికి వెళ్లిపోయింది.

"సందె గొబ్బిళ్లా! అవేమిటి?" అడిగింది. "సాయంకాలం పూట అంటే సంధ్యవేళ పెట్టేవే 'సంధ్య గొబ్బిళ్లు'. క్రమేణా అదే 'సందె గొబ్బిళ్లు' అయింది." వివరించింది తల్లి.

"రేపు పెద్దమ్మా వాళ్లు, పిన్నీ, అత్తా అంతా వస్తారు. మీరంతా కలిసి పేరంటం చేద్దురుగాని. ఇంక ఈ రోజు నీ పన్లు చూసుకో!" అనేసి వంటింట్లోకెళ్లింది తల్లి.

"పెద్దమ్మా, పిన్నీ, అత్తా వస్తారా! అయితే రమ్య, రాగిణి, వనజా, శిరీషా కూడా వస్తారుగా! భలే! భలే! బాగా ఆడుకోవచ్చు." హుషారుగా అంది ఇందిర.

ఆ రోజంతా ఎలాగోలాగా గడిపేసింది. అసలు సందడి మర్నాడు మొదలైంది. ఇంటినిండా బంధువులు, వారి పిల్లలతో హడావిడిగా మారింది. ఇందిర స్నేహితులందరినీ 'సందె గొబ్బిళ్లు' పేరంటానికి పిలిచింది.

భోజనాలయింతర్వాత కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని పేరంటం ఏర్పాట్లు మొదలుపెట్టారు. వరండా అంతా శుభ్రంగా తుడిచి రంగవల్లులు తీర్చిదిద్దారు. చుట్టూతా గోడకానించి కుర్చీలు వేశారు. ఇందిర తల్లి, పిన్ని, అమ్మమ్మ, బామ్మ, అత్త... ఇంకా ఇంటికొచ్చిన పెద్దలంతా ఆ కుర్చీల్లో కూర్చున్నారు. వరండా మధ్యలో ఒక ఎత్తైన పీట వేశారు. దానిపై పసుపు, కుంకుమ, బియ్యప్పిండి ఉపయోగించి పద్మాలు, స్వస్తిక్‌లు, శంఖాలు, చక్రాలు తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలను అందంగా తయారు చేశారు. ఒక పెద్ద గొబ్బెమ్మను 'తల్లి గొబ్బెమ్మ' చేశారు. ప్రత్యేకంగా తెప్పించిన గుమ్మడి పూలను అందంగా కిరీటంలాగా ఆ గొబ్బెమ్మపై అమర్చారు.

గొబ్బిళ్లన్నింటినీ జాగ్రత్తగా తెచ్చి వరండాలో ఉంచిన పీఠం మీద ఉంచి, గౌరీదేవిగా భావిస్తూ పూజలు చేశారు. అనంతరం పడుచు పిల్లలంతా ధూపదీప శోభలతో కళకళలాడుతున్న గొబ్బిళ్లకు నమస్కరించారు.

చక్కగా పట్టుపరికిణీలు కట్టుకుని నడిచే లక్ష్మీదేవి రూపాలా అన్నట్లున్న పిల్లలని చూసి పెద్దలంతా ముచ్చటపడ్డారు.



"చీకటి పడిపోతోంది. ఇంకా ఎంతసేపర్రా! త్వరగా గొబ్బి తట్టండి!" గదమాయించారు బామ్మగారు.

అమ్మాయిలంతా చేయిచేయి పట్టుకుని అడుగులు లయబద్ధంగా కలుపుతూ గుండ్రంగా గొబ్బిళ్ల చుట్టూ నిలబడ్డారు. తర్వాత చేతులు వదిలేసి, చప్పట్లు కొడుతూ గొబ్బి తట్టసాగారు. "చుట్టూ తిరుగుతూ పాట పాడండి. ఏదీ! రమ్యా! మొదలెట్టు" ఉత్సాహపరిచింది మేనత్త.

ఇంక పాటల ప్రవాహం మొదలైంది. అమ్మాయిల్లో హుషారు పెరిగింది. అడుగులు వేగంగా వేస్తూ, గొబ్బి తట్టసాగారు.

"ఏల వచ్చెనమ్మ కృష్ణుడేల వచ్చెనే?
ఆ మాయదారి కృష్ణుడొచ్చి మహిమ చేసెనే!
ఉట్టి మీద పాలు పెరుగు ఎట్లు దించెనే?
బాలుడు కాదమ్మా! పెద్దవాడమ్మా!"

తర్వాత పాట రజని మొదలెట్టింది. అంతా గొంతు కలిపారు.

"దుక్కుల్ దుక్కుల్ దున్నారంట!
ఏమి దుక్కుల్ దున్నారంట?
రాజావారి తోటలో జామ దుక్కుల్ దున్నారంట!
ఆనాటి అక్కల్లారా! చంద్రగిరి భామల్లారా!
భామలగిరి గొబ్బిళ్లో!
గొబ్బీయళ్లో..! గొబ్బీయళ్లో...!"

ఇలా మొదలైన పాట.. జామ పండ్లు పండేవరకూ సాగి... పూర్తయింది.

"ఇంతకీ అసలు పాటేదీ?" కొంటెతనం మిళాయిస్తూ అడిగింది ఇందిర పిన్ని.

"ఔనౌను! అసలు పాట ఏదీ? పాడండర్రా!" అందుకుంది అమ్మమ్మ.

అమ్మాయిలకి అర్థమైంది. కళ్లల్లో నునుసిగ్గులు తొంగిచూశాయి. చెంపలు కెంపులయ్యాయి. చిరునవ్వులు నవ్వుకుంటూ ఒకర్నొకరు చూసుకున్నారు. గ్రహించిన పెద్దవాళ్లు తామూ నవ్వేశారు.

"ఇక చాలుగానీ, మొదలెట్టండి" గదమాయించారు.

"వేళ మించిపోతోంది. త్వరగా మొదలెట్టండి," ప్రోత్సహించింది పెద్దమ్మ.

తప్పదన్నట్లు కదిలారు పిల్లలు. గుండ్రంగా తిరుగుతూ పాడసాగారు.

"సుబ్బిగొబ్బెమ్మా! శుభము లివ్వవే!
చేమంతి పువ్వంటి చెల్లెల్నీయవే!
తామర పువ్వంటి తమ్ముడ్నీయవే!
బంతిపూవంటి బావనీయవే!
మందార పూవంటి మరదల్నీయవే!
మొగలి పూవ్వంటి ... ..."

పాట ఆపేసి ఫకాల్న నవ్వుతూ తలోపక్కకీ వెళ్లిపోయారు.

సిగ్గుపడిపోతున్న అమ్మాయిలని చూసి తామూ ముచ్చట పడిపోయారు పెద్దలు.

"ఆపేశారేమే! పాడండీ! మీకు తెల్సుకదా! గొబ్బెమ్మంటే గౌరీదేవి. మీ కోరికలు సరిగ్గా చెప్పుకుంటే ఆ తల్లి ఆశీర్వదిస్తుంది. రండి, రండి" పిలిచారు పెద్దవాళ్లు.

అమ్మాయిలు మళ్లీ మొదలెట్టారు.

"చేమంతి పువ్వంటి చెల్లెల్నీయవే!
....
మొగలీ పువ్వంటి ...." మళ్లీ ఆగిపోయింది. అమ్మాయిల తలలు నేలవైపు దించి, నవ్వుకుంటున్నారు.

"ఏయ్, అమ్మాయిలూ! ఇలా మధ్యలో ఆపేస్తే మీకు మంచి మొగుళ్లెలా వస్తారు?" అల్లరిగా అడిగింది అత్త.

పాట మళ్లీ మొదలై "మొగలీ పువ్వంటి ....." వరకూ గట్టిగా పైకి పాడిన అమ్మాయిలు "మొగుడ్నీయవే" అని వినీవినపడకుండా అనేసి పకపకా నవ్వుతూ సిగ్గుతో తలో పక్కకీ పారిపోయారు.

"ఓసి, మీ సిగ్గు బంగారంగానూ! అలా పారిపోతే వాయనాలెవరిస్తారే?" తానూ నవ్వుతూనే పిలిచారు బామ్మగారు.

సిగ్గుపడుతూనే అంతా వెనక్కొచ్చి పేరంటాళ్లకు వాయనాలిచ్చి, వారి ఆశీస్సులు పొందారు అమ్మాయిలు. పేరంటం ముగిసి అంతా ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు.

* * *

ఆ రాత్రి బామ్మగారి పక్కన చేరింది ఇందిర. "బామ్మా! బామ్మా! ఇందాక పేరంటంలో చివరిపాట గుర్తుంది కదా! అందులో చామంతి పువ్వంటి చెల్లెలూ, తామర పువ్వులాంటి తమ్ముడూ, ..., ఇలా అన్నీ చక్కని పూలతో పోల్చి, 'మొగలి పువ్వంటి మొగుడ్ని' ఇమ్మని కోరటం ఎందుకు? మొగలి పువ్వు అంత అందంగానూ ఉండదు. పైగా ముళ్లు ఉంటాయి. అలాంటి మొగుడు కావాలనడంలో అర్థం ఏమిటి?" అడిగింది ఇందిర.

"మంచి ప్రశ్నే వేశావు. చెల్లెలూ, తమ్ముడూ మనింట్లో మనతోబాటే పెరుగుతారు. బావా, మరదళ్లూ అలాగే మెత్తగా ఉండాలని కోరుకుంటాం. అవునా?" అన్నారు బామ్మగారు. కానీ ఆడపిల్ల తానే అత్తవారింటికి వెళ్లాలి. అక్కడ అత్తమామలు, ఆడపడుచులూ అంతా కొత్తకొత్తగా అనిపిస్తుంది.

నువ్వు మొగలి పువ్వుని చూశావుకదా! దానికి పైపైనే ఉండే రేకుల్లో ముళ్లుంటాయి. అత్తవారిల్లు కూడా పైపైన ఉండే మొగలి రేకుల ముళ్లలాగా భయపెడుతున్నట్లు ఉంటుంది. భర్త కూడా కొంచెం కఠినుడిలాగానూ, అర్థం చేసుకోనివాడుగానూ అనిపించవచ్చు.

"కానీ మొగలిపువ్వుపై రేకులను జాగ్రత్తగా తొలగిస్తే లోపలిరేకు మెత్తగా, బంగారు వర్ణంలో మత్తెక్కించే సువాసనలు వెదజల్లుతాయి. అలాగే అత్తవారింటికి వెళ్లిన ఆడపిల్ల అందర్నీ తానే అర్థం చేసుకుంటూ పైపై ముళ్లవంటి అపార్థాల రేకులని తొలగిస్తే, ఘుమఘుమలాడే మొగలి పూరేకుల సుగంధం వంటి మంచితనం బయటపడుతుంది. మొగలిపూల పరిమళం చాలాకాలం నిలిచి ఉంటుంది. ఎండిన రేకులు కూడా గుబాళిస్తుంటాయి. అలా మొగలి పువ్వులాంటి భర్తతో జీవితం సుగంధ భరితమై శాశ్వతంగా పరిమళిస్తూ ఉంటుంది. అందుకే 'మొగలి పువ్వంటి... మొగుడ్నీయవే' అంటారు." అని వివరించింది బామ్మ.

* * *

తల్లి చెప్తూండగా ఏకాగ్రతతో వింటున్న శ్రావ్య "అమ్మా! మన తెలుగు సంప్రదాయాల్లో ఎన్ని విశిష్టార్థాలు ఉన్నాయో కదా!" అంది. "అవును, అదే మన తెలుగుజాతి గొప్పదనం." అంది ఇందిర.

ముద్దబంతి పూవులో..



సంక్రాంతికీ బంతిపూవుకీ విడదీయరాని అనుబంధం. వీటిని పొలాల గట్లపైనా, కాయగూరల మొక్కల మధ్యనా నాటుతారు. ఎందుకంటే చుట్టుపక్కల మొక్కలని ఆశించే క్రిమికీటకాలను సైతం పారదోలే శక్తి వీటికి ఉంది. బంతి మొక్కలు సంక్రాంతి సమయానికి విరగపూస్తాయి. గుమ్మాలకి తోరణాలవుతాయి, గొబ్బెమ్మలకి తలలవుతాయి, భోగి పేరంటంలో అక్షతలవుతాయి.. మొత్తంగా ప్రకృతే పరవశిస్తోందన్న ఊహకి 'రెక్క'లిస్తాయి. వైద్య శాస్త్రంలో బంతిపూలకి ఎంతో ప్రత్యేకత ఉంది. హోమియోపతిలో కేలెండ్యులాగా ప్రసిద్ధమైన మందు బంతిపూల నుంచే తీస్తారు. చర్మసంబంధమైన రోగాలకి కేలెండ్యులాని దివ్యౌషధంగా భావిస్తారు. దీన్ని తాకినా, వాసన చూసినా కూడా చర్మానికి మంచిది. సంక్రాంతి భోగభాగ్యాలకే కాదు, ఆయురారోగ్యాలకి కూడా 'పండు'గే.

వాడపల్లి రాధ
విశ్రాంత అధ్యాపకురాలు
విజయవాడ.
90320 44635

సరిగమలు...!

కిరణ్

> 'తల్లిని మించిన దైవము లేదు' అని ప్రతిరోజూ భావించి తరించడం మన పద్ధతి - మనమూ 'మదర్స్ డే'లు జరుపుకోవచ్చు మనమూ పరభాషల్లో నిష్ణాతులమైపోవచ్చు. కానీ మన భాషనీ సంస్కృతినీ మరిచి పోయేంత తీవ్రంగా అవసరం లేదేమో!

సమ్మర్‌లో మా elder son software course పూర్తి చేశాడండీ.. ఫ్రెండ్ కి apply చేశాడు. infact ఢిల్లీలో ఓ reputed company మంచి offer కూడా ఇచ్చింది. ఈ year marriage కూడా అయిపోతే once for all settle అయిపోతాడు. ఇకపోతే మా second son..

ఇంగ్లిషు మేఘాలు ముసురుతుంటే మధ్యమధ్యలో బిక్కుబిక్కుమంటూ తొంగిచూస్తూ.. అంతలోనే హిందీ రాహువు, మరేదో కేతువు మింగెయ్యడానికి తరుముకొస్తూ ఉంటే అల్లాడిపోతూ.. కొట్టుమిట్టాడుతున్న తెలుగు చందమామకి ఇక శుక్లపక్షం లేదేమో-రాదేమో?

ఇక రానున్న ప్రతినెలకీ 30 అమావాస్యలేమో!

రి'త'మ్ ఉన్న సాంగ్సు నాకిష్టం. నేను 'క'ష్టం సినిమా చూశాను.

మనది 'బా'రతదేశం.

'గం'టసాల గారి గొంతు బాగుంటుంది.

'చ'త్రపతి శివాజీ ఇక్కడే పుట్టాడు.

ఎందరో మహానుబావులు

- పరుషాలు పలకడం

తెలుగువాళ్లందరికీ చేతకావట్లేదు -

ఈ మధ్య కొందరికి పౌరుషమూ చచ్చింది మరి!

గడగడా ఇంగ్లిషు మాట్లాడితే విదేశాల్లో ఉద్యోగ అవకాశం వస్తుంది సరే! ఒప్పుకుంటాం. ...

- తెలుగును తప్పనిసరిగా విద్యావిధానంలో ప్రవేశపెడితే?

1. తెలుగు నేర్చుకుంటారు.
2. మాతృభాషపై మమకారం పెరుగుతుంది.
3. మాతృభాషపై గౌరవం పెరుగుతుంది.
4. ఇది నాది, వీళ్లు నా వాళ్లు, ఇది నా ప్రాంతం అనే అభిమానాలు మెండు అవుతాయి.
5. ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి.
6. ఓ పక్క ఇతర భాషలు కూడా వంటబడుతూ ఉంటాయి.
7. విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేసే తెలుగు వారిలో లేని ఆత్మవిశ్వాసం వీరిలో ఉండటం వల్ల వారిపై పైచేయి సాధిస్తారు.

- ఈ ప్రతిపాదన ఆకర్షణీయంగా లేదా?

మన శరీరంలో ఉష్ణోగ్రతని కొలవగలిగినట్లుగా మనసులో ఎగిసే క్రోధావేశాల్ని కొలవగలిగే సాధనం ఉంటే బాగుండని నాకనిపిస్తుంది. ఎవరైనా మనల్ని ఇంగ్లిషులో తిట్టారనుకోండి! కోపం వస్తుంది. అదే తెలుగులో తిడితే వచ్చే కోపం ఎంతో చెప్పలేం! ఒకసారి తెలుగు, ఇంగ్లిషు రెంటిలోనూ ఉన్న ఒక తిట్టును ఊహించి చూడండి! మరి మాతృభాషలో అంత శక్తి ఉన్నందుకు మానవ జీవన విధానంలో, పరిపాలనా వ్యవస్థలో నిత్య సమాజ సంబంధాలలో .. మాతృభాషకి ఎందుకు పెద్ద పీట వేయకూడదు!

పలకరింపుల్లో సైతం 'హాయ్' అంటూ తెలుగు వచ్చి కూడా తెలుగులో మాట్లాడటానికి సిగ్గుపడేవాడు, తెలుగు వాడినని చెప్పుకోవడాన్ని చులకనగా భావించేవాడు.. నేను ఫలానా వారి కడుపున పుట్టాను.. అని చెప్పుకోలేని బతుకు బతుకుతున్నట్టు. (కాదు.. బతికీ చచ్చినట్టు)

దరిద్రమంతా ఎక్కడొచ్చిపడిందంటే- ఏడాదిలో ఓ రోజుకి 'మదర్స్ డే' అని తల్లిని గౌరవించుకోవడం వాళ్ల పద్ధతి. 'తల్లిని మించిన దైవము లేదు' అని ప్రతిరోజూ భావించి తరించడం మన పద్ధతి. -

మనమూ 'మదర్స్ డే'లు జరుపుకోవచ్చు మనమూ పరభాషల్లో నిష్ణాతులమైపోవచ్చు. కానీ మన భాషనీ సంస్కృతినీ మరిచిపోయేంత తీవ్రంగా అవసరం లేదేమో!

తమిళ సోదరులూ మరాఠీ సోదరులూ
ప్రపంచంలో మనుగడ సాగిస్తూ
తలెత్తుకునే తిరుగుతున్నారు
మనమెందుకు చెయ్యలేం?
దేశభాషలందు తెలుగు Less అనా?

నిల్చున్నపాటుగా కార్గిల్ సరిహద్దులకెదురెళ్లిపోయి ప్రాణాలర్పించేసి దేశసేవ చెయ్యక్కర్లేదు! ఐదేళ్లకోసారి ఓటు హక్కుని సరిగ్గా వినియోగించుకుంటే చాలు! సినిమా వాళ్ల వరకూ వస్తే.. ముందు తెలుగులో సినిమా పేర్లు పెట్టుకుని 'కాస్తంత' తెలుగుని బతికిస్తే చాలు - సినిమాలో సంభాషణలన్నీ సంస్కరించొద్దు! నా వరకు నేను ప్రతి సినిమాలో ఒక్క పాటైనా పూర్తి తెలుగులో సాహిత్యం రాయించి స్వరపరుస్తానని ప్రమాణం చేస్తున్నాను!

అక్షరక్రీడ 3

1				X
2				
3				X
4				
5				X
6				
7				X
8				X

1. సిరిమోము ఒక తెలుగు సంవత్సరం
2. దయతో కూడిన కత్తి
3. తిరగబడిన కీచకసోదరి
4. గురువు
5. యశోద తర్వాత జన్మ
6. బుద్ధుని కుమారుడు
7. దేవతల్లో ఒక తెగ
8. పిసినారి

పూర్తి చేసిన తరువాత నిలువుగా మొదటి గళ్లలోని అక్షరాలను కలిపి చదివితే ప్రసిద్ధ చక్రవర్తి పేరు వస్తుంది.

సమాధానాలు 114వ పేజీలో...

కథ
భాషా సుధ

మన కథల్లో తెలుగుతనం, నుడికారాల గురించి చెప్పుకోవడమంటే వస్తువు, శైలి, శిల్పం ఈ మూడింటిని విశ్లేషించుకోవడమే. కథా కథనాన్ని, సంవిధానాన్ని స్థూలంగా శిల్పం అనుకోవచ్చు. కథా నిర్మాణ పద్ధతి అది. అందులో విభిన్న విధానాలూ, రీతులూ, కిటుకులూ ఉన్నాయి. శిల్పానికి వివరణ కూడా ఒక ప్రత్యేకాంశం.

ఇక శైలి. శైలి... కథాసంవిధానానికి అంటే చెప్పే పద్ధతికి తోవ. అందుకని శైలి లేకుండా శిల్పం ఉండదు. బాట ఉంటే నడక సాగుతుంది. కనుక కథానికల్లో తెలుగుదనం, నుడికారాలపై చెప్పుకుంటున్నామంటే, ప్రాథమికంగా శైలిని గురించి వివరించుకుంటున్నామన్న మాట. శైలి కథలోని అంతర్లయ. వస్తువు, శిల్పం - గంగా యమునలైతే, శైలి సరస్వతి. అదొక వాక్య రచనా పద్ధతి. రచనలోకి వాక్యాలు భాష ద్వారానే వస్తాయి. మాటతీరు, పలుకుబడి, జాతీయాలు, లోకోక్తులు, సామెతలు, నుడీ, నానుడీ - ఇవన్నీ వాక్య నిర్మాణంలో తొణికిసలాడే మెరుపులు. వీటన్నింటా నిలువెల్లా అమృతం నిండి ఉంటుంది. ఆ అమృతాన్ని ఆస్వాదించే వారికి కథానందమనేది 'చుబ్బనచూఱలు'!

కథనశైలి, సంభాషణాశైలి, వర్ణనశైలి, సూక్తిశైలి వంటి సాంకేతికాంశాల్లోకి పోకుండా, శైలిలో ధ్వనించే తెలుగుతనాన్ని, నుడికారాన్ని ఈ వ్యాసంలో ప్రస్తావిస్తాను.

కథకుడి లోకజ్ఞత, జీవిత పరిశీలనావ్యగ్రత, సాహితీ సంస్కారం, అధ్యయనశీలం వీటన్నిటి సమాహారరూపం అతని రచనాశైలికి విన్నాణాన్ని కూర్చుతుంది. తెలుగుతనం, నుడికారం అనేవి ఆ విన్నాణంలోని సొబగులూ, సొంపులూ! అవి కన్నెపిల్ల పూలజడలాంటివి. కనువిందు చేస్తాయి. పఠిత హృదయంలో రసస్ఫురణ కలిగిస్తాయి. 'ఎముకలు కొరుక్కుతినే చలి. చలికాలంలోనైనా భార్య భర్తకి వణికిపోతూనే తలుపు తీస్తుంది' అంటారు రావూరువారు. ఆమె చలికి వణికిపోతోందా, లేక భర్తకి వణికిపోతోందా? ఇదీ చమత్కృతి!

దిద్దుబాటు (గురజాడ)తో మొదలెడితే ఎన్నెన్నో కథల పేర్లలోనే తెలుగుతనం, నుడికారం ప్రస్ఫుటమవుతూ ఉంటాయి చూడండి. ఎసరూ - అత్తెసరూ (బీవీఎస్ రామారావు), అలరాసపుట్టిళ్లు (కల్యాణసుందరీ జగన్నాథ్), వగపేటికి చల్ల చిందినన్ (రాజారాం), ఇలాంటి తవ్వాయి వస్తే, అరికాళ్ల కింద మంటలు (శ్రీపాద), తిరుగుడుగుమ్మి (గొరునాయుడు), వఱడు (అల్లం శేషగిరిరావు), చావువిందు (తుమ్మేటి), అంబల్ల బండ (భూపాల్), పగిలిన పచ్చికుండలు (చిరంజీవి), ఇంతలో ఉంది (కొ.కు), దొంగలున్నారు జాగ్రత్త (బొ.సూర్యారావు), పాడులోకం - పాడుమనుషులు (బలివాడ), అడుసు (సింగమనేని), దోషగుణం (చలం), పూర్ణాహుతి (పె.సు.రా.), తరలివెళ్లాము (జానకీరాణి), రెక్కమాను (ఎం.వి.రమణారెడ్డి), కడుపాత్రం (తవ్వా ఓబుల్‌రెడ్డి), మన్నుతిన్న మనిషి (దేవపుత్ర), బిడ్డలు గల్ల తల్లి (ఉమామహేశ్వరరావు), ఒకటే చీర (వేలూరి), లంఖణం పరమౌషధం (కరుణకుమార), పొగలేని నిప్పు (బుచ్చిబాబు), దాసం పాట (చింతా దీక్షితులు), రెండు బండ్లు పోయాయి (పూసపాటి కృష్ణంరాజు)... ఇలా ఎన్నైనా ఉదహరిస్తూ పోవచ్చు. ఇవన్నీ ఒక తెలుగు పరిమళాన్నీ, ఒక ఆత్మీయ స్పర్శనూ నింపుకుని ఉంటాయి.

జాతి లక్షణాలు ప్రతిఫలించేది జానుతెనుగులోనే. 'బతికి ఉండి మీతో చెబితే నమ్ముతారా? నేనే కావలసి ఈ పన్నాగం పన్నాననుకుంటారు... ఆ రోజు తెల్లారకట్ట...' ఇలా సాగుతుంది చలం శైలి. అదొక ఉత్తుంగ గంగాఝరి. ఆ

ఉరవడిదాక విద్యుద్వేగం. రెడ్డి రంగమ్మలాంటి కథల్లో చలం శైలి పరవళ్లు తొక్కుతుంది.

శ్రీపాదవారి తెలుగు నుడికారానికి సాహితీలోకం ఎప్పుడూ రుణపడే ఉంటుంది. 'మొగాడయి పుట్టిన ప్రతీవాడూ మొగుడయి పోడానికర్హుడే కామోసు... పెళ్లాడితే ఇలాంటి దేబెలనా? ఆడవాళ్లంతా పురుగులా? ప్రతీ ఆడదీ ఏ తలకుమాసిన వాణ్నో కట్టుకోకతప్పదేం? ఇదీ తూర్పుకోస్తా పల్లెటూళ్లలో ఆనాటి శిష్టులు మాట్లాడే వాడుక భాష. 'దేబె', 'కామోసు', 'తలకు మాసినవాడు' - అవీ నుడులూ, పలుకుబడులూ!

మల్లాది వారి బాస జాతి జీవనాడిని పట్టిచ్చే బాస. 'గారాల కూన', 'పాలవెల్లి నేలకూలినట్లు', 'మడుగు నీరు వడిపట్టి', 'మంచుకమ్మింది', 'చందమామ దూగరరేగింది'. వంటి తెనుగుసోన జాల్వారుతుంది. అందుకు ఆరుద్ర అన్నారు, 'మాటల్లో ఉప్పూ, కారం, పులుపూ, తీపి స్ఫురింపచేయాలంటే జాతీయాలకే అది సాధ్యం' అని.

కరుణకుమార వ్యవహారికంలో డబ్బు 'దండుకోవడం', 'బదనాయం (దండన) తప్పించుకోవడం', కస్తీ చేయడం (నిలదీయడం)' వంటి కర్బ్రారకళికలు కనిపిస్తాయి. కొడవటిగంటి, మా.గోఖలే, గోపిచంద్, జి.వి.కృష్ణారావ్ వంటి రచయితల రచనల్లో ఫక్తు గుంటూరు జిల్లా నుడులూ, నానుడులూ శైలిలో అంతర్భాగంగా చదువరుల్ని అలరిస్తాయి. ఆ తరం రచయితల్లో పద్మరాజు, బుచ్చిబాబు, చాసో, బలివాడ, కా.రా, రాజారాం వంటి కథకుల రచనల నిండా తెనుగుతనమే. చాసో అంటారు, 'ఆ గుంటని మరిగినాట్ట', 'ఊటగెడ్డ వోరన (సెలయేటి ఒడ్డున)'... ఇలా ఏరుకున్న వారికి ఏరుకున్నన్ని ఉత్తరాంధ్ర మాటల ముత్యాలు! రాజారాం కథల్లో చిత్తూరు పలుకులు: 'నేను పడమటి గడ్డంతా తిరిగినోణ్ని' వంటివి ఒలుకుతాయి. రావిశాస్త్రి శైలి ఒక పరిశోధనా గ్రంథానికే చక్కని అంశం కదా! ముళ్లపూడి వెంకటరమణదొక ప్రత్యేకముద్ర. వారి 'ధనార్ధరి', 'ఏకలవ్యుడు' వంటి కొత్తపదాలూ, సాక్షి, కానుక, సీతాకల్యాణం, ఋణానందలహరి, సెరెబ్రల్‌సినేమియా వంటి కథల్లోని శైలీ విన్యాసం - ఆలోచనాత్మకం, ఆనందదాయకం కదా! ఇక, సురవరం ప్రతాపరెడ్డి, ఆళ్వారుస్వామి, దాశరథి రంగాచార్య, రావూరు భరద్వాజ వంటి సుప్రసిద్ధ కథకుల తెలుగుతనం, నుడికారం విలక్షణం.

మరికొంత ముందుకొస్తే - బీనాదేవి శైలి కథా సాహిత్యంలోనే సంచలనాత్మకం. ఆమె వాక్యాల్లో పోలికలు ఒదిగిపోతాయి. 'పేగులు కరకర చుట్టుకుపోతాయి', 'ఏ మహమ్మారి నాలుక చాచింది', 'మొగపంజాలకి దూదిబొమ్మ', 'బెంచీ మీదే కునుకేశాడు కుర్రవెధవ' వంటి ప్రయోగాలూ విశాఖ పలుకుబడికి అద్దం పడతాయి. పూసపాటి కృష్ణంరాజు 'ఆ పప్పులేం ఉడకవు', 'జబర్దస్తీగా చెప్పింది', 'హద్దుపద్దూ లేదు' వంటి జాను తెలుగు పదాలు వాడతారు.

శ్రీరమణ పాత్రల మాటతీరులో 'అఘాయిత్యపు వెధవ', 'చిరుతిళ్లు', 'ఆరుపుంజీల బేళ్లు', 'బోడిగుండుకీ బొటనవేలుకీ ముడిపెట్టడం' వంటి వాక్యాలు దొర్లుతాయి. ఇవి చదువరికీ, పాత్రకీ మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొందిస్తాయి. కథాసన్నివేశాలకి ఆర్ద్రతని అలదుతాయి. స్వామి అంటారు - 'పుష్యమిపాయె, ఆశ్లేష వచ్చె, కార్తి తప్పిపాయె', 'జనమంతా చప్పగా అయిపోయిరి', 'ఉరువు సేద్యం'... ఇలా రాయలసీమ ప్రజాభాష తొణికిసలాడుతుంది. పులికంటి, దేవపుత్ర, రాసాని, సింగమనేని, సన్నపురెడ్డి, నరేంద్ర వంటి వారంతా రాయలసీమ జనహృదయ ఘోషని జీవద్భాషలో వెలువరించినవారే. అల్లం రాజయ్య కథల్లో తెలంగాణా మాండలిక పదాల శయ్యాసౌభాగ్యం మస్తుగా దర్శనమిస్తుంది. 'గాడుపుదుమారం', 'పూనకం పూనటం', 'గుదిబండ' వంటి మాటలు తగుల్తాయి. తమ్మేటి అంటాడు, 'నిప్పుల మీది మొక్కజొన్నకంకి తీరుగ బొర్లిపోతన్నడు', 'వ్యవసాయం పాత బొంద', 'అది ఒడ్డునబడేదా, గడ్డనబడేదా', 'గొడ్డూ, గోదా, జాగా గంగల కల్సినయ్' అని. మాటల వెనుక ధ్వనించే వ్యధా, మనసూ - చదవరిని కదిలించవూ మరి!

తెలంగాణా భాషానుడికారాన్ని ఎంతో శక్తిమంతంగా కథాగతం చేస్తున్న పెద్దింటి అశోక్‌కుమార్, కాలువ మల్లయ్య, కె.వి.నరేందర్, సదానంద్ శారద, బెజ్జారపు రవీందర్, వినోద్‌కుమార్, వేణుగోపాల్, ఎస్.కె.రామారావు, రమాచంద్రమౌళి, సుజాతారెడ్డి, అంపశయ్య నవీన్ వంటి కథా రచయితలు ఎందరో. కథారచన పట్ల వీరందరి ఆరాధనా భావం వల్ల ఈనాటి కథల్లో వస్తువిస్తృతితోపాటు, శైలిలో తెనుగుదనం నుడికారం కూడా చిక్కబడినై. పదునెక్కినై.

తెలుగు కథ తెలుగు శైలిలో ఉంటేనే అందమూ, ఔన్నత్యమూ, గౌరవమూ! కథాశైలిలో ఒదిగి ఒప్పికగా కూర్చునే ఒప్పులకుప్పలే నుడికారం, పలుకుబడీ, లోకోక్తులు, సామెతలు వంటివి. కథలో పాత్రలు తుమ్మినా, తిట్టినా, పొగిడినా, తెగడినా తెలుగు తీరు తెలుగువారి తీరే! అందుకే తెలుగు కథ ఒక జాతి కథ! తెలుగు కథావికాసం తెలుగు భాషా వికాసానికి చోదకశక్తి!

జె.ఎస్.మూర్తి (విహారి)
విశ్రాంత అధికారి,
జీవిత బీమా సంస్థ
హైదరాబాద్, 98480 25600

బియ్యపు 'పిండి' వంటలు

సంక్రాంతి నాటికి పంటలు పండి, ధాన్యలక్ష్మి ప్రతి ఇంటా కొలువై ఉంటుంది. ఆ బియ్యానికి కాస్త బెల్లం, నూనె చేరిస్తే మిఠాయిలకి మారాజైన అరిసె తయారైనట్లే. అరిసెల కోసం తడి బియ్యాన్ని దంచి, దానికి బెల్లపు పాకాన్ని చేరుస్తారు. అలా తయారైన మిశ్రమాన్ని నూనెలో వేయించుకుంటే 'పిండి'వంట సిద్ధం. బియ్యం, బెల్లం వంటివి సహజ పదార్థాలే కనుక అరిసెలు శరీరానికి శక్తినిస్తాయే కానీ హాని చేయవు. బియ్యపు పిండితో చేసే మురుకులు, అన్నానికి చింతపండు రసాన్ని జోడించి చేసే పులిహోర, పాలు - బెల్లం కలిపి చేసే పరమాన్నాలు (పొంగలి) కూడా రుచినీ, శరీర శుచినీ కల్గిస్తాయి.

దగ్ధం

చదువుతున్నారు. పాలు తీసుకోమన్నట్టు సైగ చేసి - "శివుని తలను చేతిలో పట్టుకున్న భద్రకాళికేనా?...!!" ప్రశ్నించారు నాన్న.

ఆ ఎర్రని వస్త్రం మీద అలాంటి బొమ్మే ఉంది. అందుకే కాళికాదేవి చీర అని పేరుపెట్టుకున్నా. ఖాళీగ్లాసు కింద పెడుతూ అదే మాట చెప్పాను. నేను చేసిన పరిశోధన గురించిన ఆసక్తి నాన్నకు ఇంకా పెరిగింది.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ విభాగంలో ఉత్సాహకరమైన ప్రోత్సాహమే దొరికింది. నాలాంటి యువ శాస్త్రవేత్తలకు అలాంటి చోట పనిచేసే అవకాశం లోకాన్ని దగ్గరిగా చూపెడుతుందని నా నమ్మిక.

సమస్య ఎక్కడుందో అక్కడికే వెళ్లాలనే మా పరిశోధనా విధానం బాగా నచ్చుతుంది. నేను చేసిన అధ్యయనం నా ఇష్ట ప్రకారమే జరిగిందని చెప్పడంలో ఎంతో సంతృప్తి ఉంది. శోధనకు నేనెంచుకున్న బాటలోనే ఆంధ్రా - ఒడిశా సరిహద్దుకు వెళ్లాను. అక్కడి అరుదైన వ్యక్తిగత అధ్యయన పద్ధతుల (కేసుస్టడీ)ను చదివిన నాన్న, నేను వెళ్లిన చోటుకి తీసుకెళ్లమనడంతో పట్టరాని సంతోషం కలిగింది.

* * *

తూరుపు తెలవారుతుండగా వైజాగ్ నుంచి మా కారు ఒడిశా వైపు బయలు దేరింది. ఇంతకుముందు

"వింత కేసు..!!" బుజ్జగిస్తున్నట్టుగా చూస్తూ, పాలగ్లాసుతో నిల్చున్న నాన్నతో చెప్పా ఆ రాత్రి. బాగా మరిగినపాల కంటే చేస్తున్న 'పని' తీక్షణమైనదన్న వేడుకోలు అందులో ఉంది. అల్లరి చేయొద్దనీ, బుద్ధిగా ఈ పని సైతం కానివ్వమని ఆయన మొండికేస్తున్నారు. నాన్న పంతం తగ్గిస్తూ అప్పుడు అడిగా - "కాళికాదేవి చీర తెలుసా?!.." అని. చిక్కని రక్తం రంగు, ముక్కిన ధాన్యం వాసనతో, చిరుగులు పడ్డ ఆ నారవస్త్రం సంగతి బోధపరిచాను. తెచ్చిన పదార్థం పక్కనపెట్టి, ల్యాప్‌టాప్‌ను తనవైపు తిప్పుకున్నారు నాన్న.

ముఖం కడుక్కొని తిరిగి గదిలోకి వచ్చేసరికి పియానోమీద వేళ్లు ఆడిస్తున్నట్టుగా, కీబోర్డును ఆపరేట్ చేస్తూ నా రీసెర్చ్ రిపోర్ట్‌ను

అక్కడికి వెళ్ళినప్పుడు-

అగ్గిని వేలం వేస్తున్నట్టుందా చోటు. మంటల్లోకి పిడకలు విసురుతూ జనం కేకలేస్తున్నారు. ఆడవాళ్ళు బూతులు తిడుతుంటే మగవాళ్లు అనుసరిస్తున్నారు. పంటకు విత్తనాలు చల్లేముందు వీధి చివర నిప్పు రాజేయడం ఒడిశా భూయా జాతి ప్రజల ఆచారం. ఆ గుంపులో ఆమెను సులభంగానే గుర్తుపట్టాను. రాటుదేలిన చూపులు, ముడతలు పడ్డ నిగనిగలాడుతున్న ఒళ్లు, మర్రి ఊడల్లాంటి జుత్తును సిగేసుకుని, అంచుల్లేని తెల్లని చీరలో తళతళలాడుతున్న ఆ బామ్మ బోర్డర్ బతుకులను బాగా ఎరిగిన పేదరాశి పెద్దమ్మ. కొండచీపుళ్లతో నేసిన ఇంటిలో కర్రపీటమీద నన్ను కూర్చోబెట్టింది. నా సంగతంతా విని మట్టిగూన నుంచి పాత నారవస్త్రం తీసింది. దాన్ని ఒళ్లంతా కప్పుకుని, సంబరపడిపోతున్న ధ్వనితో చెప్పుకొచ్చిందామె. "పెళ్లిచీరకు పడ్డ చిరుగులు మామను నవ్వించాయి. ఆయన సంతోషపడినా, చూసి ఎగతాళి చేసినా పరవాలేదు. అదే పని ఇంకెవరో చేస్తే తట్టుకోలేను. కాని మా కల్యాణం చూడటానికి ఎవరూ రాలేదులే. ఉద్దానం కంచిలి ఎరుగుదువా?.. అక్కడ ఉండేవాళ్లం. కంచిలి శ్మశానం దగ్గర్లోని చండేశ్వరి గుడిలో ఆ తల్లి సమక్షాన మామ నన్ను మనువాడాడు. ఏయ్ పిల్లా...! మా తొలి నిద్దరైతే కుంచమోడి చెరువు పక్కనే!!.." ఈ మాట చెప్పేటప్పుడు అవ్వ కళ్లు సిగ్గైపోయాయి.



కొంచెమే కావచ్చేమో గానీ యవ్వనం మంచి జ్ఞాపకాలనే మిగులుస్తుంది. చెదిరిపోయిన బామ్మ గతం వింటున్నప్పుడు నాకలాగే అనిపించింది. కానీ నా పరిశోధన చుట్ట కంపుకొడుతున్న ఆ నోటివెంట రాబోయే ఆమె తీపిగురుతుల గురించి కాదు. ఒక అంతులేని సమస్య, దాని మూలాలపైనే ఆసక్తంతా.

* * *

"ఇదే ఆ పెళ్లిచీర" ఒంటిమీద కప్పుకున్న చీరను గుప్పిట నొక్కుతూ అంది బామ్మ. వణుకుతున్న ఆమె చేతుల్లో నలిగి, చిరిగిన ఆ చీర నాకేదో రహస్యాన్ని చెప్పడానికి గింజుకుంటున్న ప్రాణిలా కనిపించింది. "మాకో ఆచారం ఉంది. పెళ్లికి కొత్త చీర కొనం. మా అమ్మ వివాహానికి కట్టిన చీరే నేనూ కట్టాలి. నాకు మూడుముళ్లు పడే వేళ ఈ చీర చిరుగులు చూసే మామ నవ్వాడు. ఏనాటిదో ఈ గంజాం గుడ్డ, కన్నాలు పడకుండా ఉంటుందా చెప్పు. నా తరువాత దీన్ని కట్టుకునే వారే లేకుండా పోయారు. మాకు అంతా మగ సంతానమే" నా స్పందన కోసం చూడకుండా బామ్మ చెప్పుకుంటూ పోతోంది.

"ఉద్దానంలో వస్తాదు బండడు అంటే ఎరగనోళ్లు లేరు. ఊరి గుడి దగ్గర రాళ్లు ఎత్తే వస్తాదు కాదు నా బండడు. కొండల మీద ఆకాశానికేసి ఎదిగిన తాటి చెట్లను ఎక్కదీసే మొనగాడు" భుజాలెగరేస్తూ ఈ మాట అన్నప్పుడు బామ్మ చెంపలు నెమ్మదిగా ఊగాయి. ఆమె నోరు చెప్పుకుంటూ పోతోంది.

"బండడికి భార్యనయ్యానే గానీ మామ తెగువను దగ్గర నుంచి ఎప్పుడూ చూడలేదు. తనతో రమ్మని ఆయనెప్పుడూ గొడవే. నేనే తప్పించుకునేదాన్ని. ఏమదృష్టమోగానీ ఒకసారి మాత్రం వెళ్లక తప్పింది కాదు.

* * *

ఆ యేడు సంక్రాంతికి ఉద్దానం రాజపురంలో సంబరం. ఊరి చివర చిన్న కొండల్లో పుట్టిన పెద్ద తాటిచెట్టు ఎక్కుడీయాలి. విజయనగరం వస్తాదుకీ, మామకీ పోటీ. బండడి బలవంతం మీద ఐదుగురు పిల్లలను చంకనేసుకుని కుంతీలాగా వెళ్లాను

ఎడ్లబళ్లమీద వచ్చారు జనం. అదొక జాతరే. కొండలు పోటుగాళ్లలా నిలబడి ఉన్నాయి. వస్తాదులిద్దరూ రాళ్లమీద రాజులాగా ఉన్న దుక్కతాటిచెట్టును నేల కూల్చాలి. ఆ చెట్టుకి ఒకటే పూజలు. బలిచ్చిన మేకపోతు రక్తాన్ని దాని మొదలు దగ్గరపోసేరు. మామ ముఖానికి ఆడోళ్లు పసుపురాసి బొట్టులెట్టి హారతులిచ్చారు.

ఆదొక యుద్ధభూమిలా అనిపించింది. గాలికి కదులుతున్న దుక్కతాటిచెట్టు విరగబడి నవ్వుతున్న రాకాసిలా, దానికి బలివ్వబోతున్న రణం మేకపోతులా మామ కనిపించాడు. తెల్లని గుడ్డను చించి గోచీ కట్టుకున్నాడు బండడు. కడివడు మేకపాలు తాగాడు. చెట్టుకు, భూమికి దండమెట్టి ఎగబడ్డాడు మామ.

నానబెట్టి బంకమట్టి రుద్దిన కొబ్బరిపీచు తాడు చెట్టుమీదికి విసిరాడు. మదపుటేనుగును బంధించినట్టు నాలుగు వైపులా చుట్టేశాడు. తాడుతో కుస్తీలు పట్టాడు. మామను హుషారెత్తించినారు ప్రజలు.

పూట గడిచింది. చెట్టు కదల్లేదు. మెదల్లేదు. చెమటతో కలిసి మామ వీపుల రక్తం చిమ్ముతోంది. నల్లటి ఆ రక్తం రుచి చూడడానికి ఈగలు మూగుతున్నాయి. ఇదంతా చూసి నా కళ్లమ్మంట నీరు పొర్లింది.

గుండెల నిండా ఊపిరి పీల్చి ఒక్క పెట్టున వదులుతూ బలాన్నంతా ఒకే చోట నిలిపి చెట్టును అకలించాడు. వేళ్ల పటుత్వం దెబ్బతీయడానికి కుడి కాలును గట్టిగా నేలకు ఆనించి ఎడమ కాలుతో ఎగదన్ని ఎగబడుతూ తాళ్లను లాగాడు. వేళ్ల వేటికవే విడిపోయేలా సత్తువంతా ధారపోశాడు. పదడుగుల దూరం నుంచి పరుగెత్తుకుంటూ వచ్చి గుండెతో దబీ దబీమని ఢీ కొట్టాడు. ఆ దెబ్బలకు గిజగిజలాడినట్టు తాటిచెట్టు కింది నుంచి పై వరకు ఊగిపోయింది.

పట్టుచిక్కాక మరివదల్లేదు బండడు. పిచ్చెక్కిన వాడిలా "హుర్రరే!!..." "హుర్రర్రే..!!" అని కేకలేస్తూ చెట్టు మొదలు పైన చేతులు ఆనించి తాటిచెట్టుకు కొండ నుంచి అందుతున్న

ఆధారాన్ని తుంచేస్తూ తూరుపు నుంచి పడమరకి వంచాడు. ఆ తోపుడుకు చిటపట చిటపటమని చెట్టు వేళ్లు తెగడం చెవుళ్లకు సోకింది. మధ్యలో బండడు ఒకటి రెండుసార్లు నీరు తాగినాడంతే. విడుపులేదు. విశ్రాంతి లేదు.

నా మామ గెలిచిన ఆ క్షణాలు ఇప్పటికీ నా కళ్లలో మెదలుతున్నాయి. కొండరాయి బద్దలైనట్టు తొలుత ఒక చప్పుడు వినిపించింది. జనాల్లో కలకలం. మామను చుట్టిముట్టేసినారు ప్రజలు. నిటారు తాటిచెట్టు నిలువునా కూలింది. పూజారులు శాంతి కోరుతూ చెట్టుకు పూజలు చేశారు.

* * *

ఉద్దానమంతా నెలరోజులు బండడిని ఊరేగించారు. ఆనాటి రాత్రి మామకు ఎంతో ఇష్టమైన ఈ చీరనే కట్టుకున్నా..!!" అంటూ నా చేతిలో తన పెళ్లిచీర పెట్టింది.

మాసిపోయిన కొంగుపై కాళిక బొమ్మ ఉంది. నేనడగాల్సిన ప్రశ్నల గురించి మనసులోనే అనుకున్నా. వాటికి జవాబులు దొరుకుతాయనే ఆశ ఏదో తెలియని ఉద్రేకాన్ని కలిగించింది.

ఈ స్థితిలోనే ఆకస్మాత్తుగా నాకెదురైన అనుభవం ఆశ్చర్యంతో కూడిన విభ్రాంతిలోకి నెట్టేసింది. మీట నొక్కితే వెలిగిన విద్యుద్దీపంలా ఆమెలో ఒకానొక కాంతిరేఖ ప్రవేశించి బామ్మ నుంచి పొందాలనుకుంటున్న సమస్త వివరాలకు అప్రయత్నంగానే ద్వారాలు తెరిచింది.

ఆప్తులు దూరమైతే ఉద్దానం స్త్రీలు గొంతునిండా ఒక పాట నింపుకుని ఏడ్చే ఏడుపును ఆమె అందుకుంది. గుండెలో గూడుకట్టుకున్న పాత గాయం రేగితేనే అలాంటి దుఃఖరాగాలు బయటకొస్తాయి. అప్పటివరకు బహుదానది పాయలా నెమ్మదిగా సాగిన బామ్మ మాటలు ఒక్కసారి వంశధార ఉప్పెనలా పొర్లుకొచ్చాయి. "నా రాజు. నా దేవుడు. నా బండడికి అదే ఆఖరు పోటీ అయిపోయిందోలమ్మ అప్పుడొచ్చిన పెద్దగాలాన బతుకుల్ని బలితీసుకుందే తల్లీ" కుదురు కున్నంతవరకు ఈ మాటల్ని పాడుతూనే ఉంది. మంచి నీళ్లయినా ముట్టకుండానే తన విషాదానికి గొంతునిచ్చింది బామ్మ" గాలివాన గడిచిన కొన్నాళ్లకు పాకిన పాపిష్టి జబ్బు దెబ్బకు కొండలాంటి బండడు పిండిరాయిలా అయిపోయాడు.

నీడలా తోడున్న బండడు భూమితల్లికి జీర్ణమైపోయాడు. మామ గతమైపోయాక పిల్లల్నేసుకుని తిరగని చోటు లేదు. బరంపురంలో ఉన్నప్పుడు లారీల్లో పనికి చేరి



దూరాలెళ్లిన పదేళ్ల పెద్దకొడుకు ఆజాపాజా లేకుండా పోయాడు. మిగిలిన నలుగురూ ఒడిశా అంతా చెదిరిపోయారు. నన్ను వాళ్లతోనే ఉండమనేవారు నా బిడ్డలు. తిరిగింది చాలని ఇక్కడ ఉండిపోయాను. ఏ ఆధారం లేకుండా వాళ్లని పెద్ద చేశాను, నన్ను నేను పోషించుకోలేనా?... చెప్పు. కొన్నాళ్ల వరకు పండక్కీ, పబ్బానికీ నా కొడుకులు వచ్చిపోయేవారు. నాటి పెద్దగాలాన (తుపాన్) తరువాత నా పెనిమిటి దూరమైతే, ముప్పై రెండేళ్ల గడిచాక వచ్చిన పెద్దగాలాన తరువాత ఆ ముదనష్టపు జబ్బే నా కొడుకులకీ వచ్చేసింది" చివరి మాటను బోర్డరు బామ్మ వందలసార్లు అనుండొచ్చు. అయితే నా శోధనలో అదికూడా కీలకమైన సంగతని బహుశా ఆమెకు తెలియకపోయుండవచ్చు.

తిరుగుముఖం పట్టిన వేళ ఆ చీర తిరిగి ఇస్తున్నప్పుడు ఏమనాలో అర్థం కాలేదు. దానిపై ఉన్న కాళికా బొమ్మ, రంగు, వాసన మనసులో ముద్రపడిపోయాయి.

కొద్దిదూరం వచ్చేశాక బామ్మ కేకేశారు "ఏయ్ పిల్లా మళ్లీ వస్తావా!!..." అని. స్పందనగా నా రెండు చేతులూ పైకెత్తి ఊపాను. ఆ సంకేతానికి అర్థమేమిటో అప్పట్లో నాకే అర్థం కాలేదు. కానీ మరికాసేపట్లో అక్కడ ఉండబోతున్నాను.

* * *

సుదూరాలకు ఎప్పుడూ డ్రైవింగ్ చేయని నాన్న సరిహద్దును చేరుకునే వరకు కారును తనే నడిపారు. విశ్రాంతి కోరలేదు. కారు ఆంధ్రా సరిహద్దు ఉద్దానం దాటి ఒడిశాలోకి

వెళుతున్నప్పుడు, ఈ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ జబ్బు గుర్తొచ్చి ఒళ్లు గగుర్పొడిచింది. బోర్దరు బామ్మలాంటి ఉదాహరణల (కేస్ స్టడీలు) ఆధారంగానే కిడ్నీ విషాదాలకు సంబంధించిన కొన్ని నిజాలను కనుగొనగలిగాను.

ఉద్దానంలో ఉండే ప్రత్యేక ఉష్ణోగ్రతల వలన శరీరంలోని నిర్జలీకరణ (డీ - హైడ్రేషన్)కు గురై ఆ ప్రభావం కిడ్నీల మీద పడుతోంది. తుపానుల తరువాతే ఇలాంటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మూత్రపిండ వ్యాధుల వలన తమవారిని పోగొట్టుకుని బతుకులీడుస్తున్న బోర్దరు బామ్మలాంటి అభాగ్యులు ఎంతోమంది ఉన్నారక్కడ.



మా కారు ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ఊరు గిరిశోలకు చేరుకునేసరికి ఎండ పేలుతోంది. గడపలో కూర్చున్న బామ్మ ఎవరికో, ఏదో చెబుతోంది. బండడి గురించే అయ్యుంటుందేమో. కారు దిగిన నాన్న మెరుపు నడకతో ఆమె దగ్గరకు చేరుకున్నారు. నింపాదిగా అక్కడికి వెళ్లిన నేను, నా జీవితంలో ఎంతో ఘనమైన ఆ క్షణాలను చూస్తున్నపుడు శిలా ప్రతిమనైపోయాను.

తప్పిపోయిన లేగదూడ మళ్లీ కనపడితే తల్లావు ప్రేమ కురిపించినట్టుగా మా నాన్నను బామ్మ ముద్దాడింది. తిట్టింది. కొట్టింది. ఆమె ఒడిలో నాన్న ఒదిగిపోయారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. లారీ పనిలో చేరాక డిల్లీ వెళ్లి తప్పిపోవడం నుంచి చాలాకాలం ఆమె కోసం ఉద్దానంలో ఎంత వెతికిందీ, పెళ్లయ్యాక వైజాగ్‌లో స్థిరపడటం వరకు అంతా చెప్పుకుని విలపించారు. గతం గురించి ఎప్పుడూ ప్రస్తావించని నాన్న నన్ను గత జన్మలోకి తీసుకెళ్లినట్టుగా అనిపించింది. విచిత్రాన్ని చూడటానికన్నట్టుగా చుట్టూ జనం గుమిగూడారు.

ఆకాశం కేసి చేతులు చాపిన ఆమె 'బండోడా!... నీ పెద్దకొడుకొచ్చేడురో' అంటూ అరిచింది. కాసేపటికి ఏదో గుర్తొచ్చినట్టుగా లేచి ఇంట్లోకెళ్లింది. కాళికాదేవి చీర తెచ్చి నా చేతిలో పెట్టి "పిల్లా...!! పెళ్లికి కట్టుకోవే. నా కొడుకు దక్కాడు. అదే సరి నాకు." అని ఆగి, అంతట్లోనే రౌద్రమైన కంఠంతో - "కానీ.. పిల్లా.. మీ అయ్యను తోలుకుపో. వాడు ఇక్కడుండొద్దు. ఈ శ్మశానంలో నా బిడ్డ బతకడే తల్లీ. నా కొడుకును ఆ జబ్బు వదలదే ఒలమ్మా!.." మా నాన్నమ్మ పెట్టిన రోదనలకు ఆ వేళపుడు ప్రచండంగా వాదిస్తోన్న ఎండసైతం స్థాణువైపోయింది. నిలువునా కంపించిపోతున్నా నాన్న నుంచి ఏం సమాధానం వస్తుంది. అది నాకు తెలుసు...!!.

బల్లెడ నారాయణమూర్తి
పాత్రికేయులు, శ్రీకాకుళం
99854 11039

నిశ్శబ్దమే కవిత్వం

గత్యంతరం లేకనే మాటలు నిజానికి
నిశ్శబ్దమే అసలైన కవిత్వం.
విత్తనం చిట్లుతున్నప్పుడు
వినిపించదు,
పువ్వులు
పెద్ద హడావిడి లేకుండా
తమకే తెలియనంత హాయిగా
పూస్తాయి.
పక్షులూ, సీతాకోకలు
చుట్టూ మూగినప్పుడు మాత్రమే
దాని అభివ్యక్తికి సాఫల్యం.

అరుగు మీద కూచుంటే
చీమలా పాకి వస్తుందో జ్ఞాపకం
కవితలో చేరాలని కాబోలు!
మౌనం తప్ప
మరేమీ ఎరుగని శిలలాగ
కదిలే కాలానికి
కదలని భాష్యంలాగ
చిరకాలం తపస్సు చేస్తుంది కవిత్వం,
కిటికీ కవతల
ఒక్కొక్క ఆకే రాలిపడుతున్నట్టు
కాస్తకాస్త వ్యక్తమౌతుంది.

చందమామ ఓ చిన్నముద్ద
చీకటి మూలాల్లో
వెన్నెల సోకుతున్నప్పుడే
లోకం కవిత్వంగా మారుతుంది.

అరణ్యంలో మధ్యాహ్నం పూట
ఓ ఎండుపుల్ల విరిగినట్టు
ఏదో స్ఫురణ!
ఎడతెగని దుఃఖంలో
మెల్లగా తెరుచుకునే ఓ ఆవరణ!

కవిత్వం
దేనికీ నిర్ధారణ కాదు
అదొక నిరంతర స్వప్నం!
చిన్నప్పుడు కల్వర్టు మీద
చద్దిమూట విప్పగానే
కలిపిన తొక్కువాసన
గుప్పుమనేది.
నిజానికి కవిత్వానికి మాతృక అదే!

– డా॥ ఎన్.గోపి
హైదరాబాద్. 93910 28496

మరో అష్టదిగ్గజ కవులు

ఊహాచిత్రాలు: నందు

ఆంధ్ర సాహిత్యలోకంలో 'అష్టదిగ్గజ కవులు' అనే మాట వినపడుతూనే శ్రీకృష్ణదేవరాయల భువనవిజయం గుర్తుకొస్తుంది. విజయనగర సామ్రాజ్యానికి రాజధాని నగరమైన హంపీ విజయనగరంలో రాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులున్నట్లు, ఆ కవులు భువనవిజయసభలో కొలువుదీరి కవితా పాండిత్యాలను ప్రదర్శించేవారని, రాయలు సభాధ్యక్షులై ఆ సాహిత్యాన్ని ఆస్వాదించేవారని చదువుకున్నాం. కన్నడ, తమిళ, తెలుగు ప్రాంతాలను పాలిస్తున్నా - ఆయన దగ్గర అష్టదిగ్గజ కవులంటే అందరూ తెలుగు కవులుగానే లెక్క చూపుతున్నాం. ఆ లెక్క కూడా ఒక కొలిక్కి రావడం లేదు. ఇక తమిళ కన్నడ కవులు అష్టదిగ్గజాల్లో లేరా? ఉన్నారనుకుంటే ఎవరు? ఇవన్నీ స్పష్టమైన సమాధానం దొరకని ప్రశ్నలు.

కృష్ణదేవరాయలు కేవలం సాహిత్య కార్యక్రమాల కోసం ఒక మందిరాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. ఆ మందిరం పేరు భువనవిజయం. 'తెలుగు సాహిత్య సమీక్ష' గ్రంథంలో ఈ మాట ఉంది. 'భువన భారమును భరించునవి అష్టదిగ్గజములు. సాహితీ సమరాంగణ సార్వభౌముడును, ఆంధ్రభోజుడునగు కృష్ణదేవరాయలు (క్రీ.శ. 1509-30) విద్యావినోదాల సభాభవనం పేరు 'భువన విజయం' భువన విజయనామం సార్థకం అయి అందులో ఎనిమిది దిక్కులను ఎనిమిది సింహపీఠికలమర్చి వాటిపైన ఎనమండుగురు కవుల్ని ప్రతిష్ఠించి కృష్ణదేవరాయలు విద్యా వినోదం నిర్వహించేవాడని ప్రతీతి.'

తెలుగు సాహిత్యంలో అష్టదిగ్గజకవి సంప్రదాయం ప్రవేశపెట్టింది కృష్ణదేవరాయలే. కానీ అంతకంటే ముందు సంస్కృత సాహిత్యంలో 'నవరత్నాల' ప్రసక్తి ఉంది. భోజుని ఆస్థానంలో 'నవరత్నము'లను పేరుతో తొమ్మండుగురు పండితులుండేవారు. సాహిత్యంలోనే కాక, జ్యోతిష్యం, ఖగోళం వంటి శాస్త్రాల్లో పండితులు కూడా అందులో ఉండేవారు. ఆ మార్గాన్ననుసరించి రాయలు అష్టదిగ్గజ కవి సంప్రదాయాన్ని పాటించారు. రాయల వారిని ఆంధ్రభోజుడని పిలుచుకొన్నందువల్లే కావచ్చు. మణవాల మహాముని దగ్గర అష్టదిగ్గజాలు, నవరత్నాలు ఉండేవారని ఈయణ్ణి వీరరాఘవాచార్యులు తెలిపారు. ఇది వైష్ణవ ధార్మిక సంప్రదాయం. రాయలు వైష్ణవాభిమాని కాబట్టి ఆ సంప్రదాయాన్ని స్వీకరించి ఉంటారు.

రాయల కొలువులో అష్టదిగ్గజాలున్నట్లు కడప జిల్లాలోని తిప్పలూరు శాసనం ద్వారా సాహిత్యలోకానికి మొదట తెలిసింది. తెలుగు విజ్ఞాన సర్వస్వంలో 'కృష్ణదేవరాయలు కడప మండలంలో కమలాపురం తాలూకాలోని తిప్పలూరు అనే గ్రామాన్ని సర్వాగ్రహారంగా అష్టదిగ్గజ కవీశ్వరులకు దానం చేశారు.' అని తెలుపుతోంది. పెద్దన, తిమ్మనాది కవుల రచనల వల్ల, చాటువుల వల్ల ఆయా కవులు రాయల కొలువులో ఉన్నట్లు తెలుస్తుందే తప్ప 'అష్టదిగ్గజ కవీశ్వరులు' అనే పదం తిప్పలూరి శాసనం వల్లే బయటపడింది.

పరిశోధకులు శాసనాలను సంగ్రహించి లోకానికి వెల్లడించక మునుపే క్రీ.శ. 1810-12 ప్రాంతంలో మెకంజీ సేకరించిన కైఫీయత్తుల్లోనూ తిప్పలూరు శాసన ప్రసక్తి ఉంది. 'తరువాత మరికొన్ని దినములకు విజయనగర సింహాసనాధీశ్వరుండయిన శ్రీకృష్ణదేవ మహారాయల వద్ద వున్న అష్టదిగ్గజ కవీశ్వరులకు, ఈ గ్రామం ధారవోసి యిచ్చివుండిరి' (మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం 310 సంపుటం, 355 పుట) అని.

ఈ సంగతి ఎందుకంటే అదే కైఫీయత్తులలో మరో అష్టదిగ్గజ కవీశ్వరుల ప్రసక్తి కూడా ఉంది. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో 352 సంపుటంలోని 392 పుటలో "పూర్వం మట్ల అనంతరాజు గారు సిద్ధవటంలో వుండి యేలుతూ వుండగా వారివద్ద అష్టదిగ్గజాలు అని కవీశ్వరులు యెనిమిది మంది వుండిరి. వారిలో జంగాలు కొందరు కవీశ్వరులుగా వుండిరి" అని ఉంది. దీనిప్రకారం మట్ల అనంతరాజు కొలువులో అష్టదిగ్గజ కవులున్నట్లు అందులో నలుగురు జంగాల కవులున్నట్లు తెలుస్తోంది. దాని కిందే ఆ కవుల పేర్లు, వారికిచ్చిన గ్రామాల పేర్లు ఉన్నాయి. ఆ వివరం... **మంత్రిమూర్తి పాపరాజు, చింతలవారి కొండప్ప, కొఠారం మల్లెం కొండప్ప, గురువప్ప.** వీరికిచ్చిన గ్రామాలు **సిద్ధవటం తూర్పు జంగాలపల్లె, గుండ్లమడకకు తూర్పు బ్రాహ్మణపల్లె, కలువాయి సమ్మతు చుంటు బావి జంగాలపల్లె, పొత్తపికి నైఋతి సమీపం జంగాలపల్లె.**

కానీ ఏ కవికి ఏ గ్రామం అనే వివరం లేదు. వీరి రచనలు ఏవి అన్న వివరమూ లేదు. సాహిత్య చరిత్రలో ఆ పేర్లు కనిపించలేదు. కానీ ఒక్క మాట అనుకోవలసి వస్తుంది. వారు కవులు కాకపోతే అనంతరాజు వారికి గ్రామాలెందుకు బహూకరిస్తారు?

పై నలుగురు కవుల్లోని మొదటి కవి మూర్తిరాజు పాపరాజును గూర్చి ఈ విధంగా ఊహించడానికి అవకాశం ఉంది. సిద్ధవటానికి అతి సమీపంలోనిది ఒంటిమిట్ట. అక్కడి శ్రీ రామాలయం అనంతరాజు కాలానికే సుప్రసిద్ధం. ఆయనే ఆలయ ప్రాకారం నిర్మించారు. తూర్పు ద్వారం ఆయనే నిర్మించారు. దానికి లోపైపు ఉత్తర దిశలో ప్రాకారకుడ్యం మీద రథోత్సవానికి సంబంధించిన శాసనం కూడా ఉంది. రథాన్నీ ఆయనే నిర్మించి ఉండవచ్చు. ఇన్ని ధార్మిక కార్యక్రమాలు ఒంటిమిట్ట గుడిలో జరుగుతూండగా అనంతరాజు ఆస్థాన కవులు ఒంటిమిట్టకు ఎన్ని మార్లో వచ్చి ఉంటారు. ఆ గుడికి దేవదాసీ వ్యవస్థ ఉంది. వారి పేరు మీద ఇప్పటికీ ఒక వీధి ఉంది. అక్కడ సిద్ధిసాని పేరున్న వేశ్య. ఆమె దగ్గరకు వెళ్లి బహుశా ఈ కవి పాపరాజు చాటు పద్యంతో ఆశీర్వదించారు. ఆశీర్వాదం అందుకొన్న సిద్ధిసాని కూడ కవికి ఓ పద్యంలో బదులు చెప్పింది. ఆ విషయం ఈ చాటు పద్యంలో కనిపిస్తుంది.

దీని వల్ల పాపరాజు అనంతరాజు కొలువులోని అష్టదిగ్గజాల్లో ఒకరిగా భావించవచ్చు. మిగిలిన నలుగురిని గురించీ తెలుసుకొందాం.

ఉప్పుగొండూరు వెంకట కవి

ఈయన ఎల్లమరాజు ఆస్థానంలోనే కవిగా ఉండేవాడు. సిద్ధవటం అమరంగా పొందక మునుపే మట్లవారు పొత్తపి ప్రాంతానికి వచ్చారు. క్రీ.శ. 1570, పొందలూరు శాసనం, క్రీ.శ. 1571 పొత్తపి శివాలయంలోని శాసనాలు ఈ సంగతి ధ్రువీకరిస్తున్నాయి. ఎల్లమరాజు తరువాత అనంతరాజు కొలువులోనూ వెంకటకవి ఉండేవారు. ఆయనకే అనంతరాజు 'కకుత్స్థ విజయం' కావ్య రచనా బాధ్యతలను అప్పగించాడు. ఆ గ్రంథ పీఠికలో ఈ విషయం ఉంది. వెంకటకవి ఎల్లమరాజుతో ఇలా అంటాడు.

మహి నీ పుత్రుడనంతుడు
బహుమిహమల జెప్పనేర్చు భవమౌళి ధునీ
లహరీఘుమఘుమితవచో
మహితంబులు కృతులు స్వరమాధురి నవురా!

మరో ఆంధ్రకవితా పితామహుడు?

అల్లసాని పెద్దనకు ఆంధ్రకవితా పితామహుడని బిరుదున్నట్లే మట్లవారి ఆస్థానంలో ఉన్న ఈ వెంకటకవికీ ఆంధ్రకవితాపితామహుడని బిరుదుంది. అంతేకాదు, ఉభయచ్ఛత్ర చామర శంఖ సంఘాతాంకుడనిపించుకొన్నాడు. అయితే ఉప్పుగొండూరు వేంకటకవి రచనలు తెలియరాలేదని ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్య చరిత్రలో చెప్పారు. కానీ ఒంటిమిట్ట దశరథరామ శతకాన్ని ఆయన చెప్పినట్లున్నది. ఈ విషయాన్ని మైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యం అంటుండేవారు. రామావరుల వేంకటేశ్వర్లు రాసిన ఒంటిమిట్ట కోదండ రామాలయ చరిత్రలో ఈ విషయం ప్రస్తావిస్తూ ఆ శతకంలోని కొన్ని పద్యాలను ఉట్టంకించారు. ఒంటిమిట్ట కోదండ రామాలయ ప్రాకార గోపురాదులు మట్లరాజుల కాలంలోనే నిర్మాణమయ్యాయి. ఆ సమయంలో తదాస్థానకవి వెంకటకవి ఒంటిమిట్టను పలుమార్లు దర్శించి ఉంటారు. ఆ సమయంలో దశరథ రామశతకం చెప్పి ఉంటాడు. శతకం పూర్తి రూపం లభ్యం కాలేదు. అందులోని కొన్ని పద్యాలు మాత్రం లభ్యమవుతున్నాయి. ఈ పద్యం చూడండి.

నిగనిగ మెరయు కిరీటము
ధగధగమను పట్టుదట్టి తగిన కటారున్
ఘుగఘుగ వాసన నీకే
తగుతగురా ఒంటిమిట్ట దశరథరామా!

మట్ల వారి కొలువులో ఉప్పుగొండూరు వేంకటకవిది అగ్రతాంబూలం.

కుందవరపు కవి చౌడప్ప: బూతుకవిగా పేరుపొందిన కవిచౌడప్ప మట్ల అనంతభూపాలుని కొలువులోని వాడే. ఈయన ఇంటిపేరు కుందవరం. ఇదొక గ్రామనామం. ఇది పొత్తపినాటిలో రాజంపేటకు సమీపంలో ఉండి ఉంటుంది. నేటికీ కుందవరం నెల్లూరు (కుందా నెల్లూరు) అనే గ్రామం ఉంది. ఈ గ్రామం కుందవరానికి చెందిందిగా ఊహించవచ్చు. ఇప్పటికీ కుందవరం ఇంటిపేరున్న వారు జిల్లాలో ఉన్నారు. కుందవరం చౌడప్ప

కడప జిల్లాలోని ఖాజీపేట సమీపంలో ఉన్న పుల్లూరులో నివాసం ఉండినట్లు ఆయన శతకం తెలియజేస్తున్నది.

కవి చౌడప్ప అనంతుని కొలువులో ఉన్నప్పటికీ ఇతర రాజాస్థానాలు తిరిగాడు. తంజావూరు వెళ్లి రఘునాథ రాయల్ని దర్శించాడు. ఆయన మెప్పు పొందాడు. రఘునాథరాయలు సంగీత సాహిత్యాలలో దిట్ట. అనంతరాజులానే రఘునాథరాయలు రాజకవి. చౌడప్పకవి తక్కువ తిన్నవాడు కాదు. సంగీతమంటే చెవికోసుకొనేవాడు.

అంభోజాక్షుల లోపల
రంభయె కడు నందగత్తె, రాగంబులలో
గాంభీర్యము గల రాగము
కాంభోజియె కుందవరపు కవిచౌడప్పా! అన్నాడు.

చౌడప్ప తన శతకంలో రఘునాథరాయలకొక స్థానమిచ్చి గౌరవించాడు. చూడండి...

నేరుతునని మాటాడగ
వారిజభవు నంతవాని వశమా తంజా
వూరి రఘునాథరాయల
గారి సభన్ కుందవరపు కవి చౌడప్పా!

సరస సంగీత సాహిత్య గోష్ఠుల్లో పాల్గొని రఘునాథరాయల మెప్పు పొంది ఉంటాడు చౌడప్ప. ఆ ఆనందంతోనే ఈ పద్యం చెప్పాడు.

నీతులకేమి యొకించుక
బూతాడక దొరకు నవ్వుపుట్టదు సభలో
నీతులు బూతులు లోక
ఖ్యాతులురా కుందవరపు కవి చౌడప్పా!

కవి చౌడప్ప కేవలం మట్ల అనంతరాజును, తంజావూరు రఘునాథరాయలవారినే కాకుండా మరెందరో రాజుల్ని మెప్పించినట్లు ఒక చాటు పద్యం ద్వారా తెలుస్తోంది...

కరుణాసాగర హాస్యనాయక తపో గాంగేయగోపాల త్వ
చ్చరణాంభోరుహ భృంగ కుందవర వంశ గ్రామణీ ధీమణీ!
ధరణీ నాయక కోటినెప్పుడు కవిత్వ ప్రౌఢి మెప్పించగా
సరసాగ్రేసర చక్రవర్తివి గదా చౌడా! జగన్మోహనా!

ధరణీనాయక కోటిని కవిత్వ ప్రౌఢితో మెప్పించిన కవి చౌడప్ప కేవలం బూతుకవి అంటే చెల్లదు. పై పద్యం ద్వారా ఆయన బహుముఖత్వం బయట పడుతోంది. ఆయన చెప్పుకొన్న మరొక పద్యం...

శరనిధి మేర దప్పినను శంకరుడిచ్చు వరంబు దప్పినన్
సురగురు నీతిదప్పినను సూర్యుడు చంద్రుడు త్రోవ దప్పినన్
పరుసదనాన రాఘవుని బాణము దప్పిన హాస్యగాంధ్రలో
సరసుడు జాణ కుందవర చౌడుని పద్యము నీతిదప్పునే.

శతకం మాత్రమే కాక ముప్పయిమూడు సీసాల నిఘంటువు చౌడప్పది దొరుకుతోంది. అది తెలుగు నిఘంటువు. (సమగ్రాంధ్ర సాహిత్యం 9వ సంపుటం 143 పుట) ఇది తొలి తెలుగు పద్య నిఘంటువు.

ఘంటయ కవి: చౌడప్పకు ఈ ఘంటయ తోడుగా ఉండేవాడనిపిస్తుంది. వీరిద్దరూ ఆస్థానంలో నవ్వులు పండించేవారు. చౌడప్పను, ఘంటయను బూతు కవులు అనడం కంటె హాస్యకవులు అనడం సబబేమో! అందుకు తగ్గట్లు ఈ చాటుపద్యం కనిపిస్తుంది.

అన్నిట మంచివారు విమలాత్ములు హాస్యకళాదురంధరుల్
సన్నుతనీతి పాలకులు జాణలు నైపుణు లెవ్వరంటిరా
పన్నుగ మ ట్లనంత నరపాలుని గొల్చి మహానుభావులై
వన్నెకు నెక్కినట్టి గుణవంతులు ఘంటన చౌడగాండ్లురా

ఈ పద్యం ఈ ఇద్దరిలో ఒక్కరుగాని, లేదా మూడవ వ్యక్తిగాని చెప్పి ఉండవచ్చు. మూడో వ్యక్తి అయితే వీరిద్దరిమీద అపారమైన అభిమానం ఉన్న వ్యక్తి కావచ్చు. 'ఘంటన చౌడగాండ్లురా'- అన్నచోట గాడుకు బహువచనంగా గాండ్లు అన్నారు. ఆ గాడు కూడా గౌరవ వాచకం కాదు. అల్పార్థంలో చెప్పుకొన్నారు. లేదా చెప్పారు. అభిమానం మితిమీరినప్పుడు అలా అనడం పరిపాటి! ఈ పద్యంలో వ్యక్తీకరించిన ఆ ఇరువురి గుణగణాలు ఉన్నతమైనవి. 1. మంచివారు, 2. విమలాత్ములు, 3. హాస్యకళాదురంధరులు, 4. నీతి పాలకులు, 5. జాణలు, 6. నిపుణులు, 7. గుణవంతులు - ఇలా.

ఘంటయను గురించి అంతకుమించి సమాచారం దొరకలేదు. పద్యంలో ఘంటయ పేరు ముందుగా ప్రసక్తమైనందున వయస్సులో చౌడప్పకంటె పెద్దవాడు కావచ్చు.

నక్కలపాటి సంజీవప్ప: అనంతరాజుగారి చెఱకు తోటల్ని నక్కలు నాశనం చేస్తూ ఉంటే ఆ నక్కల్ని సంజీవప్ప చెడదిట్టాడట. అందుకు ఆయన రాసి ఇచ్చిన పద్యాన్ని అనంతరాజు తోట వాకిట కట్టించాడట. చాటుపద్య రత్నాకరం ప్రథమ తరంగం 31, 32 పుటల్లో ఆ పద్యం కనిపిస్తుంది. అది ...

ఆశీవిషసమమగునా
యాశుకవిత్వంబు చేత నటువంచకముల్
నాశము గావలె చూడుము
హే శాంభవి! చౌడమాంబ! హే శర్వాణీ!

అనంతరాజుకి నక్కల బాధ తొలగింది. సంజీవప్పకు నక్కలపాటి ఇంటి పేరయింది. ఆ పేరు అనంతరాజు దయచేసిందే. ఈ పద్యం చూడండి.

ఎంచగలం డనంత వసుధేశుని యిక్షువనంబు నోళ్ల ఖం
డించిన నక్కలన్ విషపటిష్ఠపు పద్యము చెప్పివాని ని
ర్జించిన నింటిపేరు దయచేసిరి నక్కలపాటి వారటంచు

అనంతుని అస్థానకవుల్లో చాలా మంది రచనలు తెలియనట్లే ఈ నక్కలపాటి సంజీవప్ప రచనలు కూడా తెలియరాలేదు. కాని, ఈయన చెప్పిన మరి రెండు చాటుపద్యాలు ఆ పద్యాల మాటున దాగిన చరిత్ర తెలుసుకొని తీరవలసిందే. ఈ సమాచారమూ కైఫీయత్తుల్లోదే (మ.ప్రా.గ్ర. 352, సంపుటం 243-352 పుటలు, సంపుటం).

బొమ్మలకీ ఓ రోజుంది

ప్లాస్టిక్ వాడకం పెరిగిన తర్వాత బొమ్మలు సులభంగా దొరుకుతున్నాయి. కానీ ఒకప్పుడు బొమ్మల తయారీ అనేది అనేక కుటుంబాలకు జీవనోపాధిగా ఉండేది. కొండపల్లి, ఏటికొప్పాక వంటి ప్రాంతాలలో ప్రత్యేకమైన బొమ్మలు తయారయ్యేవి. ఇవి కాక మట్టితో, వెదురుతో కూడా బొమ్మలను తయారుచేసే వృత్తి కళాకారులు ఉండేవారు. సంక్రాంతికి కొద్ది రోజుల ముందు నుంచి వీటి విక్రయాలు జోరందుకుంటాయి. ఇంట్లోని బొమ్మలన్నింటినీ ప్రదర్శనగా ఉంచి పిల్లలందరినీ పిలవడమే 'బొమ్మల కొలువు'. సామాన్యంగా భోగి పేరంటంతో పాటే ఈ బొమ్మల కొలువు కూడా ఉంటుంది. బొమ్మలని ప్రదర్శించేందుకు అద్దాల బీరువాలు అందరికీ ఉండవు, కానీ బొమ్మలకీ ఓ రోజొస్తుంది. ఆ రోజున బొమ్మలన్నీ ఠీవిగా కొలువుదీరి పిల్లల చేతులని ఊరిస్తాయి.

ఒక ఆస్థానంలోని కవి మరొక ఆస్థానానికి వెళ్లి తమ సారస్వత ప్రతిభతో ఆ దొరను మెప్పించి సన్మానాలందుకోవడం శ్రీనాథుని దగ్గర్నుంచి కనిపిస్తుంది. శ్రీ కృష్ణరాయల భువన విజయ సభకు కవులు వచ్చి తమ ప్రతిభను ప్రదర్శించి సత్కారాలందుకొన్నారు. కవి చౌడప్ప తంజావూరు రఘునాథరాయల్ని దర్శించి మెప్పుపొందారు.

వేంకటపతిరాయల రాజ్యంలో పలు సంస్థానాలున్నాయి. సిద్ధవటం అమర నాయంకరం, అనంతరాజు పాలిస్తున్నారు. వేంకటగిరి ఒక సంస్థానం. వెలుగోటి యాచమ నాయకుడు పాలిస్తున్నారు. ఇలాంటి సంస్థానాధీశులందరు విజయదశమినాడు వేంకటపతి రాయల దర్శనం చేసుకుంటారు. ఆ సభలో కవులు సంస్థానాధీశుల ప్రాభవాన్ని కీర్తిస్తారు. ఒక విజయదశమి నాడు సిద్ధవటం నుంచి అనంతరాజు రాజదర్శనానికి వెళ్లలేదు. కానీ అనంతుని కవి నక్కలపాటి సంజీవప్ప వెళ్లాడు. సిద్ధవటం మండలేశ్వరుని ప్రస్తావన వచ్చినపుడు తమ రాజు ప్రాభవాన్ని గూర్చి సంజీవప్ప ఈ పద్యం చెప్పాడు.

కొద్దిన రాడు బెట్టురికి కోటలు కొండలు గొన్న శూరు డా
గద్దరి గబ్బి రాచపులి గండరగండడు మట్లనంతుడే
ప్రొద్దునవచ్చి భూభుజుల పొంకములార్పగ బుట్టినాడు మీ
పెద్దరికాలు సాగవిక ప్రేలకుడీ గడిమన్నెభూపతుల్.

వెలుగోటి యాచమనాయుడికి పొగడ్త గిట్టలేదు. 'మేం పంచ హజారి మునసబుదార్లం. మీ దొరకు పౌరుషం ఉంటే మాతో కార్యం (యుద్ధం) చేయమను. అప్పుడే నీ పద్యానికి చెల్లుబడి. ఈ విషయం మీ రాజుకు తెలియజెయ్. సమరానికి మేం సిద్ధం' అన్నాడు.

వర్తమానం అనంతరాజుకు వెళ్లింది. సిద్ధవటానికి తూర్పుగా ఉండే దొంగలసాని వద్ద పోరుకు రంగం సిద్ధమయింది. అనంతరాజు గుండ్లమడకు సమీపంలో సైన్యసమేతంగా దిగారు. గుండ్లమడకు సమీపంలోని నెమళ్లగొంది గ్రామం వద్ద యాచమనాయకుడు దిగి వర్తమానం పంపాడు. 'మేము స్వతంత్రులం. మీతో యుద్ధానికి రాం. మా దగ్గరుండే వూడిగాలను పంపుతున్నాం' అని. అనంతరాజు తక్కువ తినలేదు. 'అయితే మేమూ మా అందలం మోసే పెద్ద బసవన బోయని పంపుతున్నాం' తిరుగు సమాధానం పంపాడు. ఇరు సైన్యాలు దొంగలసాని వద్ద తలపడ్డాయి. వెలుగోటి వారి సైన్యం నిలువరించలేకపోయింది. ఊడిగాలు ఓడిపోయారు. బసవన విజయం సాధించాడు. వెలుగోటివారి బిరుదం 'కరిసింహడాలు'ను విజయానికి గుర్తుగా తీసుకొన్నాడు. బసవన కైవసం చేసుకొన్న విజయంతో సిద్ధవటం చేరుకొన్నాడు. కరిసింహడాలును అనంతుని పాదాల దగ్గరపెట్టి మోకరిల్లాడు. అప్పుడు నక్కలపాటి సంజీవప్ప చెప్పిన పద్యం ఇదీ...

బసవన బోయడె బసవడు
బసవనపై నెక్కినట్టి భవుడవు నీవే
కసువైరి వెలమ లెల్లను
రసికాగ్రణి మట్లనంత రణజయవంతా!

అనంతుడు సంజీవప్పను దివ్యాభరణాలతో సత్కరించాడు. విజయం చేకూర్చిన బోయ బసవనికి లేబాక పొలంలో ఉత్తరం పరువు దూరాన ఎర్రచెరువు పల్లెకు ఉత్తరంగా భూమినిచ్చాడు. అక్కడ బసవనపల్లె కట్టించాడు. అది 'బోయనిపల్లె' అయింది. అంతేకాక మాధవరం సమీపంలో మరొక పల్లె కట్టుకొనేందుకు అనుమతి ఇచ్చాడు. అక్కడా ఒక 'బోయనిపల్లె' అయింది. ఇప్పుడు వాటిని 'బోయనపల్లె' అని పిలుస్తున్నారు.

ఈ అష్టదిగ్గజాలతో పాటు అనంతున్ని గురించీ తెలుసుకోవలసిందే.

మట్ల అనంతరాజు: మట్లవారి మూల పురుషుడు దేవచోడ మహారాజు. సూర్యవంశీయుడు. ఆ వంశంలోని వాడు ఎల్లమరాజు. వీరు తాడిపత్రి సమీపంలోని వంగలి ప్రాంతంలో ఉండేవారు. ఆ ప్రాంతం వదలి రాయచోటి సమీపంలోని మట్ల చేరుకొంటారు. అక్కడి శివాలయంలో కొంతకాలం ఉంటారు. శివాలయంలోని నంది విగ్రహం నుంచి వారికి విలువైన సంపద లభించింది. తరువాత పొత్తపినాడులోని పొన్నాపల్లె, పొందలూరు, పెనగలూరు గ్రామాలను గ్రాసానికి గాను తిరుమల రాయల దగ్గర నుంచి స్వీకరిస్తారు. సిద్ధవటాన్ని పాలిస్తున్న కొండ్రాజు తిరుపతి రాజు చంద్రగిరిని పాలిస్తున్న వెంకటపతి రాయల సార్వభౌమత్వాన్ని తిరస్కరిస్తాడు. రాజంపేట సమీపంలోని ఊటుకూరు దగ్గర తిరుపతిరాజును ఎల్లంరాజు ఎదుర్కొంటాడు. తిరుపతి రాజును చంపి వెంకటపతిరాయల అభిమానానికి పాత్రుడౌతాడు. వెంకటపతి రాయలు సిద్ధవటాన్ని అమరంగా పాలించుకొమ్మని ఎల్లమరాజుకు అనుమతి(1598-99)నిస్తాడు. సామాన్య యుద్ధవీరులుగా ఉన్న ఎల్లమరాజు. ఆయన పుత్రులు సిద్ధవటం పాలకులయ్యారు. ఆ ఎల్లమరాజు కుమారుడే అనంతరాజు. మట్లవారి ఘనతను చాటే చాటువులు విస్తారం.

కృష్ణరాయలవలెనే అనంతరాజూ యుద్ధంలో ఓటమి ఎరుగనివాడు. సరససంగీత సాహిత్యచతురుడై రాయలు ఆముక్తమాల్యద కావ్యరచన చేసినట్లే అనంతుడు 'కకుత్స్థ విజయం' రచించాడు. కవిపోషకుడైన తండ్రి ఎల్లమరాజుకు అంకితమిచ్చి పితృరుణం తీర్చుకొన్నాడు. 'కకుత్స్థ విజయం'లోని కథ చిన్నదే. రఘువంశంలోని ఇక్ష్వాకువనే రాజు కుమారుడు సుకుమారుడు. అతని కొడుకు కకుత్స్థుడు. ఇతడే పురంజయుడనే పేరుతో ఇంద్రవాహనుడై దీపపతాకుడనే రాక్షసుని సంహరిస్తాడు. స్థూలంగా ఈ కథను స్వీకరించి కల్పనలు జోడించి అనంతుడు కావ్యరచన చేశాడు. ఇందులో 936 గద్యపద్యాలున్నాయి.

మచ్చుకు రెండు పద్యాలు చూద్దాం. కుకవి నిందను గురించిన పద్యం...

డా గురించుచు నీనెల బాగొనర్తు
మనుచు నాకుల రచనల నలసి సంధు
లందు గూర్పక రసములు చిందుబోసి
కొనెడు గ్రాసార్థి కవులు నిక్కువపు కవులె

ఆకుల రచన, సంధులు గూర్చకుండుట, రసములు చిందుబోవుట అనే పదాలతో కవితా నిర్మాణం, విస్తరి కుట్టుతో మేళవించి కుకవుల్ని గ్రాసార్థులుగా మార్చాడు.

జ్ఞానవ్యాప్తిని చెప్పడానికి ఒక చిన్న పద్యమే ఎన్నుకొన్నాడు.

దర్పణంబు లేక తనమోము గనరాదు
దానవైన వెన్ను గానరాదు
కన్నులొప్ప నెంత గననోపు జెప్పుడా
యెఱుక చూఱకాంచు నెల్ల యవియు

కేవలం కన్నులు సర్వాన్నీ చూడలేవు. ఎఱుక మాత్రమే చూరగొంటుంది అంటున్నాడు. అనంతుడు. తక్కిన విషయాలకు ఆయన కావ్యముంది.

అనంతరాజు పుష్టిగల రచన చేసినా ఆయన ఆస్థానకవులు రాసిన కావ్యాలు మనకందలేదు. అష్టదిగ్గజాలను నియమించుకొనే సంప్రదాయం తర్వాతి కాలంలోనూ కొనసాగింది. 'గోలుకొండ నవాబుల ఏలుబడిలోని సంస్థానములలోను, పెద్దాపుర సంస్థానములోను అష్టదిగ్గజ కవులుండినట్లు' నిడుదవోలు వెంకటరావు తెలిపారు (ఆచార్య జి.నాగయ్య, తెలుగు సాహిత్య చరిత్ర). కార్వేటి నగరం సంస్థానంలోను అష్టదిగ్గజాలున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి ఎందరో విశిష్ట కవులు తిరుగాడిన నేల మనది.

కట్టా నరసింహులు,
విశ్రాంత భాషా పండితులు
కడప, 9441337542

ముంబయి తెలుగు యజ్ఞం నిర్విఘ్నం

పుట్టిన గడ్డను విడిచి పరాయి ప్రాంతాలకు వెళ్లిన వారిలోనే తమ మాతృభూమి పట్ల, మాతృభాష పట్ల విపరీతమైన అభిమానం ఉంటుందన్నది పలు శాస్త్రీయ పరిశోధనల్లో వెల్లడైన నిజం. ఏ దేశమేగినా, ఏ ప్రాంతం వెళ్లినా మనిషి తన మూలాలను అన్వేషిస్తూనే ఉంటాడు. ఉపాధి కోసమో, ఉన్నత స్థాయి కోసమో మట్టిబంధానికి, పేగుబంధానికి దూరమైనప్పటికీ, తన భాషాసంస్కృతులను తన చుట్టూ వలయంగా ఏర్పాటు చేసుకొనేందుకు తపిస్తుంటాడు. ఆ ప్రయత్నంలో ఏకాంతం నుంచి సమూహంగా మారతాడు. అలాంటి సమూహమే మన తెలుగు వెలుగుల్ని మహారాష్ట్రలో ప్రకాశింపచేస్తోంది.

మూడువందల సంవత్సరాల క్రితం ఉపాధి కోసం ముంబైకి చేరుకున్న తెలుగువాడు చాలా సంవత్సరాల వరకు కేవలం ఆకలి తీర్చుకునేందుకు నిత్యం పోరాడాడు. ఆకలి నుంచి కాస్త వెసులుబాటు లభించగానే, చుట్టూ చూసుకున్నాడు. ఈ నగరంలో ఒంటరినని తెలుసుకున్నాడు. సంఘటిత శక్తిని గుర్తించాడు. సంఘాలకు పునాది వేశాడు. తత్ఫలితంగా కుల సంఘాలు, గ్రామ సంఘాలు ఏర్పడ్డాయి. తెలుగు వారిలో సామాజిక చైతన్యానికి నాంది పడింది. కానీ ఏదో వెలితి తెలుగువాడిని తొలచసాగింది.

అపుడు గుర్తొచ్చింది... అవును...! తాను భాషను, సంస్కృతిని, సాహిత్యాన్ని పోగొట్టుకొంటున్నాడు. కుల సంఘాలతో తెలుగుదనానికి పెద్దగా ప్రయోజనం లేదని, సాహితీ సంస్కృతులు పరిరక్షణకు కులాతీత సంఘాలు అనివార్యమని గ్రహించాడు. ఆ కోవలోనే ఏర్పాటై, నేడు ముంబయిలో శతాధిక తెలుగు సంస్థల మాతృసంస్థగా పేరు పొంది, తెలుగు వాడి 'కీర్తి' పతాకాన్ని మహారాష్ట్రలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఎగరవేస్తున్న సంస్థ... 'ది బొంబాయి ఆంధ్రమహాసభ అండ్ జింఖానా'.

ఆంధ్రమహాసభ స్థాపన

20వ శతాబ్దం ఆరంభంలో ముంబయిలో తెలుగు వారి సంఖ్య ఊపందుకుంది. ప్రారంభంలో భవన నిర్మాణ రంగానికి చెందిన వారే వలస వచ్చినప్పటికీ, తర్వాత మిల్లు కార్మికుల సంఖ్య కూడా పెరగసాగింది. వారితో పాటు పరిశ్రమల్లో ఉద్యోగాల కోసం విద్యావంతులు, ఉన్నతోద్యోగులు, మేధావులు కూడా ముంబయికి చేరుకోసాగారు. అప్పటికే కొన్ని తెలుగు సంఘాలు అక్కడక్కడ ఏర్పాటై తెలుగు సాహితీ సంస్కృతుల్ని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. కానీ వాటి పరిధి చిన్నది కావటంతో 1924లో కొందరు ఉన్నత విద్యావంతులు, ఉన్నతోద్యోగులు కలిసి పరేల్ ప్రాంతంలో 'ఆంధ్రహోమ్' అనే గ్రంథాలయం కూడా ఏర్పాటు చేశారు. అప్పుడు తెలుగువారు ఎక్కువగా పారిశ్రామిక ప్రాంతాలైన పరేల్, మాటిపురా, బైకల్లా, వర్లీల్లోనే ఉండేవారు.

శ్రామికేతర సంపన్న కుటుంబాలు కొన్ని ఈ ప్రాంతాలలో ఇమడలేక, ధనవంతులుండే దాదర్, మాటుంగా, పార్శీకాలనీ, హిందూకాలనీ వైపు తరలిపోయారు. దాంతో 'ఆంధ్రహోమ్', 'ఆంధ్రనిలయం' సంస్థల కార్యకలాపాలు మందగించాయి.

1927లో విక్టోరియా టెర్మినస్ (నేటి సి.ఎస్.టి). స్టేషన్‌కు ఎదురుగా ఉన్న కాపిటల్ సినిమా బిల్డింగ్‌లో 'బొంబాయి ప్రొవిన్షియల్ ఆంధ్రమహాసభ' అనే మరో సంస్థను ఉన్నత వర్గాలకు చెందిన కొందరు తెలుగు వారు స్థాపించారు. ఈ సంస్థ నిర్వాహకులు 'బొంబాయి ప్రొవిన్షియల్ ఆంధ్ర కాన్ఫరెన్స్'ల పేరిట 1928లో కళ్యాణ్‌లో, 1930లో గిర్‌గావ్‌లో ఘనంగా సదస్సులు నిర్వహించారు. అయితే చాలా మందికి ఈ మూడు సంస్థల్లో ఉమ్మడి సభ్యత్వం ఉండేది. మూడింటి లక్ష్యం తెలుగు భాషావికాసం, సాహితీసంస్కృతుల పరిరక్షణే అయినపుడు, ఒకటిగా మారితే మరింత గొప్పగా కార్యక్రమాలు నిర్వహించవచ్చనే సత్సంకల్పం కలిగింది. శిష్టల వెంకటరావు, కంచర్ల జానకీరామయ్య, గుమ్మడపల్లి అనంత పద్మనాభస్వామి, పాత్రుని వెంకటనారాయణ, తదితరులు చొరవ తీసుకొని, మూడింటిని కలిపి 'ది బొంబాయి ఆంధ్రమహాసభ అండ్ జింఖానా'గా ఏర్పాటు చేశారు. ఆంధ్రమహాసభ స్ఫూర్తితోనే ముంబయిలో మరెన్నో సాహితీ సాంస్కృతిక సంస్థలు ప్రాణం పోసుకున్నాయి. ప్రస్తుతం ఆంధ్రమహాసభ, ఆంధ్ర స్కూల్ భాసిల్లుతున్నాయి. ఈ స్కూల్లో శిశు నుంచి 12వ తరగతి వరకు విద్యను అందిస్తున్నారు.

సంస్థ మనుగడలోకి వచ్చినా సొంత కార్యాలయం లేనందువల్ల రెండు గదుల్లో సర్దుకునేవారు. కార్యక్రమాల జోరు పెరగడంతో సొంత కార్యాలయం సంపాదించుకోవాలనే ఆకాంక్ష ప్రముఖులకు కలగసాగింది. అప్పుడే వెదకబోయిన తీగ కాలికి తగినట్లు ముంబయి మున్సిపల్ కమీషనర్‌గా తెలుగు వ్యక్తి, ప్రముఖ రచయిత సోమంచి యజ్ఞన్న శాస్త్రి పదవీ బాధ్యతలు చేపట్టారు.

ఇక్కడ ఆయన గురించి కాస్త చెప్పుకోవాలి.

సోమంచి యజ్ఞన్న శాస్త్రి

రచయితగా, ఉన్నతాధికారిగా, తెలుగు ప్రజల పక్షపాతిగా ఆయన ముంబయి తెలుగువారికి ఎన్నో సేవలందించారు. వారి చొరవతోనే ఎందరో తెలుగు వ్యక్తులు రచయితలుగా వెలుగొందారు. నగరంలో పలు సంస్థల ద్వారా ఎన్నో తెలుగు కార్యక్రమాలకు ఆయన జీవం పోశారు. ఎందరో తెలుగు వ్యక్తులు సామాజిక, రాజకీయ, విద్యా రంగాల్లో ఎదిగేందుకు తోడ్పడ్డారు. ఆంధ్రమహాసభకు స్థలం కావాలని తెలుగువారు అడిగినప్పుడు వెంటనే ప్రస్తుతం ఆంధ్రమహాసభ ఉన్న స్థలాన్ని మంజూరు చేశారు. అంతేకాక ఆంధ్ర పాఠశాలకు, మరికొన్ని తెలుగు, తమిళ, కన్నడ, కేరళ సంస్థలకు స్థలాలను మంజూరు చేశారు. ఆంధ్రమహాసభకు ఓ పర్యాయం అధ్యక్షుడిగా వ్యవహరించి మహాసభ కీర్తిని ఇనుమడింపజేశారు. సోమంచి యజ్ఞన్న శాస్త్రి ముంబయి తెలుగు ప్రజలకు ఇప్పటికీ ఆరాధ్యుడే...!

ఆంధ్రమహాసభలో కార్యక్రమాలు

మొదట్లో స్వరాష్ట్రం నుంచి ప్రముఖుల్ని రప్పించడం, వారిని సన్మానించడం, ముంబయిలోని తెలుగు పిల్లల కోసం ఆటల పోటీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టి అనతికాలంలోనే వివిధ రంగాలకు తన కార్యకలాపాలను విస్తరించింది. మహాసభ ప్రాంగణంలోనే ఆధ్యాత్మిక కేంద్రం ఉండాలని 'శ్రీ వెంకటేశ్వర పూజా మందిరాన్ని' నిర్మించారు. విశాలమైన రెండు భవనాలు నిర్మించారు. అందులో హాలు, మినీ హాలు, గదులు, సభావేదిక, బహిరంగ సభా ప్రాంగణం లాంటి పలు ఏర్పాట్లు చేశారు.

స్వరాష్ట్రం నుంచి సాహితీ, కళా రంగాల ప్రముఖుల్ని వంతుల వారీగా రప్పించి వైవిధ్యభరిత కార్యక్రమాలు నిర్వహించసాగారు. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు పేరిట అతిపెద్ద గ్రంథాలయాన్ని నెలకొల్పారు. ఆధునిక యంత్రాలతో సభ్యుల కోసం వ్యాయామ శాలనూ ఏర్పాటుచేశారు. మన కళల్ని, కళారూపాల్ని మరిచిపోతున్న నేటి యువత కోసం కూచిపూడి, భరతనాట్య శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తున్నారు. తెలుగు విద్యార్థులకు ప్రోత్సాహకాలు, చిత్రలేఖనం, క్రీడల్లో శిక్షణ, పాటల పోటీలు తదితర కార్యక్రమాలు క్రమం తప్పక జరుపుతున్నారు.

1997లో మహారాష్ట్రలోని వివిధ తెలుగు సంస్థల సమన్వయంతో, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సహకారంతో భారీ ఎత్తున అఖిల భారత తెలుగు మహాసభలు నిర్వహించారు. 2004లో ప్రథమ మహారాష్ట్ర ప్రాంతీయ మహాసభలు కూడా రెండు రోజులు పాటు ఘనంగా నిర్వహించారు. 1957లో రజతోత్సవాల్ని, 1992లో వజ్రోత్సవాల్ని, 2007లో అమృతోత్సవాల్ని భారీ ఎత్తున నిర్వహించారు. రెండు రాష్ట్రాలకు చెందిన రాజకీయ, సాహితీ, సంగీత, సినిమా ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంతో ముంబైలో తెలుగువారికి ప్రత్యేకమైన గుర్తింపు కలిగించారు.

2011లో రెండు రోజులు తెలుగు సంస్థల పేరుతో అష్టావధానాలు, నాటకాలు, కవిసమ్మేళనాలు, ధ్వన్యనుకరణ, జానపద నృత్యాలు, హాస్యవల్లరి, సినీ మాయలు, ప్రముఖులకు సన్మానాలు లాంటివెన్నో అత్యంత వైభవంగా నిర్వహించారు. 2012 మార్చిలో అఖిల భారత నృత్యోత్సవాలలో పలురీతుల నృత్య ప్రదర్శనలతో కళాహృదయాల్ని సంతోషసాగరంలో ఓలలాడించారు. నృత్య కళాకారులనూ ఘనంగా సన్మానించారు.

ప్రతి సంవత్సరం, తెలుగు పండుగలను ఘనంగా నిర్వహించడం, ప్రతినెలా విజ్ఞానపీఠం పేరుతో సమకాలీన అంశాలపై సదస్సును ఏర్పాటు చేయడం, ప్రతి ఉగాదికి కవిసమ్మేళనం, దసరా ఉత్సవాలు, భాషాదినోత్సవాలు, వెంకటేశ్వర కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాలను కూడా ఘనంగా నిర్వహిస్తున్నారు. చిన్నా, పెద్దా ఏ కార్యక్రమం నిర్వహించినా స్వరాష్ట్రం నుంచి ఆ కార్యక్రమ నేపథ్యానికి చెందిన ఒక ప్రముఖుణ్ణి ఆహ్వానించడం ఇక్కడి ఆనవాయితీ. దేశంలో ఎక్కడ ప్రకృతి విపత్తులు సంభవించినా భారీ విరాళాలు అందిస్తూ సామాజిక బాధ్యతనూ నెరవేరుస్తున్నారు. ముంబయిలో తెలుగు రచయితల పుస్తకాల్ని ఆవిష్కరించడం, వారికి ఆర్థిక సహకారాన్ని సమకూర్చడం వంటివీ చేస్తున్నారు.

విశ్వనాథ సత్యనారాయణతో సహా దాదాపు తెలుగు సాహితీ ప్రముఖులందరూ ఆంధ్రమహాసభ ఆతిథ్యాన్ని స్వీకరించిన వారే. వెంపటి చినసత్యం, శోభానాయుడు, మంజుభార్గవి, హేమమాలిని వంటి నృత్యకళాకారులు మహాసభ వేదిక నుంచి ప్రదర్శనలు ఇచ్చిన వారే! కె.విశ్వనాథ్ వంటి ఎందరో ప్రముఖులు ఈ వేదికను అలంకరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులెందరో ఆంధ్రమహాసభను సందర్శించి, సేవల్ని గుర్తించారు. 2006లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్రమహాసభను ఉత్తమ రాష్ట్రేతర సంస్థగా గుర్తించి ఉగాది పురస్కారాన్ని కూడా బహుకరించింది.

ప్రత్యేకంగా మహిళాశాఖ

మహిళాభ్యుదయాన్ని దృష్టిలో పెట్టుకొని మహిళా శాఖను ఏర్పాటు చేశారు. వారికి

యువతకు వ్యక్తిత్వ వికాస శిక్షణ

ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించి, ఆర్థిక వనరుల్ని అందిస్తున్నారు. మహిళాదినోత్సవాలతో పాటు, సామాజిక మార్పుల నేపథ్యంలో మహిళల కోసం అవగాహనా సదస్సులు, పండగలు, వేడుకలు, బొమ్మలు కొలువులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, వినోద కార్యక్రమాలు, బతుకమ్మ వేడుకలు, దసరా సరదాలు, అన్నమయ్య సంకీర్తనలు, అష్టలక్ష్మీ వ్రతాలు లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ, మహిళల్లో సంఘటిత శక్తిని పెంపొందిస్తున్నారు.

రోగులకు రాయితీలు

స్వరాష్ట్రం నుంచి ముంబయికి చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు గదుల అద్దెలో యాభై శాతం వరకు రాయితీలను కల్పిస్తున్నారు. వీలైనంతగా వారికి కావాల్సిన సమాచార సహకారాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. (వైద్యం కోసం వచ్చేవారు మహాసభ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. ఫోన్: 022-24144377-88). ముంబయిలో పరిచయమున్న ఎవరితోనైనా నమోదు చేసుకోవచ్చు. కార్యవర్గ సభ్యులెవరైనా పరిచయం ఉంటే మరీ మంచిది.

ఇంతేకాకుండా తెలుగు వారికి యోగా శిబిరాలు, విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్ (వృత్తిగత నైపుణ్యం) ఇంద్రజాల ప్రదర్శన వంటివి నిర్వహించి తమ వంతు సేవలందిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రమహాసభ అధ్యక్షులైన పోతు రాజారాం, ప్రధాన కార్యదర్శి కె.బాబూరావుల హయాంలో ఈ కార్యక్రమాలు సాగుతున్నాయి. ఆంధ్రమహాసభ ఈ పరాయి గడ్డపై తెలుగు భాషా, సంస్కృతి, ఆచార వ్యవహారాల వికాసానికి నిరంతరం పాటుపడుతూ, తెలుగువారి స్వాభిమాన ప్రతీకగా విరాజిల్లుతోంది.

సంగెవేని రవీంద్ర
రచయిత, ముంబయి
099871 45310

మన తెలుగు

తెలుగు భాష యనిన తీయ మామిడి తోట;
తోటలోని చెట్లు మేటికృతులు;
పద్యగేయ వితతి పరిపక్వ ఫలములు;
తత్ఫలాలను తినదలచుడయ్య!

తెలుగుభాషలోన దివ్యమై వెలుగొందు
రమ్యపుస్తకాలు లక్షలుండె;
మీకు నచ్చినట్టి మేలైన గ్రంథాలు
సత్వరమ్ముతెచ్చి చదువుడయ్య!

తెలుగుభాష నీది; తెలుగు వాడవు నీవు;
తెలుగు వృద్ధి బరచ దలచు మీవు;
మాతృభాష నెపుడు మాటాడవలె నంచు
పలుకుమయ్య! ప్రజకు తెలుపుమయ్య!

అన్యభాషలనెడి యడవి యేన్గులు వచ్చి,
పాడొనర్చె తెల్గు వనమునెల్ల;
అట్టితోట కింక నండగా నేనుండి
బ్రోచెదనని, దీక్ష బూనుమయ్య!

చెట్లకొమ్మల పయిచేరి కూర్చున్నవి
అన్యమాధ్యమమ్ము లనెడి కపులు;
తోట నష్టపరచు వాటినెల్ల తరిమి;
తెలుగు రక్షణమ్ము సలుపుమయ్య!

ఆకాంక్ష:

వందపదుల యేళ్ళనాటి వైభవాలు తెల్గుకున్,
వందనమ్ము సల్పుగాత! వాసిగన్న భాషలున్;
ముందుతరము వారలెల్ల మోదమందు రీతిగా
అందమైన తెల్గుబాస అవని వెల్గుగావుతన్!

ముదిగొండ శ్రీరామశాస్త్రి
ఖానాపురం హవేలి. ఖమ్మం. 98663 05945

అన్ని చదువులూ తెలుగులో ఉండాలి!

ఆచార్య
ఆర్వీఎస్ సుందరం

> "ఉన్నత విద్యలో కూడా తెలుగే ప్రథమ భాషగా ఉండాలి. కేవలం మార్కుల కోసం ఇతర భాషలన్ని నేర్చుకొనే విధానం పోవాలి. వైద్యం, ఇంజినీరింగ్ లాంటివి కూడా తెలుగులో నేర్చుకునే అవకాశం కలగాలి. ఈ విషయంలో చైనా, జపాన్, జర్మనీ, రష్యాలాంటి దేశాల్ని చూసి మనం నేర్చుకోవాలి."

తెలుగు ప్రాచీన భాష. విశిష్ట భాష. ప్రపంచంలో ఏ భాషతో పోల్చినా తెలుగు విశిష్టమైన భాష అనడంలో సందేహం లేదు. భాష అనేది భావ వ్యక్తీకరణ కోసం ఏర్పడింది. కేవలం భావ వ్యక్తీకరణతో ఊరుకోక భాషను మాట్లాడే జన సముదాయం ఆ భాషను అన్ని విధాలా సమర్థమైన భాషగా తీర్చి దిద్దుకుంటారు. తెలుగు భాషను తెలుగు జాతి అత్యంత సమర్థమైన భాషగా తీర్చి దిద్దుకుంది. తెలుగు భాష స్వతంత్ర భాషగా మూడు వేల సంవత్సరాల కంటే ముందు నుంచి వికాసం చెందుతూ ఉంది. ద్రావిడ భాషలో మూలం నుంచి విడివడిన మొదటి భాష తెలుగే. అప్పటి నుంచి తెలుగు భాష అన్ని విషయాలను వ్యక్తీకరించగల సామర్థ్యం అలవరచుకొంది. సంస్కృత ప్రాకృతాల నుంచి అక్షరాలను స్వీకరించి మరింత బలపడింది. ఆధునిక కాలంలో క్యాట్, ర్యాట్, బ్యాంక్ లాంటి పదాలలోని 'ఆ' అనే ధ్వనిని, ఫ్యాన్, ఆఫీసులాంటి పదాలలోని 'ఫ' మొదలైన అక్షరాలను చేర్చుకుంది. లిపిలో క్రీస్తు పూర్వమే సంస్కృతంలోని అక్షరాలను కూడా చేర్చుకొని బలపడింది. వీటి కారణంగా ప్రాచీనతతో పాటు గొప్ప అభివ్యక్తి సామర్థ్యాన్ని కూడా అలవరచుకొంది తెలుగు భాష.

తెలుగు భాషను ప్రాచీనమూ విశిష్టమూ అనడానికి ఎన్నో కారణాలున్నాయి. మూడు వేల ఏళ్లనాడే తెలుగు వారు తమలో తాము మాట్లాడుకోడానికి తగిన భాషను ఏర్పరుచుకొన్నారు. గాథాసప్తశతి కాలంనాటికే క్రీ.శ.1వ శతాబ్ది పొలం పాటలు, పెళ్లి పాటలు పాడుకొనే వారు. ఆరో శతాబ్ది నుంచి శాసనాలు రూపొందించారు. తొమ్మిదో శతాబ్దం నుంచి అన్ని రకాల పద్యాలనూ రాయడం మొదలుపెట్టారు. పదకొండో శతాబ్దిలో మహా భారతంలాంటి ఇతిహాస నిర్మాణానికి పూనుకున్నారు.

ముఖ్యంగా చెప్పవలసిన విషయం ఏమంటే వెయ్యి సంవత్సరాలకు పైగా తెలుగు వారు ఏనాడు నిలపకుండా సాహిత్యాన్ని సృష్టించారు. ఇలా చేసిన భాషలు ప్రపంచంలోనే చాలా తక్కువగా ఉన్నాయి. ఇక తెలుగులో పద్యం, పదం, గద్యం అనే మూడు మాధ్యమాలలోనూ రచనలు వెలువడ్డాయన్నది గమనించాలి. పద్యం వెయ్యేళ్లకు పైగా తెలుగులో సజీవంగా ఉంది. పద సాహిత్యానికి తెలుగు పెట్టింది పేరు. అన్నమయ్యలాంటి పద కవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడు ప్రపంచంలోనే లేడంటే అతిశయోక్తి కాదు. 32 వేల సంకీర్తనల్ని ఒక జీవిత కాలంలో రాసిన మహనీయుడు అన్నమయ్య.

తెలుగు సంగీతాత్మక భాష. మొదటి నుంచి అది అజంత భాష. అచ్చులు భాషకు ప్రాణం. అవి లేకుండా అక్షరాలను పలకలేం. తెలుగు అజంత భాష కావడం వల్ల చెవులకు ఇంపుగా ఉంటుంది. ఈ విషయాన్ని పాశ్చాత్య పండితులు ఏనాడో గుర్తించారు. అందువల్లనే తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని కీర్తించారు. కర్ణాటక సంగీతంలో తెలుగు కీర్తనల్ని పాడకుండా ఉండడం సాధ్యం కాదు. అన్నమయ్య, క్షేత్రయ్య, త్యాగయ్య దక్షిణ భారత దేశమంతా పరిచితులూ. ప్రపంచంలో ఏ భాషనైనా తెలుగు వారు సరిగ్గా ఉచ్చరించ గలరు. ఏ భాషనైనా తెలుగు లిపిలో రాసుకోగలరు. ఇంపైన తెలుగు భాషతో ఎవర్నైనా మెప్పించగలరు.

ప్రభావాలు..

తెలుగు మీద ఎన్నో భాషా సాహిత్యాలు ప్రభావం ఉంది. తెలుగు ప్రభావం ఇతర భాషా సాహిత్యాల మీద కూడా ఉంది. తెలుగు మీద సంస్కృత, ప్రాకృత, ఇంగ్లీషు భాష ప్రభావం వల్ల తెలుగు నష్టపోయిందని కొంతమంది అంటున్నారు. కాని ఇప్పుడు మనం ఈ ప్రభావాలను వదిలించుకోవడం వీలు కాదు. నిజానికి సాధ్యమైనంత వరకు తెలుగు పదాలను వాడడం మంచిదే. తెలుగు పదాలతోనే దేన్నయినా వ్యక్తీకరించగలిగితే మంచిదే. అత్యంత విస్తృతంగా ఒక భాషను పెంపొందించుకోవాలనే అభిలాష ఉంటే దానికి తగిన పదజాలాన్ని ఏర్పరుచుకోక తప్పదు. అంతమాత్రం చేత ఇతర భాషలకు దాస్యం చెయ్యాల్సిన అవసరం లేదు. ఇతర భాషలలో ఉన్న విజ్ఞానాన్నంతటినీ తెలుగులోనికి తెచ్చే ప్రయత్నాలు జరిగాయి. అందువల్లనే వ్యాకరణాలు, ఛందస్సులు, అలంకారాలు, పురాణాలు, గణితంలాంటి శాస్త్రాలు, ధర్మ శాస్త్రం, చరిత్రలాంటివన్నీ తెలుగులోనికి వచ్చాయి. ఇవన్నీ తెలుగును పరిపుష్టం చేశాయి.

తెలుగు భవిష్యత్తు

తెలుగును ప్రపంచంలో అత్యుత్తమ భాషగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనమీద ఉంది. దీని కోసం తెలుగులో ఉన్న జ్ఞానం (సాహిత్యం, ఛందస్సు, వ్యాకరణాలు మొదలైనవి), ఇతర భాషల్లోకి వెళ్లాలి. అలాగే ఇతర భాషలలో ఉన్న జ్ఞానమంతా తెలుగులోనికి రావాలి. అది కూడా ఎప్పటికప్పుడు, ఆధునిక జ్ఞానమంతా తెలుగులోనికి వచ్చే అవకాశం ఉండాలి. తెలుగు పిల్లలందరూ ప్రాథమిక విద్యను తెలుగులోనే నేర్చుకోవాలి. ఉన్నత విద్యలో కూడా తెలుగే ప్రథమ భాషగా ఉండాలి. కేవలం మార్కుల కోసం ఇతర భాషలన్ని నేర్చుకొనే విధానం పోవాలి. వైద్యం, ఇంజినీరింగ్‌లాంటివి కూడా తెలుగులో నేర్చుకునే అవకాశం కలగాలి. ఈ విషయంలో చైనా, జపాన్, జర్మనీ, రష్యాలాంటి దేశాల్ని చూసి మనం నేర్చుకోవాలి. తెలుగు వారి పరిపాలన తెలుగులోనే జరగాలి. న్యాయస్థానాలన్నింటినీ తెలుగే వినిపించాలి. తెలుగు చదువుకున్న వారికి ఉద్యోగాలలో ఎక్కువ అవకాశం ఇవ్వాలి. ఇవన్నీ తెలుగు జాతిగా పుట్టిన ప్రతి తెలుగువాడు అనుసరించాల్సిన కర్తవ్యాలని భావించాలి.

తొక్కుడుకొమ్మ

పొద్దు వాటాలింది. ఒంటిగంట దాటి నట్టుంది. కోసిన సొద్దకంకులు ఒడుల్లో వేలాడుతుండగా ఒకరొకరే మునంలోంచి బైటకు రాసాగారు కూలీలు.

"యమ్మ యమ్మ! రొంత గట్టెక్కించి పోండి తల్లీ! మీకు పున్నెముంటాదమ్మా" కొడవలి పైకెత్తి కూలీలకేసి చూస్తూ ప్రాధేయపడింది చేనుగల్లామె.

సగంపైగా మునం మిగిలి ఉంది ఇంకా. దాన్ని గట్టెక్కించాలంటే మరో గంట సమయం దాకా పడుతుంది. కూలీలు ఎవరూ ఆమె మాట వినిపించుకున్నట్టు లేదు వెనుదిరిగి మునం పట్టుకోలేదు. ఆ కంకి మీదకు కొడవలి చాచలేదు. ఒకర్నొకరు చూపులతోనే సైగలు చేసికొంటూ తాము గట్టెక్కేందుకే మొగ్గు చూపారు. ఒడుల్లో కంకుల్ని మంచె దగ్గరున్న కుప్పలో పోశారు. ఒడి విప్పి చీరకు అంటుకున్న ఎండుసుంకు రాలిపోయేలా మడతల్ని జాడించుకొన్నారు.

మునం గట్టెక్కితే చేనుకోత పూర్తవుతుంది. రేపటమాపట ఆమె ఒంటరిగా అగచాట్లు పడే బాధ తప్పుతుంది. కానీ ఇప్పుడు తమకా అవకాశం లేదు. మాపటిపూట పనయిఉంటే చీకటి పడినా సరే చేసేవాళ్లు. ఇప్పుడిక్కడ ఆలస్యం చేస్తే మరో చేలో ఒప్పుకొన్న మాపటి పనికి ఎదుర్కోలేరు.

కూలీలకు గిరాకీ పెరిగినందువల్ల రోజుటి పని కూడా రెండు భాగాలు విడిపోయింది. రెండు కూళ్లుగా సంపాదన అయింది. పని చేయించుకునేవాళ్లకు కూడా పైటేల సంగటి మోసుకొచ్చే జంజాటం ఒకటి తప్పిపోయింది.

అక్కడున్న వాళ్లలో చాలామంది పోటీ పనికి వచ్చినవాళ్లే. సాయంకాలం ఇంకో అమ్మకు పోటీకి వెళ్లాలి. చాలావరకు ఇంటి ఆడమనుషులు పోటీలు చేసుకొని పనుల్ని కూడబెట్టుకొని, అందర్నీ ఒకసారే పిల్చుకొని తమ పొలం పని పూర్తి చేసికొంటారు.

అందరికన్నా వెనగ్గా మునంలోంచి లేచింది ప్రసన్న. చేనుగల్ల ఆడమనిషి కేసి జాలిగా చూస్తూ గట్టెక్కింది.

చేను దాటేదాకా! అనికాడుతూ అడుగులు వేసినవాళ్లు కాస్తా దారిలో కలుసుకోగానే ఊరికేసి ఎగమల్లి సుడిగాలుల్లా రవరవ ముందుకుసాగారు.

ప్రసన్నకు తన పిల్లలిద్దరూ కళ్లముందు కదలాడారు.

పెద్దోడు నాలుగో తరగతి, చిన్నోడు రెండో తరగతి- ఊరి బడిలోనే.

మధ్యాహ్న భోజనం బడిలోనే అందిస్తారు కాబట్టి వాళ్ల తిండి గురించి దిగులు లేదు.

ఎటొచ్చీ తన దిగులంతా ఉట్టిమీది సెరవలోని అప్పచ్చుల పాకు గురించే.

బడి వదిలి ఇంటికొచ్చినప్పటి నుంచి పిల్లలు ఒకటే పోరు చేస్తున్నారు ఏదొకటి కొనిపెట్టమని. బడికి వెళ్లేముందు కూడా అంతే. మూడు పూటలా బువ్వ మెతుకులు తప్ప పైతిండికి ఏమీలేదు. రోజుకు ఒక్కసారన్నా అదనంగా నోరాడటం లేదు. పైతిండికి కొట్టకలాడుతున్నారు పాపం!

అందుకే ఒక పడిబియ్యం పిండిగొట్టి బెల్లపుపాకులో కలిపి పెట్టింది అప్పచ్చులు కాల్చాలని. తన మొగునికి జాగ్రత్త లేదు. ఉట్టిమీది సెరవలో ఏముందో అనుకొని కిందకు దించి, తిరిగి ఉట్టికెక్కించక, సరిగ్గా వాకిలి అడ్డగించక, వీధుల్లో యవ్వారానికి పోతే- కుక్కలు ఇంట్లో జొరబడి సెరవలో మూతిబెట్టినాయంటే ఏమీ మిగలదు. అడుగంతా నాకిగాని వదలవు. కాలికొద్దీ రవరవ నడవసాగింది ఆమె.

పత్తిగంపలు నెత్తిమీద పెట్టుకొని ఉరుకులు పరుగుల మీద సావు జంపులుగా ఊర్లోకి పోతున్నారు జనం. తలమీది బరువుకు నడుము మడతల్లో చిరుచెమటలు ఊరుతోండగా నడుస్తున్నారు ఆడవాళ్లు.

ఆకాశంలో మేఘాల హడావుడి ఎక్కువగా ఉంది.

నాలుగు రోజులు గుంపించి ఎండ కాసేసరికి కాయలన్నీ పగిలి చెట్ల నిండా తెల్లగా విరిగి వేలాడుతూ ఉంది పత్తి. వానొస్తే నాని నేలరాలి మట్టిగొట్టుకుపోతుంది. మరోవైపు

సొద్దపంట భంగమవుతుంది. అందుకే రైతుల్లో ఈ ఆందోళన. గుండె నిండా అలజడి.

ఉత్తరకార్తె వెళ్లిపోతూ ఉంది. ఈ రోజో రేపో హస్తకార్తె వస్తుంది. ఈశాన్యమూల కొండలకు ఆవల ఉరుములు మెరుపులు అలజడి దండిగా ఉంది. కార్తెల సందిలో వన వంగితే బలపడిపోతుంది.

చేలగెట్ల మీద అక్కడక్కడా ఏపుగా పెరిగిన తేకుచెట్లు ఆకులు కనిపించకుండా పూసిన పూలగుత్తులతో వింతగా కనిపిస్తున్నాయి.

ఊర్లో అడుగు పెట్టినాంక కూడా కాలినడక వేగం తగ్గలేదు ప్రసన్నకు.

మిద్దె పంచలో పత్తికాయల కుప్ప ముందు కూచునిపత్తి తీస్తూ ముసలి అత్త. నడవను కాళ్లు లేకున్నా తనకు చేతనైనంత ఏదొక పనిచేస్తూ ఉంటుంది ఆమె.

"బువ్వ తిన్నావా లేదా?" అడిగింది ఆమెను.

"యాడ తిన్నిస్సాండయీ- యూటె నారుగూల. యూటె తలపుండు పగల. సూడు.. పుట్టలు పగలగొట్టుకొని వచ్చినట్టు ఎట్ట పారేడతండాయో!"

కాయల్నిండా నువ్వులు చల్లినట్లు జిబజిబమంటున్నాయి నల్లటి పత్తిపురుగులు. అవి పారాడితే ఒళ్లంతా జిలజిలగా ఉంటుంది తప్ప చురుకు ఉండదు. ఎటొచ్చి ఎర్రటి నరజుల్తోనే తంటా, అప్పుడే గుడ్డులోంచి బైటకొచ్చినంత సన్నగా ఉన్నా చురక్కి చురక్కిన కరుస్తుంటాయి అవి.

"వాయిల మండలో వేపమండలో తెచ్చి కప్పించుకోకూడదా!" అంది ప్రసన్న.

"ఆ నా కొడుకు అంతముట్టుకోడైతే ఇంగేమీ? - యాడజచ్చిండో.. పొద్దున్నించి రానేలే..."

లేతలేత వావిలి మండల్ని కుప్పమీద కప్పితే పురుగులన్నీ ఆకులకు ఎక్కుతాయి. మండను తీసి ఎండలో విదిల్చి తిరిగి కుప్పమీద కప్పవచ్చు. ఓ వైపు అత్త ఇబ్బందుల్ని ఆరా తీస్తూనే వాకిలి దొబ్బి ఇంట్లోకి అడుగు పెట్టింది. ఏమీ కనిపించని చీకటిలోనే ఉట్టిపైకి ఎగజూసింది. దొడ్డివాకిలి తీసిన తర్వాతగాని మనస్సు కుదుటబడలేదు. ఉట్టిమీది సెరవ దించి, పాకుపై వేలితో వత్తిచూసి తృప్తిపడింది.

చేతులు కడుక్కొని అత్తకింత బువ్వపెట్టి, తనూ నాలుగు పిడచలు పచ్చడితో తిని, పళ్లెం కడిగేసరికి మొగుడు సుధాకర్ ఇంట్లోకొస్తూ కన్పించాడు. అతని చేతిలో చిన్నపాటి గుడ్డమూట ఒకటి వేలాడుతూ ఉంది. ఒక్క చూపుతోనే అదేమిటో పోల్చుకుంది. తేమ వూరి, అక్కడక్కడా ఎర్రబడి, నీచునీళ్లు ఒడుస్తూ, ఒకటి రెండు ఈగలు దాన్ని వెంటాడుతూ.. అది సియ్యల మూట. అతనికేసి ఎగాదిగా కూడా చూడలేదు ఆమె. మాంసపు మూటకేసి అసహ్యపు చూపును విసురుతూ పంచలోకి నడిచింది. ముసలామె గొణుక్కొంటూ ఉంది.

ఆమె తిన్న పళ్లెన్ని అందుకొని నీళ్లు పోసి వీధిలో విసరిచల్లి పంచగూట్లో పెట్టింది ప్రసన్న. కాయల కుప్పముందు కూచుని నాలుగు గుప్పెళ్లు పత్తి పీకేసరికి వీధిలో అగపడ్డారు తోటికూలీలు.

"రారా.. పొద్దుపోతోంది.." వీధిలోంచే పిల్చింది ఓ కూలమ్మ.

లేచి చెప్పుల్లో కాళ్లు దూర్చి బైటకు అడుగేయబోతోంటే బిరబిర ఇంట్లోంచి వాకిట్లోకి వచ్చి "యాడికి పోతాండవు?" అడిగాడు సుధాకర్. ఆ ప్రశ్నలోని ఆంతర్యం ఆమెకు తెలుసు.

"నీ ఎదురుగ్గా కూకోనుండాల్నా?" అసహనాన్ని వెళ్లగక్కింది.

"పొద్దునోతు పనికిబొయ్యింది సాల్లే.. సంపాయిచ్చి పాతర్లుబొయ్యొద్దుగాని.. రారా.. సియ్యల్దెచ్చినా.. కూరొండుదూరా.." గొంతులో మగనితనం గరగరమంది.

ఆమె ఒళ్లంతా అసహ్యపు జలదరింపుతో వణికింది. "నిన్నా మొన్నా తిన్నేది సాల్దా?" అంది పెదాలు బిగబట్టి.

అతను పంచలోంచి వీధిలోకి నడుస్తూ "నియ్యబ్బని సొమ్మేం తెచ్చి పెట్టలేదులే.. తెచ్చింది నేను.. ఎదురు మాట్లాడకండా ఇంటికాడ పడుండి వండిపెట్టు.." మొగుని హోదాలో హుకూం జారీచేసి వీధెక్కిపోయాడు.

అతనికేసి అదోలా చూసింది ప్రసన్న.

ముసలామె సన్నని గొంతుతో కొడుకును తిట్టరాని తిట్లు తిడుతూ ఉంది. వాకిండ్లేసి వచ్చి తోటి కూలీల వెంట సాగింది ప్రసన్న. అంగడింట్లోకెళ్లి రెండ్రూపాయలకు చాక్లెట్లు కొని బడి వద్ద పిల్లల చేతిలో పెట్టి, రెండు మాటలు చెప్పి తిరిగి కూలీల్లో కలుసుకొంది.

ఊరు దాటింతర్వాత రాములమ్మ అడిగింది "పచ్చిసియ్యలు మాపిటేల దాకా ఉంటే పనికొస్తాయా? చెడిపోవూ? రోంత ఉప్పు పసుపు కలిపి పొయ్యి మీద బేసిరాకూడదంటనే.. మాపిటేల ఇంటికి పోయినాంక కూరొండుకోకపోయినవా!" అని.

"పనికిరాకుంటే దిబ్బలో బేసుకుంటాడులే. విసురుగా చెప్పింది ప్రసన్న.

"ఊరకొచ్చినయా? లెక్కబెట్టి కొన్నెయి గాదూ!"... దీర్ఘంగా నిట్టూర్చింది రాములమ్మ.

"ఒక్కరోజు రొండ్రోజులయితే వండి పెట్టేదాన్ని.. బతికినన్నాళ్లూ యూనిముండ యాడమోసేది?" గొంతు జీరవోయింది ఆమెకు. "ఈ వారం రోజుల్లోనే ఇది మూడోతూరి. ఒకరోజు కోడిసియ్యల్దెచ్చి వండమన్నెడా! రేత్రికి మందుకు లెక్కీమని కూకుంటే.. నన్ను నానాక ఇబ్బందిపెట్టి, నా మానం పానం దీసి కూల్లెక్క తీసుకుంటె.. తాగొచ్చి ఊరకుంటే పర్లే... మీసాల్దిప్పి ఊరందర్నీ తిట్టబెట్టె.. ఊరు మంచిదై సరిపోయింది.. మల్లా మొన్న పంది సియ్యల్దెచ్చి కూరొండమనె.. వండిపెడ్తే.. మందుకు లెక్కడిగె.. లేదంటి.. బంగపడె.. కాళ్లావేళ్లా బడె.. పిల్లోళ్లకు తొడగను సరైన చొక్కాలేదే. నిక్కర్లన్నీ పిర్రల మింద చినిగిపోయుండాయి. యూని బొక్కన లెక్కేడ గొట్టేను.. లేనే లేదంటి.. తిట్టబట్టె.. నన్నూ నా పుట్టింటోల్లనూ.. నానాక కూతల్లేకా! సెప్పుకునే

మాటలు గాదులే.. అయప్ప తిట్లు యిల్లేక వాళ్ల అన్న లెక్కిచ్చి పంపిచ్చె.. తాగొచ్చె.. అన్న దేవుడని.. ఆలి దెయ్యమనె.. మల్లా ఇయ్యాల సియ్యలు.. కూలిపని సాలిచ్చి వండిపెట్టాలంట.. వండుతే మందుకు లెక్కియ్యాల.. లేదంటే తిట్లదినాల..ఇంట్లో యాడ దాపెట్టుకొన్నే ఎతుకుతాండె.. బొడ్లో దాపెట్టుకొన్నే గుంజుకుంటాండె.. యాడ యాని ధూము తగిలించేను? యాటకాడ సియ్యలు అప్పుడెస్పాండె.. రేపు వాళ్లొచ్చి ఇంటికాడ ఒక మాటంటే పడేదెవురు? వానెమ్మ వానేలి అంటే తగిలేదెవురికి? మనకే గద!.. యాడమ్మా సియ్యలొండి పెట్టేది? నువ్వయితే వండుతావా?" ఏడుపు ఆపుకోలేకపోయింది.

అమ్మలక్కలంతా ఆమె మాటల్నే బలపరిచారు. ఆమె మొగుణ్ని తిట్టిపోశారు. అట్లాంటోల్లను ఆడోళ్లంతా కలిసి మంచానికి అణగగట్టి ఒక నెలరోజులు యాలకింత పిడచబేస్తా మగ్గదీయాలన్నారు. అన్నీ మంచంలోనే జరిగిపోతేగాని బుద్ధిరాదన్నారు. ప్రసన్నకు భయంభయంగానే ఉంది. సాయంత్రం దాకా పత్తి విరుస్తూనే ఉన్నా మనస్సు మాత్రం ఇంటి వద్దే ఉంది. మొగుడేమి ఇబ్బంది పెడుతున్నాడోనని ఆందోళన. అతని చేష్టలకు పిల్లలు బెదిరిపోతారేమోనని దిగులు. పొద్దు కొండల్లోకి వాలే సమయాన ఇంటిదారి పట్టారు అందరూ. ఊర్లోకి అడుగు పెట్టేసరికి పొద్దుగుంకింది. ఇంటిముందు వీధిలో కుక్కల కొట్లాటను దూరాన్నించే గమనించింది ప్రసన్న. ఏదో తినేందుకు గొడవ పడుతున్నాయి అవి. ఆమె నొసలు ముడివడింది. పిల్లలు పక్కింటి పంచలో కూచుని పలక రాసుకొంటున్నారు.

మొగుడు తమ పంచలో అటుఇటు అసహనంగా తిరుగుతున్నాడు. దగ్గరగా వెళ్లగానే అర్థమైంది వీధిలో కుక్కలు తినే పదార్థమేమిటో! కడుపు తరుక్కుపోయింది ఆమెకు. గుండెలు రగిలాయి.

"కూరొండమంటే వండవా? అంత పొగురెక్కినావా! అప్పచ్చులు కాల్చుకొని తియ్యగా తిందామనుకొన్నెవా? ఇంగ తినునియ్యక్క.. కుక్కల్తో కాట్లాడి పెరక్కతినుపో.." రొప్పుతున్నాడు అతను. మరోసారి కుక్కలకేసి చూసింది ఆమె.

"పిల్లల నోటికాడి పదార్థం తీసి కుక్కలకేసిండు యానికి గత్తరదగల.. ముసలామె ఏడుపు గొంతుతో తిడుతోంది. ప్రసన్నకు కూడా ఏడుపొచ్చింది. అతని మీద అంతులేని అసహ్యం పొర్లుకొచ్చింది. తన తాగుడుకు నంజుడు వండలేదని పిల్లల పంటికిందకు లేకుండా చేసిన అతని నికృష్టపు వ్యసనం పట్ల కోపం ఎగదన్నుకు వచ్చింది. దాన్ని ఎట్లా వ్యక్తం చేయాలో తెలీలేదు. అతనికి ఎప్పుడూ ఎదురుమళ్లింది గాదు. మాటకుమాట అనిందిగాదు. తిట్టింది గాదు. కొట్లాడింది గాదు.

ఇప్పుడు ఆవేశం పట్టలేకపోతోంది.

చేతికి ఏది దొరికితే అది తీసికొని వీధిలోని కుక్కల మీద విసిరింది. తుంటకర్రతో వాటిని వెంపర్లాడి కొట్టింది. వీధి కుక్క దొర్లుతూ ఉన్న సెరవను తీసికొని నేలమీద కసిగా బాదింది. ఆ ఊపులోనే ఇంట్లోకి వెళ్లేసరికి అడ్డగోడ మీద ఈగలు ముసురుతూ ఉన్న సియ్యల మూట కన్పించి, అది మొగుని మొహంలాగే అన్పించి, మూట విప్పుతూ దొడ్లోకి వెళ్లి గోడవతల ఇంటెనకాల మాంసాన్ని విసిరికొట్టిన తర్వాతగాని ఆమె ఆవేశం చల్లారలేదు.

"ఇంగతిను!" అనుకొంది కసిగా.

అప్పటికింకా చీకటి పడలేదు. మాంసాన్ని పసిగట్టిన కాకులు ఒకదాన్నొకటి పిల్చుకొంటూ ఇంటివెనక గోలగోలగా మూగాయి. మాంసం ముక్కలు నోట కరచుకొని ఎగురుతూ తిరునాళ్ల సందడిని సృష్టిస్తున్నాయి. ఇంట్లోకి వచ్చిన సుధాకర్‌కు కాకిగోల విన్పించింది. దొడ్లోకి చూడగానే విషయం సగం అర్థమైంది. దొడ్డిగోడ మీద వేలాడే ఖాళీ మాంసం గుడ్డా, అడ్డగోడ మీద కనిపించని సియ్యల మూటా మిగతా సగాన్ని అతనికి తేటతెల్లం చేశాయి. వండమని ఇచ్చిన కూరను వండకపోవటమే కాకుండా కాకుల పాల్జేసిన పెండ్లాం మీద చచ్చేంత కోపమొచ్చింది. ఆమె తిరుగుబాటును ఓర్చుకోలేకపోయాడు.

"కొవ్వుబట్టినవే నియ్యమ్మ!" అంటూ ఆమె జుట్టు పట్టుకొని వంచి వీపు మీద దబాగుబా బాదాడు.

రెండు మూడు దెబ్బలకు ఒళ్లొంచి మౌనంగానే ఉండిపోయింది. ఆమె తర్వాత ఓర్చుకోలేక బావురుమంది. "ఓయమ్మ సచ్చినే.." అంటూ గట్టిగా అరుస్తూ నేలబడింది.

"ఒరే.. నీ సేతల్లో ముల్లులు బడ.. నీ తలపుండు పగల.." అంటూ కూచున్న తావునించే ఆరాటంగా లేచేందుకు ప్రయత్నిస్తూ, వంగిన మోకాళ్లు సాగక, బలవంతాన కర్రసాయంతో లేచి, కాళ్లు స్వాధీనం తప్పుతోన్నా రెండడుగులేసి వాకిట్లోకి వచ్చింది ముసలామె. మరో నాలుగు గుద్దులు గుద్ది బైటకు నడిచాడు.

తిడుతూ తన మీదకు కర్ర ఎత్తిన తల్లి కుత్తుక పట్టుకొని పత్తికుప్ప మీద కూలేసి వీధిలోకెళ్లాడు. కట్లు తెగిన గడ్డిమోపులా ఇంట్లోపడి రోదిస్తూ ఉంది ప్రసన్న.

ఇంటి ముందు కుక్కల కొట్లాట. ఇంటి వెనుక కాకుల గోల. ఇంట్లో ఆడమనిషి ఏడుపు.. మూడు శబ్దాలూ కలగలిపి వింతగా వినిపిస్తున్నాయి. పిల్లలు భయంభయంగా జేజి దగ్గరకు వెళ్లి అట్నించి అమ్మను చేరుకున్నారు. ఆమెను కౌగిలించుకొని వాళ్లూ ఏడవసాగారు.

పిల్లల సహానుభూతి ఆమె గుండెల్ని మరింత నలిపింది. తను సంసారం చేసే క్రమానికీ మొగుని పోరంబోకుతనానికీ ఎప్పటినుంచో అన్వయం కుదరలేదు. పైగా ఈ రోజు చేయి చేసికోవడం కూడా..

నిమిషం తీరిక లేకుండా పన్జేసినా సంసారం గడవడం కష్టంగా ఉంది. మొగుడనేవాడు దోసెడు బియ్యంగానీ, పది రూపాయలు లెక్కగానీ తెచ్చివ్వకున్నా కట్టుకున్న నేరానికి అతనికి కూడా మూడుపూటలా కూడు పెడుతోంది. ఊరకూరకే తిడుతోన్నా భరిస్తోంది. గద్దిస్తోన్నా సహిస్తోంది. అతని భారాన్ని కూడా తనే యీడుస్తోన్నా.. ఆబోతు కోడెలా కుమ్మికుమ్మి వదలటం... భరించలేకపోతోంది ఆమె. ఏ తీరున కూడా అరిగించుకోలేకపోతోంది. గోడకానుకొని దిగాలుగా కూచుండిపోయింది. ఇల్లంతా

కథలోని పదాలకు అర్థాలు

వాటాలింది - వంగింది
సొద్దకుంట - సజ్జకంకులు
రోంత - రవంత
పైటేల - పగటివేల
అనికాడుతూ - నెమ్మదిగా
ఎగమల్లి - ఎగజూసి
రవరవ - గబగబ
పోడు - మారాంచెయ్యటం
సావుజంపలుగా - పడుతూలేస్తూ
గుంపించి - తీవ్రంగా
నారుగూల - మొలకల్లో చావటం
వాకిలి దొబ్బి - వాకిలినెట్టి
సియ్యల - మాంసం
పిడచచేస్తా - వెయ్యటం
గత్తరదగల - రోగంరాను
ఉలగరిస్తోంది గుంగ్రించుకొస్తోంది- వాంతి వచ్చేట్లు ఉండటం
మునంలోంచి - మడిలో నుంచి

చీకటిమయమైంది. ముసలామె తారాడుకొంటూ వచ్చి బల్బు వెలిగించింది.

"బైట మంచమ్మీంద పలకలు, కాగితాలుండాయి.. ఎత్తిపెట్టుకోపోండి" పిల్లలకు చెప్పింది. పిల్లలిద్దరూ పంచలోకి నడిచారు. ముసలామె మళ్లీ పత్తికాయల కుప్పముందు కూలబడింది. తర్వాత కొంతసేపటికి మెల్లిగా లేచి నిల్చుంది ప్రసన్న. చిందరవందరైన వెంట్రుకల్ని వేళ్లతో వెనక్కి దువ్వి కొప్పు ముడేసుకుంది. జారిపోతూ ఉన్న చీరను సవరించుకొంది. గుండె బద్దలైపోయి ఉంది. మెదడు శూన్యంలా ఉంది. కళ్లు తిరుగుతున్నాయి. ఒళ్లు తూలుతూ ఉంది. మనస్సునిండా ఆక్రమించుకొన్న మగని దౌష్ట్యం-తన నిస్సహాయత. ఏదో నిర్ణయానికి వచ్చేందుకు శక్తిని కూడదీసుకొనే క్రమంలో గుండెలనిండా గాలి పీల్చుకుంది. దొడ్లోకి వెళ్లి గూళ్లల్లో వెదికింది.

పురుగుల మందు డబ్బా దొరికింది. పైరుకు చల్లగా మిగిలిన మందుడబ్బా. దాన్ని ఆ రోజు చేనివద్దే పారేద్దామనుకొంది గాని అది ఇప్పుడిట్లా ఉపయోగపడుతుందని ఊహించ లేదు. మూత తీసి వంచి చూసింది. అడుగున కొద్దిగా ఉంది. ఇంకొన్ని నీళ్లు కలిపింది. నోట్లో పోసుకొని ఒక్కగుక్క మింగింది. భరించరాని కంపు. ఓర్చుకోలేని రుచి. కడుపులో ఉన్నదంతా బైటకొస్తుందేమోనన్న భ్రాంతి. పంచలోంచి పిల్లలు పిల్చినట్లుగా అనిపించింది. రెండోగుక్క తాగలేకపోయింది. వెళ్లి మంచమ్మీద ముసుగేసుకు పడుకొంది. కడుపులో చేయిపెట్టి దేవినట్లుంది... ఉలగరిస్తోంది.. గుంజ్రింపుకొస్తోంది.. మంచం పట్టె మీదుగా తల నేలకు దించి 'వాక్'మంటూ ఉమ్మగిలుతోంది. ముసలామెకు ఏదో అనుమానమొచ్చింది. పిల్లల్ని వెంటేసుకొని ఇంట్లోకి నడిచింది.

"ఏమ్మే? ఏమైంది?" అంటూ దగ్గరకు పోగానే వాసన పసిగట్టింది. వెంటనే గావుకేకలు పెట్టింది. "ఓయమ్మో! నా కోడలే.. మందు దాగిందే.. ఇంగెట్టనే దేవుడా.. పిల్లోళ్లకు దిక్కెవుర్రా భగమంతుడా.. కోడలా.." అంటూ గుండెలు బాదుకొంటూ కుప్పకూలిపోయింది.

విషయం అర్థంగాక పిల్లలు కూడా బిగ్గరగా ఏడవటం మొదలెట్టారు. అప్పటిదాకా రోజుటిలాగే అవేవో తాగుబోతు కేకలుగానే భావించారు ఇరుగుపొరుగులు. మధ్యలో దూరితే తమను కూడా ఒక తప్పుడు కూతతో ఎదిరిస్తాడేమోనని సుధాకర్ పట్ల జంకారు. పరిస్థితి విషమించిన సంగతి అర్థమై నిమిషాల మీద పోగయ్యారు. వీధి వీధికి విషయం పాకి ఊరి ఆడవాళ్లంతా అక్కడ గుమికూడారు. కొందరు చింతపండు నీరు వగైరా తాపి ఆమె చేత కక్కిస్తూ ఉంటే, మరికొందరు ఆమె మొగుణ్ని గురించి ఆరా తీశారు. ప్రాణాలన్నీ కుటుంబం కోసమే ఖర్చుబెడుతూ ఉన్న ఆ పిల్లను పశువులా కొట్టి, ఆమెను చావుదాకా తీసికెళ్లిన అతని మీద కోపం పట్టలేకపోయారు.

"యాడుండాడో ఎతుకులాడండ్రా అడ్ని.." ఒకావిడ కేకలేసింది. అతని కోసం ఆడవాళ్లు ఊరంతా వెంపర్లాడారు. అతనిలాంటి మొగుళ్లు ఊర్లో చాలామందే ఉన్నారు. ప్రసన్నలాంటి పెళ్లాలు కూడా ఉన్నారు. అతని మీద యీరోజు ఏదొక చర్య తీసికోకుంటే అందరూ అతని దారిలోనే నడుస్తారు. అందుబాటులో బ్రాంది షాపు ఉండటం వల్ల అరకొర అలవాటున్నోడు కూడా తాగుబోతుగా మారాడు. ఒకరికొకరు తోడై సిగ్గుఎగ్గు లేకుండా తయారయ్యారు. తాగుబోతోళ్ల పెళ్లాలందరికీ ఆక్రోశం ముంచుకొచ్చింది. ఇంతకన్నా మంచి అవకాశం దొరకదు. ఒక్కన్నన్నా ఇరగదీస్తే మరొకనికి భయం పడుతుంది. అప్పటికే స్నేహితులు సమాచారం అందించినట్టుంది. సుధాకర్ ఊరు వదలి పారిపోయాడు.

అప్పటికప్పుడు ఆటో మాట్లాడి ప్రసన్నను పోరుమామిళ్లకు తీసికెళ్లారు గ్రామస్థులు. ఆమె వద్దంటోన్నా వినిపించుకోకుండా ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు.. ఆమె అమ్మానాన్నలు వచ్చారు. చుట్టుపక్కాలు వచ్చిపోతున్నారు. మళ్లీ రోజు సాయంత్రానికంతా ప్రమాదస్థితి నుంచి పూర్తిగా బైటపడింది ఆమె. ఆసుపత్రి ఖర్చులకు ఎవరు డబ్బులిస్తున్నారో తెలీదు. అమ్మానాన్నలు కూలి పనిచేసుకు బతికేవాళ్లు. అంతస్తోమత వాళ్లకు లేదు. అడిగితే "నీకెందుకులే.." అంటున్నారు. ఊర్లోవాళ్లే మనిషికింత వేసుకొన్నట్లుంది. కోలుకున్నాక తనే చెల్లించాలి. నాన్నకు పక్కూరి ముసలాయన ఎక్కడో తోడయ్యాడు. ఆయన మనవడు, పదవ తరగతి కుర్రాడు చెట్టుమీంచి కిందబడి చేయి విరిగిందట.

"ఈ కాలం పిల్లోలకు చెట్లెక్కడం, యీతగొట్టడం, కట్టెలు నరకడం యీ విద్దెలన్నీ యాడ తెలిసి ఏడ్చినయీ. ఎప్పుడూ బడులూ సదువులే.. ఎలక్కాయల కోసం సెట్టెక్కి.. యాన్నో కొసకొమ్మల్లో ఉండే కాయలు.. ఉత్త తొక్కుడు కొమ్మను నమ్ముకొని చిటారుకొమ్మలకు పోవాలంటే యాడయితది. పట్టుడు కొమ్మ కూడా బలంగా ఉండాల గద సేతిలో... పట్టుడుకొమ్మ సరిలేక, అది చేతిలో విరిగి, తొక్కుడు కొమ్మ మీంచి జారిపడె.. సెయ్యి ఇరగ్గొట్టుకొనే..' చెబుతున్నాడు ఆయన.

ప్రసన్న కూడా వింటూ ఉంది. వార్డులో టీవీ వల్ల కొంత పొద్దుబోతూ ఉంది. రాత్రి సంచలన వార్త ఒకటి ప్రసారమైంది. మగవాడి సంపాదనలో పది నుంచి ఇరవై శాతం గృహిణికి వేతనంగా నిర్ణయించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లుగా వార్త. దాని మీద చర్చా కార్యక్రమాలు. మహిళా సంఘాల హర్షాలు. మహిళలకు వేతనమేమిటీ? వీధికో బ్రాంది షాపు పెట్టి మగాళ్లనంతా దానికి బానిసల్ని చేసి పెళ్లాం బొడ్లో దోపుకొన్న కూలి రూకల్ని కూడా లాక్కుపోయేలా చేస్తోంది గదా ప్రభుత్వం! ఆడకూతుర్ల కంట ఇంతలావున కన్నీరు కార్పిస్తే ఆ ఉసురు ఊరకపోతుందా? ప్రసన్న కళ్లు తడితడిగా మారాయి మొగుణ్ని తలచుకొని.

పక్కూరి పెద్దాయన చెప్పినట్లు పట్టుడుకొమ్మ తొక్కుడు కొమ్మ చెట్టు ఎక్కేనోనికే కాదు. సంసారానికి కూడా అవసరమే. తొక్కుడు కొమ్మగా దృఢంగా ఉండాల్సిన మొగుడు ఆ బాధ్యతను వదిలేసినా కనీసం పట్టుడుకొమ్మగా అయినా ఆసరా ఉండాలి గదా! విరుచుకొని విసిరికొడితే సంసారం నేలగూలక తప్పదుగదా!

రెండ్రోజుల తర్వాత ఇంటికొచ్చింది ప్రసన్న. ఈ లోపు ఆడవాళ్లంతా ఊర్లో బెల్టుషాపు మీద దాడిచేసి సీసాలు పగులగొట్టి హెచ్చరించి వదిలారు. భార్య క్షేమంగా ఇంటికొచ్చిన విషయం సుధాకర్‌కు చేరవేసి అతన్ని రహస్యంగా ఊర్లోకి రప్పించుకొన్నారు మిత్రులు. మందుతాగే ఓ పెద్దాయన అతన్ని పిల్చి బాగా మందలించాడు.

"కాలాలు మారిపోయినయిరా కొడకా! తాడు బిర్రున పన్జరుపుకోవాలగాని యింగా బిగదీస్తే యిదో.. యిట్లా తాడే తెగిపోతది. ఇప్పట్నుంచి ఇంట్లో నీ బతుకు కుక్క బతుకే గద! అందరి మొగోళ్ల పరువు దీస్చివి... మొన్న నువ్వుగీన దొరికింటే ఆడోళ్లంతా కలిసి తిర్నాల్లో కుక్కను కొట్టినట్లు కొట్టిండే వాళ్లనుకో.. ఇప్పుడైనా వాళ్ల కండ్లబడితే ఊరకే వదల్రు.. మొగాన ఉమ్ముతారు.. ఎట్లనోకట్ల నీ పెండ్లాం కాళ్లో కడుపో పట్టుకొని మంచి జుసుకోపో.. మొగోళ్ల పరువు పోగొట్టగాకు.. మానంగా మర్యాదగా బతుకు.." అంటూ సలహా ఇచ్చాడు.

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
ఉపాధ్యాయుడు,
కడప, 94412 87865

జో అచ్యుతానంద.. జోజో ముకుందా!

తెలుగు భాషకు వెయ్యేళ్ల చరిత్ర... కాదు రెండు వేల ఏళ్ల చరిత్ర.... ఇలా అనేక వాదోపవాదాలు నేడు తెలుగునాడులో... అలాగే ఇతర ప్రాంతాల్లో జరుగుతున్నాయి. సరే భాష ఎప్పుడు పుట్టిందో... తెలుగు ఎలా పురుడు పోసుకుందో... దాని వికాసం, విస్తృతి, విక్రమం లాంటివి ఓ నిమిషం పక్కన పెడితే...

ఇప్పటి వరకూ లభించిన తెలుగు సాహిత్యంలో చిన్న పిల్లల కోసమే రాసినవి చాలా తక్కువగా దొరుకుతున్నాయి. పిల్లలకు లాలిపాటల దగ్గర్నుంచీ చూస్తే తేట తెనుగులో తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య రాసిన 'జో అచ్యుతానంద... జోజో ముకుంద... లాలి పరమానంద రామ గోవింద'తో పాటు 'చందమామ రావే... జాబిల్లి రావే' అంటూ... సాగే పాటలే తొలివిగా చెప్పొచ్చు. ఈ పాటలకు అదే పల్లవితో పలు ప్రాంతాల్లో సపాట (పేరడీ)లు పుట్టుకొచ్చాయి. ఇలాంటి పాటలు పాడుతూ ఎందరో తల్లులు తమ పిల్లలకు గోరుముద్దలు తినిపిస్తూ భాషను కూడా నేర్పారు.

'చందమామ రావే... జాబిల్లి రావే, కొండెక్కి రావే, గోగు పూలు తేవే... బండెక్కిరావే బంతిపూలు తేవే... రథమెక్కి రావే రంగుపూలు తేవే అన్నీ తెచ్చి అబ్బాయి కియ్యవే...'

అంటూ సాగే పాటలో ఎన్ని పదాలో... పిల్లాడికి అన్ని ముద్దలు... ఇలా తల్లి పిల్లాడికి తన ఒడిలోనే భాషా భోజనాన్ని కూడా తినిపిస్తుంది. అలాగే... అతన్ని జో కొట్టాలంటే 'జో అచ్యుతానంద జోజో ముకుందా... లాలి పరమానంద రామగోవింద... జోజో... తొలుత బ్రహ్మాండంబు తొట్టెగావించి... నాలుగు వేదములు గొలుసులమరించి' అంటూ ఈ బ్రహ్మాండాన్ని ఊయలగా చేసి, నాలుగు వేదాలను తాళ్లుగా వేసి తనబిడ్డకు పాట పాడుతూ వేదాలు నాలుగని, మనం ఈ బ్రహ్మాండంలో జీవులమని చెప్పకనే చెబుతుంది. ఇలా ఆయా ప్రాంతాల్లో తమకు తెలిసిన జ్ఞానాన్ని స్థానికతతో మేళవించి అక్కడి దేవుళ్లకు ముడిపెట్టి అన్నమయ్య సాహిత్యానికి తల్లులు పుట్టించిన సాహిత్యం అనంతం... కానీ ఇదంతా అలభ్యం... నీడలాంటి అమ్మ ఆలనను ఎందరు పిల్లలు పొందుతున్నారు? మరి మన పిల్లలకు అమ్మ అందించే కమ్మనైన తెలుగుదనం ఎలా తెలుస్తుంది?

సహజకవి బమ్మెరపోతన తెలుగులో భాగవతాన్ని తేలిక పదాలతో బాలలకు కూడా అర్థమయ్యే రీతిలో రాసి అజరామరుడిగా మిగిలిపోయాడు. మందార మకరంద మాధుర్యాన్ని, నిర్మల మందాకినీ వీచికల ఆహ్లాదాన్ని, లలిత రసాల పల్లవ రుచిని, పూర్ణ చంద్రుడి వెన్నెల చల్లదనాన్ని ఒలికిస్తూ తన 'పలికెడిది భాగవతమట, పలికించెడువాడు రామభద్రుండట, నే పలికిన భవహరమగునట, పలికెద వేరొండుగాథ పలుకగనేలా...' అంటూ పిల్లల నాల్కలపై ముద్దు ముద్దుగా జాలువారే పంచదార పాకంలాంటి సాహిత్యాన్ని అందించాడు. ఆయన సప్తమ స్కంధంలో బాల ప్రహ్లాదుడిచే పలికించిన పద్యాలు చెవులకు ఆహ్లాదాన్ని... పిల్లలకు మోదాన్ని పంచుతాయి. వారిలో భక్తిభావాన్ని పెంపొందించి... సన్మార్గ తీరాలవైపు అడుగులు వేయిస్తాయి.

దేవదేవుని చింతించు దినము దినము

చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు
కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు
తండ్రి హరిజేరు మనియెడి తండ్రి తండ్రి

అంటూ సాగే పద్యంతో మనిషి గమ్యాన్ని, చదువు లక్ష్యాన్ని, గురువు అర్హతను, కాలం విలువనూ తెలియజెప్పుతాడు.

ఇవన్నీ చిన్నతనంలో పిల్లలకు నేర్పించగలిగితే ఆహా... ఎంత తెలుగుదనం... మన సంప్రదాయంలోని ఉమ్మడి కుటుంబాలు... అమ్మమ్మలు, తాతలు.. వారు పిల్లలకు వినిపించే కథలు, పాటలు... వారి పక్కల్లో పిల్లల పక్కతడుపులు... అలాంటి పిల్లల పెంపకంలో వారు చెప్పే మెలకువలు... ఇవన్నీ కాలం అనే ప్రదర్శనశాలలో కరిగిపోయిన అనుభూతులు... మళ్లీ అలాంటి అనుభూతులను మనం వారసత్వంగా అందించగలిగితే భాష మన బిడ్డతోపాటే ఎదుగుతుంది. అతనితోనే వికసిస్తుంది...

ఇక పోతన తర్వాత తెలుగు పలువురి రాజుల ఆశ్రయంలో నిండు జవ్వనిలా హొయలొలికి, ఆ రాజుల పతనంతో కేవలం పండితుల ప్రబంధ సాహిత్యంలో బంధితమై... ఖండకావ్యంలో కుంచితమై... వేమన, బద్దెనల కాలాలకు చేరుకుంది. ప్రజాకవి వేమన కేవలం కందపద్యాలతో తన అనుభవాలనే ఇతివృత్తంగా అందరి నాల్కలపై అలరారేలా సృజియించిన శతక సాహిత్యం... తెలుగునాట ఓ విప్లవాన్ని తెచ్చింది. ముఖ్యంగా చిన్న పిల్లల్లో నైతికతను పెంచేదిగా ఈ సాహిత్యం రూపొందింది. ఓ నలభైఏళ్ల ముందు వరకూ కూడా (అంటే 1970వ దశకం వరకూ) ప్రతి పాఠశాలలో వేమన పద్యం వల్లెవేయించడం, ప్రతి ఇంటిలో పెద్దలు అనేక సందర్భాల్లో వేమన పద్యంలోని పంక్తులను ఉట్టంకిస్తుండటం జరుగుతుండేది. వేమనను ఓ ఆంగ్లేయుడు వెలికితీసే వరకూ ఆయన గొప్పతనం మనకు తెలియదు.

గంగిగోవు పాలు గరిటెడైనను చాలు..
కడవెడైననేమి ఖరముపాలు..
భక్తి గలుగు కూడు పట్టెడైనను చాలు
విశ్వదాభిరామ వినురవేమ

పనసతొనలకన్న పంచదారల కన్న
జుంటితేనెకన్న జున్నుకన్న
చెరకు రసముకన్న చెలిమాట తీపిరా..
విశ్వదాభిరామ వినురవేమ

చిత్త శుద్ధిలేని శివపూజలేలరా...
భాండశుద్ధిలేని పాకమేల...
ఆత్మశుద్ధిలేని ఆచారమదియేల...?

ఇలా వేమన చూపిన నీతి... పలికిన భాష ఇవన్నీ ఇంటి నుంచే పిల్లలకు ఎందరు నేర్పుతున్నారు? ఈ పద్యాల్లోని జుంటితేనెను ఎందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు తాగిస్తున్నారు?

వేమన దగ్గర్నుంచి అలా అలా కుంటుతూ... గెంతుతూ... ముక్కుతూ... మూలుగుతున్న భాషను కొత్త పుంతలు తొక్కించారు సీపీ బ్రౌన్, గురజాడ, కందుకూరి, గిడుగు లాంటి కొందరు మహానుభావులు. వ్యావహారిక భాష విజృంభణానికి వేసిన బాటలు తర్వాత దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, కొడవటిగంటి తదితరులు అందిపుచ్చుకున్నారు. భావి సారథులైన బాలలకు ప్రత్యేక సాహిత్యం వీరి కాలంలో పురుడు పోసుకుంది.

ఈ క్రమంలో గురజాడ 'ముత్యాలసరాలు' ఛందస్సుతో ముందడుగు వేశారు. ఆనాటి కన్యాశుల్కం, బాల్యవివాహ దురాచారంపై చిన్న పిల్లలకు కూడా అర్థమయ్యేలా తేలిక పదాలతో రాసిన 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' ఆధునిక బాల సాహిత్యంలో ఎక్కుపెట్టిన విచ్చుకత్తి... తర్వాత కాలంలో వచ్చిన భావకవిత్వం కేవలం ఊహాజనితమైన అమలిన శృంగారంతో కూడిన ఆదర్శ ప్రేమనే ప్రచారం చేసింది.

కానీ భావకవుల కోవకు చెందిన కృష్ణశాస్త్రి మాత్రం తన 'అమూల్యాభిప్రాయాల్లో' పిల్లల పట్ల, తనకుగల అభిమానాన్ని, వారి పాటల్ని, ఆటల్ని తాను పసిపిల్లాడై వివరిస్తుంటే... చదివే వారు కూడా ఆ ఊయల్లో ఊగిపోవాల్సిందే. అతని తర్వాత శ్రీశ్రీ మెరుపు మెరిసే, వాన కురిస్తే అది మీకే అని ఆనందించే 'కూనల్లారా... చిరుతల్లారా... ఉడుతల్లారా...' అంటూ పిల్లల్ని తన పదాల పల్లకిలో ఊరేగించారు.

ఇక అందర్నీ అత్యంత ప్రభావితం చేయగలిగే చలనచిత్ర రంగంలో పిల్లల కోసం వచ్చిన సినిమాలు ఎన్నో... పిల్లల కోసం వచ్చిన పాటలు కూడా అన్నే...

'తియ్య తియ్యని మాటలతో తీస్తారు సుమా గోతులు... నమ్మవద్దు' అంటూ 'ఖైదీకన్నయ్య' చిత్రంలో సుశీల పాడిన పాట. తర్వాత కాలంలో 'నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువ్వు మరవొద్దు... అంటూ 'కోడలు దిద్దిన కాపురం'లో సినారె రాసిన పాట, 'పిల్లలూ దేవుడు చల్లని వారే' అంటూ లేత మనసుల్లో ఆరుద్ర రాసిన పాట ఇలా... ఆణిముత్యాలు ఎన్నో.

నల్లపూసల నిగనిగలు

మంగళసూత్రం, నల్లపూసల దండ తదితరాలన్నీ ఇల్లాలి సౌభాగ్యానికి చిహ్నాలుగా భావిస్తారు. కానీ, మన వివాహ సంప్రదాయాల్లో ఇవి మొదటి నుంచీ లేవు. ప్రాచీన కవుల రచనలను పరిశీలిస్తే ఆ విషయం అర్థమవుతుంది. ఆదిలో తలంబ్రాలు మాత్రమే ఉండేవి. ఆ తర్వాత మంగళసూత్రాలు, నల్లపూసలు వచ్చాయి. తెలుగు సాహిత్యంలో తొలిసారి తెలుగింటి ఇల్లాలి కంఠసీమకు నల్లపూసలను అలంకరించింది... మాదయ్యగారి మల్లన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో ఉండే వారు. అల్లసాని పెద్దన, ముక్కుతిమ్మనలకు సమకాలీనులు. మల్లన రచించిన 'రాజశేఖర చరిత్ర'లో నల్లపూసల నిగనిగలు దర్శనమిస్తాయి.

సవిధకీర్ణపరాగాగ్ని సాక్షిగాగ -
దమ్మివిందు కరగ్రహణ మ్మొనర్ప
బొలుచు పద్మినికిని నల్లపూసదండ -
గట్టినాడన నెలదేటిగములు పొదలె

కోడూరి శ్రీనివాసరావు
ఉపసంపాదకుడు, ఈనాడు,
రాజమండ్రి, 94941 58032

అమ్మ సిగలో మరో కలికితురాయి

తెలుగు వెలిగింది. అంతర్జాతీయ వేదికపై మిరుమిట్లుగొల్పింది. విశ్వభాషల్లో మేటిగా వన్నెలీనింది. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన రెండవ ప్రపంచ లిపుల సదస్సులో... ద్వితీయ ఉత్తమలిపిగా ఎంపికై శాశ్వత కీర్తిని సముపార్జించుకుంది.

ఈ సదస్సును 'ది ఇంటర్నేషనల్ ఆల్ఫాబెట్ అసోసియేషన్' నిర్వహించింది. కొరియా భాష లిపి మొదటి స్థానంలో నిలిచింది. లిపి ఉన్న భాషలన్నింటిలోకి అత్యుత్తమైన దాన్ని ఎంపిక చేసేందుకు మొదటిసారిగా 2009లో ఈ సదస్సును నిర్వహించారు. అప్పట్లోనూ కొరియా లిపే ఉత్తమమైందిగా ఎంపికైంది. గ్రీకు, ఇటాలియన్ లిపులు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. తాజా సదస్సులో తెలుగు రెండో స్థానంలో నిలవగా, ఆంగ్లం మూడో స్థానాన్ని దక్కించుకుంది. అయితే... ఈ పోటీలను భవిష్యత్తులో నిర్వహించబోమని నిర్వాహకులు ప్రకటించారు. ఎందుకంటే, ఇప్పుడున్న ఏ భాష లిపి కూడా సమీపకాలంలో తన స్వరూపాన్ని మార్చుకునే అవకాశం లేదు కాబట్టి. దీన్ని బట్టి... ఇప్పుడు ఎంపికైన లిపులే అత్యుత్తమైనవిగా శాశ్వతకీర్తిని అందుకున్నట్లే!

ఉత్తమలిపిని గుర్తించడానికి కొన్ని అంతర్జాతీయ ప్రమాణాలున్నాయి.

1) లిపి సౌకర్యవంతంగా ఉండాలి.
2) వీలైనంతవరకూ ఉచ్చారణా విధేయంగా ఉండాలి.
3) వీలైనన్ని ధ్వనుల్ని రాయడానికి ఆ లిపి సామర్థ్యం కలిగి ఉండాలి.
4) నేర్చుకోవడానికి సులభంగా ఉండాలి.
5) ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి అనుకూలంగా ఉండాలి.
6) చూడ్డానికి అందంగా ఉండాలి.

ఈ ఆరు ప్రమాణాల్లో తెలుగుభాష ఒక సాంకేతిక విజ్ఞానానికి అనుకూలంగా ఉండటంలో మాత్రమే కొంత వెనుకబడి ఉంది. ఫలితంగానే మొదటి స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. 2012, అక్టోబరు 1 నుంచి 4వ తేదీ వరకు జరిగిన రెండవ ప్రపంచ లిపుల సదస్సులో 33 దేశాలకు చెందిన వారు పాల్గొన్నారు. మన దేశం నుంచి తెలుగు, కన్నడం, మలయాళం, బెంగాలీ, మరాఠీ, గుజరాతి, ఉర్దూ, పంజాబి తదితర భాషల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతినిధులందరూ తమ లిపుల విశిష్టతపై 30 నిమిషాల పాటు సదస్సులో పత్ర సమర్పణ చేశారు. వాటిని అమెరికా, ఇండియా, సూడాన్, శ్రీలంక, థాయిలాండ్, పోర్చుగల్ దేశాలకు చెందిన తొమ్మిదిమంది న్యాయమూర్తులు, 50 మంది పరిశీలకులతో కూడిన బృందాలు కూలంకషంగా పరిశీలించాయి. ఉత్తమ లిపులను ఎంపిక చేశాయి.

తెలుగు భాషకు ప్రతినిధిగా మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్... సదస్సుకు హాజరయ్యారు. తెలుగు లిపి పరిణామాన్ని, చరిత్రను అక్కడ ఆయన వివరించారు. తెలుగు అక్షరాల పరిణామక్రమాన్ని చిత్రాల ద్వారా ప్రదర్శించారు. తెలుగు లిపి అందంగా ఉండటమే కాకుండా, అనేక భాషలకన్నా ఎక్కువ ధ్వనులను రాయగలిగిన సామర్థ్యం కలిగి ఉందని చెప్పారు. ఉచ్చారణా విధేయమైన లిపి కలిగిన భాష అని సోపపత్తికంగా నిరూపించారు. తెలుగు పదాలు ఎక్కువ భాగం అచ్చులతో అంతమవడం వల్ల భాషకు అందం వచ్చిందన్నారు. అచ్చు, హల్లు ఒకదానితో ఒకటి కలిసి ఒకే అక్షరం ద్వారా సూచితం కావడం వల్ల రాతలో వర్ణాల సంఖ్య తక్కువగా ఉంటుందన్నారు. తెలుగు లిపిలో వర్ణాలు ఎక్కువగా కనిపించినా, ఒకేమాదిరిగా ఉన్న వర్ణాలు ఎక్కువగా ఉన్నందువల్ల నేర్చుకోవడం కష్టం కాదని, ఉచ్చరించినట్టే రాసే అవకాశం ఉన్నందువల్ల చాలా సులభంగా నేర్చుకోవచ్చని వివరించారు. తెలుగుపై సంపత్‌కుమార్ పత్రానికి మంచి స్పందన వచ్చింది. ప్రపంచ ప్రతినిధులందరూ మన అమ్మభాష గొప్పదనాన్ని, ఉచ్చరణ విధేయత లక్షణాలను ప్రశంసించారు.

అచ్చ తెలుగు సొగసును, సొబగును ప్రపంచానికి చాటిన మాడభూషి సంపత్‌కుమార్‌తో 'తెలుగువెలుగు' ముఖాముఖి...

తె.వె: ప్రపంచ లిపుల సదస్సుల ముఖ్యోద్దేశం ?

సంపత్: భాష మానవ మనోగతాన్ని వివరించడానికి పుడితే, లిపి దాన్ని శాశ్వతం చేయడానికి ఆవిర్భవించింది. అందుకనే దానికి అక్షరం అన్న పేరు స్థిరపడింది. అక్షరాలు రానివాళ్ల తమకు తెలిసిన దేన్నీ శాశ్వతంగా నిలుపుకోలేరన్న అభిప్రాయంతోనే ప్రజల్ని అక్షరాస్యుల్ని చేయాలన్న భావాన్ని తత్త్వవేత్తలు ప్రకటించారు. అయితే మాట్లాడినంత సులభంగా రాయడం సాధ్యం కాదన్న విషయం ప్రపంచంలో ఉన్న అక్షరాస్యుల శాతాన్ని బట్టి తెలుసుకోవచ్చు. క్రమంగా అక్షరాస్యుల సంఖ్య పెరుగుతూ ఉన్నప్పటికీ లిపిలోని అనేక అసౌకర్యాల వల్ల అక్షరాస్యులు కూడా లిపిని సరిగా రాయలేకపోతున్నారు. ఇది ప్రపంచంలోని అన్ని భాషల లిపులకూ ఉన్న సమస్యే. భాషా శాస్త్రవేత్తలు లిపిని సులభంగా నేర్పించడానికి అనేక మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ సాధ్యం కావడం లేదు. అక్షరాలే మరిచిపోయామని అప్పుడప్పుడూ కొంతమంది అంటూ ఉంటారు. ఎందుకంటే వాళ్లకు రాసే పని ఉండదు. ఉపయోగంలో లేకపోతే ఏదైనా నశించిపోతుంది. అలాగే లిపిని కూడా ఉపయోగించకపోతే జ్ఞాపకం నుంచి

తొలగిపోతుంది. లిపికి సంబంధించి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవడంలో భాగంగా ఇటీవల కొరియన్ వాళ్లు ప్రపంచ లిపుల సమ్మేళనాలు కూడా చేస్తున్నారు. ఇప్పటికి రెండు ప్రపంచ లిపుల సమ్మేళనాలు నిర్వహించారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వివిధ లిపులకు సంబంధించిన భాషా శాస్త్రవేత్తల్ని పిలిపించి ఆయా లిపుల లేఖన విధానాలపై పత్రాలు సమర్పింపజేసి, ఆయా లిపుల్లో ఉన్న ప్రయోజనాలను తెలుసుకొని ఆ ప్రయోజనాలను తమ లిపిలో సాధించాలన్నదే వాళ్ల ధ్యేయం. ఈ నేపథ్యంలో తెలుగు లిపికి ఉన్న సౌలభ్యం, తెలుగు లిపి చరిత్ర, పరిణామం మొదలైన అంశాలను దృష్టిలో పెట్టుకొని చూస్తే ప్రపంచంలో అనేక లిపులకు లేని గొప్పదనం తెలుగు లిపికి ఉందన్న విషయాన్ని మనం గమనించవచ్చు.

తె.వె: కొరియన్ లిపి అత్యుత్తమైనదిగా ఎంపికైంది కదా...

సంపత్: తెలుగుకు రెండో స్థానం రావడానికి కారణం... మన భాష లిపిలోని లోపాలు కాదు. ఆ లిపిని ఉపయోగించేవాళ్లు సాంకేతికంగా అభివృద్ధి చెందకపోవడమే. కొరియన్ లిపిని ఉపయోగించే ప్రజలు తమ లిపిలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి దాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేసుకున్నారు. ఉచ్చారణ విధేయతకు చాలా దగ్గరగా తీసుకొచ్చారు. అది చిత్రలిపి కాబట్టి అందంగా కూడా ఉంటుంది. తెలుగు లిపి అక్షర లిపి. గుండ్రంగా ఉండటం వల్ల అందంగా ఉంటుంది. ఇంగ్లీషు లిపి కూడా అందంగానే ఉంటుంది. అయితే అది ఉచ్చారణ విధేయతలో చాలా దూరంలో ఉంది. కొరియన్ లిపిలో ఆధునిక అవసరాలకు అనుగుణంగా చేస్తున్న మార్పులవల్ల, లిపికి సంబంధించిన చైతన్యం సామాన్య ప్రజల్లో కూడా కలుగజేస్తూ ఉండటం వల్ల అక్కడి ప్రజలు తమ లిపిని ఎంతో అభిమానంగా చూసుకుంటున్నారు, నేర్చుకుంటున్నారు. ఇటీవలి కాలంలో కొరియన్ ప్రజలు తమ లిపిని గురించి చాలా తీవ్రంగా ఆలోచించి, పాత పద్ధతుల్ని పక్కనపెట్టి లిపిలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. లిపి మీద సామాన్య ప్రజలకు కూడా అవగాహన కల్పించడానికి వాళ్లు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. దేశమంతా రోడ్ల మీద కొరియన్ లిపి కనిపించే విధంగా బోర్డులు పెట్టారు. ఎవరైనా కొత్తవాళ్లు వచ్చినా కొరియన్ లిపి నేర్చుకోవడానికి అనువుగా ఉండేట్లు అచ్చులు, హల్లులు రాసిన పలకలు అమర్చారు. దీనివల్ల చిన్నపిల్లలు, పెద్దలు ప్రతిరోజూ తమ అక్షరాలను చూసుకొంటూ మురిసిపోవడంతోపాటు మరచిపోకుండా ఉంటారు. తెలుగువాళ్లు కూడా అలా చేయగలిగితే ప్రపంచంలోనే తెలుగులిపి అగ్రస్థానంలో నిలవగలదన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు.

తె.వె: ఉచ్చరణ విధేయ పరంగా మన భాషకు ఇతర భాషలకూ ఉన్న తేడా ఏంటి?

సంపత్: తెలుగులిపి ప్రపంచంలోని అనేక లిపుల కన్నా అనేక విధాలుగా ఉత్తమమైందన్న దాంట్లో సందేహం లేదు. లిపి ప్రధాన ధ్యేయం మాట్లాడినట్టు రాయడానికి ఉపయోగపడాలి. అంటే ఉచ్చారణా విధేయంగా ఉండాలి. ప్రపంచంలో ఏ భాషకూ పూర్తిస్థాయి ఉచ్చారణా విధేయమైన లిపి లేదు. అంటే ఏ లిపీ సమగ్రమైంది కాదని అర్థం. అయితే ఆయా భాషా ప్రజలు తమ లిపిలోని లోపాల్ని అర్థం చేసుకొని తదనుగుణంగా ఉపయోగించుకోవడం జరుగుతోంది. అంటే లోపాల్ని సవరించుకోవడానికి బదులు లోపాలను అలాగే ఉంచుకొని తామే లిపికి అనుకూలంగా మారుతున్నారు. ఇందుకు ఏ భాషా మినహాయింపు కాదు. చివరకు భాషా శాస్త్రవేత్తలు ప్రపంచంలోని అన్ని భాషలకూ సమానంగా తయారు చేసిన 'ధ్వని విధేయ లిపి' కూడా మినహాయింపులతోనే అన్ని ధ్వనుల్ని ప్రకటించగలుగుతుంది. ఇక సాధారణ లిపుల్ని గురించి చెప్పనవసరం లేదు. ప్రపంచంలోని ఈ లిపులన్నిటిలోనూ తెలుగులిపికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. అనేక భాషలకన్నా కూడా తెలుగు లిపిలో ఎక్కువ ధ్వనుల్ని రాయడానికి అవకాశం ఉంది. భారతదేశంలోని అన్ని భాషలూ ఒకే లిపి నుంచి పుట్టినప్పటికీ మిగిలిన భాషలు కొన్ని ధ్వనుల్ని నిర్లక్ష్యం చేయడం లేదా అనేక ధ్వనుల్ని ఒకే వర్ణంతో సూచించడానికి ప్రయత్నించడం లాంటి ప్రయత్నాలు చేయడం వల్ల వాటిల్లో కొన్ని ధ్వనుల్ని సూచించడానికి లేఖన పద్ధతి లేకుండా పోయింది. ఇందుకు దేవనాగరి లిపి కూడా మినహాయింపు కాదు. దేవనాగరి లిపి కన్నా ఎక్కువ ధ్వనుల్ని రాసే సామర్థ్యం తెలుగు

రోగాలను హరించే రేగుపళ్లు



బదరికావనంలో నరనారాయణులు తపస్సుని ఆచరించారని ప్రతీతి. ఆ సమయంలో తమ ఆకలిని తీర్చుకోవడానికి తిన్నవే బదరీ ఫలాలు. అవే భోగి పళ్లు! లేదా రేగు పళ్లు. భోగినాడు ఇంట్లోని చిన్నారులను కూర్చోబెట్టి, వారిపై రేగుపళ్లు, బంతి పూలరేకులు, చిల్లర కలిపి తలంబ్రాల్లా పోస్తారు. తర్వాత ఆ పళ్లను పంచిపెడతారు. రేగుపళ్లకి ఆయుర్వేదంలో ఓ ప్రత్యేకత ఉంది. దృష్టిదోషాలను, ఉదరసంబంధ వ్యాధులను పరిహరించే ఔషధంగా పరిగణిస్తారు. జీర్ణవ్యవస్థకి కూడా ఇది మేలు చేకూరుస్తుంది. చైనా, కొరియా వంటి దేశాల్లో సైతం రేగుపళ్లను దివ్యౌషధంగా భావిస్తారు. పండిన రేగుపళ్ల వాసన మనసుకి ఆహ్లాదాన్ని కలిగిస్తే, వాటితో ఆడుకునే చిన్నారుల కేరింతలు సంతోషాన్ని ఇనుమడింపజేస్తాయి.

లిపికి ఉంది. మొదటి నుంచీ కూడా తెలుగు లిపి అక్షరాల్ని పెంచుకోవడానికి తప్ప తగ్గించుకోవడానికి ప్రయత్నించలేదు. తమిళంలో ఎన్నో ధ్వనుల్ని రాయడానికి వీలులేదు. పరిమితమైన లిపితో అపరిమితమైన ధ్వనుల్ని రాయడానికి పూనుకోవడం వల్ల ఉచ్చారణా విధేయంగా లేకపోవడమే కాకుండా, అపఉచ్చారణలు ఎక్కువైపోయాయి. ప్రాచీన కాలంలో ఉన్న లేఖన పద్ధతుల్నే ఆధునిక కాలానికి కూడా అనువర్తించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది.

తె.వె: అన్య భాషల పదాలను రాసేందుకు మన లిపే ఉత్తమమైనదా?

సంపత్: ఆధునిక కాలంలో అనివార్యంగా అనేక భాషల నుంచి పదాలను తీసుకోవలసి వస్తోంది. అయితే వాటిని సమగ్రంగా రాయడానికి కావలసిన లిపి మాత్రం లేకుండా పోయింది. ఈ పరిస్థితి చాలా భాషలకుంది. తెలుగు లిపి మాత్రం ఇందుకు మినహాయింపు. తెలుగులో కూడా పూర్తిగా అన్ని ధ్వనుల్ని రాయలేకపోయినా, మిగిలిన ప్రపంచ భాషలతో పోల్చినప్పుడు తెలుగు లిపి ఎంతో ఉన్నత స్థాయిలో ఉందన్న విషయాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. మనమే కాదు ప్రపంచంలో లిపి విజ్ఞానంతో పరిచయం ఉన్న వాళ్లందరూ కూడా ఈ విషయాన్ని అంగీకరిస్తున్నారు. ప్రపంచంలో అతి ప్రాచీనమైన భాషగా ప్రచారంలో ఉన్న తమిళం, అత్యంత ప్రాధాన్యం ఉన్న భాషగా చెలామణీ అవుతున్న ఇంగ్లీషు (రోమన్) లిపులతో పోల్చినప్పుడు తెలుగులిపి ఉన్నతత్వాన్ని చూసి ప్రపంచంలోని భాషా శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

తె.వె.: తెలుగులో ఉన్న 56 అక్షరాలన్నింటి వల్ల ఉపయోగం లేదు.. వాటిలో కొన్నింటిని తీసివెయ్యాలన్న వాదనలు వస్తున్నాయి..

సంపత్: తెలుగువాళ్లు తెలుగు లిపికి సంబంధించి చైతన్యం పొందాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. తెలుగు లిపి అక్షరాలు ఎక్కువ అన్నది అందులో మొదటిది. పాశ్చాత్య భాషా శాస్త్రవేత్తలు ఎక్కువ అక్షరాలు ఉండటాన్ని అతిశయంగా భావిస్తున్నారు తప్ప లోపంగా భావించడం లేదు. ఇంగ్లీషు భాషకున్న లోపం అదే అన్నట్లు వాళ్లు చెబుతున్నారు. నిజానికి ఇంగ్లీషులో కూడా అక్షరాలు తక్కువేమీ కాదు. ఎందుకంటే ఇంగ్లీషులో నాలుగు రకాల అక్షర క్రమాలున్నాయి. అవన్నీ నేర్చుకొంటే తప్ప మనం ఇంగ్లీషు లిపిని అన్ని సమయాల్లోనూ ఉపయోగించలేం. మొదటి ఏబీసీడీ, రెండో ఏబీసీడీ, మూడో ఏబీసీడీ, నాలుగో ఏబీసీడీ - ఈ నాలుగింటిలో కనీసం రెండైనా నేర్చుకొంటేగానీ ఇంగ్లీషు లిపిలో రాయడం కుదరదు. 'ఎ ఇ ఐ ఒ యు' అన్న నాలుగు అచ్చులు ఒకేచోట ఉండవు. అవి అచ్చులని కూడా అందరికీ తెలియవు. ఈ అచ్చుల ఉచ్చారణ అన్నిచోట్ల ఒకేమాదిరిగా ఉండవు. ఒక్కో అచ్చుకు అనేక ఉచ్చారణలుంటాయి. అందువల్ల వాటిని ఎప్పుడు ఏ విధంగా పలకాలో తెలియదు. ఈ లోపాల్ని ప్రపంచంలో ఇంగ్లీషువాళ్లు తప్ప మిగిలిన భాషీయులందరూ గుర్తించారు. లోపాలతో సర్దుకునిపోవడం అలవాటయినందువల్ల ఇంగ్లీషువాళ్లకు వాటిని గురించి పెద్దగా పట్టింపులేదు. ఇంగ్లీషు నేర్చుకొనే ఇతరులు లోపాల వల్ల ఆ భాష నేర్చుకోవడం కష్టంగా ఉన్నా, అవసరార్థం దాన్ని గుడ్డిగా నేర్చుకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇంగ్లీషు ద్వారా ఆలోచించడం వల్ల ఇంగ్లీషు లిపినే కంప్యూటర్ విజ్ఞానానికి ఉపయోగించడం వల్ల కంప్యూటర్‌కి ఆ భాష బాగా నప్పింది. అంతకుమించి ఇంగ్లీషు లిపికి ఉన్న సౌకర్యం లేదు. ఇలా ఇంగ్లీషు లిపితో ఉన్న అనేక కష్టాలను ప్రపంచంలోని ఇతర భాషలు మాట్లాడేవాళ్లు ఏకరవు పెడుతూనే ఉన్నారు. కానీ ఆ భాషమీద ఉన్న మోజువల్ల పెడచెవిన పెట్టేవాళ్లే ఎక్కువమంది. ఇంగ్లీషు భాషలో మొత్తం 22 లోపాలున్నట్లు పాశ్చాత్య భాషా శాస్త్రవేత్తలు గుర్తించారు. తెలుగు లిపికి అన్ని లోపాలు లేవు. కేవలం ఒత్తులు ఒక క్రమంలో కాకుండా కొన్ని కింద, కొన్ని పైన, కొన్ని పక్కన రాయడంలాంటి కొన్ని మాత్రమే ఉన్నాయి. ఇక్కడివాళ్లు మాత్రమే తెలుగు లిపికి అక్షరాలు ఎక్కువ అన్న విషయాన్ని ప్రధానమైన లోపంగా చెబుతూ, అక్షరాలను తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే అవసరం లేని అక్షరాలు వాటంతట అవే నశించిపోతాయన్న విషయాన్ని తెలుగు లిపిలో లోపించిన అక్షరాలు ఇప్పటికే నిరూపించాయి. అచ్చుల్లో 'ఌ'కి పూర్తిగా ప్రయోగాలు లేనందువల్ల అది నశించిపోయింది. 'ఋ ౠ'ల్లో రెండోదానికి ప్రయోగాలు లేవు. మొదటిదానికి 'రు' ఉచ్చారణే ఉండటం వల్ల దాని ప్రయోగం కూడా తగ్గిపోతోంది. హల్లుల్లో 'ఱ' ఉచ్చారణకు 'ర' ఉచ్చారణకు భేదాన్ని గుర్తించలేనందువల్ల 'ఱ' లోపించింది. ఈ లోపించిన అక్షరాల వల్ల తెలుగు లిపికి నష్టమేమీ లేదు. ఏ ఇతర భాషల్లోనూ ఇలా అక్షరాలు లోపించడం లేదు. ఇంగ్లీషులో ఒక పదంలో ఒక అక్షరం అవసరం లేకున్నా ఆ అక్షరం ఆ పదంలో కొనసాగుతూనే ఉంటుంది. కానీ తెలుగులో ఆ అక్షరం భాషలో నుంచే లోపించిపోతోంది. తెలుగువాళ్లు అక్షరాలను నేర్చుకొనేటప్పుడు, నేర్పించేటప్పుడు స్వల్పభేదం ఉన్న అక్షరాలను గుర్తించి వాటిని ఏకాక్షరాలుగా నేర్పితే అక్షరాల సంఖ్య తక్కువగా కనిపిస్తుంది. ఆ అక్షరాల వల్ల ఉన్న ప్రయోజనాన్ని పొందవచ్చు. 'ర-ఱ'లు, 'ధ, దధ'లు, 'నస'లు, 'పవ'లు, 'మయ'లు మొదలైనవాటిని ఒకేసారి నేర్పించడం వల్ల వాటిమధ్య ఉన్న సామ్యాన్ని తెలుసుకోవడం వల్ల సులభంగా నేర్చుకోవచ్చు. అలాగే ఇటీవల కొంతమంది మహాప్రాణాల్ని పలకలేకపోవడం వల్ల వాటిని తీసెయ్యాలని అంటున్నారు. తీసేయడం చాలా సులభం. కానీ కలపడం అసాధ్యం. ఇప్పటికీ తెలుగులో కొన్ని ధ్వనుల్ని రాయలేం. వాటికి అక్షరాలను కలపాలంటే సాధ్యమయ్యే పనికాదు. తమిళ, ఇంగ్లీషు భాషా లిపుల్లో ఎన్నో అక్షరాలను కలపాలని ఆ భాషా శాస్త్రజ్ఞులు ప్రయత్నించి విఫలమయ్యారు. తమిళంలో బలవంతంగా కలిపిన అక్షరాల్ని కూడా ఉపయోగించడం లేదు. అందువల్ల నేర్చుకోవడంలో సులభమైన పద్ధతుల్ని

చిత్రాలు: కుమరేశ్

అవలంబించడం లేదా కష్టపడి నేర్చుకోవడం, బాగా అభ్యాసం చేయడం లాంటి విషయాలపై శ్రద్ధ చూపించాలి తప్ప, తీసేయడం అనే అంశం మీద శ్రద్ధ చూపించకూడదు.

తె.వె.: తెలుగును నేర్చుకోవడానికి, తెలుగులో రాయడానికి తెలుగు వారే ఆసక్తి చూపట్లేదు. ఎందుకు?

సంపత్: తెలుగు లిపిని ఇతర భాషస్థులు సులభంగా నేర్చుకోగలుగుతున్నారు. కానీ తెలుగువాళ్లు మాత్రం చాలా కష్టపడుతున్నారు. 17వ శతాబ్దం ఆరంభం నుంచి తెలుగులిపిని నేర్చుకొన్న విదేశీయులందరూ తెలుగులిపి గొప్పతనాన్ని మెచ్చుకొన్నవాళ్లే తప్ప, ఎవరూ ఈ లిపి సరిగా లేదనో, కష్టంగా ఉందనో చెప్పలేదు. షూల్జ్, ఎల్లిస్, సి.పి.బ్రౌన్ మొదలైనవాళ్లంతా మన లిపిని గురించి ఎంతో మంచి అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. ఆ కాలంలో మద్రాసు సెయింట్ జార్జ్‌కోటలో ఉన్న కళాశాలలో విదేశీయులందరూ ఏదో ఒక భారతీయ భాషను నేర్చుకొనేవాళ్లు. తమిళం నేర్చుకోవాలని చేరిన చాలామంది అది నేర్చుకోవడం కష్టమని, తెలుగు సులభంగా నేర్చుకోవచ్చని దాన్ని వదిలిపెట్టి దీన్ని నేర్చుకొన్నవాళ్లున్నారు. ప్రస్తుతం విదేశాల నుంచి వచ్చిన తెలుగు లిపిని నేర్చుకొంటున్నవాళ్లు కూడా ఈ లిపి ఎంతో సులభంగా ఉంది, చెప్పినట్లు రాసే సౌకర్యం ఈ లిపిలో తప్ప మా లిపుల్లో కనిపించడం లేదని స్పష్టంగా చెబుతున్నారు. అయితే తెలుగువాళ్లు అందుకు విరుద్ధంగా ఆలోచిస్తున్నారు.

తె.వె.: మన భాషను సురక్షితం చేసుకోవాలంటే ఏం చేయాలి?

సంపత్: తమిళుల నోట సాధారణంగా ఒక మాట వినిపిస్తూ ఉంటుంది. 'మాకుగానీ అంత జనాభా, అలాంటి లిపి, అలాంటి మాధుర్యం ఉంటే' అని అంటూ ఉంటారు. అంటే తెలుగు జనాభా అంత జనాభా, తెలుగు లిపిలాంటి సమర్థమైన లిపి, తెలుగు భాషలాంటి మధురమైన భాష ఉంటే ఇంకా ఎన్నో సాధించగలిగేవాళ్లం అన్నది వాళ్ల భావం. అవన్నీ ఉన్న తెలుగువాళ్లు దాన్ని గుర్తించడం లేదు, గుర్తించినా సాధించిందేమీ లేదు. భాషకు సంబంధించిన చైతన్యం, లిపికి సంబంధించిన అవగాహన, సాహిత్యానికి సంబంధించిన అభిమానం, సంస్కృతికి సంబంధించిన ఆదరణ, ఆచారాలకు సంబంధించిన ఆచరణ ఉంటేగానీ ఏ జాతి తన ప్రత్యేకతను నిలబెట్టుకోలేదు. ఇవన్నీ ఉన్నప్పుడు మిగిలిన రంగాల్లో కూడా సులభంగా అభివృద్ధి చెందవచ్చు. జపాన్, దక్షిణ కొరియాలాంటి దేశాలు అనతికాలంలో అంత అభివృద్ధి సాధించడానికి మూలకారణం ఇదే. మనది అన్నదాన్ని మనం పోగొట్టుకోకపోతే, మిగిలినవన్నీ కూడా మనదగ్గరికి వాటంతట అవే వచ్చి చేరుతాయి అన్న సూత్రం భాషకు, లిపికి కూడా వర్తిస్తాయి.

- తెలుగువెలుగు బృందం

సహకారం: మహ్మద్ షరీఫ్, ఈనాడు, చెన్నై

కనులారా కనుమ

కనుమను పశువుల పండుగ అని అంటారు. పంటలు పండేందుకు రైతులకు ఎడ్లు చేసే సాయం గొప్పది. ధాన్యాన్ని గాదెలకి తెచ్చే ఎద్దుల చిరుగంటల సవ్వడి రైతులకి శుభసూచకం. అందుకే కృతజ్ఞతగా ఆ రోజున వాటిని శుభ్రం చేసి, అలంకరించి, పూజలు చేస్తారు. దూడల మెడలకీ, కాళ్లకీ చిరుగజ్జెలు కడతారు. ఎద్దు కొమ్ములకు పసుపు కుంకుమలను రాసి ఊరేగిస్తారు. కొన్నిచోట్ల ఎడ్లపందాలూ జరుగుతాయి. శీతాకాలంలో మినుములు ఒంటికి వేడినిస్తోందని ఆయుర్వేదం చెబుతోంది. అందుకే 'కనుమ నాడు మినుములు తినాలన్న' నానుడి బలపడింది. అందుకే ఇంటికి వచ్చిన చుట్టాలు కనుమనాడు బయల్దేరకూడదంటారు పెద్దలు. అలా వచ్చిందే 'కనుమనాడు కాకి కూడా కదలదన్న' సామెత.

2013లో తెలుగు నెలలు

ఆంగ్ల సంవత్సరం సౌరమానాన్ని అనుసరించి ఉంటుంది. కాబట్టి ప్రతి ఏడూ తెలుగు మాసాల తేదీలు మారుతూ ఉంటాయి. తెలుగు మాసాలన్నీ కలిపినా 365 రోజులకి కొంచెం తక్కువ అవుతాయి. ఆ మిగులు రోజులను భర్తీ చేస్తూ కొన్ని సంవత్సరాలకు ఓసారి అధికమాసం వస్తుంది. ఉదాహరణకు 2012లో అధికమాసం వచ్చింది, తిరిగి 2015లో వస్తుంది. మనం చాంద్రమానాన్ని అనుసరిస్తాం. అందుకే ఈ తేడా!

తెలుగునెలలు	2013లో ఆంగ్లనెలలు
మార్గశిరం	డిసెంబరు 14, 2012 - జనవరి 11
పుష్యం	జనవరి 12 - ఫిబ్రవరి 10
మాఘం	ఫిబ్రవరి 11 - మార్చి 11
ఫాల్గుణం	మార్చి 12 - ఏప్రియల్ 10
చైత్రం	ఏప్రియల్ 11 - మే 9
వైశాఖం	మే 10 - జూన్ 8
జేష్ఠం	జూన్ 9 - జులై 8
ఆషాఢం	జులై 9 - ఆగస్టు 6
శ్రావణం	ఆగస్టు 7 - సెప్టెంబరు 5
భాద్రపదం	సెప్టెంబరు 6 - అక్టోబరు 5
ఆశ్వయుజం	అక్టోబరు 6 - నవంబరు 3
కార్తీకం	నవంబరు 4 - డిసెంబరు 2

తెలుగు సంవత్సరం చైత్ర మాసంతో ప్రారంభమవుతుంది. పాఠకుల సౌలభ్యం కోసం ఆంగ్ల సంవత్సరానికి అనుగుణంగా, ఈ వరుసని జనవరి నెలనుంచి ఇచ్చాం.

ఖర్చులే పండుగా

“ఈ పండక్కి నాకు ఓపిక లేదండీ. ఏ పిండి వంటలూ చేయలేను. పిల్లలకి కావాల్సినవి తీసుకుని వచ్చేయండి” రాధ ముందే తేల్చి చెప్పేసింది.

“అదేమిటి, అరిసెలూ అవీ చేయవూ, పిల్లలేం తింటారూ.. ఇంటికి వచ్చిన వాళ్లకేం పెడతాం!” అంటూ రామారావు తనకిష్టమైన వంటకాన్ని పిల్లల వంకతో అడగకనే అడిగాడు.

“ఏమో బాబూ, నేను గంటలు గంటలు కూచుని చేయలేను. నడుం నొప్పి వస్తోంది. ఇంత కష్టపడి చేస్తే మీ పిల్లలు ఒక్కరోజు తిని తర్వాత దాని మొహం కూడా చూడరు. అయినా చేసినా, కొన్నా ఒకటే ఖర్చు అవుతుంది. ఒళ్లు హూనం చేసుకోవడం తప్ప ఏమీ ఉండదు” అంది.

“అలా అంటావేంటే, వాడు అన్ని రకాల నూనెలు వేసి చేస్తాడు. ఆరోగ్యం చెడిపోదూ, అయినా ఇంట్లో చేస్తే ఆ రుచే వేరు” అన్నాడు.

“ఆ! చాల్లెండి ఛాదస్తం. అంత సుకుమారంగా ఉన్నాం కాబట్టే ఏమీ పడవు మనకి. అన్నీ అలవాటు చేసుకుంటే సరి. ఏమైనా సరే. తింటే తినండి, లేకపోతే మానెయ్యండి. కానీ ఈ పిండి వంటల పనులు మాత్రం నా వల్ల కాదు” అని చెప్పేసింది.

“సరేలే ఇంకా పది రోజులు ఉందిగా. అప్పటి సంగతి చూద్దాంలే” అంటూ సరిపెట్టాడు.

ఆఫీసుకి టైం అయిపోవడంతో హడావిడిగా ఆఫీసుకి బయల్దేరాడు రామారావు.

* * *

ఆఫీసుకి వెళ్లీవెళ్లడంతోనే పనిలో పడ్డాడు. సునీతగారికి బ్యాంకుకు వెళ్లేపని చూసుకోమని చెప్పేంతలోనే ఆవిడ ముందే చెప్పేసింది.

సాయంత్రం గంటముందే వెళ్తాను, అనుమతి కావాలని.

పండక్కి పిల్లలకి బట్టలు కొనడానికి వెళ్లాలని, వాళ్లాయన నాలుగ్గంటలకల్లా వచ్చి తీసుకెళ్తాడని చెప్పింది. తన పిల్లలకి కూడా పండక్కి బట్టలు కొనాలనే విషయం గుర్తొచ్చింది రామారావుకి.

రేపో ఎల్లుండో వెళ్లాలనుకుంటూ పనుల్లో పడ్డాడు. పండుగలన్నా, సాంప్రదాయాలన్నా ఎంతో ఉత్సాహపడేవారిలో రామారావు ముందు వరుసలో ఉంటాడు. అందుకే పాపం పది రోజుల ముందు నుంచే పండగ.. పండగ అని పాట పాడుతూ ఉంటాడు. అందులోనూ పెద్ద పండుగ ‘సంక్రాంతి’ అంటే మరీ హడావిడి పడుతూ ఉంటాడు.

రొటీన్‌కి భిన్నంగా ఉండేందుకు, మన సంస్కృతి, సంప్రదాయాలు నిలుపుకోవడానికి పండుగలను నిత్యనూతనంగా జరుపుకోవాలంటాడు.

చిన్నప్పటి పండుగ రోజులు గుర్తు తెచ్చుకుంటూ అందులో సగం ఆనందమైనా పొందడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు. పండుగ గురించి ఎవరైనా ఉదాసీనంగా మాట్లాడితే ఒప్పుకునేవాడు కాదు.

“పండక్కి కొత్త బట్టలు కొన్నారా పిల్లలకి” అని అడిగితే “ఆ! లేదండీ. అయినా పండగని ఏముంది, ఎప్పుడూ కొంటూనే ఉంటాం. ప్రత్యేకంగా పండుగకని ఏముంది” అని చెప్పేవాళ్లు ఎక్కువవతున్న రోజుల్లో ఇంకా పండుగ కోసమే బట్టలు కొనడం పాతపద్ధతి అని అందరికీ అనిపించినా, రామారావులాంటి వాళ్లకి పండుగ ఎప్పుడూ ప్రత్యేకమే.

“మీలాంటి అతి ఉత్సాహవంతుల వల్లే బట్టల షాపుల వాళ్లందరూ పండుగ పేరుతో బాగుపడుతూ ఉంటారు” అంటుంది అతని భార్య రాధ కూడా.

ఇలాంటి మాటలే ఆఫీసులోనూ వింటూంటాడు రామారావు.

“ఊరివాళ్లలాగా ఏం పండుగలండీ, మీరన్నట్టు రొటీన్‌కి భిన్నంగా ఉండేందుకు పార్టీలవీ హాజరవుతూనే ఉంటాం కదా!” అంటుంది వాణి.

“మన సంప్రదాయం, సంస్కృతి కొంచెమైనా తెలుస్తాయా అందులో, అందినకాడికి ఐస్‌క్రీం తినడం తప్ప పిల్లలకి ఈ పార్టీలో ఏం తెలుస్తుంది?” అంటాడు రామారావు.

‘ఏం సంప్రదాయం లెండి, కేజీ చింతపండుతో ఇత్తడి బిందెలు తోమి అటక మీద బోర్లించడమూ, ఇల్లంతా దులిపి కడిగించడమే మీ ఊర్లలో పండుగంటే’ అని వెక్కిరిస్తూ ఉంటారు.

“నేనయితే పండుగలన్నీ సెలవురోజుగానే తీసుకుంటాను. ఇంకా ఆలస్యంగా లేవాలనిపిస్తుంది” అంటుంది మాధవి.

“మీకు ఆ ఆనందాలు తెలియవు కాబట్టి ఇలా మాట్లాడుతున్నారు. ఆ రోజుల్ని తలచుకుంటేనే ఎంత ఆనందంగా ఉంటుందో” అంటూ పాతరోజుల్లోకి వెళ్లిపోయాడు రామారావు.

“రామారావుగార్ని ఎవరు కదిపారు? ఆయన్ని చూడండి ఎంత ఉద్రేకపడుతున్నారో!” అంటూ నవ్వుకుంటారంతానూ...

* * *

“పండుగ దగ్గరకొస్తోంది, పిల్లలకి బట్టలు తీయొద్దూ” అని అడిగాడు ఆఫీసుకి వెళ్లబోతూ హఠాత్తుగా గుర్తొచ్చిన రామారావు.

“సర్లెండీ, రెడీమేడ్‌వేగా, ఎంతసేపు కొనాలి. తొందరేముంది.” అంది రాధ.

“అలా అంటావేంటి అన్నిటికీ, బట్టలు కొంటే అవి చూసుకుని పిల్లలు సంతోషపడుతూ ఉంటారు కదా!” అన్నాడు కాస్త విసుగ్గానే.

“చాల్లెండి, పాతకాలం కబుర్లు మీరూనూ. కొత్తబట్టలు మొహం చూడని వాళ్లలాగా” అంది



అంతే విసుగ్గా.

"ఎన్నిసార్లు కొత్తబట్టలు కొనుక్కున్నా ఎప్పటి ఆనందం అప్పటిదే. ఎందుకు ఎప్పుడూ స్తబ్దుగా ఉంటావు. నీలాగే పిల్లల్నికూడా తయారు చేస్తావా!" అంటూ కొంచెం కోప్పడ్డాడు.

"ఆс! మీకు తగ్గవాళ్లే మీ పిల్లలు. నాలా ఎందుకవుతారూ!" అంటూ సాగదీసింది.

"సరే! కానీ బట్టల సంగతేమిటి? నువ్వు కూడా కొనుక్కుంటావా!" ఆశపెడుతూ అడిగాడు.

"నాకేం వద్దు బాబూ. పండుగలంటేనే ఖర్చులు. పిల్లలకి తీయండి చాలు" అంది.

"పండుగలంటే ఖర్చులు కాదు. వట్టిరోజుల్లో వృధాగా పెట్టే ఖర్చులకంటే పండగకు పెట్టే ఖర్చుకి సార్ధకత ఉంటుంది" అన్నాడు.

"సరేలెండి, వితండవాదం చేయడానికి నాకు సమయం లేదు. మీకూ సమయమవుతోంది బయలుదేరండి" అని తొందరపెట్టింది.

* * *

ఆఫీసుకెళ్లడంతోనే అంతా రామారావు వంకే చూసి నవ్వుకోవడం గమనించాడు. ఏమీ అర్థంకాక ఆగలేక అడిగేశాడు కూడాను.

"ఏమిటండీ, ఒకటే నవ్వుకుంటున్నారు. నాకేం అర్థం కావడం లేదు" అని.

"ఏమీ లేదయ్యా, పత్రికలో ఏదో రాశారట. నీలాంటి వాళ్ల గురించేనని నవ్వుకుంటున్నారంతాను" అని చెప్పాడు నరసింహంగారు.

మళ్లీ అతని కుతూహలం చూసి ఆయనే "ఎవరో గార్డెన్స్ వాళ్లు ఆ మధ్య కార్తీకమాసంలో వనభోజనాలు అవీ ఏర్పాటు చేసినట్టు సంక్రాంతికి ఏదో పండుగ తాయిలం ప్రకటన ఇచ్చారట. అది చూసి నవ్వుకుంటున్నారు" అని చెప్పాడు. ఎవరి దగ్గరో ఆ పత్రిక తెచ్చుకుని చదవడం మొదలుపెట్టాడు రామారావు.

ఆ ప్రకటనలో సారాంశం ఇలా ఉంది.

"పల్లెటూర్లని వదిలి వచ్చేశామని పల్లెటూరి వాతావరణానికి దూరమైపోయామని బాధపడే వారందరికీ ఓ చక్కటి అవకాశం - మన భాగ్యనగర శివార్లలోనే చక్కటి పల్లెవాతావరణాన్ని నెలకొల్పి ఉదయంనుంచి సాయంత్రం వరకు అలరించడానికి విందులు, విశేషాలు ఏర్పాటు చేశాం. గార్డెన్స్‌కి రావడానికి ఉచిత ప్రయాణ సదుపాయం ఉదయం ఆరు గంటలకి సిటీలో నాలుగయిదు ప్రదేశాల నుంచి బస్సులు బయలుదేరతాయి. గార్డెన్స్ చేరిన వెంటనే భోగిదండలు ఇస్తారు. అక్కడే మధ్యలో ఉన్న భోగిమంటలో వేయడానికి గొబ్బిళ్లు పెట్టడానికి అన్ని ప్యాకెట్లలో లభ్యమవుతాయి. ఆసక్తి ఉన్నవాళ్లకి గొబ్బిళ్లపాటలు సీడీలు, క్యాసెట్లు కూడా దొరుకుతాయి. తర్వాత ఫలహారం పొంగల్ వేడిగా వడ్డిస్తారు. అల్పాహారం అయిన తర్వాత చుట్టూ ఉన్న గ్రామీణ వాతావరణం తిలకించే అవకాశం. వచ్చాక తిన్నవారికి తిన్నంత అందరికీ పండగ భోజనం. పులిహోర, చక్కెర పొంగలి... వంటి తెలుగు వంటలు, తర్వాత ఆటలు అవి కూడా తెలుగువే. మధ్యాహ్నం కొంచెం సేదతీరాక సాంప్రదాయ వంటలతో చిరుతిళ్లు ఇస్తారు. సాయంత్రం భోగిపళ్ల పార్టీకి అదనంగా ఇచ్చి ఏర్పాటు చేసుకోవాలి.

ఇలాగే సంక్రాంతి రోజు కూడా గడపాలని అనుకుంటే అది కూడా బుక్ చేసుకోవచ్చు. రెండు రోజులకు బుక్‌చేస్తే మినహాయింపు ఉంటుంది. బుకింగ్స్‌లో లాటరీ తీసి బహుమతులు ఇవ్వబడతాయి. బుకింగ్స్ పరిమితం."

ఇదీ ఆ ప్రకటనలోని విశేషం.

అప్పుడర్థమయింది రామారావుకి అందరూ అంతలా ఎందుకు నవ్వుతున్నారో.

రామారావుకి ఏమనాలో అర్థం కాలేదు.

కథ

పండగలని కూడా వ్యాపారంలో భాగంగా చేసి ఇలా మారుస్తున్నారో, కనీసం పల్లె వాతావరణం ఇలా ఉంటుందని పండుగలు ఇలా ఉంటాయని పిల్లలకి చూపించి మేలే చేస్తున్నారో అర్థంకాక అదోరకంగా నవ్వాడు.

అందరూ రామారావు వంకచూసి -

"ఏం రామారావుగారూ! బుక్ చేస్తున్నారా! ఆలసించిన ఆశాభంగం" అంటున్నారు.

"ఆс, బుక్ చేస్తున్నాను మా ఊరికి టికెట్లు. అయినా నాకేం ఖర్మయ్యా, పల్లెతనం తెలియని వాళ్లకవి కొత్తగానీ నేనక్కడే పుట్టి పెరిగినవాడిని. నాకేదీ కృత్రిమంగా అనుభవించాల్సిన అవసరం లేదు" అంటూనే "అయినా పండగకి పదిమందినీ ఇంటికి పిలుచుకొనే అలవాటుకానీ మేమే ఎక్కడికో పారిపోయే అవసరం ఏముంది?" అన్నాడు.

ఎవరూ ఏమీ మాట్లాడకపోయేసరికి..

"ఇవన్నీ వ్యాపారీకరణలో భాగంగా సాగుతున్నాయి. నన్ను వీటిలో భాగంగా చూసి ఎందుకు నవ్వుతున్నారో అర్థం కావడం లేదు. ఆశ్చర్యమనిపిస్తోంది. ఎపుడూ పండగగా పేరు వినని 'ధనత్రయోదశి' దగ్గర్నుంచి స్నేహితుల రోజు, ప్రేమికుల రోజు.. ఇవన్నీ జరుపుకోవడం అలవాటు చేసుకున్నాం. ఎప్పుడూ అందర్నీ ప్రేమించే, అందరితోనూ స్నేహించే మనకి ఈ సంస్కృతిని మనదిగా చేసుకోవడం అలవాటు చేసుకున్నా, మనవి కాని ఈ 'రోజు'ల్లో ఆర్భాటం చేయడం తప్ప మన పండగల తీరు ఎలా మార్చుతున్నాం" అంటూ సీరియస్‌గా చెప్పేసరికి...

"ఏదో సరదాకి అన్నాంలెండి సార్, అంత సీరియస్ అయిపోకండి" అన్నారంతానూ.

ఇంటికెళ్లేసరికి రాధ సంతోషపడుతూ ఓ పేపరు చేతికిచ్చి చదవమంది. వెంటనే బుక్ చేయమంది.

అది పొద్దున ఆఫీస్‌లో చూసిందే. రామారావుకి ఏమనాలో అర్థం కాలేదు.

సిహెచ్.వి.వి. రత్నమాల
సహాయకులు, జీఎస్ఐ,
హైదరాబాద్. 99489 02602

నడకే కాదు... జాడా కనిపించాలి

మొదటి మహాసభల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు

ఎన్టీఆర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మండలి వెంకటకృష్ణారావు

ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ పరంగా మన గతమెంతో ఘనం. భాగ్యనగరం వేదికగా తెలుగు ఖ్యాతిని దిగంతాలకు వ్యాపింపజేసిన మొదటి సభలు... తెలుగు జాతికి అందించిన స్ఫూర్తి అనన్యం. అసమానం. పుట్టినగడ్డకు తరతరాలుగా దూరమైనా తల్లిపేగుతో తమ అనుబంధాన్ని అపురూపంగా కొనసాగిస్తున్న విదేశాల్లోని తెలుగు వారి భాషాభిమానానికి ప్రతీకలు... మలేషియా, మారిషస్ మహాసభలు. సభల నిర్వహణ, ఏర్పాట్లు, చర్చలు... ఇలా ఏ అంశాన్ని తీసుకున్నా గత సభల స్థానం నింగిలోనే.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1975, ఏప్రిల్ 12 నుంచి 18 వరకు హైదరాబాదులో మొదటి ప్రపంచ తెలుగు మహాసభలను ఎంతో వైభవంగా నిర్వహించింది. ఈ మహాసభలకు మన రాష్ట్రం నుంచేగాక ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి చాలామంది తెలుగు భాషాభిమానులు హాజరయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారినందరినీ ఒక వేదికపై తీసుకువచ్చి వారిలో ఒక భావ సమైక్యతను, భాషాభిమానాన్ని పెంపొందింపచేశాయి ఆనాటి సభలు. తెలుగునాట తొలిరోజుల్లో 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' పాట టంగుటూరి సూర్యకుమారి గళం నుంచి జాలువారి ప్రజలను ఉత్తేజపరిచింది. ఆమెను ప్రత్యేకంగా లండన్ నుంచి ఆహ్వానించి మొదటి ప్రపంచ తెలుగు మహాసభల వేదికపైన ప్రారంభోత్సవ గీతంగా పాడించడం ఒక మధుర ఘట్టం. కవిదిగ్గజమైన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ అధ్యక్షతన కవి కంఠీరవాల కంఠాల నుంచి తెలుగు కవితాధార తేనెలొలికించి తీపిని పంచిన అద్భుతమైన సన్నివేశమది. మన సంగీతం, నాట్యం, నాటకం, శిల్పం, చిత్రలేఖనం వంటి కళా ప్రదర్శనలు, తెలుగు జాతి గత వైభవాన్ని, ఆధునిక కాలంలో విభిన్న రంగాల్లో సాధించిన ప్రగతిని సింహావలోకనం చేసుకొన్న చారిత్రకమైన సందర్భమది. నగరమంతా స్వాగత ద్వారాలతో, తెలుగు ప్రశస్తి గానాలతో, సభాప్రాంగణం చేనేత వస్త్ర కళా విన్యాసాలతో కనువిందు కలిగించి ప్రతి తెలుగు ఎదను పులకింపజేసింది.

మొదటి మహాసభల ఫలితంగా రాష్ట్రేతర ప్రాంతాలు, విదేశాల్లో నివసిస్తున్న తెలుగు వారితో మన రాష్ట్రానికి విద్యాసాంస్కృతిక పరమైన నిరంతర అనుసంధానం అనివార్యమని భావించి ప్రభుత్వం 1976లో అంతర్జాతీయ తెలుగు సంస్థను స్థాపించింది. ఈ సంస్థ ద్వారానే మొదటి మహాసభల తీర్మానం మేరకు ప్రభుత్వం 1981, ఏప్రిల్ 14 నుంచి 18 వరకు మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో రెండో ప్రపంచ తెలుగు మహాసభలు జరిపించింది. ఆ తరువాత 1984లో ప్రభుత్వం తెలుగు విశ్వవిద్యాలయాన్ని స్థాపించి అప్పటి అకాడమీలను, తెలుగు భాషా సమితిని, ఆనాటి అంతర్జాతీయ తెలుగు సంస్థను అందులో విలీనం చేసింది. రెండో మహాసభల్లోని తీర్మానం మేరకు 1990, డిసెంబరు 10 నుంచి 13 వరకు మారిషస్ దేశంలో ప్రభుత్వం మూడో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించింది. మనదేశంలో, మన రాష్ట్రంలో తెలుగు సభలను జరపకుండా ఎక్కడో విదేశాల్లో జరపట

హైదరాబాద్ గన్‌ఫౌండ్రి ప్రధాన రహదారి నుంచి ఊరేగింపుగా మహాసభలకు వెళ్తున్న నాయకులు, భాషాభిమానులు

మహాసభల ఉద్దేశాన్ని ఆహూతులకు తెలియజేస్తున్న మండలి, చిత్రంలో అప్పటి ఉపరాష్ట్రపతి బి.డి.జెత్తి కూడా ఉన్నారు

ముఖ్యఅతిథిగా విచ్చేసిన అప్పటి భారత రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌కు స్వాగతం పలుకుతున్న మండలి

కందుకూరి వీరేశలింగం పంతులుకు నివాళులర్పిస్తున్న జలగం, మండలి, భాట్టం శ్రీరామమూర్తి, వావిలాల గోపాలకృష్ణయ్య

మేమిటన్న సందేహం రావచ్చు. అయితే మొదటి మహాసభలలో పాల్గొన్న మలేషియా తెలుగు ప్రతినిధి బృందం ఈ సభల వైభవానికి ముగ్ధులైంది. తమ దేశంలో ఉన్న తెలుగు ప్రజల ముంగిట్లోనూ ఈ తెలుగు వెలుగులు పంచాలని సంకల్పించింది. రెండో మహాసభలు తమ దేశంలో జరపాలని ఆహ్వానించింది. మలేషియా సభలకు వచ్చిన మారిషస్ తెలుగు ప్రతినిధి బృందం ఈ తీపి గుర్తులను తమతోపాటు తీసుకొని వెళ్లి తమ దేశంలోని తెలుగువారికి అందించాలని ఆశించి మూడో మహాసభలను తమ దేశంలో జరపడానికి ముందుకు వచ్చింది. ఈ రెండు మహాసభలూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమన్వయంతో జరిగాయి. దీనివల్ల విదేశాంధ్రుల్లో మొదటి మహాసభలు తెలుగు భాషా సంస్కృతుల పట్ల ఆసక్తిని రేకెత్తించాయని స్పష్టమవుతుంది. అది ఈనాటికీ అక్కడ తీగ సాగింది.

మారిషస్ సభలకు వచ్చిన దక్షిణాఫ్రికా తెలుగు ప్రతినిధి బృందం నాలుగో ప్రపంచ తెలుగు మహాసభలు తమ దేశంలో జరపాలని, తద్వారా అక్కడి తెలుగువారిని ఉత్తేజపరచాలని సంకల్పించింది. అది అనివార్య పరిస్థితుల వల్ల నెరవేరలేదు. అక్కడే ప్రపంచ తెలుగు మహాసభలకు అడ్డుకట్ట పడింది.

తరువాత అంతర్జాతీయ తెలుగు కేంద్రం ద్వారా జాతీయ స్థాయిలో మొన్నటి దాకా అయిదు సభలు జరిగాయి. కానీ తెలుగు భాషాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు మాత్రం అటు అమెరికా, ఇంగ్లాండు, ఆస్ట్రేలియా, మలేషియా, సింగపూర్ వంటి విదేశాలలో, ఇటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రదేశాల్లో, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో ఈ సభలు ముమ్మరంగా జరుగుతూ వచ్చాయి. ఇది మొదటి ప్రపంచ తెలుగు మహాసభల స్ఫూర్తియే అని చెప్పుకొన్నా ఈ సభలు రానురాను పిల్ల వసుచరిత్రల్లా మారిపోయాయనే ఒక విమర్శ ఉంది. ఇందుకు కారణం ఈ సభలు వినోదానికే పరిమితమై, విజ్ఞానాత్మకమైన విద్వద్గోష్ఠులు, చర్చా సదస్సులు, భాషా సాంస్కృతిక విధానాలకు దూరం కావడమే. ఈ విషయంలో మనం కొంత ఆవేదన చెందినా, ప్రపంచ తెలుగు మహాసభలనే ప్రక్రియకు శ్రీకారం చుట్టి, ఆ భావనను నిలబెట్టింది మాత్రం మొదటి ప్రపంచ తెలుగు మహాసభలని సగర్వంగా చెప్పుకోవచ్చు. ఆనాటి సభల్లో ప్రపంచంలోని నలుమూలలా ఉన్న తెలుగువారితో సంబంధ బాంధవ్యాలను కలిగి ఉండటమేకాక భాషా సంస్కృతిపరంగా ఎంతో అభివృద్ధిని సాధించాలని ఆశించారు. దీనిలో మొదటిది నెరవేరినా రెండోది వెనుకబడింది. ఇందుకు ఇతర కారణాలు ఏవైనా ఇప్పుడు ప్రపంచీకరణ నేపథ్యం ఒక ప్రధాన కారణంగా చెప్పుకుంటున్నాం. అయితే దీని ప్రభావం కేవలం తెలుగు భాషపైనే పడిందా, ఇతర భాషలు దీనికి లోను కాలేదా అంటే సంతృప్తికర సమాధానం ఉండదు. పొరుగుభాషల స్థితిగతులను పరిశీలిస్తే అవి తమ ఉనికిని కాపాడుకుంటూనే ఆధునికంగా ముందుకు సాగుతున్నాయి. ఈ ప్రయత్నంలో తెలుగు మాత్రమే బాగా వెనుకబడిపోయింది. దీనికి కారణం ప్రపంచీకరణ నేపథ్యమని చెప్పుకున్నా మన భావదాస్యం, పరభాషా సంస్కృతీ వ్యామోహం, మన తెలుగు ప్రజల ఉదాసీనత, ప్రభుత్వ వైఖరి అని చెప్పుకోక తప్పదు. ఇది కేవలం ప్రజలపైనే రుద్దకుండా ప్రభుత్వమూ దీనికి కొంత బాధ్యత వహించాలి.

సభల్లో నిర్వహించిన అవధానం... చిత్రంలో విశ్వనాథ, దివాకర్ల, సి.వి.సుబ్బన్న, ఆరిపిరాల విశ్వం తదితరులు

సత్కారాలందుకుంటున్న తెలుగు తేజోమూర్తులు విశ్వనాథ సత్యనారాయణ, దాశరథి కృష్ణమాచార్యులు

మొదటి మహాసభలకు హాజరైన తెలుగు వారితో లాల్‌బహదూర్ శాస్త్రి మైదానం నిండిపోయింది...

అక్కినేనికి సత్కారం



రెండో మహాసభల్లో సభాసదులను కట్టిపడేసిన సాంస్కృతిక ప్రదర్శనలు...

తెలుగు'వాడి' చమత్కారం

వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు జాతికి మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు ఒక మరపురాని మధురస్మృతి. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, విద్యాశాఖమంత్రి మండలి వెంకటకృష్ణారావులు కృష్ణార్జునుల్లా వ్యవహరించి నడిపించిన ఈ సభలు 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతాలాపనతో ప్రారంభమయ్యాయి. అదే సమయంలో సభా ప్రాంగణంలోకి రావాలని ప్రయత్నించిన ఆ గీతరచయిత శంకరంబాడి సుందరాచారిని పోలీసుల గుర్తించలేని కారణంగా విఫలం కావడం అందరినీ కలచివేసింది. ఇలాంటి ఘటనలను మినహాయిస్తే సభలు ఆహ్లాదంగా జరిగాయి.

తెలుగు జాతి చరిత్ర మొత్తాన్ని కళ్లకు కట్టేలా చిత్రిస్తూ డా॥ సి.నారాయణరెడ్డి రచించిన 'తరతరాల తెలుగు వెలుగు' నృత్యరూపక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సభలను బహిష్కరించాలని తొలుత కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, మహాకవి శ్రీశ్రీలు ఇద్దరు కలిసి అనుకున్నా ఆ తర్వాత విశ్వనాథ సత్యనారాయణ వెనక్కి తగ్గారు. సభలకు హాజరయ్యారు. జలగం వెంగళరావు పేరులోని జలగం అంటే 'సుగంధద్రవ్యం' అని ఆయన సభలో చమత్కరించారు. నిజానికి విశ్వనాథ అధ్యక్షతన ఈ సభల్లో జరిగిన కవిసమ్మేళనం అద్భుతంగా సాగింది. దాశరథి, ఆరుద్ర, కుందుర్తి వంటి గొప్పకవులు కవితాగానం చేశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి కూడా కవి సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ కవిసమ్మేళనంలో విశ్వనాథ వారు సంధించిన వ్యంగ్యబాణాలు కవితా ప్రియుల గుండెల్లో కలకాలం నిలిచిపోయాయి. ఉదాహరణకు కుందుర్తి ఆంజనేయులు కవిత చదవడానికి వస్తుంటే 'ఈయన పేరు ఆంజనేయులు. ఆంజనేయులు అంటే కోతి. ఈయన కవిత్వం (వచన కవిత్వం) అంతా కోతి, ఈయన అంతా కోతి' అన్నారు. సదస్సులో అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. కుందుర్తి మైకు దగ్గరికి వచ్చారు. 'విశ్వనాథవారు నాపేరు ఆంజనేయులు కాబట్టి నన్ను కోతి అన్నారు. నేను వచన కవిత్వం రాస్తాను. అది ఆయనకు ఇష్టం లేదు కాబట్టి నా కవిత్వాన్ని కూడా కోతి అన్నారు. ఎందుకోగానీ నేనంతా కోతి అన్నారు. విశ్వనాథ సత్యనారాయణ గారు మా గురువు గారు' అన్నారు. వినయానికి వినయం! దెబ్బకు దెబ్బ! కుందుర్తి 'అంతరార్థాన్ని' గ్రహించిన ప్రేక్షకుల కరతాళధ్వనులు మిన్నుముట్టాయి.

కవి సమ్మేళనంలో కవులకు పారితోషికం కింద నూటపదహార్లు ఇచ్చారు. దీన్ని ఆసరా చేసుకొని విశ్వనాథ కవులను కట్టడి చేయడానికి ఒక షరతు పెట్టారు. పద్యాలు రాసిన వాళ్లయితే 4 పద్యాలకు మించి చదవరాదని, గేయాలు రాసిన వాళ్లు 16 చరణాలకు మించిన చదవరాదని చెప్పారు. అలా చదివితే నూటపదహార్లు ఇచ్చేది లేదని హెచ్చరించారు. అయితే ఆరుద్ర ఈ నియమాన్ని ఉల్లంఘించారు. ఆ విషయం ముందే చెప్పారు 'నాకు నూట పదహార్లు ఇవ్వకపోయినా ఫర్వాలేదు... నూట పదహార్లు ఇమ్మని నన్ను అడగకపోతే చాలు' అని అన్నారు.



రెండో ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై దివంగత ముఖ్యమంత్రులు బెజవాడ గోపాలరెడ్డి, టంగుటూరి అంజయ్య

ఆనాటి మహాసభలకు హాజరైన భాషావేత్తలు, భాషాభిమానులు

రెండో మహాసభల్లో ప్రసంగిస్తున్న 'అగ్నిధార' దాశరథి

మలేషియా మహాసభల ప్రారంభ సమయంలో నిర్వహించిన ప్రదర్శన.. చిత్రంలో అప్పటి ముఖ్యమంత్రి అంజయ్య

తాను చదవదలుచుకున్నది మొత్తం చదివారు. ఈ కవిసమ్మేళనంలోనే పోతుకూచి సాంబశివరావు మీదా విశ్వనాథ సత్యనారాయణ చమత్కార బాణం సంధించారు. 'అంబలేనట్టి శివుడు ఈ సాంబశివుడు!' అన్నారు. పోతుకూచి సాంబశివరావు బ్రహ్మచారి అని ప్రత్యేకించి చెప్పనవసరంలేదు...

ఇంకో చమత్కారం అందరినీ ఆకర్షించింది. ఇది పి.వి.నరసింహారావుది. సదస్సు తెలుగు భాషా సముద్ధరణ మీద! పి.వి.నరసింహారావు ముఖ్య అతిథి! ఆ సదస్సులో తెలుగు భాషాప్రియుడైన గ్విన్ అనే విదేశీయుడు మొదట ఆంగ్లంలో ప్రసంగించారు. తెలుగులో మాట్లాడాలని సభాసదులు ఆయన్ను కోరారు.

'తెలుగులో మాట్లాడితే, తెలుగు భాషను చంపేస్తానేమో' అన్నారు గ్విన్. పి.వి.నరసింహారావు వెంటనే 'మీకు ఆ అవకాశం లేదులెండి. మేం ఎప్పుడో ఆ పని చేసేశాం' అన్నారు. అందరూ నవ్వేశారు.

"శాతవాహనులు నీతాతలే కాదనను... కాకతీయుల శౌర్యకళ నీకు లేదనను" అంటూ సి.నారాయణరెడ్డి రాసిన గీతం సభల రోజుల్లో మారుమోగింది. తెలుగు జాతి గర్వించదగిన ఎందరో మహానుభావులు తెలుగు మహా సభల్లో పాల్గొని వాటిని రక్తి కట్టించారు. తెలుగు జాతి కీర్తిని దశదిశలా చాటారు! ఆ సభలు తర్వాత జరిగిన సభలన్నింటికీ అడుగుజాడ అయ్యాయంటే అతిశయోక్తి కాదు.

– శంకరనారాయణ, 80083 33227

విశ్వనాథ అధ్యక్షతన జరిగిన కవిసమ్మేళనంలో కవితాగానం చేస్తున్న దివాకర్ల వేంకటావధాని

అందుకే ఈనాడు మన ప్రభుత్వం మూడు ప్రపంచ తెలుగు మహాసభల తరువాత, 37 ఏళ్ల తరువాత మళ్లీ మన తెలుగునాట నాలుగో మహాసభలను జరిపించడానికి పూనుకోవడం స్వాగతించాల్సిన విషయం, ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకునే తరుణం.

అయితే ఇవి ప్రజల విమర్శలకు గురికాకూడదు. నిర్మాణాత్మకమైన భాషా సాంస్కృతిక విధానాలను రూపొందించుకుని కార్యాచరణ బద్ధమైన ప్రణాళికలను అమలుపరిచి సత్ఫలితాలను సాధించినప్పుడు ఈ మహాసభలు సాఫల్యం చెందుతాయి.

ఈ సభల పర్యవసానంగా రాష్ట్రమంతటా తెలుగు కనిపించి, వినిపించాలి. అందుకు పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు తెలుగు బోధన కొనసాగాలి. పాలనాభాషగా తెలుగును కచ్చితంగా అమలుపరచాలి. ప్రభుత్వం ఒక ప్రత్యేక భాషా సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలి. తెలుగు చదవడం వల్ల తమకేమి లాభమనే భావాన్ని ఈ తరం వారి మనసులలో నుంచి పూర్తిగా వైదొలగించాలి. తెలుగు వల్ల అనేక లాభాలు ఉన్నాయని నిరూపించగలగాలి. అందుకు విద్యార్జనలో, పరీక్షలలో, ఉద్యోగ నియామకాలలో తెలుగుకు ప్రోత్సాహకాలను అందించాలి. సాంస్కృతిక సంపదను కాపాడే దిశగా కృషి జరగాలి. ఇవన్నీ ముమ్మరంగా కొనసాగినప్పుడే ఈ సభలు కృతకృత్యమైనట్లు. ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించినట్లు. అప్పుడే అయిదో ప్రపంచ తెలుగు మహాసభలకు ద్వారాలు తెరుచుకుంటాయి.

డా॥ టి.గౌరీశంకర్,
రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు.
94409 69130

తెలుగు ఒడిలో...
కథల బడి

శ్రీతల, వేదయుక్తి, అభివరుణ్, యోగేశ్వర్, షరీఫ్, ముజామిల్... అందరూ 'చేయి తిరిగిన వారే'. అందమైన ఆలోచనకు అద్భుతమైన భావవ్యక్తీకరణ సామర్థ్యాన్ని జోడించి చదువరుల మనస్సులను రంజింపజేయగల ప్రతిభావంతులే. అలా అని వీరందరూ... సాహిత్యంలో తలపండిపోయిన పెద్దలని అనుకోకండి! పదిహేనేళ్లలోపు వయసున్న పిల్లలు. 'కొత్తపల్లి' కథల పుస్తకాన్ని తిరగేస్తే... ఇలాంటి కథకులెందరో! మరో విషయం... ఈ కథల్లోని భావాలను ప్రతిబింబించే వర్ణచిత్రాలకు రూపాలనిచ్చేదీ చిన్నారులే.

'కథలు, ఆటలు, పాటలు వృథాగాపోవు. వాటిల్లో పిల్లలకు వాళ్లదైన ఒక ప్రపంచం దొరుకుతుంది. ఆ ప్రపంచంలో స్వేచ్ఛగా రెక్కలార్చుకుంటూ తిరిగి, వాళ్లు ఇతర ప్రాపంచిక విషయాలను సునాయాసంగా నేర్చుకుంటారు. 'కథలు, ఆటలు, పాటలు సేద తీరుస్తాయి. సేద తీరిన మనస్సులు ఊరట చెంది, మంచి మనుషుల్ని తయారు చేస్తాయి. సమాజంలో శాస్త్ర విషయాల్ని లోతుగా నేర్వాలంటే, మనుషులకు వాటిపై మక్కువ అవసరం. కళలు ఆ మక్కువను నిర్మిస్తాయి'

తమ వెబ్‌సైట్ ముందుమాటలో 'కొత్తపల్లి' బృందం చెప్పిన పై మాటలు అక్షరసత్యాలు. 'తెలుగు పిల్లలకు సంతోషాన్ని ఇచ్చేందుకు, మానవీయ స్పర్శ ఉన్న కథలను, ఆటపాటలను, విద్య, విజ్ఞాన, వినోదాలను పిల్లల స్వీయ దృక్పథంలో, బేషరతుగా అందించడమే' తన లక్ష్యమని ప్రకటించుకుంది.

ఏప్రిల్ 2008లో మొదటిసారి అచ్చయిన నాటి నుంచి నేటి వరకూ క్రమం తప్పక ప్రతి నెలా అఖిలాంధ్ర బాలలోకాన్ని పలకరిస్తోంది. రాయడమే కాదు, సంపాదకీయ బాధ్యతల్లోనూ వారికి భాగమివ్వడం 'కొత్తపల్లి' ప్రత్యేకత.

ఈ పత్రిక రూపకర్త... ఉప్పలపాటి సుబ్బరాజు. మద్రాస్ ఐఐటీలో బీటెక్, బాంబే ఐఐటీలో ఎంటెక్, పీహెచ్‌డీ చేసిన సరస్వతీపుత్రుడాయన. అంతటి విద్యార్హతలు ఉన్నవారు సాధారణంగా ఏ బహుళజాతి సంస్థలోనో పని చేస్తూ, అవకాశమొస్తే విదేశాలకు వెళ్లిపోతారని భావిస్తాం. కానీ, సుబ్బరాజు పదిహేడేళ్ల నుంచి అనంతపురంలోనే ఉండిపోయారు. బడికి దూరమవుతున్న పేదపిల్లలకు అక్షరాలు నేర్పారు. 'ప్రకృతిబడి' ఒడిలో వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దారు. 'బండ విద్యా విధానం'తో బాల్యానికి దూరమవుతున్న నేటితరం పిల్లలను చూసి, చలించి... 'కొత్తపల్లి'కి రూపకల్పన చేశారు. నాలుగేళ్ల నుంచి నిర్విఘ్నంగా పత్రికను తీసుకువస్తూ చిన్నారుల మానసిక వికాసానికి బాటలు పరుస్తున్నారు. ఈ ప్రస్థానం అనుభవాలను

'తెలుగువెలుగు'తో పంచుకున్నారు.

తె.వె.: ఐఐటీ, కొత్తపల్లి... రెండూ భిన్న ప్రపంచాలు కదా?

సుబ్బరాజు: మా స్వస్థలం తిరుపతి. మద్రాస్, బాంబే ఐఐటీల్లో చదువుకున్నా, సహజవనరుల నిర్వహణ, వినియోగంపై పరిశోధనలు చేశా. ఐఐటీల్లో... మంచిగా చదువుకోవడానికి ఎంత అవకాశం ఉంటుందో, సమాజం గురించి తెలుసుకోవటానికీ అంతే అవకాశముంటుంది. విద్యార్థిగా ఉన్నప్పుడే స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేశా. దేశంలోని విద్య, పర్యావరణాంశాలపై అధ్యయనం చేశా. చదువు పూర్తికాగానే ఈ రంగాల్లోనే పని చేయాలని నిర్ణయించుకున్నా. ఆ సమయంలోనే అనంతపురంలోని టింబక్టు కలెక్టివ్ గురించి తెలిసింది. సమాజహితం కోరి ఆ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు నాకు నచ్చాయి. దాంతో 1995వ సంవత్సరంలో టింబక్టులో చేరా. అప్పుడే సంస్థ..'ప్రకృతి బడి'ని ప్రారంభించింది. బాల్యాన్ని ఉత్సాహంగా అనుభవిస్తూ... చిన్నారులందరూ మానసికంగా ఎదిగేలా అర్థవంతమైన చదువు అందివ్వాలన్నదే దీని లక్ష్యం. ఇందులోకి పిల్లలను తీసుకురావడానికి విస్తృతంగా పర్యటించే వాళ్లం. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. అనంతపురం జిల్లాల్లోని పల్లెల్లో పేదరికం ఎక్కువ. ఫలితంగా బాలకార్మిక వ్యవస్థ వేళ్లూనుకుపోయింది. పిల్లలను బడికి పంపి చదివించాలన్న ఆసక్తి చాలామంది తల్లిదండ్రుల్లో కనిపించదు. ఒకవేళ... బడికి పంపినా, ఒకటి రెండేళ్ల తర్వాత మాన్పించేసి పనిలో పెట్టేవారు. అలా బడికి దూరమైన వారు, బాలకార్మికులుగా చితికిపోతున్న చిన్నారులతో మాట్లాడే వాళ్లం. వాళ్ల పెద్దలకు నచ్చజెప్పి పాఠశాలకు తీసుకొచ్చే వాళ్లం. తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించి అక్కున చేర్చుకునే వారం.

తె.వె. పత్రిక ఆలోచన ఎలా మొగ్గ తొడిగింది?

చిత్రాలు: వెంకటసుబ్బయ్య

సుబ్బరాజు: ప్రస్తుతం పిల్లలంతా బండ విద్యా విధానంలో చదువుకుంటున్నారు. చిన్నారుల తెలివితేటలకు ర్యాంకులే కొలమానాలుగా మారాయి. ర్యాంకులు వచ్చే వారికే గుర్తింపు. ఫలితంగా... చిట్టిబుర్రలపై విపరీతమైన ఒత్తిడి. ఫలితంగా పసివాళ్లలో సృజనాత్మకత తగ్గిపోతోంది. అందమైన అనుభవంలా ఉండాల్సిన బాల్యం... బండబారిపోతోంది. ఈ స్థితిని మార్చడానికి ఏదైనా చేయాలనుకున్నాం. పిల్లలకు ఇష్టమైన కథలను వారి చేతే రాయించి, ప్రచురిస్తే బాగుంటుందనిపించింది. పిల్లలకు గుర్తింపూ లభిస్తుందని భావించాం. ఆ ఆలోచనల్లోంచి పుట్టిందే కొత్తపల్లి పత్రిక.

తె.వె.: పిల్లలకు దీనిపై ఎలా ఆసక్తి కలిగించారు?

సుబ్బరాజు: ప్రకృతిబడిలోని విద్యార్థులతోనే కొత్తపల్లి ప్రారంభమైంది. ఇక్కడ ఒక విషయం గమనించాలి. చదువు మానేసి పనికి వెళ్లి, తిరిగి బడికి వచ్చిన విద్యార్థుల భాషా పాటవం ఎలా ఉంటుంది? వారిని చూసినప్పుడు చాలా బాధ కలిగేది. తెలుగులో సవ్యంగా రాయలేని పరిస్థితి. వారి రాతలో ప్రతి వాక్యానికి ఎన్నో అక్షర దోషాలు. బడి పట్ల వారికి ఆసక్తి పెంచుతూ... తప్పులు లేకుండా తెలుగు రాయడం నేర్పాలనుకున్నాం. అందుకే ప్రతి విద్యార్థిని వారికి తెలిసిన కథలను రాసుకురావాలని చెప్పాం. వారు రాసిన కథలను గోడ పత్రిక ద్వారా చదివించాం. తోటి విద్యార్థి రాసిన కథను మిగిలిన పిల్లలు ఆసక్తిగా చదివేవారు. దీంతో ప్రత్యేకంగా నకళ్లను (సైక్లోస్టైల్) తీసి మిగతా పిల్లలతో చదివించాం. అందరిలోనూ కథలు రాయటం పట్ల ఆసక్తి పెరిగింది. ఇలా ముందుగా ప్రకృతి బడి నుంచి మొదలై చెన్నేకొత్తపల్లి మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థుల నుంచీ కథలను ఆహ్వానించాం. తర్వాత జిల్లాస్థాయికి వెళ్లాం. ఇప్పుడు అమెరికా నుంచీ కూడా 'కొత్తపల్లి'కి కథలు వస్తున్నాయి. ఇంకో విషయం.. పుస్తకం ముఖచిత్రం నుంచి లోపల సందర్భ చిత్రాలు కూడా పిల్లలు వేసేవే!

తె.వె. పత్రికా ప్రచురణ చాలా ఖర్చు కదా?

సుబ్బరాజు: కొత్తపల్లి ప్రచురణకు ఎంత ఖర్చు అవుతుందని అనుకుంటున్నారు? ప్రతి నెలా రెండు వేల కాపీలను కేవలం రూ.25 - 30 వేల ఖర్చుతో పూర్తి చేస్తున్నాం. మా మిత్రమండలిలోని ఒక్కొక్కరూ ఒకో నెల ఖర్చు భరిస్తారు. అలాగే, అంతర్జాలం (ఇంటర్నెట్)లోని ఓపెన్‌సోర్సును సమర్థంగా ఉపయోగించుకుంటూ ఖర్చును తగ్గించుకుంటున్నాం. ప్రచురణకూ మామూలు డెస్క్ జెట్ ప్రింటర్స్‌ను వాడుతూ... ఇంకును సాధారణంగా వాడే ఇంజక్షన్ సిరంజిల ద్వారా నింపుతున్నాం. రంగుల పేజీలను ముద్రించినా



తెలుగుపై ఆసక్తి పెంచడమే లక్ష్యం

నారాయణ... దేశరాజధానిలో సివిల్ ఇంజినీరుగా పని చేసిన వ్యక్తి. ప్రస్తుతం 'కొత్తపల్లి' ప్రధాన సంపాదకులు. హైదరాబాద్‌కు చెందిన ఆయన, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో సివిల్ ఇంజినీరింగ్‌లో బీఈ చేశారు. ఢిల్లీ ఐఐటీ నుంచి ఎంటెక్ పట్టా పుచ్చుకున్నారు. ఆ తర్వాత ఉద్యోగ జీవితం, 'కొత్తపల్లి'కి తన ప్రయాణం, తదితరాలన్నీ ఆయన మాటల్లో విందాం...

'చదువు పూర్తయ్యాక నాలుగేళ్ల పాటు ఉద్యోగం ఇంజినీర్‌గా ఉద్యోగం చేశా. లాతూర్ భూకంపం కారణంగా తీవ్రంగా నష్టపోయిన గ్రామాల పునర్నిర్మాణ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నా. ఆ సమయంలోనే గ్రామాలకు వెళ్లాలన్న ఆలోచన వచ్చింది. చిత్తూరు జిల్లా వెంకటాపురంలో ఉన్న మా గురువు నరేంద్రనాథ్ దగ్గరకు వచ్చేశా. మానవహక్కుల ఉద్యమకారులు దివంగత బాలగోపాల్ స్నేహితుడు, సహచరుడాయన. ఆయన స్ఫూర్తితోనే నేనూ గ్రామాల్లోని సమస్యలపై పని చేసేవాణ్ని. మరోవైపు... సుబ్బరాజు మా అన్నయ్య స్నేహితుడు. చిన్నప్పటి నుంచి మా ఇంటికి వచ్చి పోతుండే వారు. చదువు తర్వాత తను టింబక్టులో చేరారు. అప్పటికే నేను గ్రామస్థాయిలో పని చేయాలని నిర్ణయించుకోవడం, సుబ్బరాజు కూడా టింబక్టులో ఉండటంతో అక్కడికే వెళ్లిపోయా. పన్నాలుగేళ్ల నుంచి ఇక్కడే ఉన్నా. కొత్తపల్లి ప్రారంభం నుంచీ సంపాదక బాధ్యతలు నిర్వర్తిస్తున్నా. నా భార్య సమత. ఆయుర్వేద వైద్యురాలు. మా పాప సత్యలక్ష్మి. పత్రిక ఎడిటింగ్ చేసేటప్పుడు నాతోనే ఉంటుంది. అక్షరదోషాలను గుర్తించి చెబుతుంది.

తల్లిదండ్రులపై బయటి ఒత్తిళ్లు చాలా పని చేస్తున్నాయి. దాంతో వారు తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమంలోనే చదివించాలనుకుంటున్నారు. కానీ, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులు లేరు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి గురువులు ఉన్నారు. మన పాఠశాలల్లో తెలుగు బోధనా విధానంలో ఒక లోపం ఉంది. భాషను నేర్చుకోవడానికి స్ఫూర్తినిచ్చేలా పాఠ్యాంశాలు ఉండట్లేదు. కథలు, పాటలు, నాటకాల్లోని సంభాషణలు ద్వారా పిల్లల్లో భాషపై ఆసక్తి పెంచవచ్చు. ముఖ్యంగా, కథలు... చిన్నారులను భాష వైపు లాగుతాయి. కథలు చదివే, రాసే పిల్లల్లో భాషా నైపుణ్యాలు వృద్ధి చెందుతాయి. ఒకసారి కథల ద్వారా తెలుగుపై ఆసక్తి కలిగించాక, వారి దృష్టిని పద్యాలు, కావ్యాల వైపు మరల్చవచ్చు. కొత్తపల్లిని ఏర్పాటు చేయడం వెనుక లక్ష్యమిదే. ప్రస్తుతం కొత్తపల్లికి పిల్లలు రాస్తున్న కథలు నాణ్యత పరంగా చాలా బాగుంటున్నాయి. వాక్య నిర్మాణాల్లో తప్పులనేవి ఆ స్థాయిలో సహజం. పిల్లలు రాయడం ప్రారంభించిన మొదట్లో... వారు గతంలో చదివిన కథలనే తిరిగి రాస్తారు. పెద్దవాళ్లు దగ్గరుండి ప్రోత్సహిస్తే క్రమేణా తమవైన, విలక్షణమైన సొంత కథలకు ప్రాణం పోస్తారు. పిల్లల్లోని సృజనను ప్రోత్సహించడమే మా లక్ష్యం.'

చాలా తక్కువ ఖర్చుతోనే పూర్తి చేస్తున్నాం. ముందు మా పాఠశాల కోసం ఒక పుస్తకాన్ని మాత్రమే తయారు చేసే వాళ్లం. క్రమేణా రెండు వేల కాపీలకు తీసుకెళ్లాం. ఇక్కడ మరో విషయం చెప్పాలి. కొత్తపల్లి... వాణిజ్యపరమైనది కాదు. లాభనష్టాలతో నిమిత్తం లేకుండా... పిల్లల్లో సృజనాత్మకత పెంచాలన్న ఉద్దేశంతో నడుపుతున్నది. కొత్తపల్లి అంతర్జాలంలోనూ దొరుకుతుంది. ఎవరైనా ఉచితంగా తీసుకోవచ్చు. అంతర్జాలంలో 'తెలుగు'ను పెంచాలన్న ఉద్దేశంతోనే ఇక్కడ పెడుతున్నాం.

తె.వె.: మీకు బాగా గుర్తుండిపోయిన అనుభవాలేంటి?

సుబ్బరాజు: మా పక్కింట్లోనే రాజు, మౌనిక అని అన్నాచెల్లెళ్లు ఉండేవారు. చదువులో పెద్ద చురుకైన వారు కాదు. కానీ కొత్తపల్లిని క్రమం తప్పకుండా చదివేవారు. ఒకసారి వారిని అడిగా... మీరూ కథలూ రాస్తారా అని. రాస్తామన్నారు. కాగితం, కలం ఇచ్చా. అరగంటలో ఇద్దరూ చెరో కథా రాసి చూపించారు. అద్భుతంగా ఉన్నాయవి. ఎక్కడా అక్షరదోషాల్లేవు. వాటిని దిద్దాల్సిన అవసరమూ రాలేదు. వెంటనే ప్రచురించాం. తెలివితేటలను చదువుతో కొలవగూడదన్న మా నమ్మకాన్ని నిలబెట్టారు వారు. ఈ నాలుగేళ్లలో ఇలాంటి చిన్నారులెందరినో కలిశాం.

తె.వె. కొత్తపల్లి స్థాపక లక్ష్యాన్ని అందుకున్నామని భావిస్తున్నారా?

సుబ్బరాజు: ఒకవిధంగా చెప్పాలంటే... స్పష్టమైన లక్ష్యమేదీ లేదు. పిల్లల్లో సృజనాత్మకత పెంచితే చాలనుకున్నాం. విద్యావిధానంలో మార్పు తీసుకురావడం సాధ్యమేనని నిరూపించాలనుకున్నాం. ఆ మేరకు సఫలమయ్యామనే చెప్పవచ్చు. కొత్తపల్లి స్ఫూర్తితో చాలా మంది పిల్లలు కథలు రాస్తున్నారు. విజయవాడ నుంచి చిత్తూరు వరకూ ఉన్న చాలా పాఠశాలలు కొత్తపల్లిని తీసుకుంటున్నాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహిస్తూ కథలను రాయిస్తున్నారు. ప్రచురితమైన కథలను చూసి కొందరు... ఇవి పిల్లలు రాసినట్లు ఉండట్లేదు, పెద్దలే రాస్తున్నారని అంటున్నారు. కానీ, పిల్లలతో ఒక గంట కూర్చుని మాట్లాడితే వారిలో ఉన్న నైపుణ్యాలు తెలుస్తాయి. ఇదే మాట వారికి చెబుతున్నాం.

తె.వె.: సంపాదక బృందంలో పిల్లలతో కలిసి పనిచేయడం ఎలా ఉంది?

సుబ్బరాజు: పిల్లలు సంపాదక బాధ్యతలు వహించడమే పెద్ద అబ్బురం. మొదట్లో వాళ్లు ఈ స్థాయి బాధ్యతలు తీసుకుంటారని అనుకోలేదు. అక్షరదోషాలు దిద్దడం నుంచి మార్పుచేర్పుల వరకూ చేస్తున్నారు. వాళ్ల నైపుణ్యం చూస్తే ముచ్చటేస్తుంటుంది.

తె.వె. తెలుగు నాట పిల్లల పత్రికల పరిస్థితి?

సుబ్బరాజు: సంఖ్య బాగా పెరగాలి. కేరళలో ప్రతి పత్రికా సంస్థ... ఒక పిల్లల పత్రికను ప్రచురిస్తుంది. అలాగే, మన రాష్ట్రంలోనూ రావాలి. అయిదు వందలకంటే ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలూ కూడా తక్కువ ఖర్చుతోనే తమ స్థాయిలో పత్రికలను తీసుకురావచ్చు. సాంకేతికతను, అంతర్జాలాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే చాలా సులువుగా పత్రికలను ప్రచురించవచ్చు. పాఠశాలల్లో ఈ స్ఫూర్తి నింపాలన్నదే కొత్తపల్లి బృందం ప్రయత్నం. అలాగే, పెద్ద పాఠశాలలకు సొంతగా వెబ్‌సైట్లు ఉన్నాయి. తమ పిల్లల సృజనలను (శాస్త్ర సాంకేతిక విషయాల్లోనివైనా) ప్రదర్శించడానికి వాటిలో ఒక విభాగాన్ని కేటాయిస్తే... విద్యార్థులకు మేలు జరుగుతుంది.

తె.వె: తెలుగు బాల సాహిత్యం ఎలా ఉంది?

సుబ్బరాజు: పిల్లల కోసం చక్కటి తెలుగులో పుస్తకాలు, అదీ మంచి సాహిత్యం ఉన్న పుస్తకాలు రావటం లేదనే చెప్పాలి. ఇదే సమయంలో విద్యార్థుల్లో చదవాలనే ఆసక్తీ క్రమేణా తగ్గిపోతోంది. టీవీల ప్రభావం వారిపై

చాలా ఉంది. స్ఫూర్తి కలిగిస్తూ విజ్ఞానాన్ని పెంచే అంశాలు వాటిలో కనపడటం లేదు. దీనివల్ల భాష మెరుగుపరచుకునే అవకాశం విద్యార్థులకు ఉండటం లేదు. గతంలో రాష్ట్ర బాలల అకాడమీ పిల్లల కోసం గొప్ప పుస్తకాలను చాలా ప్రచురించింది. బాపు, ముళ్లపూడి వెంకటరమణ వంటి ఎందరో పెద్ద రచయితలు అందులో పనిచేశారు. మళ్లీ అలాంటి కసరత్తు జరగాలి.

తె.వె.: బాలల కోసం రాసే వారికి సూచనలు?

సుబ్బరాజు: కథ సూటిగా, భాష సరళంగా ఉండాలి. ఆలోచన రేకెత్తించేలా ఉండాలి. అర్థం కాని పదాలను ఉపయోగించటం వల్ల శ్రమ వృథా అవుతుంది. మన చుట్టూ ఉండే కథావస్తువునే వాడితే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. సంస్కృతి, సమాజం గురించి అందులో ప్రస్తావిస్తే పిల్లలకూ తెలుస్తాయి.

తె.వె: తెలుగును కాపాడుకోవటం ఎలా?

సుబ్బరాజు: మాతృభాషపై పట్టు లేకుండా ఎంత చదివినా వృథా. పరభాషలో ప్రవేశం ఉండటం తప్పని చెప్పటం లేదు. మూలాలను వదలి సాము చేయవద్దనే చెబుతున్నా. పాఠ్య పుస్తకాలు చదివే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. మాతృభాషపై పట్టు లేకుండా... పాఠ్యాంశాలను పూర్తిగా అర్థం చేసుకోలేకపోతున్నాం. ఇప్పటికైనా తెలుగులో చదవాలనే తపన పెంచాలి. వాస్తవ పరిస్థితి చూస్తే ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాషకు ప్రాధాన్యం తగ్గింది. తెలుగు భాషలో చదవటం వల్ల ఉపయోగం లేదన్న భావన చాలామందిలో ఉంది. ముందుగా దీన్ని పోగొట్టాలి. దీనికి ప్రభుత్వపరంగా కఠిన నిర్ణయం తీసుకుంటే భాషకు జీవం ఉంటుంది.

తె.వె.: చివరిగా, మీ కుటుంబం గురించి....

సుబ్బరాజు: నా భార్య... యాన్సీ. మలయాళీ. గతంలో పాఠశాల ఉపాధ్యాయినిగా పని చేసే వారు. నాకన్నా మూడేళ్ల ముందే టింబక్టులో చేరారు. మాది ప్రేమ వివాహం. కొత్తపల్లి పిల్లలతో బాగా కలిసిపోతారు. వాళ్లకి కథలు చెబుతారు. కొత్తపల్లికి సంబంధించిన కార్యాలయ బాధ్యతలు చూసుకుంటారు. మాకు ఇద్దరు అమ్మాయిలు. దీపిక... తొమ్మిదో తరగతి, నందిని... అయిదో తరగతి చదువుతున్నారు. ఇద్దరూ కథలు రాస్తారు. వారు రాసినవి కూడా కొత్తపల్లిలో ప్రచురితమయ్యాయి.

- తెలుగు వెలుగు బృందం

సహకారం: సీహెచ్.నాగేశ్వరరావు, ఈనాడు, అనంతపురం

పాఠ్యపుస్తకాల కంటే మిన్న

'మాది ఆంగ్ల మాధ్యమ పాఠశాల. మా విద్యార్థుల్లో తెలుగు పదసంపద పెరగడానికి కొత్తపల్లి ఎంతో సాయపడుతోంది. మా పిల్లలందరూ కథలను ఇష్టంగా చదువుతారు. రాస్తారు. ఇప్పటి వరకూ మా పిల్లల్లో దాదాపు 60 మంది రాసిన కథలు కొత్తపల్లిలో ప్రచురితమయ్యాయి. తెలుగులో తప్పుల్లేకుండా రాయడం, భావవ్యక్తీకరణ సామర్థ్యాల్ని పెంచడానికి లేఖారచన చక్కని మార్గం. మా పిల్లల్నీ అందుకు ప్రోత్సహిస్తా. ఇప్పటికి 200 మంది మా విద్యార్థులు రాసిన ఉత్తరాలు కొత్తపల్లిలో వచ్చాయి. పాఠ్యాంశాల ద్వారా కంటే కూడా కథల ద్వారానే పిల్లల్లో భాషా నైపుణ్యం పెరుగుతుంది. కొత్తపల్లిలో బొమ్మ ఇచ్చి కథ రాయమని చెబుతుంటారు. పిల్లలకు ఇది మంచి సాధన. ఊహాశక్తిని, ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఇది బాగా ఉపకరిస్తుంది. **- సోమిరెడ్డి, వ్యవస్థాపకులు, తేజ విద్యాలయ, కోదాడ, నల్గొండ జిల్లా**

ఆ సంచిక మొత్తం మా పిల్లలదే

కొత్తపల్లి పత్రిక యాభైవ సంచిక (జూన్, 2012)లో కథలు, కవితలు, చెణుకులు అన్నీ మా టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పిల్లలు రాసినవే. ఒకసారి జంగమయ్య అనే కుర్రాడు మంచి బొమ్మ వేశాడు. దాన్ని కొత్తపల్లికి పంపిస్తే... ప్రచురించారు. అంతే కాదు, దానికి తగిన కథ రాయమని పత్రికా ముఖంగా పోటీ కూడా పెట్టారు. ఆ సమయంలోనే సుబ్బరాజు గారితో మాట్లాడుతుంటే... ఆయన ఒక ప్రతిపాదన తెచ్చారు. ఒక పూర్తి సంచికకు సరిపడా కథలు, కవితలను మీ పిల్లల చేతే రాయించి పంపిస్తే, పాఠశాల ప్రత్యేక సంచికను తీసుకువస్తామన్నారు. మా విద్యార్థులూ ఏడెనిమిది నెలలు కష్టపడి కథలు, బొమ్మలు తదితరాలన్నింటిని తీర్చిదిద్దారు. ఇలాంటి కృషి అంతా పిల్లల్లో సృజనాత్మకతను పెంచడానికి ఉపయోగపడుతుంది.

- పి.ఎస్.నాగరాజు, తెలుగు ఉపాధ్యాయులు, నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీకాకుళం

తెలుగుతల్లి ముద్దుబిడ్డలు

రూ.లక్షల సంపాదన వదులుకుని తెలుగు భాష కోసం కృషి చేస్తున్నారు... కొత్తపల్లి సభ్యులు. సుబ్బరాజు మా పాఠశాలకు రెండు సార్లు వచ్చారు. కథలు ఎలా రాయాలో పిల్లలకు శిక్షణిచ్చారు. 2012లోనే మా విద్యార్థులు రాసిన పది కథలు పత్రికలో ప్రచురితమయ్యాయి. కొత్తపల్లి అంటే ఇక్కడి చిన్నారులందరికీ చాలా ఇష్టం. ఒకసారి వారిని పరీక్షిద్దామని... వచ్చే నెల నుంచి పత్రికను తెప్పించటల్లేదని చెప్పా. పిల్లలందరూ గొడవ చేశారు. పత్రిక కావాల్సిందేనని పట్టుబట్టారు. పిల్లల ప్రపంచంలో కొత్తపల్లికి ఉన్న స్థాయి ఏంటో చెప్పే ఘటన ఇది. పత్రికలో వచ్చే కథలన్నీ బాగుంటాయి. సంపాదకీయం మేలిముత్యమే. చిన్నారుల్లో అది రగలించే స్ఫూర్తిని మాటల్లో చెప్పలేం..

- పుల్లయ్య, ఉపాధ్యాయులు, ఎంపీపీ పాఠశాల, గడ్డంనాగేపల్లి, అనంతపురం

మనమెందుకు చేయలేం?

మా పిల్లలకు కొత్తపల్లిని పరిచయం చేసిన సుబ్బరాజు, నారాయణగార్లకు రుణపడి ఉన్నాం. వారి సాయంతో మా పిల్లల రచనలు, బొమ్మలతో సొంతంగా కొన్ని పుస్తకాలను ప్రచురించగలిగాం. కొత్తపల్లి లాంటి కృషి ప్రతి పాఠశాలలోనూ చేపడితే పిల్లలకు ఎంతో మేలు జరుగుతుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో నెలల పిల్లల కోసం కూడా ప్రత్యేకంగా కొన్ని వందల పుస్తకాలు తయారు చేస్తారు. అలా వారికి పుస్తకాలపై ప్రేమను పెంచుతున్నారు. మనం కనీసం నెలకొక కొత్తపల్లిని మన పిల్లల కోసం కొనలేమా? మన పిల్లల రచనలతో నెలకొకటి ఇలాంటి పుస్తకాన్ని తయారు చేసుకోలేమా? ఆ మాత్రం చేయగలిగినా మన బళ్లు, చదువులు, పిల్లలు తద్వారా దేశం బాగుపడతాయి. **- బి.ఇంద్రాణి, ప్రిన్సిపల్, అరవింద స్కూల్స్, మంగళగిరి**

చీకట్లో చిరుదీపం

మాటలాడ వచ్చు మనసు నిల్వగలేదు
తెలుపవచ్చు దన్ను తెలియలేదు
సురియబట్టవచ్చు శూరుడు కాలేడు
విశ్వదాభిరామ వినురవేమ

ఇతరులకు సూక్తులు చెప్పి ఊరుకునే వారి కన్నా... వాటిని తామే ఆచరించి ఆదర్శ ప్రాయులుగా నిలిచేవారే గొప్ప. వేమన మాటల్లోని అంతరార్థమిదే. పాలన భాషగా తెలుగు అమలవ్వట్లేదని బాధపడి ఊరుకునే వారి కంటే... ఇలా అమలు చేసుకోవచ్చని చేతల్లో చేసి చూపుతున్న వారు ప్రశంసనీయులు కదా.

భాషాభిమానం బాగు బాగని వట్టి గొప్పలు చెప్పుకోకోయ్!

భాష కోసం, జాతి కోసం పాటు పడటం మర్చిపోకోయ్!

ప్రకాశం జిల్లా ఒంగోలు సంతపేటలోని భూగర్భ జల శాఖ కార్యాలయంలోకి అడుగుపెట్టగానే కనిపించే వాక్యాలివి. ఇవే కాదు ఆ కార్యాలయ గోడలన్నింటిపై భాషాభిమాన స్ఫూర్తిని రగిలించే మాటలనే దర్శనమిస్తాయి. 'తెలుగులో ఆలోచించండి... తెలుగులో మాట్లాడండి... తెలుగులో రాయండి' అని చెప్పే ఆ కార్యాలయాధికారులు, సిబ్బంది... రోజువారీ కర్తవ్య నిర్వహణలో తెలుగునే ఉపయోగిస్తూ స్థానికుల ఆదరాభిమానాలను అందుకుంటున్నారు.

తెలుగులో ప్రభుత్వ పాలన సాగించడమంటే... తల్లి ఒడిలో బిడ్డను లాలించడంతో సమానమన్న నమ్మకం భూగర్భ జల శాఖది. దీనికి తగ్గట్టుగానే 1990లో ఆ శాఖ అప్పటి సంచాలకులు కె.ఎం.సుబ్రహ్మణ్యం... రాష్ట్రవ్యాప్తంగా తమ శాఖలోని కార్యాలయాలన్నిటికీ ఆదేశాలిచ్చారు. తెలుగు భాషకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఆనాడు ప్రారంభమైన తెలుగు భాషా వినియోగ ప్రస్థానం ప్రస్తుత సంచాలకులు మురళీకృష్ణారావు పర్యవేక్షణలో మరింతగా వన్నె కెక్కింది. ఆయన ప్రతినెలా.. తెలుగు భాషను తమ కార్యాలయాల్లో ఏవిధంగా వినియోగిస్తున్నారో ప్రత్యేకంగా గమనిస్తున్నారు.

భాషా శ్రామికులు

ఒంగోలు కార్యాలయంలో పనిచేస్తోన్న 25 మంది సిబ్బంది తెలుగుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ముఖ్యంగా సాంకేతిక పద సంబంధమైన శాఖ కావడం వల్ల తమకు కావాల్సిన తెలుగు పదాల కోసం నిరంతరం శోధిస్తుంటారు. ఇందుకు భాషాభిమానుల, నిఘంటువుల సాయం తీసుకుంటారు. హాజరు పుస్తకం మొదలు కార్యాలయ సంబంధిత దస్త్రాల వరకు అన్నీ తెలుగులోనే రాస్తారు. హైదరాబాద్ ఉన్నతాధికారులకు పంపే వర్తమానాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా తెలుగులోనే ఉంటాయి. పరిశోధనా పత్రాలను మాత్రం తప్పనిసరై ఆంగ్లంలో పంపుతారు.

ఎక్కువగా గ్రామీణ ప్రాంత రైతులతో అనుబంధం ఉన్న కార్యాలయమిది. కార్యకలాపాల్లో ఆంగ్లాన్ని వినియోగిస్తే గ్రామీణులకు ఇబ్బంది కలుగుతుందన్న భావన ఇక్కడి అధికారుల్లో ఉంది. అందుకనుగుణంగానే తెలుగుకు అగ్రతాంబూలం ఇస్తున్నారు.

మొత్తం తెలుగే

అను స్క్రిప్టును ఉపయోగించి మొత్తం కార్యాలయ దస్త్రాలను తెలుగులో నిర్వహిస్తున్నారు. తమకు కావాల్సిన సమాచారాన్ని ఆంగ్లం నుంచి తెలుగులోకి మార్చుకోవటానికి వీరు యథాతథ అనువాదం చేస్తున్నారు. దీనివల్ల ఆంగ్లంలో వచ్చిన వర్తమానం భావం మారకుండా ఉంటుందని వీరి అభిప్రాయం. సాంకేతిక పదాల విషయంలో కొంత గ్రాంథికంగా అనిపించినా తెలుగువే కాబట్టి కొన్ని వాడుతున్నారు.

కార్యాలయ ఉటంకురాలు (టైపిస్ట్) వి.ఆశాలత... తెలుగు భాషను కంప్యూటర్‌లో సమర్థంగా వినియోగిస్తున్నారు. ప్రతిరోజూ 20 నుంచి 30 వరకు దస్త్రాలకు సంబంధించిన సమాచారాన్ని ఉద్యోగులకు అందిస్తుంటారు. తన వరకూ కంప్యూటర్లో తెలుగును వాడటం వల్ల ఎలాంటి సమస్యలు లేవంటున్నారావిడ. పైగా తెలుగులోనే తొందరగా సమాచారం

వారధి అమ్మభాషే

కె.ఇ.విజయకుమార్, ఉపసంచాలకులు, భూగర్భ జలశాఖ, ప్రకాశం

మా శాఖలో తెలుగు వినియోగాన్ని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు గమనిస్తూ మమ్మల్ని మరింతగా ప్రోత్సహిస్తున్నారు. మన భావాలను ఇతరులకు అర్థవంతంగా అందించాలంటే మాతృభాషే అత్యుత్తమం. ఇప్పుడు ఎక్కువ మంది తెలుగులో ఆలోచించి ఆంగ్లంలో మాట్లాడుతున్నారు. దీనివల్ల చెప్పదల్చుకున్న భావంలోని గాఢత్వం లోపిస్తుంది. ఉదాహరణకు మా శాఖ దగ్గరికి ఎక్కువగా వచ్చేది రైతులే. వారికి ఆంగ్లంలో సమాచారం ఇస్తే ఏం అర్థమవుతుంది? ప్రజలకు, ప్రభుత్వానికి, అధికారులకు తెలుగు వారధిలాగా సేవలందిస్తుందనే విషయాన్ని మనందరం గ్రహించాలి. దీనివల్ల చాలా ప్రయోజనాలున్నాయి. ఉదాహరణకు నేను ఉత్తరాంచల్ పర్యటనకు వెళ్లినప్పుడు, అక్కడ పాలనలో సంపూర్ణంగా వారి మాతృభాష హిందీనే వినియోగించడం గమనించాను. తమిళనాడు, కర్ణాటకలో ప్రభుత్వ పరంగా వారి మాతృభాషల వినియోగమే ఎక్కువ. మనంకూడా ఇదేమార్గంలోకి రావాల్సిన సమయం ఆసన్నమైంది.